వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక
VEEKSHANAM, TELUGU MONTHLY
సంపుటి : 18 సంచిక : 2 హైదరాబాద్ 223 ఫిబ్రవరి 2020 పేజీలు : 68 రు. 25

- జీయర్ దొరల కనుసన్నల్లో తెలంగాణ విద్య
- ఆంధ్రప్రదేశ్ రాజధాని మార్పు ప్రహసనం
- కార్మిక వ్యతిరేక చట్టాల క్రోడీకరణ
- ఎన్ఆర్సిపై అట్టుడుకుతున్న దేశ ప్రజ
- ఉత్తరప్రదేశ్ యోగి పాలనలో నాజీజం
- యూనివర్సిటీలపై పాలకవర్గాల దాడి
- అమెరికా - ఇరాన్ యుద్ధ మేఘాలు

'వీక్షణం' మీద పోలీసుల దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం

వీక్షణం, రాజకీయార్థిక సామాజిక మాసపత్రిక గత పదిహేడు సంవత్సరాలుగా నిరంతరాయంగా ప్రజాపక్షం వహిస్తున్నందుకు, ప్రభుత్వాల ప్రజావ్యతిరేక నిర్ణయాలను, విధానాలను విమర్శనాత్మకంగా పరిశీలించి, ప్రజలకు తెలియజేస్తున్నందుకు పాలకుల కన్నెర్రకు గురవుతున్నది. 2003లో వి హనుమంతరావు, ఎబికె ప్రసాద్, ఎన్ వేణుగోపాల్ వంటి సీనియర్ పాత్రికేయులు ప్రారంభించిన, 2008 నుంచి ఎన్ వేణుగోపాల్ సంపాదకుడుగా సాగుతున్న వీక్షణం ఈ పదిహేడు సంవత్సరాలలో వేరువేరు పార్టీలకు చెందిన ఇద్దరు ప్రధాన మంత్రుల, ఐదుగురు ముఖ్యమంత్రుల పాలనలో దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రతి రాజకీయార్థిక, సామాజిక విధానం మీద ప్రజాపక్ష విమర్శను రాస్తూ వస్తున్నది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం, పోలీసులు ఇటీవలి కాలంలో వీక్షణం మీద, వీక్షణం సంపాదకుడి మీద దుష్ప్రచారాలు, అక్రమ కేసులు ప్రారంభించారు. మొదట అక్టోబర్‌లో వీక్షణం సంపాదకుడిపై ఒక అక్రమ కేసు బనాయించారు. ఆ కేసులో ముందస్తు బెయిల్ కోసం వెళితే పోలీసులు దాఖలు చేసిన కౌంటర్‌లో "వీక్షణం మావోయిస్టు పార్టీ అనుబంధ సంస్థ" అని ఆరోపించారు. తాజాగా ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యాపకుడు సి. కాశీం అరెస్టు సందర్భంగా విడుదల చేసిన పత్రాలలో మావోయిస్టు పార్టీ నిధులతో నడుస్తున్న పత్రికలలో 'వీక్షణం' పేరు చేర్చారు. భిన్నాభిప్రాయ ప్రకటనను సహించని పాలకులు, వారి అడుగులకు మడుగులొత్తే పోలీసులు చేస్తున్న ఈ అబద్ధ ప్రచారాలను వీక్షణం కలెక్టివ్ తీవ్రంగా ఖండిస్తున్నది. అన్ని రాజకీయ పార్టీల విధివిధానాల గురించి వివరణలు, విమర్శనాత్మక విశ్లేషణలు ప్రచురించే రాజకీయార్థిక, సామాజిక పత్రికగా వీక్షణం ఏ పార్టీకీ అనుబంధ పత్రిక కాదు. ప్రభుత్వ ప్రకటనలు, వ్యాపార సంస్థల ప్రకటనలు, దాతల విరాళాలు, చందాలతో నడుస్తున్న వీక్షణం పదిహేడు సంవత్సరాలుగా చాలీచాలని ఆర్థిక వనరుల స్థితిలోనే అప్పులతోనే సాగుతున్నప్పటికీ ఏ ఒక్క రాజకీయ పార్టీ నుంచి కూడ నిధులు సేకరించలేదు. రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్‌పేపర్స్ ఫర్ ఇండియా నమోదుతో, చట్టబద్ధమైన సంస్థలన్నిటికీ క్రమబద్ధంగా వార్షిక ఆర్థిక, నిర్వహణా నివేదికలు సమర్పిస్తూ నడుస్తున్న వీక్షణం మీద ఇటువంటి అన్యాయమైన, నిరాధారమైన నిందారోపణలు చేయడం వీక్షణం గొంతు నొక్కడానికి, వీక్షణం పట్ల అనుమానాలు వ్యాపింపజేయడానికి పాలకులు వేస్తున్న దుష్టపథకంలో భాగమని మేం భావిస్తున్నాం. ఈ దుష్ప్రయత్నాలను, దుష్ప్రచారాలను ఆపివేయవలసిందిగా పోలీసులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ దుష్ప్రచారాలను ఖండించవలసిందిగా ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు, వీక్షణం అభిమానులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

– వీక్షణం కలెక్టివ్

223 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఫిబ్రవరి 2020
సంపుటి : 18
సంచిక : 2

- పాఠకుల వీక్షణం 4
- సంపాదకీయం ◆ నెల దాటినా ఆగని పోరు, మారని హోరు 5
- సంపాదకీయ వ్యాఖ్యలు ◆ మా దొర అవ్వల్ దర్జ, మాటంటె తల గోసుకుంటడు ◆ రాజధాని రభస ఇంత హింసాత్మకం కావలసిందేనా? 6
  ◆ పుతిన్ అధికార సుస్థిరత కోసమే రాజ్యాంగ సంస్కరణలు -ఎ. నర్సింహా రెడ్డి 7
- కొత్త పుస్తకాలు 8
- దేశీయం – దేశం ఒక్కుమ్మడిగా లేచి నిలిచిన వేళ – రాజవరం పార్థసారథి 9
- 〃 – ప్రభుత్వ వాదనలు తప్పుల కుప్పలు – మిహిర్ దేశాయి 11
- 〃 – రాజ్యాంగ సూత్రాలను రక్షించుకొనే ఉద్యమం – డా. కత్తి పద్మారావు 16
- ప్రాంతీయం – మాట్లాడే గొంతులపై కొనసాగుతున్న నిర్బంధం – ఎన్. వేణుగోపాల్ 19
- 〃 – జీయర్ దొరల కనుసన్నల్లో తెలంగాణ విద్య – బి. రామకృష్ణ 21
- 〃 – ఆంధ్రప్రదేశ్ రాజధాని మార్పు ప్రహసనం – చిమ్మె జాన్ బర్నబాస్ 23
- 〃 – మరోసారి రాయలసీమకు ద్రోహం – ఎం.కె. కుమార్ 27
- దేశీయం – యూనివర్సిటీలపై పాలక వర్గాల దాడి – డా. ఎ. పున్నయ్య 30
- 〃 – యోగి పాలనలో నాజీ దుర్మార్గాలు – ప్రజా న్యాయస్థానం 34
- 〃 – కార్మిక వ్యతిరేక చట్టాల క్రోడీకరణ – ఎం. శ్రీనివాస్ 36
- 〃 – ఎల్గార్ పరిషత్ కేసు వెనుక ఆర్ఎస్ఎస్ – ప్రతీక్ గోయల్ 39
- 〃 – ఇనుప ముళ్ల తీగెల మానసిక సరిహద్దు – పార్థ బి. చటర్జీ 41
- 〃 – 1857 నుంచి అయోధ్య కథ – ఆనంద్ పట్వర్ధన్ 43
- ప్రాంతీయం – ప్రసవంలో శిశువు తల, మొండెం వేరుచేసిన డాక్టర్లు – లక్ష్మణ్ గడ్డం 44
- ఇంటర్వ్యూ – ఎ.బి.కె. ప్రసాద్‌తో ముఖాముఖి – గోవిందరాజు చక్రధర్ 46
- అంతర్జాతీయం – అమెరికా-ఇరాన్ యుద్ధ మేఘాలు – ఎ. నర్సింహా రెడ్డి 50
- 〃 – ముషారఫ్ ఉదంతం – నేతలకు హెచ్చరిక – రాజేంద్రబాబు అర్విణి 54
- పుస్తక సమీక్ష – మరో హైదరాబాద్ – లంకా పాపిరెడ్డి 56
- అంతర్జాతీయం – డిసెంబరిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు - 4 – ఎన్.వి.యస్. నాగభూషణ్ 57
- ఆర్థికాంశం – డేవిడ్ హార్వే: పెట్టుబడి - 7 ప్రధాన వైరుధ్యాలు – రమేష్ పట్నాయక్ 60
- ఈనెల – వై. రామచంద్రం 60
- ఇరుగు-పొరుగు – వై. రామచంద్రం 61
- భూగోళం – సి. రాజశేఖర్ 62
- అసహజ మరణాలు – ఎస్. వెంకటేష్ 82

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రూ. 25	రూ. 25
సంవత్సరం	రూ. 300	రూ. 250
మూడు సంవత్సరాలు	రూ. 900	రూ. 650
ఐదు సంవత్సరాలు	రూ. 1500	రూ. 1100
పది సంవత్సరాలు	రూ. 3000	రూ. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన ఎం. ఈశ్వరప్ప, కర్నూలు - రు. 2,000; థామస్, హైదరాబాద్ - రు. 100; సి.హెచ్. శ్రీనివాస్, కావలి నెల్లూరు - రు.500; కె. గాంధీ ప్రసాద్, రేపల్లె - రు. 5,000; సురవరం సుధాకర్ రెడ్డి, హైదరాబాద్ - రు. 5,000; శ్రేయోభిలాషి, హైదరాబాద్ - రు. 10,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం పద్దెనిమిదవ జన్మదిన ప్రత్యేక సంచికలో వచ్చిన అన్ని వ్యాసాలు ఇప్పుడు జరుగుతున్న ఘటనల నేపథ్యంలో (పౌరసత్వ సవరణ చట్టం, దిశ ఘటన, ఏపి మూడు రాజధానులు) చాలా వివరాలు తెలుసుకో దగినవిగా ఉన్నాయి. సి. వనజ రాసిన 'నిర్భయ నుంచి దిశ దాకా' వ్యాసంలో నిర్భయ ఘటన నుంచి దిశ ఘటన మధ్య కాలంలో ఎన్ని అత్యాచారాలు, హత్యలు జరిగాయో, వాటికి కారణాలు ఏమిటో చాలా వివరంగా చెప్పారు. గడ్డం లక్ష్మణ్ 'దిశ నిందితుల ఎన్‌కౌంటర్' వ్యాసంలో ఈ ఘటనపై పోలీసులు ఎంత నిర్లక్ష్యం వహించారో, ప్రజల నుంచి ఆందోళనలు రావడంతో తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఎలా ఎన్‌కౌంటర్ కథ అల్లారో బాగా రాశారు. అలాగే పున్నయ్య 'బకాయి ఎగవేతదారుల జాబితా' వ్యాసంలో పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్లు వాళ్ల వ్యాపారాలకు బ్యాంకుల నుండి రుణాలు పొంది, బ్యాంకులకు కట్టకుండా ఎలా ఎగ్గొడుతున్నారో వారి జాబితాతో సహా బాగా వివరించారు. వీక్షణం 17 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంలో పత్రిక చేస్తున్న కృషి గురించి ప్రముఖుల అభిప్రాయాలు బాగున్నాయి.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

వీక్షణం పద్దెనిమిదవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నందుకు అభినందనలు. ప్రతి నెల వీక్షణం క్రమం తప్పకుండా చదువుతాను. ఆ నెలలో జరిగిన విషయాల గురించి దిన పత్రికలలో ఎన్నో కొన్ని విషయాలు బయటకు వస్తుంటాయి. కానీ వీక్షణంలో వస్తున్న వ్యాసాలు చాలా లోతుగా, అర్థవంతంగా ఉంటాయి. ఈ ప్రత్యేక సంచికలో వచ్చిన అన్ని వ్యాసాలు ప్రత్యేకంగా ఉన్నాయి. ఒక పత్రిక గురించి ప్రజలతో కలిసి పనిచేసే ప్రముఖులు వీక్షణం మొదటి నుంచి ఇప్పటివరకు అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం ఎంత కృషి చేసిందో తమ అభిప్రాయాల ద్వారా వివరంగా పత్రిక గురించి చెప్పారు. వీక్షణం మరిన్ని విశ్లేషణాత్మక వ్యాసాలను ప్రచురిస్తూ మరింత ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాను.

– మాధవ్‌కుమార్
జహీరాబాద్

వీక్షణం జనవరి సంచికలో వీక్షణం పదిహేడు సంవత్సరాల కాలంలో అది చేసిన కృషి గురించి, ఎదుర్కొన్న ఒడుదుడుకుల గురించి వివరంగా రాశారు. వీక్షణం పత్రికను తెలుగు సమాజం ముందుకు తీసుకురావాల్సిన అవసరాన్ని గుర్తించిన మేధావులు తమ బాధ్యతను నెరవేర్చారు. ఈనాడు పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల వీక్షణం పత్రిక అవసరం మరింత పెరిగిందని నేను భావిస్తున్నాను. ఇలాంటి పత్రికలు అరుదు. ఎందుకంటే దిన పత్రికల్లో వచ్చే వ్యాసాలకు పరిది పరిమితులతో కూడిన వ్యాసాలు వస్తున్నాయి. ఒక సందర్భంలో సమాజంలో ఏం జరుగుతుందో తెలుసుకొని ఒక అవగాహన ఏర్పర్చుకునే అవకాశాన్ని వీక్షణం కల్పిస్తుంది. పాలకులు అనుసరిస్తున్న విధానాలు సమాజాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టే విధంగా ఉన్నాయి. అలాంటి విషయాల పట్ల సమాజాన్ని జాగృతం చేయవల్సిన అవసరం చాలా ఉంది. వీక్షణం మాస పత్రికగా కన్నా వార పత్రికగా రావాల్సిన అవసరాన్ని రోజు రోజుకు ముదురుతున్న పరిస్థితులు తెలియజేస్తున్నాయి. ఈ సమాజంలో వీక్షణం లాంటి పత్రికలు అరుదు. కాబట్టి వాటిని అన్ని రకాలుగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు నావంతు కృషి చేస్తాను.

– విశ్వం
నిజామాబాద్

వీక్షణం జనవరి సంచికలో వీక్షణం పదిహేడు సంవత్సరాలు పూర్తిచేసుకొని 18 సంవత్సరాలలోకి అడుగిడుతున్న సందర్భంగా ఈ ప్రయాణాన్ని సమీక్షిస్తూ తెలుగు సమాజంలోని భిన్న సమూహాలకు చెందిన మేధావులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. వీక్షణం సమకాలీన ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వస్తున్న మార్పులను విశ్లేషణాత్మకంగా తెలుగు పాఠకులను అందిస్తున్న తీరు గురించి తెలిపారు. వీక్షణాన్ని ఇంగ్లిష్‌లో వస్తున్న ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీతో దాదాపుగా ఎక్కువ మంది మేధావులు పోల్చారు. అంటే వీక్షణం కృషి వెనక వీక్షణం బృందం కృషి ఎంత ఉందో దీన్ని బట్టి అర్థంచేసుకోవచ్చు. వీక్షణం ఇంగ్లిష్‌లో అచ్చవుతున్న వ్యాసాలను తెలుగు పాఠకులకు అందించి ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న పరిణామాలను అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. పాలకులు సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ లాంటి చట్టాలను తెచ్చి సమాజాన్ని రెండుగా చేల్చే ప్రయత్నాన్ని ప్రజల శవాలపైనుంచైనా కొనసాగించాలనుకుంటున్నారు. ఈ సందర్భంలో ప్రజల పక్షం వహించే వీక్షణం అవసరం మరింత పెరిగిందని నా అభిప్రాయం. ప్రజల్ని చైతన్యపరిచే బాధ్యతను నిర్వర్తిస్తున్న వీక్షణంకు నా అభినందనలు.

– ఎ. అంజయ్య
రేకుర్తి, కరీంనగర్

వీక్షణం జనవరి సంచికలో 'బకాయి ఎగవేతదారుల జాబితా' పేరుతో డా. ఎ. పున్నయ్య రాసిన వ్యాసంలో రిజర్వ్ బ్యాంకు విడుదల చేసిన జాబితా ప్రకటించడంతో దొంగలు బయటికి వచ్చినట్లైంది. ఒక వర్గం వారు ప్రజల సొమ్మును దోచుకోవడానికి అధికారులు, నాయకులు ఎలా అవకాశం కల్పిస్తున్నారో దీన్నిబట్టి అర్థమవుతోంది. సామాన్య రైతులు తీసుకున్న అప్పులకు వారి ఇంటిమీద పడి అవమానపరిచి ఇంట్లోని వస్తువులు వేలం వేసి వసూలు చేస్తారు. మోసగించి ప్రజల సొమ్మును దోసుకెళ్తున్న వారికి మాత్రం ప్రభుత్వం విదేశాల్లో స్థిరపడడానికి పాస్ పోర్టులిచ్చి సాగనంపుతోంది. పాలకులు, దోపిడీకి పాల్పడేవారు ఒక్కటేనని దోపిడీ చేసిన సొమ్మును పంచుకోవడంలో భాగస్వాములు కాబట్టే వారికి అన్ని ఏర్పాట్లు అధికారంలో ఉన్నవారు చేస్తున్నారు. ఇలాంటి వ్యాసంతో ప్రభుత్వ, అధికారుల బండారాన్ని బయటపెట్టిన రచయితకు కృతజ్ఞతలు.

– పి. రాజు
నల్లగొండ

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

నెల దాటినా ఆగని పోరు, మారని హోరు

ఒక నెల సంపాదకీయం రాస్తున్న సందర్భంలో దేశంలో నెలకొని ఉన్న స్థితి మరుసటి నెల సంపాదకీయం రాసే సమయానికి కూడ యథాతథంగా ఉండడం, మరింత విస్తరించడం అరుదైన సందర్భం. విశాల సమాజపు మౌలిక ఇతివృత్తాలు స్వల్పకాల గమనంతో పెద్దగా మారవు గాని సమకాలీన వర్తమానానికి సంబంధించిన ఆందోళనలు, అప్పటికప్పుడు మనసును కలవరపరిచే సమస్యలు త్వరత్వరగా మారిపోతుండడం, నిన్నటి సమస్య గురించి ఆలోచించడానికి తీరిక ఇవ్వనంత పెద్ద సమస్య ఇవాళ గొంతు మీద కూచోవడం మన సమాజంలో మామూలే. ఇటువంటి స్థితిలో కూడ ఇప్పటికి ఆరువారాలు దాటినప్పటికీ భారత సమాజమంతా అదే ఒకే సమస్యపై ఇంకా తన ఆందోళనను ప్రకటిస్తూనే ఉన్నది. దేశం దేశమంతా ఒకే ఆక్రోశం, ఒకే ఆవేశం, ఒకే ఆగ్రహం ఉద్యమ రూపం ధరించి వెల్లువెత్తుతున్నాయి. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా డిసెంబర్ 12న మొదలైన ఆందోళన, అంతకు కొద్ది నెలల ముందు నుంచే ఈశాన్య రాష్ట్రాలకు, ప్రత్యేకించి అస్సాంకు మాత్రమే పరిమితమైన జాతీయ పౌర పట్టికకు వ్యతిరేక ఆందోళనతో కలగలిసి, మరొక నాలుగు నెలల తర్వాత ప్రారంభం కానున్న జాతీయ జనాభా పట్టికకు వ్యతిరేకతను కూడ కలుపుకొని, చిన్న చిన్న నదులూ పాయలూ కలిసి మహానది అయినట్టు దేశమంతా ఉద్యమ ప్రవాహం ఉరకలెత్తుతున్నది. ఇదివరకే రాసినట్టు 'దేశానికిది సంఘ్ పరివార్‌ను ప్రతిఘటించే ఉత్సవ సందర్భం.'

మౌనమే ప్రతిఘటన అన్నట్టు ఆగ్రహాన్ని సగం మూసిన కనురెప్పల వెనుకా, బిగించిన పెదాల వెనుకా దాచుకున్న కశ్మీర్ ను మినహాయిస్తే ఈ ఆరువారాలుగా సిఎఎ – ఎన్ఆర్‌సి – ఎన్‌పిఆర్‌లకు వ్యతిరేకంగా గొంతెత్తని సమూహం లేదు, పిడికిలి బిగించని ప్రాంతం లేదు, నినాదాలతో ఆకాశం గజగజలాడని రోజు లేదు. నిజంగానే ఇది ప్రజా ఉద్యమ ఉత్సవ సందర్భం. అయితే ఎంత మహోధృత ఉత్సవ సందర్భంలోనైనా మితిమీరి పొంగిపోతే, వాస్తవాలను విస్మరిస్తే, ప్రతీపశక్తుల బలాన్ని తక్కువగా అంచనావేస్తే సాధించగలిగిన, సాధించబోయిన విజయం కూడ పరాజయంగా మారిపోతుంది. దేశమంతా భాగం పంచుకుంటున్న, ఆలోచనాపరులందరూ కదులుతున్న ఈ ఉద్యమ సందర్భాన్ని ఒక్కసారి నిర్మమకారంగా విశ్లేషించుకోవలసి ఉన్నది. ఈ ఉద్యమ లక్ష్యాలు ఏమిటి, ఇవి ప్రజాప్రయోజనాలను ఎంతవరకు ప్రతిఫలిస్తున్నాయి, ఇంకా ఈ ఉద్యమ లక్ష్యాలను విస్తరించే అవకాశం ఉందా, ఈ ఉద్యమం అంతిమంగా సమసమాజ స్థాపనకూ, ప్రజా రాజ్యాధికారానికీ దారి తీస్తుందా, ఆ గమ్యానికి చేరడానికి ఏం చేయవలసి ఉంది, ఈ ఉద్యమంలో పాల్గొంటున్న విశాల ప్రజారాశులు ఏమిటి, ఆ ప్రజారాశుల మధ్య ఇవాళ వ్యక్తమవుతున్న ఐక్యతను మించిన దృఢమైన, లోతైన ఐక్యతను సాధించడం ఎట్లా, ఆ ప్రజా ఐక్యత భారత సమాజానికి సహజమైన చీలికల, అంతరాల, వైమనస్యాల బారిన పడి విధ్వంసమై పోకుండా పరిరక్షించడం ఎట్లా ఇవీ భారత సమాజ భవిష్యత్తు గురించి తపనపడే ఆలోచనాపరులు ఇవాళ వేసుకోవలసిన ప్రశ్నలు. ఈ ప్రశ్నలు వేసుకుని, నిజాయితీగా జవాబులు చెప్పుకుని, ఆ జవాబుల ఆధారంగా ఆలోచనాచరణలకు పూనుకున్నప్పుడే ఇవాళ్టి ఉత్సవ సందర్భానికి సార్థకత ఉంటుంది.

ఈ ఉద్యమ లక్ష్యాలు ఇప్పటికైతే చాల పరిమితమైనవి. పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలనీ, జాతీయ పౌర పట్టిక ప్రక్రియను ఆపివేయాలనీ, జాతీయ జనాభా పట్టిక ప్రక్రియను చేపట్టవద్దనీ మాత్రమే ప్రస్తుత ఉద్యమం ఆకాంక్షిస్తున్నది. మామూలుగానైతే భారత రాజకీయాలలో అనుసరించే చాణక్య నీతితో పాలకవర్గాలు ఈ కోరికలను అంగీకరించి ఉద్యమాన్ని చల్లారనిచ్చి, మరొకరూపంలో అవే పనులు చేసి ఉండేవారే. కాని ఇవాళ పాలకస్థానంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వంటి మూర్ఖ, విద్వేష సంస్థ ఉన్నది గనుక, దాని విషరాజకీయాల ఎజెండాలో ఇది ఒక చిన్న, మొదటి అడుగు మాత్రమే గనుక అది వెనక్కి తగ్గదలచుకోలేదు. హింసా దౌర్జన్యాల ద్వారా ఇంకా ముందుకే సాగదలచుకున్నది. అంటే, ప్రస్తుత ఉద్యమం తన లక్ష్యాలను ఇంకా విస్తరించవలసి ఉన్నది. ప్రస్తుత లక్ష్యాలు కేవలం పౌరసత్వపు గుర్తింపు ఉంటుందా ఉండదా అన్నదగ్గర ఆగిపోతున్నాయి. ఆ గుర్తింపు ఉన్నా లేకపోయినా కూడు గూడు గుడ్డ ఆత్మగౌరవం, మరో మాటల్లో జల్ జంగల్ జమీన్ ఇజ్జత్ విద్య వైద్యం సుస్థిర అభివృద్ధి అనే మౌలిక లక్ష్యాలు కూడ ఈ ఉద్యమ లక్ష్యాలలో చేరవలసి ఉన్నది. అలా అన్ని వర్గాల ప్రజల మౌలిక సమస్యల పరిష్కారాలు ఉద్యమ లక్ష్యాలుగా మారినప్పుడు ఆ లక్ష్యాలు మరో మాటల్లో సమసమాజ స్థాపన, ప్రజా రాజ్యాధికారం అవుతాయి.

అయితే ఈ ఉద్యమంలో పాల్గొనే అన్ని సమూహాలూ తప్పనిసరిగా గుర్తించవలసిందేమంటే ప్రతి సమూహమూ ఇతర సమూహపు పారిభాషిక పదజాలంలోనే ఉద్యమ లక్ష్యాలను ప్రకటించనక్కరలేదు. ఎవరి భాష, తర్కం, వ్యక్తీకరణ వారు ఉంచుకుంటూనే ఒక ఉమ్మడి కార్యాచరణలో భాగమై తద్వారా ఆలోచనల మధ్య సంభాషణ, ఐక్యత సాధించవచ్చు. ఈ బహుళత్వ శక్తుల మధ్య ఉమ్మడి కార్యాచరణ అన్నప్పుడే ఏ విభాగానికి ఆ విభాగానికే ప్రత్యేకమైన ఆచరణ రూపాలు, పోరాటరూపాలు, నినాదాలు, వ్యూహాలు ఉండవచ్చునని కూడ గుర్తించవలసి ఉంటుంది. ప్రజాస్వామ్యం ఒక గమ్యం మాత్రమే కాదనీ, మార్గమంతటా కూడ సంకల్పపూర్వకంగా ఆచరించవలసిన ఆదర్శమనీ ప్రతి ఒక్కరిలోనూ గుర్తింపు ఉంటే ఇవాళ ఉద్యమ ప్రజారాశుల మధ్య వ్యక్తమవుతున్న ఐక్యత మరింత దృఢమైనదిగానూ, లోతైనదిగానూ మారుతుంది. ఈ క్రమంలో ఆ ఐక్యతను ధ్వంసం చేయడానికి సమాజంలోని అనేక అంతరాలు, వైమనస్యాలు పనిచేస్తాయనీ, ప్రతీపశక్తులు వాటిని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తాయనీ కూడ నిత్యం జాగరూకతతో ఉంటే ఇవాళ్టి ఐక్యత చీలదీయడానికి వీలులేనంత దృఢమైనదవుతుంది. భారత ప్రజా ఆకాంక్షలు సఫలం కావడానికి తగిన అవకాశం ఇచ్చిన ఇటువంటి సందర్భాలు గత రెండు శతాబ్దాలలో ఎన్నోసార్లు వచ్చాయి. ఆయాకాలాల ప్రజా నాయకత్వాలు ఆ అవకాశాలను జారవిడుచుకున్నాయి. ఇవాళ్టి అవకాశాన్ని సక్రమంగా వినియోగించుకుని ఈ సందర్భాన్ని ఒక గుణాత్మక పరివర్తనకు సోపానపు సందర్భంగా మార్చడానికి తగిన సమయస్ఫూర్తినీ, చైతన్యాన్నీ, చొరవనూ భారత ప్రజా ఉద్యమ నాయకత్వ శక్తులు చూపుతాయా? వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

మా దొర అవ్వల్ దర్జ, మాటంటె తల గోసుకుంటడు

మా దొరంటే ఏమనుకుంటానవ్? మాటంటె మాటే గని మాట దప్పడు. మాట దప్పిండంటె తల గోస్కుంటడు. ఉల్లెక్కాల అనుకుంటానవా ఏంది? టుపాకి ఎంకట్రామడి పెగ్గెల తీర్గ అనిపిస్తాందా ఏంది? మారె పట్నంల నాలుగొద్దుల సంది జరిగిన ముచ్చట జెప్తే, వారీ నివద్దెరా అంటవ్ నువ్వే. ఇగ ఇను. దేశంల కెల్లి తుర్కోల్లందర్ని ఎల్లగొట్టుటానికి ఢిల్లిల మోడీ ఏదో ఇకుమతు జేస్తాండట గద. గది మంచిది గాదు, వాండ్లు, వాండ్ల తాతలు ముత్తాతలు గుడ ఈ దేశంల పుట్టి పెరిగి సచ్చినోల్లె, వాండ్లు ఈ దేశం బిడ్డలె అని అందరం అనుకుంటానం గద. పీరీల పండుగల మనం గుడ ధూల ఆడలేదా, పీరీలు ఎత్తిన ఉస్సేను సాబు కాల్లు మనిండ్లల్లల్ల గుడ కడుగలేదా. ఊళ్లె ఉన్న రెండు మూడు తుర్కలిండ్లోల్లు గుడ దస్ర రోజు జమ్మి కాడికి రాలేదా. ఎన్నడన్న కొట్లాట ఉన్నదా మనకు? ఇయాల మోడీ వచ్చి కొట్లాట బెట్టె. తెలంగాణోల్లం ఈ కొట్లాటకు కట్టడి జేయాల్న లేదా? ఆ చట్టమేందో, నాకు నోరు తిర్గది గని, దాన్ని జేసుడు తప్పు, మన అన్నదమ్ముల మీద అనుమానం బెట్టుకునుడు, వాండ్ల మీద కత్తి దూసి వాండ్లు మన ఇంటోల్లు కాదు అని అనుడు తప్పు అనాలె గద. అట్ల దేశంలో తీరొక్క మనుషులు అనబట్టిరి, ఆఖరికి యేరే యేరే రాష్ట్రాల్ల ముక్కెమంత్రులు గుడ అన్నరట గద. కాని మన దొర అనకపాయె. ఔననకపాయె, కాదనకపాయె. ఏమన్నంటే ఆడ నీను ఓటెయ్యలేదు గద, మోడీ సాబుకు జై అనలేదు గద అనబట్టె. మల్ల ఇంకో దిక్కేమో మోడీ సాబు దొంగపని జేసిండు అని జులూస్ దీస్తమన్నోల్లను కొట్టిపిచ్చె. జైలుఖాన్ల నూకె. సభ పెట్టనియ్యకపాయె. దొర అటున్నడా, ఇటున్నడా నాకేమి సమజ్ గాలె. వారెవ్వా, బలెగున్నది కత. కట్టిన యేషమేమో మాయల మరాఠీది, చేసే చేతనేమో బుడ్డరికానుది. ఏందిరా గోస ఇట్లొచ్చింది అని పరేషాన్ల పడితి. ఇగట్లున్నదా కత. చటుక్కున మెరుపు మెరిసె. తెలంగాణంతట షహర్లల్ల ఓట్లొచ్చె గద. అన్నాలం పాడుగాను ఒక మనిషికి ఓటుకు మూడు ఏలట, ఐదు ఏలట, ముప్పై ఏలట, యాభై ఏలట, తులం బంగారమట. ఏంటివి బాంచెన్ అవి పైసలా చింతగింజలా? గంత గనం పైసలు బోసి కొనుక్కునుడెందుకు? ఎట్లనైనా సర్కారు నీదేనాయె, నాలుగేండ్లదాక నిన్ను కదిలిచ్చెటోడు లేకనేపాయె. అయినా గన్ని పైసలు బోసి నాదే అతికారం అని రుజువు జేసుకోవాల్నా? గట్ల అగ్గగ్గలు బడి పైచేయి అనిపిచ్చుకున్నాక నాదే గెలుపు అని ఎట్ల అనబుద్దయితది బాంచెన్? ఆ గెలుపు ఎట్లొచ్చిందో నీకు దెల్వదా? దేవుడున్నడో లేడో అందరికన్న ఎక్కువ దెలిసేది అయ్యగారికే గద, దేవునికి పెట్టిన ప్రసాదమంత ఇంటికే గద. గట్లనే నీ ఓట్లు నువ్వే కొనుక్కున్నవని, బెదిరిచ్చి, బుదగరిచ్చి, లొంగదీసి సంపాయించినవని అందరికన్న ఎక్కువ నీకె దెలుసు గద. సరె పోనీ, ఆ గెలుపు సంగతి జెప్పుటానికి పత్రికలోల్లను పిలిస్తివి. ఆ జోష్ ల మోడీ చట్టం మీద కీకలేస్తివి. ఆ చట్టానికి ఖిలాఫ్ ల నువ్వే కొట్లాడ్తనంటివి. అందరు ముక్కెమంత్రులను ఒక్క కాడికి దెచ్చి, నువ్వే వాళ్ల ముందర నిలబడ్తనంటివి. రేపు అసెంబ్లిల తీర్మానం గుడ జేస్తనంటివి. అబ్బ నా చెవుల తుప్పు వదిలిపోయిందనుకో. అంతమంచిగనే ఉన్నది గని దొరా, పొద్దూకంగ గా రంకెలేస్తివి, మర్నాడు తెల్లారంగనే నీ పోలీసులు గాయినెవలు, నీ పేరున్నోడె, గాయినెను లోపల నూకిరి. గాయినె గుడ గా చట్టానికి ఖిలాఫ్ గ మాట్లాడెతందుకే ఒచ్చిండట గాదు బాంచెన్. గాయినె సభకు పోయినోల్ల మీద నీ పోలీసులు లాఠీలు గుడ ఇరగ్గొట్టింగ్రట గద. ఇంతకు నువు గా మోడీ చట్టానికి ఖిలాఫా కాదా బాంచెన్?

వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

రాజధాని రభస ఇంత హింసాత్మకం కావలసిందేనా?

ఒక రాష్ట్రపు రాజధాని ఎక్కడ ఉండాలనేది కేవలం పాలకుల ఇష్టారాజ్యపు నిర్ణయం మాత్రమే కాదు. రాజధాని అనేది ప్రభుత్వ పాలనా కేంద్రంగా, శాసన నిర్మాణ కేంద్రంగా, న్యాయవ్యవస్థ కేంద్రంగా, వ్యాపార కేంద్రంగా ఉంటుంది గనుక దానితో ప్రజలకు నిత్య అవసరాలుంటాయి గనుక అది ప్రజా రవాణాకు అనుకూలంగా ఉండవలసి ఉంటుంది. ఈ కేంద్రీకరణ వల్ల అక్కడికి వలసలు ఎక్కువగా సాగే అవకాశం ఉంటుంది గనుక అక్కడ గృహ వసతికి, అన్ని మౌలిక సౌకర్యాలకు ఏర్పాటు ఉండవలసి ఉంటుంది. అంటే ఒక స్థలాన్ని రాజధానిగా నిర్ణయించడానికి నైసర్గిక, భౌతిక, రాజకీయ, రవాణా తదితర అనేక కోణాల నుంచి ఆలోచించవలసి ఉంటుంది. ఒక ప్రభుత్వం అటువంటి సమగ్ర ఆలోచన ఏదీ లేకుండానే కేవలం ఆశ్రితుల రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఒక స్థలాన్ని నిర్ణయించిందనుకుంటే, ఆ తప్పును సరి చేయగలిగింది అటువంటి మరొక తప్పుతో కాదు. పాత ముఖ్యమంత్రి, లేదా పాత పాలక పక్షం తన ఆశ్రితుల ప్రయోజనాల మీద ఆధారపడి మాత్రమే పాత రాజధానిని నిర్ణయించింది గనుక ప్రతీకారంగా కొత్త ముఖ్యమంత్రి, లేదా కొత్త పాలక పక్షం తన ఆశ్రితుల ప్రయోజనాల కోసం మరొక చోట రాజధానిని స్థాపిస్తాననడం హాస్యాస్పదం, అనవసర వ్యయం, అక్రమం. ఆ ఇష్టారాజ్యపు స్వార్థపరమైన నిర్ణయానికి వికేంద్రీకరణ అనే ఆకర్షణీయమైన పేరు పెట్టడం మరింత దుర్మార్గం. తప్పనిసరిగా పాత తప్పును సవరించవలసిందే. కేంద్రీకరణ స్థానంలో నిజమైన వికేంద్రీకరణ జరపవలసిందే. కనీసం ఇప్పుడైనా ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని, రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాలలోనూ – ఉత్తరాంధ్ర, మధ్యాంధ్ర, రాయలసీమ, పల్నాడు – ఆయా ప్రాంతాల ప్రజల అవసరాలు, ప్రయోజనాలు, వనరులు మదింపు వేసి, సక్రమమైన పద్ధతిలో వికేంద్రీకరణ జరపవలసి ఉంది. శాసనసభలో మందబలం ఉందని పాత రాజధాని చట్టాన్ని ఒక్క కలం పోటుతో కొట్టివేయడం, శాసనమండలిలో బలం లేదు గనుక ఎవరిని ఎట్లా కొనివేయాలా బెదిరించాలా అని ఆలోచించడం, ఈ క్రమంలో నిర్ణయం చట్టపరమైన చిక్కుముడులలో చిక్కుకోవడం, పాత రాజధానిని యథాతథంగా కొనసాగించమని నిజమైనదో, కృత్రిమమైనదో ఒక ఆందోళన జరగడం, ఆ ఆందోళన మీద ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం... ఈ తతంగమంతా ఒక ప్రజాస్వామిక పాలనలో జరగవలసిన పనులు కావు. నిజానికి పాత ప్రభుత్వపు పథకాలను తిరగదోడి, సమీక్షించి, అవసరమైతే రద్దు చేయాలనే ఆలోచనే కొత్త ప్రభుత్వానికి ఉంటే ఆ ఆలోచనలను ఎన్నికల నినాదాలుగానే చెప్పి ఉండవలసింది. కనీసం అధికారం లోకి రాగానే ఆరు నెలల కిందనే ఆ సూచనలను వదిలి ఉండవలసింది. ఈ ఆరు నెలలలో పాత రాజధానిలో నిర్మాణ పనులన్నిటినీ స్తంభింపజేయవలసింది. అవేమీ లేకుండా ఇప్పుడు హఠాత్తుగా ఈ నిర్ణయం అమలును ప్రారంభించడం కేవలం కక్ష సాధింపు మాత్రమే గాని ప్రజా ప్రయోజనాల కోసమూ కాదు, పాలనా సౌలభ్యం కోసమూ కాదు. నిరంకుశ రాచరికమే కొనసాగుతున్నదనేందుకు సూచన మాత్రమే.


వీ


పుతిన్ అధికార సుస్థిరత కోసమే రాజ్యాంగ సంస్కరణలు

- ఎ. నర్సింహా రెడ్డి


సోవియట్ రష్యా కుప్పకూలాక 2000 నుండి రష్యాలో కెజిబి నేపథ్యం గల పుతిన్ శకం ఆరంభమైంది. రాజకీయంగా క్లిష్ట పరిస్థితులు ఎదురైనా సునాయాసంగా అధిగమించిన పుతిన్ పాలన ఇష్టారాజ్యంగా మారింది. 2014లో క్రిమియా ఆక్రమణ తర్వాత అమెరికా, యూరప్ దేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలతో సమస్యలు ఎదుర్కొంది. అయినా రష్యాలో పుతిన్ మాటే శాసనంగా సాగుతోంది. తనకు రాజకీయ ప్రత్యర్థి లేకుండా చేసుకున్నాడు. ప్రత్యర్థులపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధించాడు. ప్రజా నిరసనలు, ఆందోళనలను ఉక్కుపాదంతో అణచి వేశాడు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, ప్రధాని మెద్వదేవ్‌పై అవినీతి ఆరోపణలున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా జనం రోడ్లెక్కిన సందర్భాలున్నాయి. రష్యా రాజ్యాంగం ప్రకారం దేశాధ్యక్షుడు రెండు పర్యాయాలకు మించి ఉండకూడదు. మే 2000 నుంచి మే 2008 వరకు రెండు పర్యాయాలు అధ్యక్షునిగా కొనసాగి, 2008 నుంచి 2012 వరకు ప్రధానిగా కొనసాగి 2012 మేలో తిరిగి అధ్యక్ష పీఠమెక్కారు. అధ్యక్ష పదవీ కాలాన్ని 4 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాలకు పెంచుతూ రాజ్యాంగ సవరణ చేశాడు. 2018 మేలో జరిగిన ఎన్నికల్లో పుతిన్ అధ్యక్షునిగా తిరిగి ఎన్నికయ్యాడు. ఏ పదవిలో ఉన్నా ఆయనే అధికారానికి కేంద్ర బిందువు. ఇప్పుడు పుతిన్ వయసు 76 ఏండ్లు. ఆయన పదవీకాలం 2024 వరకు ఉన్నది. ఇప్పటికీ దేశంలో అత్యంత ప్రజాభిమానం గల నాయకుడు పుతిన్. అయినప్పటికీ తిరిగి ప్రధాని పదవి చేపడితే అధికార లాలసుడనే అభిప్రాయం కలుగుతుందని తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికే రాజ్యాంగ సంస్కరణలు చేపడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

దేశ స్థితిగతులపై ఏటా ప్రజలనుద్దేశించి పుతిన్ చేసే ప్రసంగంలో రాజకీయ వ్యవస్థలో భారీ మార్పులు తీసుకురానున్నట్లు జనవరి 15న ప్రకటించాడు. ఆ తర్వాత ప్రధాని మెద్వదేవ్, అతని మంత్రివర్గం రాజీనామా చేసింది. మరుసటిరోజు మేద్వదేవ్ స్థానంలో మిఖాయిల్ మిషుస్తిన్‌ను ప్రధానిగా పుతిన్ ప్రకటించాడు. సంస్కరణలపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తానన్నాడు. సంస్కరణలలోని ప్రధానాంశాలు అధ్యక్షుడి అధికారాలు తగ్గించడం, ప్రజలెన్నుకునే ప్రతినిధుల సభ డ్యూమాకు పెద్దపీట వేయడం. ఇకపై న్యాయమూర్తుల, భద్రతా వ్యవహారాల అధిపతుల, ప్రధాని, ఇతర మంత్రుల నియామక అధికారం డ్యూమాకు ఉంటుంది. ఇప్పటిదాకా ఆ అధికారం అధ్యక్షుడికి ఉంది. పుతిన్ ఆలోచన గమనిస్తే దేశంలో కార్యనిర్వాహక అధ్యక్షుడికి బదులు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెడుతున్నారనే అభిప్రాయం కలుగుతుంది. దేశాధ్యక్షుడికి సలహాలు ఇవ్వడానికి స్టేట్ కౌన్సిల్ ఉన్నది. అధికారాన్ని శాశ్వతం చేసుకోవడం ఎలాగో తెలిసిన పుతిన్ ఈ కౌన్సిల్‌ను బలోపేతం చేసి దానికి అధ్యక్షుడిగా కొనసాగే అవకాశాలు కన్పిస్తున్నాయి. రష్యాలో ప్రజలు పలు సమస్యలతో సతమతమవు తున్నందున మౌలిక వసతుల కల్పన, కార్మిక వేతనాల పెంపు, విద్యార్థుల మధ్యాహ్న భోజనం వంటి సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వ వ్యయాన్ని 450 బిలియన్ రూబుల్స్ పెంచుతామని హామీ ఇచ్చాడు. పుతిన్ అధికారాన్ని కాపాడుకోవడానికే రాజ్యాంగ సంస్కరణలు అని వేరే చెప్పనవసరం లేదు. 2024 తర్వాత మరోసారి రాబోయే అధ్యక్షుడికి తన స్థాయి అధికారాలు లేకుండా ఆయన జాగ్రత్త పడుతున్నట్టు కనబడుతోంది. వీ







❖ **కులాంతర వివాహాలు – సామాజిక సంఘర్షణలు** – వ్యాస సంకలనం – రేకా కృష్ణార్జునరావు – మానవ వికాస మండలి ప్రచురణ – 244 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: మానవ వికాస మండలి, ఇ.నెం. 11–450సి1, ఎన్.సి.సి. రోడ్, మంగళగిరి, గుంటూరు – 522503, ఫోన్: 9848199098




❖ **అప్రజాస్వామిక – ప్రజావ్యతిరేక – సిఎఎ, ఎన్ఆర్పి, ఎన్ఆర్సి రద్దు చేయాలి** – లతీఫ్ మహ్మద్ ఖాన్, ఏశాల శ్రీనివాస్ – సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటీ – 16 పేజీలు, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు: సివిల్ లిబర్టీస్ మానిటరింగ్ కమిటీ, అంబర్‌పేట్, హైదరాబాద్ – 13, ఫోన్ : 939105186, 040–27403392
email:civillibertiesindia@gmail.com
www.civillibertiesindia.org




❖ **కార్ల్ మార్క్స్ ఆఖరి ఆర్థిక రచన – వాగ్నర్ పై విమర్శ** (సరుకు 'విలువ'పై విశ్లేషణాత్మక విమర్శ) – తెలుగు వై.వి. రమణారావు – 80 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: వై.వి. రమణారావు, ఇ.నెం. 18–8–967, మమత హాస్పిటల్ రోడ్, వరదయ్య నగర్, ఖమ్మం – 507002, ఫోన్: 9441816881




❖ **ఎవరమ్మా మీరు** – పాటలు – ఉదయమిత్ర – పాలమూరు అధ్యయన వేదిక ప్రచురణలు – 127 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: ఉదయమిత్ర, ఇ.నెం. 9–24, చైతన్య నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్ – 509301, ఫోన్: 9985203376




❖ **చైనాలోని పరిణామాలు భారత–చైనా సంబంధాలపైన...** – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు రచనలు – 5 – కా. దేవులపల్లి వెంకటేశ్వరరావు – పోరునేల ప్రచురణ – 282 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: జి. సత్యనారాయణరెడ్డి, ఫోన్ : 7702888998, తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ పుస్తక కేంద్రాలలో




❖ **కలల కన్నీటి పాట** – విభా కవితలు – అనువాదం : అజయ్ వర్మ అల్లూరి – రాణి ప్రచురణలు – 96 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: అజయ్ వర్మ అల్లూరి, ఇ.నెం. 106, 4వ క్రాస్, మారుతీ టెంపుల్ రోడ్, గంగోత్రి లే-అవుట్, మైసూర్ – 6, కర్ణాటక, ఫోన్: 9535576037



❖ **దుఃఖపు ఎరుక** – కవిత్వం – అద్దెపల్లి ప్రభు – అనల ప్రచురణలు – 88 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: అద్దెపల్లి ప్రభాకరరావు, ఇ.నెం. 3–5, మధురానగర్, పాత పంచాయితీ కార్యాలయం, కాకినాడ – 533004, ఫోన్: 9848930203



❖ **అభిజిత్ బెనర్జి నోబెల్ విజేత – పేదరిక విముక్తి సూత్రం** – డా. అక్కెనపల్లి పున్నయ్య – అదుగుజాడలు పబ్లికేషన్స్ ప్రచురణ – 40 పేజీలు, 1/8 డెమీ, రు.40, ప్రతులకు: అదుగుజాడలు పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం. 410, ఎమ్ఎస్‌కె టవర్స్, స్ట్రీట్ నెం. 11, హిమాయత్‌నగర్, హైదరాబాద్ – 500029




❖ **ఆనందం అర్ణవమైతే..** – శ్రీశ్రీ గీతాలకు సావిత్రి అభినయం – శ్రీశ్రీ – కూర్పు సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ – 56 పేజీలు, 1/8 డెమీ, రు. 50




❖ **హాస క్రీడలు** – శ్రీశ్రీ – కూర్పు సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ – 120 పేజీలు, 1/8 డెమీ, రు. 100
పై రెండు ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్యనిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతీ నగర్, విజయవాడ – 520004, ఫోన్ : 0866–669375



❖ **జాతీయ విద్యా విధానం 2019** – ముసాయిదాపై విశ్లేషణ – పిడిఎస్‌యు ప్రచురణ– 72 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: ఎం. రామకృష్ణ, కామ్రేడ్ సి.పి. భవన్, ఇ.నెం. 2–1–594 (బి–34, ఎఫ్–1), విద్యానగర్, రైల్వే స్టేషన్ రోడ్డు, హైదరాబాద్ – 500044, ఫోన్ : 040–27668471




❖ **రివాజు** – తెలంగాణ కథ – 2018 – సంపాదకులు సంగిశెట్టి శ్రీనివాస్, డా. వెల్దండి శ్రీధర్ – సింగిడి తెలంగాణ రచయితల సంఘం ప్రచురణ – 132 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు: సంగిశెట్టి శ్రీనివాస్, నందనవనం అపార్ట్‌మెంట్, ఫ్లాట్ నెం. 212, అత్తాపూర్, మెహదిపట్నం, హైదరాబాద్ – 500048



❖ **కొండపొదుగుపాలు** – కవిత్వం – శ్రీరామోజు హరగోపాల్ – రచన ప్రచురణలు – 192 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: శ్రీరామోజు హరగోపాల్, 202, మేధ రెసిడెన్సీ, ఓల్డ్ లయన్స్ క్లబ్ హాస్పిటల్ పక్కన, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్ – 500026, ఫోన్: 99494498698



❖ **నిశ్శబ్ద** – కవిత్వం – నరేష్కుమార్ సూఫీ – కవిసంగమం బుక్స్ ప్రచురణ – 152 పేజీలు, 1/8 డెమీ, రు. 151, ప్రతులకు: నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్, నవోదయ బుక్ హౌస్, బోధి, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్



❖ **మహబూబ్‌నగర్ జిల్లా సాహిత్య చరిత్ర** – డా. భీంపల్లి శ్రీకాంత్ – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణ – 142 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్ – 500004, ఫోన్: 040–29703142



❖ **నవలాలోకం–3** – ముక్తవరం పార్థసారథి – నవచేతన పబ్లిషింగ్ ప్రచురణ – 190 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జిఎస్ఐ – పోస్టు, హైదరాబాద్ – 500068, ఫోన్: 040 – 29884453

దేశం ఒక్కుమ్మడిగా లేచి నిలిచిన వేళ

సిఎఎ-ఎన్ఆర్సి-ఎన్పిఆర్ లకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చెలరేగుతున్న ప్రజా ఉద్యమ క్రమాన్ని వివరిస్తూ, ప్రస్తుతం అవసరమైనవి లక్ష్యశుద్ధి, సరైన మార్గనిర్దేశనం అని సూచిస్తున్నారు **రాజవరం పార్థసారథి**

ఇవాళ దేశమంతా అగ్నిగుండంలా ఉన్నది. గత ఆరువారాలకు పైగా పౌరసత్వ సవరణ చట్టానికి, జాతీయ పౌర పట్టికకు, జాతీయ జనాభా పట్టికకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రతిరోజూ ఎన్నో చోట్ల ఎన్నో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రధానంగా విద్యార్థి యువజనులు, మహిళలు నాయకత్వం వహిస్తున్న ఈ విస్తారమైన నిరసన కార్యక్రమాలలో దాదాపు అన్ని ప్రజా సమూహాలు తమ వంతు భాగస్వామ్యం వహిస్తున్నాయి. ప్రతిపక్ష రాజకీయ నేతలు కూడ ఈ ఉద్యమాన్ని అంగీకరించి దానిలో ఏదో ఒకమేరకు చేరక తప్పని స్థితి ఏర్పడింది. ప్రభుత్వాధినేతలు ఎంత దమనకాండను ప్రయోగించినా ఈ నిరసనలు ఆగడం లేదు సరిగదా నానాటికీ విస్తృతమవుతున్నాయి. ఆర్ ఎస్ ఎస్ ఎజెండాను అమలు చేయడానికి కంకణం కట్టుకున్న నాయకులు సిఎఎ – ఎన్ఆర్సి – ఎన్పిఆర్ గురించి ఎన్ని అబద్ధాలు ఆడుతున్నా, వెనక్కి తగ్గేది లేదని ఎన్ని బింకపు ప్రకటనలు చేస్తున్నా, ప్రజా ఆగ్రహం రోజురోజుకూ మరింత విస్తృతమవుతున్నది, సంఘటితమవుతున్నది. సిఎఎ కు అనుకూల ప్రదర్శనలు నడపడానికి, అనుకూల ప్రకటనలు ఇప్పించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నప్పటికీ అవి రాశిలోనూ వాసిలోనూ తేలిపోతున్నాయి.

బహుశా ఇటీవలి దశాబ్దాలలో స్థానికంగా, స్థానిక సమస్యలపై దీర్ఘకాలం నడిచిన ఉద్యమాలు కొన్ని, దేశీయ సమస్యలపై అక్కడక్కడ నడిచిన ఉద్యమాలు కొన్ని ఉన్నాయి గాని, ప్రస్తుత ఉద్యమం లాగ ఇంత కాలం పాటు, ఇంత పట్టుదలతో, ఇంత పెద్ద ఎత్తున సమీకరణతో, అన్ని వర్గాల భాగస్వామ్యంతో జరిగిన ఉద్యమాలు లేవు. ఈ ఉద్యమం ఇదే ఊపుతో, లేదా మరింత ఊపు పెంచుకుని మరెంత కాలం సాగగలదో తెలియదు. ఈ ఉద్యమం ఇంకా పుంజుకుని ముందుకు సాగుతుందా, ప్రభుత్వమే దిగి వచ్చి కొంత వెనక్కి తగ్గుతుందా లేక ఉద్యమమే ప్రభుత్వ నిర్బంధకాండకు అణగిపోతుందా, ఉద్యమకారుల మధ్య చీలికల వల్ల బలహీనపడి ఆగిపోతుందా చెప్పగల స్థితి లేదు. ఈ నేపథ్యంలో ఈ దానికదిగానే అద్భుతంగా నడిచిన, నడుస్తున్న ఈ ఆరువారాల ఉద్యమం నుంచి గ్రహించదగిన పాఠాలను పరిశీలించడం, భవిష్యత్ ప్రజా ఉద్యమాలలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆలోచించడం ఆసక్తికరంగా ఉంటుంది.

ప్రస్తుత దేశవ్యాప్త, విస్తృత ఆందోళనలకు పూర్వరంగం కల్పించినది అస్సాంలో గత కొద్ది నెలలుగా జాతీయ పౌర పట్టిక (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిజెన్స్- ఎన్ఆర్సి) కు వ్యతిరేకంగా రగులుతున్న అసంతృప్తి. అది అలా ఉండగానే డిసెంబర్ 9-11 తేదీల్లో పార్లమెంటులో పౌరసత్వ సవరణ బిల్లు (సిఎబి) ప్రవేశపెట్టబడి, పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) ఆమోదం పొందడంతో ఆ అసంతృప్తి వెల్లువై దేశాన్నంతా చుట్టుముట్టింది. మొదటి వారంలోనే ఢిల్లీలో జామియా మిలియా ఇస్లామియా విశ్వ విద్యాలయంలో, ఉత్తరప్రదేశ్‌లో అనేకచోట్ల నిరసనకారుల మీద పోలీసు దౌర్జన్యం దేశప్రజలందరిలో ఆగ్రహాన్ని ప్రేరేపించింది. మొదట సిఎబికీ, సిఎఎకూ వ్యతిరేకంగా మాత్రమే మొదలైన ఆందోళన క్రమంగా ఎన్ఆర్సినీ, జాతీయ జనాభా పట్టిక (నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ – ఎన్పిఆర్) నూ కూడ కలుపుకుని దేశవ్యాప్తమైన విస్తృతమైన ఆందోళనగా మారింది. ఘర్ వాపసీ, లవ్ జిహాదీ, గోరక్షణ, పెద్ద నోట్ల రద్దు, వస్తు-సేవల పన్ను, ఎస్సి, ఎస్టి రిజర్వేషన్ల కోత, భీమా కోరేగాం కేసు, భిన్నాభిప్రాయాల పట్ల అసహనం, ఆహారం మీద, ఆహార్యం మీద ఆంక్షలు, ట్రిపుల్ తలాఖ్, అధికరణం 370 తొలగింపు, అయోధ్య తీర్పు వంటి గత ఐదున్నర సంవత్సరాలలో అమలులోకి వచ్చిన డజనుకు పైగా ప్రజావ్యతిరేక నిర్ణయాలకూ, విధానాలకూ వ్యతిరేకంగా పోగుపడుతున్న అసంతృప్తి, ఇంతకాలం తక్కువ స్థాయిలోనే వ్యక్తమైన అసంతృప్తి ఒక్కసారిగా పెటిల్లున విస్ఫోటనమైంది. డిసెంబర్ 12కు ముందరి దేశానికీ తర్వాతి దేశానికీ పోలికే లేని స్థితి నెలకొంది. మోడీ షా ల దుర్మార్గ పాలన మీద ఐదున్నర సంవత్సరాలలో పెదవి విప్పని వారెంతో మంది ఇవాళ వీథుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనల్లో భాగమవుతున్నారు.

మొట్టమొదట డిసెంబర్ 13న ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయ విద్యార్థులు సిఎఎకు వ్యతిరేకంగా పార్లమెంటుకు తలపెట్టిన యాత్ర మీద పోలీసులు దుర్మార్గంగా విరుచుకుపడ్డారు. వైస్ చాన్సలర్ అనుమతి, అధికారుల అనుమతి లేకుండా పోలీసులు క్యాంపస్ లోకి చొరబడి హాస్టల్ గదుల్లో, లైబ్రరీలో విద్యార్థుల మీద భయంకరంగా లాఠీచార్జి చేసి వందలాది మంది విద్యార్థులను గాయపరిచారు. బాష్పవాయు ప్రయోగం చేశారు. ఆ వారంలోనే అలీఘర్ ముస్లిం యూనివర్సిటీలో, లక్నోలోని నద్వా యూనివర్సిటీలో కూడ నిరసన ప్రదర్శనలు జరుపుతున్న విద్యార్థుల మీద ఉత్తరప్రదేశ్ పోలీసులు అత్యంత పాశవికమైన దాడులు చేశారు. జనవరి 5న ముసుగులు ధరించిన సాయుధులైన ఎబివిపి – ఆర్ఎస్ఎస్ గూండాలు ఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలోకి చొరబడి హాస్టళ్ల మీద దాడి చేసి విద్యార్థులను కొట్టారు. భీతావహ పరిస్థితి సృష్టించారు.

వేరు వేరు యూనివర్సిటీల్లో విద్యార్థుల మీద ఇలా పోలీసులు, సంఘ్ గూండాలు జరుపుతున్న దాడులతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా విద్యార్థి లోకం మేలుకొని ఎదురుతిరిగింది. విద్యార్థులు సిఎఎ వ్యతిరేక ఆందోళనల్లో మరింత ఎక్కువగా పాల్గొనడం, నాయకత్వం వహించడం మొదలుపెట్టారు. దేశంలో వందలాది విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు చిన్నవో పెద్దవో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు, నిర్వహిస్తున్నారు.

ఈ విద్యార్థి నిరసనకారులకు అన్ని రాష్ట్రాల్లో విద్యార్థి సంఘాలు,

మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరసమాజ సంస్థలు, ముస్లిం సమాజ సంస్థలు, ఇతర మైనారిటీ మత సంస్థలు, కొన్ని చోట్ల కార్మిక సంఘాలు, వామపక్ష రాజకీయ పార్టీలు కూడ తోడు నిలిచాయి. కాంగ్రెస్ తో సహా ఇతర పార్లమెంటరీ రాజకీయ పార్టీలు కూడ ఈ ఉద్యమంలో భాగం పంచుకోక తప్పలేదు.

దేశంలో ఆరు వారాలలో ఇంతగా దావానలంలా వ్యాపించడం మాత్రమే కాదు, ఈ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా భారతీయులు ఉన్నచోటికల్లా విస్తరించింది. న్యూయార్క్, వాషింగ్టన్, పారిస్, బెర్లిన్, జెనీవా, బార్సెలోనా, శాన్ ఫ్రాన్సిస్కో, టోక్యో, హెల్సింకీ, ఆమ్‌స్టర్‌డామ్, హేగ్, జూరిచ్ వంటి డజన్ల కొద్దీ విశ్వనగరాలలో భారత రాయబార కార్యాలయాల ముందర, దౌత్య కార్యాలయాల ముందర, ప్రధాన నగరాలలోని కీలక ప్రదేశాలలో సిఎఎ – ఎన్ఆర్‌సి – ఎన్‌పిఆర్ నిరసన ప్రదర్శనలు జరిగాయి. హార్వర్డ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కొలంబియా, యేల్, స్టాన్‌ఫర్డ్, బ్రౌన్, జాన్స్ హాప్కిన్స్, కార్నెల్, కార్నెజీ మెల్లాన్, పర్డ్యూ, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, ఎడింబరో, లీడెన్, గ్రోనింజెన్, ఎరాస్మస్ వంటి డజన్ల కొద్దీ విశ్వవిద్యాలయాలలో భారత విద్యార్థులూ, ఆయా దేశస్తులూ కూడ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

ఏ విస్తృతమైన, విశాల భాగస్వామ్యం ఉన్న ప్రజా ఉద్యమమైనా అనివార్యంగా గొప్ప సృజనాత్మక విస్ఫోటనానికి దారి తీస్తుంది. ప్రస్తుత ఉద్యమంలో కూడ అద్భుతమైన కవిత్వం, నినాదాలు, పోస్టర్లు, కార్టూన్లు, ఉపన్యాసాలు, సిఎఎ – ఎన్‌సిఆర్ –ఎన్‌పిఆర్ మీద వ్యంగ్య వ్యాఖ్యలు, వీడియోలు ఎన్నో వెలువడుతున్నాయి. ఉర్దూ కవి రాహత్ ఇందోరి రాసిన 'సభీ కా ఖూన్ హై షామిల్ యహా కి మిట్టీ మే, కిసీ కె బాప్ కా హిందుస్తాన్ తోడీ హై' (ఈ మట్టిలో అందరి త్యాగాల రక్తమూ కలిసి ఉంది, హిందుస్తాన్ ఏ ఒక్కరి అయ్య జాగీరు కాదు), హిందీ కవి వరుణ్ గ్రోవర్ రాసిన 'తానాషా ఆకర్ జాయేంగే, హమ్ కాగజ్ నహీ దిఖాయేంగే' (నియంతలు వస్తారు, పోతారు, మేం కాగితాలు మాత్రం చూపించం), గాయకుడు ఆమిర్ అజీజ్ రాసిన 'మై ఇన్‌కార్ కర్తా హు' (నేను నిరాకరిస్తున్నాను), హిందీ కవి హుస్సేన్ హైద్రీ రాసిన మై హిందుస్తానీ ముసల్మాన్ హు', అజ్మల్ ఖాన్ రాసిన 'రాసుకో నా పేరు' వంటి అనేక కొత్త వ్యక్తీకరణలను ఉద్యమకారులు దేశవ్యాప్తంగా వాడుతున్నారు. అదే విధంగా గతంలో సుప్రసిద్ధమైన ఫైజ్ అహ్మద్ ఫైజ్ కవిత 'హమ్ దేఖేంగే', అవతార్ సింగ్ పాష్ కవిత 'మై ఘాస్ హు, మై ఆప్ కే కియె ధరె పర్ ఉగ్ ఆవూంగా' (నేను గడ్డిని, నీ కాళ్ల కిందినుంచి మొలుచుకొస్తాను), బిస్మిల్ అజిమాబాదీ రాసిన 'సర్ఫరోష్‌కి తమన్నా అబ్ హమారే దిల్ మె హై, దేఖ్ నా హై జోర్ కిత్నా బాజు ఎ ఖాతిల్ మె హై' (మా హృదయాల్లో విప్లవాకాంక్ష ఉంది, హంతకుడి చేతుల్లో ఎంత శక్తి ఉన్నదో చూద్దాం), ముహమ్మద్ ఇక్బాల్ కవిత 'సారే జహాసే అచ్ఛా, ఆజాదీ నినాదాలు, రాజ్యాంగ ప్రవేశిక ఈ ఉద్యమంలో ప్రతిధ్వనిస్తున్నాయి. నరేంద్ర మోడీనీ, అమిత్ షానూ, ఆర్ఎస్ఎస్ నూ గేలిచేసే వ్యంగ్య నినాదాలు ఎన్నో ఆకాశంలో ఎగురుతున్నాయి.

ఈ ఆరువారాల ఉద్యమంలో అత్యంత ప్రభావశీలమైనదీ, ప్రపంచమంతా కొనియాడుతున్నదీ, ప్రేరణపొందుతున్నదీ షాహీన్ బాగ్ నిరసన కార్యక్రమం. డిసెంబర్ 14 నుంచి ఇది రాస్తున్న జనవరి 27 వరకు దక్షిణ ఢిల్లీలోని షాహీన్‌బాగ్‌లో నిరంతరాయమైన నిరసన ప్రదర్శన సాగుతున్నది. కేవలం పదిహేను మంది స్థానిక స్త్రీలు, అది కూడ ఇవాళ దేశమంతా ప్రేమగా షాహీన్ బాగ్‌దాదీ అని పిలుచుకుంటున్న వయసు పైబడిన స్త్రీలు, ప్రారంభించిన ఈ నిరసన కార్యక్రమం రోజురోజుకూ వేలాది మందితో, శుక్ర, శని వారాలలో లక్ష మంది దాకా కూడ విస్తరించి కూడ సాగుతున్నది. భయంకరమైన చలిని, పోలీసు నిర్బంధాన్ని, నిరసన ప్రదర్శనను తొలగించడానికి, నిర్వాహకులలో చీలిక తేవడానికి పాలకులు సాగిస్తున్న కుటిల ప్రయత్నాలను అధిగమించి ఈ నిరసన ప్రదర్శన ఉత్తేజకరంగా సాగుతున్నది.

ఈ నిరసన కార్యక్రమాలలో పాల్గొంటున్న వారందరికీ ఒకే లక్ష్యం ఉందని చెప్పలేం. ముఖ్యంగా ఈశాన్యరాష్ట్రాల ఆందోళనకారులు చట్టవ్యతిరేక చొరబాటుదారులకూ, ఏ ప్రాతిపదిక మీదనైనా సరే పౌరసత్వం ఇవ్వడానికీ వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. మిగిలిన ప్రాంతాలలో ఈ ఉద్యమంలో పాల్గొంటున్నవారిలో భిన్నమైన లక్ష్యాలున్నవారున్నారు. మత ప్రాతిపదిక మీద వివక్ష ఉండగూడదనే వారున్నారు. ఈ చట్టం, ఎన్ఆర్‌సి ప్రక్రియ అణగారిన వర్గాలకు వ్యతిరేకమనే వారున్నారు. అసంఖ్యాక ప్రజలు గుర్తింపు పత్రాలు చూపజాలరు గనుక ఇది రద్దు చేయాలనే వారున్నారు. ఈ చట్టం రాజ్యాంగ ఆదర్శాలకు వ్యతిరేకమనే వారున్నారు. ఇది ఆర్ఎస్ఎస్ విద్వేష రాజకీయాల ఎజెండాలో భాగమనీ అందువల్ల మొత్తంగా ఆర్ఎస్ఎస్ ను వ్యతిరేకించాలనే వారున్నారు. బైటికి కనబడే కారణం, స్వయంగా నిరసనకారులు చెపుతున్న కారణం ఏదైనా, లోలోపలి నుంచి వారిని కదిల్చిన ఇతర కారణాలు కూడ ఉన్నాయి. ఆర్థిక జీవనం మీద జరుగుతున్న దాడులు, సామాజిక భద్రత లేకపోవడం, రాజకీయాభిప్రాయ ప్రకటనకు అవకాశం లేకపోవడం. ఆర్థిక మాంద్యం, వృద్ధిరేటులో గణనీయమైన కోత, పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, విపరీతంగా పెరిగిపోతున్న అసమానతలు, పిడికెడు మంది ఆశ్రితులకు అనుకూలంగా సాగుతున్న ఆర్థిక విధానాలు, కార్మిక వ్యతిరేక విధానాలు, భయంకరమైన అధికార కేంద్రీకరణ, సాంస్కృతిక ఏకరూపత కోసం, గుత్తాధిపత్యం కోసం ఆర్ఎస్ఎస్ పాలకులు అమలులోకి తెస్తున్న విధానాలు వంటి రాజకీయార్థిక కారణాలు ప్రతి ఒక్కరినీ కలవరపెడుతూ ఈ ఉద్యమంలో వారి భాగస్వామ్యంలో ప్రతిఫలిస్తున్నాయి.

ఇన్ని రకాల వారు, ఇన్నిన్ని కారణాలపై ఉద్యమంలో పాల్గొనడం ఉద్యమానికి విస్తృతినీ, విశాల భాగస్వామ్యాన్నీ ఇస్తుంది గాని ఉద్యమానికి ఏకసూత్రత సాధించడం కష్టమవుతుంది. ఈ కారణాలన్నిటికీ మూలాధారాన్ని కనిపెట్టి ఆ మూలాధారం గురించి ప్రతి ఒక్కరిలో చైతన్యం పెంచి, దాన్ని తొలగించడం అనే స్థూల లక్ష్యాన్ని కూడ అన్ని భాగస్వామ్య పక్షాల చేత అంగీకరింపజేయడమే ఉద్యమ విజయానికి మార్గం సుగమం చేస్తుంది. ఎవరు ఏ కారణం మీద ఉద్యమంలో పాల్గొన్నా, వారందరి కారణాలనూ ఆమోదించి, వారందరి భాగస్వామ్యాన్నీ గౌరవించి, అందరినీ ఏకం చేయడానికి, స్థిరంగా, దృఢంగా ఉద్యమంలో నిలిపి ఉంచడానికి అవసరమైన మార్గనిర్దేశకత్వం ఇవాళ్టి అవసరం. భారత సమాజపు బహుళత్వానికీ, సహజీవనానికీ వ్యతిరేకమైన ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని నిర్మూలించడం ఈ అన్ని భాగస్వామ్య వర్గాల తక్షణ అవసరం అనే కనీస, ఉమ్మడి, సూత్రబద్ధ కార్యక్రమం పునాదిగా మార్గనిర్దేశకత్వం జరిగినప్పుడు ఈ ఉద్యమం కనీస విజయాలనైనా సాధించగలుగుతుంది. వీ

(రచయిత జర్నలిస్టు)

ప్రభుత్వ వాదనలు తప్పుల కుప్పలు

***పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర పట్టిక, జాతీయ జనాభా పట్టికల విషయంలో ప్రభుత్వం చేస్తున్న వాదనలు ఎన్నెన్ని తప్పులతో కూడి ఉన్నాయో వివరిస్తున్నారు* మిహిర్ దేశాయి**

పౌరసత్వ సవరణ చట్టం – జాతీయ పౌర పట్టికల గురించి తరచుగా అడిగే ప్రశ్నలకు జవాబులు పేరుతో కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 20న ఒక పత్రం విడుదల చేసింది. ఆ పత్రం పూర్తిగా తప్పుదారి పట్టించేదిగా ఉంది. కొన్ని సందర్భాలలో తప్పుడు సమాచారం ఇస్తున్నది. ఆ పత్రం చెపుతున్నదానికంటె దాచిపెడుతున్నదే ఎక్కువ. ప్రభుత్వం ఇచ్చిన జవాబు యథాతథంగా ఇచ్చి ఆ తర్వాత నా వ్యాఖ్యలు ఇస్తున్నాను.

అలాగే, ఈ 'తరచుగా అడిగే ప్రశ్నల' జాబితాలో అత్యంత ముఖ్యమైన, తరచుగా అడిగే ప్రశ్నలు ఎనిమిది అసలు ప్రస్తావనకే రాలేదు. మొదట ఆ ఎనిమిది ప్రశ్నలు అడిగి, ఆ తర్వాత ప్రభుత్వ పత్రం దగ్గరికి వెళతాను.

మొదటి ప్రశ్న

ప్రభుత్వ జాబితాలో పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ అనే మూడు దేశాలలో వివక్షకు గురవుతున్న మత బృందాల పేర్లు మాత్రమే ఎందుకున్నాయి? ఇతర పొరుగుదేశాలలో వివక్షకు గురవుతున్న మత మైనారిటీలు, ఉదాహరణకు శ్రీలంకలో అన్ని మతాలకు చెందిన తమిళులు, మయన్మార్ లో రోహింగ్యాలు, చైనాలో ప్రత్యేకంగా టిబెటన్ బౌద్ధులు, ఉయిఘర్ లు ఈ జాబితాలో ఎందుకు లేరు? దేశ విభజనకు ముందు కలిసి ఉన్న ప్రాంతాలు అనే జవాబు చెప్పినప్పటికీ అఫ్ఘనిస్తాన్ కు భారత విభజనతో సంబంధం లేదు గనుక దాన్ని చేర్చవలసిన అవసరం లేదు. పౌరసత్వ సవరణ చట్టంలో పేర్కొన్న సమూహాల మీద వివక్ష అమలవుతున్నదనేది కాదనలేని వాస్తవమే అయినప్పటికీ, ఈ చట్టంలో కొన్ని దేశాల, కొన్ని మతాల పేర్లు మాత్రమే చేర్చడాన్ని అర్థం చేసుకోవడం అవసరం.

రెండో ప్రశ్న

అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ లలో వివక్షకు గురవుతున్న మత మైనారిటీలను పరిరక్షించడానికి తయారైన ఈ చట్టం అవే దేశాలలో అటువంటి వివక్షకే గురవుతున్న బలోచ్ లు, అహ్మదియాలు, షియాల వంటి మత మైనారిటీలకు అటువంటి రక్షణనే ఎందుకు ఇవ్వడం లేదు? ఇటువంటి మత మైనారిటీలు వివక్షకు గురవుతున్నారనడానికి ఎన్నో ఆధారాలున్నాయి. ఒక ఉదాహరణ చెప్పాలంటే, పాకిస్తాన్ లో అహ్మదియాలను ముస్లిమేతర మైనారిటీలుగా 1974లో ప్రకటించారు. అహ్మదియాలు తమను తాము ముస్లింలుగా చెప్పుకున్నా, తమ మతాన్ని ఇస్లాంగా చెప్పుకున్నా, బహిరంగంగా ఇస్లామిక్ ఆచారాలను పాటించినా శిక్షార్హమైన నేరం అవుతుందని 1984లో చట్టం తీసుకువచ్చారు. పాకిస్తాన్ లో అహ్మదియాల మీద తరచుగా భౌతికదాడులు, హత్యలు జరుగుతున్నాయి. కచ్చితంగా వారిని మత వివక్షకు గురవుతున్న మైనారిటీ బృందంగా చూడవలసిందే. మరొక ఉదాహరణ చెప్పాలంటే, బంగ్లాదేశ్ కు చెందిన వేలాది మంది చక్మా గిరిజన తెగల వారు అక్కడ అమలైన వివక్ష వల్ల, ఇతర కారణాల వల్ల గత ఎన్నో దశాబ్దాలలో ఈశాన్యరాష్ట్రాలకు వలస వచ్చారు. వారిలో చాలమందికి పౌరసత్వం దక్కింది. ఇంకా పౌరసత్వం దక్కని చాలమంది అది కోరుకుంటున్నారు. వారిలో చాలమంది బౌద్ధమతాన్ని అవలంబించేవారున్నారు. పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం వారికి పౌరసత్వం దక్కుతుంది. కాని ఆ చక్మాలలోనే ఇస్లాం పాటించే సమూహం కూడ ఉంది. అంటే మామూలుగా చక్మా అనే ఒకే అస్తిత్వం ఉన్నప్పటికీ కొత్త చట్టం ప్రకారం ముస్లిమేతర చక్మాలకేమో పౌరసత్వం దక్కుతుంది. ముస్లిం చక్మాలకు మాత్రం పౌరసత్వం దక్కదు.

మూడో ప్రశ్న

ఐక్యరాజ్య సమితి కాందిశీకుల ఒడంబడిక 1951, నిబంధనావళి 1967 ప్రకారం, నరజాతి, మతం, జాతీయత, ఒక ప్రత్యేక సాంఘిక బృందంలో సభ్యత్వం, రాజకీయ అభిప్రాయాల కారణంగా వివక్షను ఎదుర్కొంటున్న వ్యక్తులకు కాందిశీకుల హోదా ఇవ్వవలసి ఉంటుంది. అయితే ఈ రెండు ఐక్యరాజ్యసమితి పత్రాల మీద భారత ప్రభుత్వం సంతకం చేయలేదు. అయినా సరే, ఎవరికైనా పౌరసత్వం ఇవ్వడానికి వివక్షను కారణంగా చూపుతున్నట్టయితే, ఆ వివక్ష కేవలం ముస్లిమేతర మత బృందాలు గురవుతున్న వివక్షే ఎందుకు కావాలి? ఇతర కారణాల వల్ల అమలవుతున్న వివక్ష ఇందులో ఎందుకు చేరలేదు? ఉదాహరణకు, 2019 డిసెంబర్ 19న పాకిస్తాన్ కు చెందిన విద్యావేత్త జునేద్ హాఫీజ్ కు దైవదూషణ చేశాడనే కారణంపై మరణశిక్ష విధించారు. స్పష్టంగా అది భావప్రకటనా స్వేచ్ఛ పట్ల వివక్షే. పొరుగు దేశాలలో ఇటువంటి పద్ధతిలోనూ, రాజకీయంగానూ వివక్షకు గురవుతున్నవారు ఎంతో మంది ఉన్నారు. వివక్షకు గురవుతున్నవారందరినీ పౌరసత్వం ద్వారా ఆదుకోవాలనేదే భారత ప్రభుత్వ కోరిక అయితే, మతేతర కారణాల వల్ల వివక్షకు గురవుతున్న వారిని ఎందుకు ఆదుకోవడం లేదు?

నాలుగో ప్రశ్న

పై ప్రశ్నకు అనుబంధంగానే అడగవలసిన మరొక ప్రశ్న, కొంతమందికి మాత్రమే మత ప్రాతిపదికపైనే పౌరసత్వాన్ని ఎందుకు ఇస్తున్నారు? ఇది కచ్చితంగా భారత రాజ్యాంగంలోని ప్రవేశికలో చెప్పుకున్న లౌకికవాదానికి మాత్రమే కాక, సుప్రీం కోర్టు చెప్పిన భారత

రాజ్యాంగపు మౌలిక నిర్మాణానికే వ్యతిరేకమైనది. భారతదేశంలో పౌరసత్వాన్ని నిర్వచించే, పౌరసత్వాన్ని ఇచ్చే మొట్టమొదటి పత్రం భారత రాజ్యాంగమే. ఆ రాజ్యాంగం స్పష్టంగా దేశ విభజన తర్వాత, అది మిగిల్చిన గాయాల తర్వాత రూపొందినదే. దేశ విభజన అనుభవం ఉన్నప్పటికీ ఆ రాజ్యాంగం తూర్పు, పశ్చిమ పాకిస్తాన్ ల నుంచి కాందిశీకులను అనుమతించి, వారికి భారత పౌరసత్వం కూడ ఇచ్చింది. అలా పౌరసత్వం ఇచ్చేటప్పుడు అది ఆ కాందిశీకుల మధ్య మతం పునాదిగా వివక్షణ చూపలేదు. దేశంలో పౌరసత్వం గురించి వ్యవహరించే ప్రాథమిక పత్రమైన పౌరసత్వ చట్టం 1955 ఎన్నడూ మత ప్రాతిపదిక మీద విభజన చూపలేదు. పౌరసత్వాన్ని ఇవ్వడానికి అస్సాంలోకి ప్రవేశానికి 1971 మార్చ్ 25 ను నిర్ణీత తేదీగా నిర్ణయించిన అస్సాం ఒప్పందం కూడ మత ప్రాతిపదిక మీద విభజన చూపలేదు. వలసదారుల (అస్సాం నుంచి బహిష్కరణ) చట్టం 1950 కూడ మత ప్రాతిపదిక మీద విభజన చెప్పలేదు. అందువల్ల, ప్రస్తుతం మత కోణం తీసుకురావడంలో ఎటువంటి సమర్థనీయ కారణమూ లేదు. పొరుగుదేశాలలో వివక్షను ఎదుర్కొంటున్న వ్యక్తులకు ఆశ్రయం కల్పించాలనే సదుద్దేశమే ఉంటే అటువంటి వివక్షను ఎదుర్కొంటున్న వ్యక్తులందరికీ రక్షణ కల్పించవలసిందే.

ఐదో ప్రశ్న

పౌరసత్వ సవరణ చట్టం కింద ఇవ్వజూపుతున్న పౌరసత్వం కేవలం 2014 డిసెంబర్ 31కి ముందు భారతదేశంలో ప్రవేశించినవారికి మాత్రమే వర్తిస్తుందని ఎందుకు అంటున్నారు? ఆ దేశాలలో 2014 డిసెంబర్ 31 తర్వాత మత వివక్ష ఆగిపోయిందా?

ఆరో ప్రశ్న

జాతీయ పౌర పట్టిక తయారు చేయడానికి ఆర్థికంగా ఎంత వ్యయమవుతుంది? మానవ శక్తి ఎంత వ్యయమవుతుంది? భారతదేశం ఆ వ్యయాన్ని భరించగలదా?

అస్సాంలో పౌరసత్వానికి సంబంధించిన సమస్యలపై దాదాపు వందమంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 28 మంది నిర్బంధ శిబిరాల్లో చనిపోయారు. మిగిలినవారు గుండెపోటుతోనో, ఆత్మహత్య చేసుకునో మరణించారు. వారిలో కొందరు జాతీయ పౌర పట్టిక గురించి నిరాశా నిస్పృహలతో, మానసికాందోళనతో ఆత్మహత్యలకు సిద్ధపడగా, నిర్బంధిస్తారనీ, నిర్బంధ కేంద్రాలకు పంపుతారనీ భయంతో కొందరు ప్రాణాలు తీసుకున్నారు. మరికొందరు నిర్బంధ కేంద్రాలలో అనుమానాస్పద పరిస్థితులలో మృతదేహాలుగా మిగిలారు.

అస్సాంలో జాతీయ పౌరపట్టిక తయారీకి రు. 1600 కోట్లు ఖర్చయింది. మొత్తం మూడు కోట్ల ముప్పై లక్షల మంది అభ్యర్థుల పట్టికలు తయారు చేయడానికి యాభై వేల మంది అధికారులు, సిబ్బంది పనిచేశారు. ఆ పట్టిక చివరికి పందొమ్మిది లక్షల మంది పేర్లను తొలగిస్తూ తయారయిందని, అందులో అన్ని మతాలకూ చెందిన నిజమైన పౌరులే ఉన్నారనీ ఇప్పుడు అందరికీ తెలుసు. ఈ అనుభవంతో మనం ఒక ఉజ్జాయింపు లెక్క వేయగలిగితే, భారత దేశం మొత్తం జనాభాను కూడ కాదు, కేవలం వోటర్ల సంఖ్యనే తీసుకుంటే 87 కోట్ల 90 లక్షల మందికి, అఖిల భారత జాతీయ పౌర పట్టిక తయారు చేయడానికి నాలుగు లక్షల ఇరవై ఆరు వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. అ పని పూర్తి చేయడానికి ఒక కోటీ ముప్పై మూడు లక్షల మంది అధికారులు, సిబ్బంది అవసరమవుతారు.

దానికి తోడుగా నిర్బంధ కేంద్రాల నిర్మాణానికి ఎంతో ఖర్చవుతుంది. ఆ నిర్బంధ కేంద్రాలలో అత్యంత ఘోరమైన పరిస్థితులలోనైనా జీవితాంతం, లేదా సుదీర్ఘకాలం నిర్బంధితులను పోషించడానికి ఎంతో ఖర్చవుతుంది. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జైళ్లలో నిర్బంధంలో ఉంచగలిగిన సామర్థ్యం మూడు లక్షల యాభై వేల మంది మాత్రమే. అంటే కేవలం అస్సాంలో ఎన్ఆర్సి లో మినహాయించిన వారి కోసం మాత్రమే ప్రస్తుతం దేశంలో ఉన్న జైళ్లకు ఆరు రెట్లు ఎక్కువ జైళ్లను, నిర్బంధ కేంద్రాలను నిర్మించవలసి వస్తుంది.

ఇదంతా కూడ ప్రజలకు వ్యక్తిగత స్థాయిలో అయ్యే ఖర్చును లెక్కలోకి తీసుకోకుండా వేస్తున్న అంచనా మాత్రమే. మళ్లీ అస్సాం ఉదాహరణే చూస్తే, విదేశీయుల ట్రిబ్యునల్ లోనూ, హైకోర్టులోనూ తమ కేసులను వాదించే న్యాయవాదులకు చెల్లించడానికి చాల మంది తమ భూములను అమ్ముకోవలసి వచ్చింది.

ఏడో ప్రశ్న

అసలు జాతీయ పౌర పట్టిక అవసరం ఉందా? జాతీయ పౌర పట్టిక అనేది దేశంలోని పౌరులందరి జాబితా. భారత రాజ్యాంగంలోని అధికరణం 326 ప్రకారం, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం పౌరులకు మాత్రమే వోటు హక్కు ఉంటుంది. అంటే వోటర్ల జాబితాలో ఉన్నవారందరూ పౌరులుగానే గుర్తింపు పొందాలి. దేశంలోని వివిధ రాష్ట్రాల, ప్రాంతాల వోటర్ల జాబితాలను కలిపితే దేశంలోని మొత్తం పౌరుల జాబితా, పద్దెనిమిది సంవత్సరాలకు పైబడినవారి జాబితా తయారవుతుంది. మరి ఆ పని బదులు ఈ అనవసరమైన కసరత్తంతా ఎందుకు చేస్తున్నారు? ఇక పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలు పొరుగుదేశాల నుంచి పాకుతూ సరిహద్దులు దాటి భారతదేశంలో జొరబడడం అంత సులభం కాదు. అంటే వాళ్ల తల్లిదండ్రుల పేర్లు గనుక వోటర్ల జాబితాలో ఉండి ఉంటే, పిల్లలు కూడ పౌరులే అయిపోతారు. ఇందుకు అతి కొద్ది మినహాయింపులు ఉండవచ్చు. మరి ప్రతి ఒక్కరూ ఇప్పుడు కొత్తగా తమను తాము పౌరులుగా రుజువు చేసుకోవలసిన అవసరం ఏమిటి? దళితులు, ఆదివాసులు, స్త్రీలు, ట్రాన్స్ జెండర్ వ్యక్తులు వంటి సమూహాల మీద ప్రత్యేకమైన గురిపెట్టి, అసలు అన్ని సమూహాలలోని అశేషమైన పేద ప్రజలందరినీ, ముస్లింలలో అత్యధికభాగాన్నీ పౌరసత్వ హక్కుల నుంచి తొలగించాలనే ఉద్దేశంతో కాకపోతే ఈ కసరత్తే అవసరం లేదు. జాతీయ పౌర పట్టిక లేకుండానే, విదేశీయుల చట్టం 1946 ప్రకారం కూడ అక్రమ చొరబాటుదారులను తొలగించడానికి ప్రభుత్వానికి అధికారం ఉంది. విదేశీయులుగా గుర్తించినవారి మీద దశాబ్దాలుగా క్రమబద్ధంగా విచారణలు, "తొలగించడానికి" చర్యలూ జరుగుతూనే ఉన్నాయి. అంటే ప్రస్తుతం జాతీయ పౌరపట్టిక గురించి మొత్తం కసరత్తు కూడ కేవలం భయోత్పాతాన్ని వ్యాపింపజేయడానికి, వోటర్లు కాకుండా, సంక్షేమ పథకాలకు దూరమైన అసంఖ్యాక ప్రజలను "నిర్బంధ కేంద్రాల"లో బానిస శ్రామికులుగా మార్చడానికి జరుగుతున్న కసరత్తు లాగుంది. కాకపోతే, వారిని స్వేచ్ఛగా విడుదల చేసినా ఆ అసంఖ్యాక ప్రజానీకం ఎటువంటి హక్కులు లేకుండా ఉండిపోతారు. కార్పొరేట్లకు, వారి ఆశ్రితులకు అత్యంత చౌకధరకు దొరికే శ్రామికులుగా మిగిలిపోతారు.

ఎనిమిదో ప్రశ్న

జాతీయ పౌర పట్టిక ప్రక్రియను ప్రారంభించే ఉద్దేశం లేదని ప్రధానమంత్రి అంటున్నారు. మరి జాతీయ జనాభా పట్టిక కసరత్తు ఎందుకు ప్రారంభిస్తున్నారు? దేశవ్యాప్తంగా 2020 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జాతీయ జనాభా పట్టిక కసరత్తు జరుగుతుందని కేంద్రప్రభుత్వం 2019 జూలై 31న ఒక నోటిఫికేషన్ విడదల చేసింది. మామూలుగా జరిగే జనగణనకూ, ఈ జనాభా పట్టికకూ మధ్య గందరగోళం సృష్టించే ప్రయత్నం జరుగుతున్నది. కాని ఈ జనాభా పట్టిక అనే జాతీయ పౌరుల పట్టిక నిబంధనలలో నాలుగో నిబంధన కింద జరుగుతున్నది. జనగణన అనేది పూర్తిగా స్వతంత్రమైన, పూర్తిగా భిన్నమైన ప్రయోజనం కోసం వచ్చిన జనగణన చట్టం కింద జరుతుంది. అంటే జాతీయ జనాభా పట్టిక అనేది జాతీయ పౌరుల పట్టిక తయారు చేయడానికి మొదటి అడుగుగా తయారవుతున్నది. అఖిల భారత జాతీయ పౌరుల పట్టికను తయారు చేయడానికి తప్ప "జనాభా పట్టిక"కు మరొక అవసరమమేమీ లేదు.

ఇప్పుడిక ప్రభుత్వం విడుదల చేసిన 'తరచుగా అడిగే ప్రశ్నలకు జవాబుల'ను చూద్దాం.

ప్రశ్న 1: జాతీయ పౌరుల పట్టిక పౌరసత్వ సవరణ చట్టంలో భాగమా?

ప్రభుత్వ జవాబు: కాదు. పౌరసత్వ సవరణ చట్టం ఒక ప్రత్యేకమైన చట్టం కాగా, జాతీయ పౌర పట్టిక ఒక ప్రత్యేకమైన ప్రక్రియ. పౌరాత్వ సవరణ చట్టం పార్లమెంటు ఆమోదంతో దేశవ్యాప్తంగా అమలులోకి రాగా, జాతీయ పౌర పట్టికకు సంబంధించిన దేశవ్యాప్త నిబంధనలు, పద్ధతులు ఇంకా నిర్ణయించవలసే ఉన్నాయి. అస్సాంలో అమలవుతున్న జాతీయ పౌరుల పట్టికను అస్సాం ఒప్పందం నిర్దేశించగా, గౌరవనీయ సుప్రీంకోర్టు అమలు చేస్తున్నది.

వాస్తవం: ఈ జవాబు పాక్షికంగా మాత్రమే నిజం. పౌరసత్వ సవరణ చట్టం 2019 అనేది పౌరసత్వ చట్టం 1955కు సవరణ. ఇక ఎన్ఆర్సి ప్రక్రియ పౌరసత్వ నమోదు, జాతీయ గుర్తింపు పత్రాల జారీ నిబంధనలు 2003 ప్రకారం జరుగుతున్నది. ఎన్ఆర్సి నిబంధనలను 2003లోనే జారీ చేశారు. ఆ నిబంధనలను పౌరసత్వ చట్టం 1955 ప్రకారమే జారీ చేశారు. సిఎఎ, ఎన్ఆర్సి లకు సమర్పించవలసిన పత్రాల గురించి ఇంకా ప్రకటన వెలువడవలసే ఉన్నది. సిఎఎ ప్రకారం హిందూ, క్రైస్తవ, బౌద్ధ, పార్సీ, జైన, సిక్కు మతాలకు చెందిన వ్యక్తులు తాము పాకిస్తాన్ లేదా బంగ్లాదేశ్ లేదా అఫ్ఘనిస్తాన్ నుంచి 2014 డిసెంబర్ 31కి ముందే భారతదేశంలో ప్రవేశించామని చూపుకోవలసి ఉంటుంది. కాని ఇలా చూపుకోవడానికి ఏ సాక్ష్యాధారాలు చూపాలో ఇంకా నిర్దేశించలేదు. అలాగే ఎన్ఆర్సి కింద పౌరసత్వాన్ని రుజువు చేసుకోవడానికి ఏయే పత్రాలు సమర్పించాలో కూడ ఇంకా ప్రకటించలేదు. ఎన్ఆర్సి లేకుండా కూడ సిఎఎ ఉండవచ్చు. అంటే సిఎఎ పరిధిలోకి వచ్చే వలసదారులు ఎన్ఆర్సి ప్రక్రియలో భాగం కాకుండానే తమను పౌరులుగా గుర్తించమని అడగవచ్చు. కాని ఇప్పుడు సిఎఎ లేకుండా ఎన్ఆర్సి జరపడానికి వీలు లేదు. ఇప్పుడు సిఎఎ ఒక చట్టం అయిపోయింది. ఎన్ఆర్సి కింద ఒకరి పౌరసత్వాన్ని నిర్ధారించాలంటే ఆ వ్యక్తి పౌరుడవునా కాదా తేల్చడానికి సిఎఎ ను పరిగణనలోకి తీసుకోవలసిందే.

ప్రశ్న 2: భారతీయ ముస్లింలు సిఎఎ – ఎన్ఆర్సి గురించి ఆందోళన చెందవలసి ఉంటుందా?

ప్రభుత్వ జవాబు: సిఎఎ లేదా ఎన్ఆర్సి గురించి ఏ మతానికి చెందిన ఏ భారతీయ పౌరుడూ ఆందోళన చెందవలసినదేమీ లేదు.

వాస్తవం: ఇది పూర్తిగా తప్పుదారి పట్టించే జవాబు. ఒక వ్యక్తి భారతీయ పౌరుడవునా కాదా నిర్ణయించేది ఎన్ఆర్సి ప్రక్రియ. అంటే మీరు మీ దగ్గర పాస్ పోర్టు, వోటింగ్ కార్డు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాన్ కార్డు వగైరా పత్రాలున్నాయని, కనుక మీరు భారతీయ పౌరుడినేనని అనుకోవచ్చు. అయినా ఎన్ఆర్సి ప్రక్రియలో మిమ్మల్ని పౌరుల జాబితా నుంచి తొలగించవచ్చు. ఇలా తొలగించడం అన్ని మతాల వారి విషయంలోనూ జరగవచ్చు. అస్సాంలో సరిగ్గా జరిగినది అదే. తమ దగ్గర అన్ని రకాల గుర్తింపు పత్రాలు ఉన్నాయనీ, తాము భారతీయ పౌరులమేనని అనుకున్నవాళ్లలో చాల మంది పేర్లు పౌరుల పట్టిక నుంచి మినహాయించబడ్డాయి. పౌరసత్వం ఇవ్వడానికి అప్పటికప్పుడు తయారుచేసిన యోగ్యతా నిబంధనలకు వారు సరిపోనందువల్ల వారు మినహాయించబడ్డారు. మిమ్మల్ని పౌరులుగా గుర్తిస్తే చింతించవలసిందేమీ లేదు. కాని ఎన్ఆర్సి కింద మిమ్మల్ని పౌరులుగా గుర్తించారో లేదో కూడ ఎవరికీ తెలియదు. అస్సాం ఎన్ఆర్సి లో వేరువేరు గుర్తింపు పత్రాలలో ఉన్న సొంత పేరులో గాని, తల్లిదండ్రుల పేర్లలో గాని కేవలం ఒక అక్షరం తేడా ఉంటే ఆ గుర్తింపు పత్రాలను తిరస్కరించి వారిని ఎన్ఆర్సి నుంచి తొలగించారు.

ప్రశ్న 3: ఎన్ఆర్సి ని ప్రత్యేకంగా ఒక మతస్తుల విషయంలోనే అమలు చేస్తారా?

ప్రభుత్వ జవాబు: లేదు. ఎన్ఆర్సి కి ఏ ఒక్క మతం తోనూ ఎంతమాత్రం సంబంధం లేదు. ఎన్ఆర్సి భారతదేశంలో పౌరులలో ప్రతి ఒక్కరికీ చెందినది. అది పౌరుల పట్టిక. అందులో ప్రతి ఒక్కరి పేరు నమోదు చేస్తారు.

వాస్తవం: వాస్తవంలో తగిన గుర్తింపు పత్రాలు లేనందువల్ల తమ పౌరసత్వాన్ని నిర్ధారించలేని అణగారిన వర్గాల ప్రజలలో అత్యధిక సంఖ్యాకులను ఎన్ఆర్సి మినహాయించబోతున్నది. అసలు ఎన్ఆర్సి అవసరమా అనేది అసలు సమస్య.

ప్రశ్న 4: మత ప్రాతిపదికపై ఎన్ఆర్సి మనుషులను తొలగిస్తుందా?

ప్రభుత్వ జవాబు: లేదు. అసలు ఎన్ఆర్సి ఏ ఒక్క మతం గురించీ కాదు. ఎన్ఆర్సి ఎప్పుడు అమలులోకి వచ్చినా, అది మత ప్రాతిపదిక మీద వర్తించదు, మత ప్రాతిపదిక మీద అమలులోకి రాదు. ఎవరైనా ఒక వ్యక్తి ఒక ప్రత్యేక మతాన్ని పాటిస్తున్నారనే కారణంతో మినహాయించడం జరగదు.

వాస్తవం : ఇది నిజం కాదు. ఒక ఉదాహరణ చూద్దాం. నేనొక పేద ముస్లింను. నేను భారతదేశానికి చెందినవాడినే. నా పూర్వీకులు భారతదేశానికి చెందినవారే. కాని నాదగ్గర నా పుట్టుకకు రుజువు పత్రాలేమీ లేవు. ఇక నన్ను పట్టిక నుంచి మినహాయించి, అక్రమ చొరబాటుదారుగా పరిగణిస్తారు. సిఎఎ మరింతగా నన్ను జల్లెడ పడుతుంది.

నేనొక పేద హిందువును. నేను భారతదేశానికి చెందినవాడినే. నా పూర్వీకులు భారతదేశానికి చెందినవారే. నాదగ్గర పుట్టుకకు రుజువులేమీ లేవు. ఇప్పుడు సిఎఎ ప్రకారం నేను పాకిస్తాన్ నుంచి వచ్చానని, అక్కడ అమలైన మత వివక్ష వల్ల నా దగ్గరి పత్రాలన్నీ పాకిస్తాన్ లో పోయాయనీ అంటాను. నాకు వెంటనే భారత పౌరసత్వం దొరుకుతుంది.

లేదా మరొక ఉదాహరణ చూద్దాం. నేనొక అహ్మదియా ముస్లింను. అక్కడి మత వివక్ష వల్ల నేను పాకిస్తాన్ నుంచి వచ్చేశాను. కాని సిఎఎ ప్రకారం నన్ను అక్రమ చొరబాటుదారుగా గుర్తించి నిర్బంధ కేంద్రానికి పంపుతారు.

నేనొక హిందువును. నేను అక్కడ వివక్ష తట్టుకోలేక పాకిస్తాన్ నుంచి సరిహద్దు దాటి వచ్చేశాను. నాకు పౌరసత్వం దొరికింది.

ప్రశ్న 5 : ఎన్ఆర్సి నమోదులో మమ్మల్ని భారతీయులుగా రుజువు చేసుకొమ్మని అడుగుతారా?

ప్రభుత్వ జవాబు : మొట్టమొదట ముఖ్యంగా గుర్తించవలసిన విషయమేమంటే ఎన్ఆర్సి ప్రక్రియ ప్రారంభించడానికి జాతీయ స్థాయిలో ఇంతవరకూ ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. అది అమలైతే, ఏ ఒక్కరినీ భారతీయులుగా రుజువు చేసుకొమ్మని అడుగుతారని కాదు. ఎన్ఆర్సి అనేది ఒక పౌరుల పట్టికలో మీ పేరు నమోదు చేసుకునే ఒక సాధారణ ప్రక్రియ మాత్రమే. వోటర్ జాబితాలో పేరు నమోదు చేయించుకునేటప్పుడో, ఆధార్ కార్డ్ తీసుకుంటున్నప్పుడో ఎట్లాగైతే మనం మన గుర్తింపు కార్డునో, ఇతర పత్రాలనో చూపుతామో అలాగే ఎన్ఆర్సి కోసం అటువంటి పత్రాలనే చూపవలసి ఉంటుంది.

వాస్తవం : ఇది అబద్ధం. దేశమంతటా 2020 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జాతీయ జనాభా నమోదు జరుగుతుందని 2019 జూలై 31న ఒక గెజెట్ ప్రకటన వెలువడింది. ఇది జనగణన చట్టం ప్రకారం జరిగే జనగణన ప్రక్రియ కన్న భిన్నమైనది. ఎన్ఆర్సి నిబంధనలలో సెక్షన్ 4 ప్రకారం ఈ జాతీయ జనాభా పట్టిక నమోదు జరుగుతున్నది. అంటే ఈ ప్రక్రియ పూర్తిగా ఎన్ఆర్సి ప్రక్రియలో భాగం. ఇందుకోసం ఏ పత్రాలు సమర్పించాలో ఇంకా స్పష్టంగా ప్రకటించలేదు. కాని వోటర్ జాబితాకూ, ఆధార్ కార్డుకూ సమర్పించేటటు వంటి పత్రాలు సరిపోతాయనేది మాత్రం అబద్ధం.

తమిళనాడులోని మూడు జిల్లాలలో 2019 ఆగస్టు లోనే ఎన్పిఆర్ కు పైలట్ అధ్యయనాలు జరిగాయని వార్తలు వస్తున్నాయి.

ప్రశ్న 6 : పౌరసత్వాన్ని ఎలా నిర్ణయిస్తారు? అది ప్రభుత్వం చేతిలో ఉంటుందా?

ప్రభుత్వ జవాబు : ఏ వ్యక్తి పౌరసత్వమైనా, పౌరసత్వ నిబంధనావళి 2009 ప్రాతిపదిక మీద నిర్ణయమవుతుంది. ఈ నిబంధనావళి పౌరసత్వ చట్టం 1955ఆధారంగా తయారయింది. ఈ నిబంధనావళి బహిరంగంగా ప్రజలందరి ముందూ ఉంది. ఏ వ్యక్తి అయినా భారత పౌరసత్వం పొందాలంటే ఐదు మార్గాలున్నాయి.

1. పుట్టుక వల్ల వచ్చే పౌరసత్వం
2. వారసత్వం వల్ల వచ్చే పౌరసత్వం
3. నమోదు ప్రక్రియ వల్ల వచ్చే పౌరసత్వం
4. సహజీకరణ ప్రక్రియ వల్ల వచ్చే పౌరసత్వం
5. (ప్రాంత) విలీనం వల్ల వచ్చే పౌరసత్వం

వాస్తవం : ఇది అమలులో ఉన్న విషయాన్ని చెప్పే అనవసర వివరణ. ఈ ఉన్న విషయానికి తోడుగా అంతిమంగా ప్రభుత్వమే ఏ పత్రాలు ఆంగీకారయోగ్యమైనవో, ఏవి కావో నిర్దేశిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆ సమయానికి అక్కడ ఉన్న ప్రభుత్వాధికారులే ఒక ప్రత్యేక పత్రం సాధికారికమైనదో కాదో తేలుస్తారు. ఆ పత్రాల వాస్తవికతనూ, ఒక వ్యక్తి విదేశీయుడు అవునా కాదా అనే విషయాన్నీ విదేశీయుల ట్రిబ్యునళ్లు నిర్ణయిస్తాయి. అస్సాంలో విదేశీయుల ట్రిబ్యునళ్లు పనిచేసిన తీరు చూస్తే ఎంతమాత్రం అనుభవం లేని వ్యక్తులను ఆ ట్రిబ్యునళ్ల తీర్పరులుగా నియమించారనీ, వారికి ఎంతమందిని విదేశీయులుగా నిర్ణయించవలసి ఉంటుందో లక్ష్యాలు నిర్ణయించారనీ తెలుస్తున్నది. వారు ఆ లక్ష్యాలను చేరకపోతే, అంటే నిర్దేశించినంత మందిని విదేశీయులుగా నిర్ధారించకపోతే వారి మీద తీవ్రమైన ఆరోపణలు చేసి, చివరికి వారిని ఆ ఉద్యోగాల నుంచి తొలగించారు. ఇప్పుడు, దేశమంతా ఎన్ఆర్సి మొదలైతే దేశవ్యాప్తంగా వేలాదిగా, లక్షలాదిగా విదేశీయుల ట్రిబ్యునళ్లు ఏర్పాటు చేయవలసి వస్తుంది. ఒకవైపు న్యాయస్థానాలలో న్యాయమూర్తుల ఖాళీలే నింపకుండా ఏళ్ల తరబడి ఉండిపోతుండగా, ఈ కొత్త ట్రిబ్యునళ్లకు నియమించడానికి తగినంత మంది వ్యక్తులు ఎక్కడ దొరుకుతారు, వారికి ఎంత ఖర్చవుతుంది?

ప్రశ్న 7 : నా భారత పౌరసత్వాన్ని రుజువు చేసుకోవడానికి నేను నా తల్లిదండ్రుల జనన వివరాలు ఇవ్వవలసి ఉంటుందా?

ప్రభుత్వ జవాబు : మీ జనన వివరాలను, అంటే పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, పుట్టిన చోటు ఇస్తే సరిపోతుంది. మీదగ్గర ఆ వివరాలు లేకపోతే, మీ తల్లిదండ్రుల గురించిన అవే వివరాలు ఇవ్వవలసి ఉంటుంది. కాని తల్లిదండ్రుల గురించిన పత్రాలేవైనా ఇవ్వాలనే నిర్బంధమేమీ లేదు. పుట్టిన తేదీ గురించి, పుట్టిన స్థలం గురించి ఏ పత్రాలు సమర్పించినా పౌరసత్వం దక్కుతుంది. అయితే, ఆంగీకారయోగ్యమైన పత్రాలేమిటనే విషయంలో తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదు. కాని, ఈ పత్రాలలో ప్రభుత్వాధికారులు ఇచ్చిన వోటర్ కార్డు, పాస్ పోర్టు, ఆధార్ కార్డు, లైసెన్సులు, ఇన్సూరెన్స్ కాగితాలు, జనన ధ్రువీకరణ పత్రాలు, పాఠశాల వదిలినప్పటి ధ్రువీకరణ పత్రాలు, భూమి, ఇల్లు వంటి ఆస్తి పత్రాలు వంటివి ఉండవచ్చు. ఏ ఒక్క భారతీయ పౌరుడు కూడ అనవసరమైన ఇబ్బందులకు గురికాని పద్ధతిలో ఈ పత్రాల జాబితా తయారవుతుంది.

వాస్తవం: ప్రభుత్వం చెపుతున్నది పూర్తిగా పచ్చి అబద్ధం. 1955 పౌరసత్వ చట్టానికి సవరణల ప్రకారం పౌరసత్వం అనేది మీరు ఎప్పుడు పుట్టారనేదాని మీద ఆధారపడుతుంది. మీరు 1987 జూలై 1కి ముందు పుట్టినట్టయితే, మీరు భారతదేశంలోనే పుట్టానని రుజువు చేసుకుంటే సరిపోతుంది. కాని పౌరసత్వ చట్టానికి ఆ తర్వాత జరిగిన సవరణల వల్ల, మీరు 1987 జూలై 1కీ 2004 డిసెంబర్ 3కూ మధ్య పుట్టినట్టయితే, మీరు భారతదేశంలోనే పుట్టానని మాత్రమే కాదు, మీ జనన సమయానికి మీ తల్లిదండ్రులలో ఒకరు భారత పౌరులని కూడ రుజువు చేయవలసి ఉంటుంది. మీరు 2004 డిసెంబర్ 3 తర్వాత పుట్టినట్టయితే, మీరు భారతదేశంలో పుట్టారనీ, మీ జనన సమయానికి మీ తల్లిదండ్రులలో ఒకరు భారత పౌరులనీ మాత్రమే కాదు, మరొకరు అక్రమ చొరబాటుదారు కాదనీ కూడ రుజువులు చూపవలసి ఉంటుంది.

అలాగే అవసరమైన పత్రాల గురించి ప్రభుత్వం చెప్పినది కూడ అబద్ధం. మొట్టమొదట, జనాభా పట్టిక సేకరణ ప్రక్రియ ప్రారంభించక ముందే, అవసరమైన పత్రాల జాబితా ప్రకటించకుండా ప్రభుత్వాన్ని ఎవరు ఆపుతున్నారు? ఆ జాబితా ప్రకటిస్తే, ప్రజలకు ఏవి సిద్ధంగా ఉంచుకోవాలో తెలుస్తుంది గదా. రెండవది, పౌరసత్వాన్ని రుజువు చేసుకోవడానికి తగిన పత్రాలలో ఆధార్ కార్డు కూడ ఒకటని ప్రభుత్వం చెపుతున్న మాట పచ్చి అబద్ధం. ఎందుకంటే ఆధార్ చట్టం లోని సెక్షన్ 9 ప్రకారం, "ఆధార్ సంఖ్య గాని, అందుకు సంబంధించిన ధ్రువీకరణ గాని, దానికదిగా, ఆ ఆధార్ సంఖ్య పొందినవారి పౌరసత్వానికి,

నివాసస్థానానికి సంబంధించిన ఏ హక్కునూ, రుజువునూ ఇవ్వదు” అని స్పష్టంగా ఉంది.

లైసెన్సులు వగైరాల గురించి కూడ ఇటువంటి వాదనలే వర్తిస్తాయి. వోటర్ల జాబితాలో పేరు ఉండడం, పాస్ పోర్టు ఉండడం అనేవి పౌరులకు మాత్రమే వర్తించేవి గాని, వాటికవిగా పౌరసత్వ రుజువులుగా సరిపోతాయని నిబంధనావళిలో ప్రస్తావించలేదు.

ప్రశ్న 8 : 1971కి ముందరి కుటుంబ చరిత్రను రుజువు చేసుకోవలసి ఉంటుందా?

ప్రభుత్వ జవాబు : అవసరం లేదు. 1971కి ముందరి కుటుంబ చరిత్ర కోసం మీరు ఎటువంటి గుర్తింపు పత్రాలను గాని, తల్లిదండ్రుల, పూర్వీకుల జనన పత్రాలను గాని సమర్పించనక్కరలేదు. అది అస్సాం ఒప్పందం ప్రకారం, గౌరవ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రూపొందిన అస్సాం ఎన్ఆర్సి కి మాత్రమే వర్తిస్తుంది. మిగిలిన దేశంలో ఎన్ఆర్సి ప్రక్రియ పూర్తిగా భిన్నమైనది. అది పౌరసత్వం (పౌరుల నమోదు, జాతీయ గుర్తింపు పత్రాల జారీ) నిబంధనావళి 2003 ప్రకారం జరుగుతుంది.

వాస్తవం : అస్సాంలో అమలైన ప్రక్రియ భిన్నమైనదనే మాట నిజమే గాని ప్రస్తుతం సిఎఎ ప్రభావంలో, అస్సాం ప్రక్రియను పూర్తిగా మళ్లీ జరుపుతామని కూడ భారత ప్రభుత్వం ప్రకటించింది. అటు అస్సాం ప్రక్రియకైనా, ఇటు దేశవ్యాపిత ప్రక్రియకైనా లక్ష్యం పౌరుల జాబితా తయారు చేయడమే. ఆ జాబితాలో లేనివారికి వోటు హక్కు లేకుండా చేయడమే. పైన ఏడో ప్రశ్న జవాబులో రాసినట్టు పౌరసత్వాన్ని నిర్ధారించడానికి వేరువేరు ప్రమాణాలున్నాయి.

ప్రశ్న 9 : గుర్తింపును రుజువు చేసుకోవడం అంత సులభమైతే అస్సాం ఎన్ఆర్సి లో పందొమ్మిది లక్షల మంది ఎందుకు తొలగించబడ్డారు?

ప్రభుత్వ జవాబు : చొరబాటుదారుల సమస్య అస్సాంలో సుదీర్ఘకాలంగా ఉంది. దాన్ని అరికట్టడానికి ఒక ఉద్యమం సాగింది. తత్ఫలితంగా 1985లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం చొరబాటుదారులను గుర్తించడానికి, ఎన్ఆర్సి తయారు చేయడానికి ఒక ఒప్పందం చేసుకుని, 1971 మార్చ్ 25ను నిర్ణీత తేదీగా నిర్ణయించింది.

వాస్తవం : నిజానికి అస్సాం ఒప్పందపు స్ఫూర్తిని అధిగమించడమే సిఎఎ లక్ష్యం. అస్సాంలో కూడ అవసరమైన అన్ని పత్రాలూ ఉన్నప్పటికీ అత్యధిక సంఖ్యాక ప్రజలను పౌరసత్వం లేనివారిగా ప్రకటించారు. ఒక వాదన ప్రకారం, ఒక అర్థంలో మిగిలిన దేశంలో కన్న పౌరసత్వం రుజువు చేసుకోవడం అస్సాంలోనే సులభం. మీరు బంగ్లాదేశ్ నుంచి అస్సాంలోకి 1964లో, లేదా అంతకు ముందు ప్రవేశించారని రుజువు చేసుకుంటే పౌరసత్వం పొందడానికి అరులవుతారు. కాని మిగిలిన దేశంలో అది సరిపోదు. మిగిలిన దేశంలో మాత్రం 1950 జనవరి 26 తర్వాత పాకిస్తాన్ నుంచో, బంగ్లాదేశ్ నుంచో వచ్చినట్టయితే మిమ్మల్ని చట్టవ్యతిరేక చొరబాటుదారుగా ప్రకటిస్తారు. కొన్ని మినహాయింపులతోనైనా, మీరు భారతదేశంలోనే పుట్టారని రుజువు చేసుకోగలిగితే మిమ్మల్ని భారత పౌరుడిగా పరిగణిస్తారు. అంటే మీరు అస్సాంలోకి 1964 లో ప్రవేశించారని మాత్రం రుజువు చేసుకుంటే మీరు ఎక్కడ పుట్టారనేది రుజువు చేయనక్కరలేదు. అప్పటి నుంచి అస్సాంలోనే నివసిస్తున్నారనేందుకు అవసరమైన ఆస్తి పత్రాలు వగైరా చూపితే చాలు. మిగిలిన దేశంలో మాత్రం అది సరిపోదు. అయితే, ఇది ఒక వాదన మాత్రమే. మరెన్నో విషయాలలో అస్సాంలో పౌరసత్వం పరిగణన పొందడం మిగిలిన దేశంలో కన్న చాల కష్టం.

ప్రశ్న 10 : ఎన్ఆర్సి ప్రక్రియ సందర్భంలో మమ్మల్ని పాత పత్రాలు చూపమని అడుగుతారా, అవి సంపాదించడం కష్టం కదా?

ప్రభుత్వ జవాబు: అటువంటిదేమీ ఉండదు. గుర్తింపును రుజువు చేసుకోవడానికి అవసరమైన మామూలు పత్రాలు మాత్రమే అడుగుతారు. జాతీయ స్థాయిలో ఎన్ఆర్సి ని ప్రకటించినప్పుడు, అందుకు సంబంధించిన నిబంధనలు, సూచనలు జారీ అవుతాయి. వాటి వల్ల ఏ ఒక్కరూ ఇబ్బందికి గురికారు. ప్రజలను వేధించాలని, ఇబ్బంది పెట్టాలని ప్రభుత్వ ఉద్దేశం కాదు.

వాస్తవం : ఈ జవాబు పూర్తిగా అబద్ధం. అసలు ఈ జవాబుకు ప్రాతిపదికే లేదు. ఎందువల్లనంటే 1955 పౌరసత్వ చట్టానికి జరిగిన సవరణల ప్రకారం మీరు ఎప్పుడు పుట్టారనే దాన్ని బట్టి మీ తల్లిదండ్రులు భారత పౌరులని రుజువు చేసే పత్రాలు ఇవ్వవలసి ఉంటుందని నిర్దేశించారు. దాని బదులు, విదేశీయుల చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి ఎవరు పౌరులు కారో నిర్ధారిస్తే సరిపోతుంది.

ప్రశ్న 11 : ఒక వ్యక్తి నిరక్షరాస్యుడై, అతని దగ్గర అవసరమైన పత్రాలేవీ లేకపోతే ఏం జరుగుతుంది?

ప్రభుత్వ జవాబు : అటువంటి సందర్భంలో ఒక సాక్షిని తెచ్చుకోవడానికి అధికారులు ఆ వ్యక్తికి అనుమతి ఇస్తారు. అలాగే, ఇతర సాక్ష్యాధారాలు, సముదాయపు గుర్తింపు వగైరాలను కూడ అనుమతిస్తారు. సరైన పద్ధతి పాటించబడుతుంది. ఏ ఒక్క భారతీయ పౌరుడినీ అనవసరమైన ఇబ్బందికి గురిచేయడం జరగదు.

వాస్తవం : ఈ జవాబు చెప్పడానికి ఆధారం ఏమిటి? జననాన్ని రుజువు చేసుకోవడానికి తగిన నిబంధనలను నిర్దేశించలేదు. ప్రస్తుతం ఉన్న చట్టప్రకారం ఒకే ఒక్క పద్ధతి, జనన మరణాల తప్పనిసరి నమోదు చట్టం 1969 మాత్రమే. దాని ప్రకారం 1969 నాటి నుంచి ప్రతి ఒక్క జననమూ నమోదు కావలసిందే. కాని ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో, కొన్ని పట్టణ ప్రాంతాలలో కూడ అత్యధిక సంఖ్యాకులు, ముఖ్యంగా మురికివాడల నివాసులు, ఫుట్ పాత్ ల మీద నివసిస్తున్నవారు వగైరా తమ జననాలను నమోదు చేసుకోవడం లేదు. ఒక నిబంధన గాని, నియంత్రణ గాని, ఉత్తర్వు గాని, ప్రభుత్వాదేశం గాని లేని స్థితిలో ఏ ప్రాతిపదిక మీద సాక్షులను అనుమతిస్తారు?

ప్రశ్న 12 : భారతదేశంలో సొంత ఇల్లు లేనివారు, నిరుపేదలు, చదువుకోని వారు ఎంతో మంది ఉన్నారు. వారి గుర్తింపుకు ఆధారమైన పత్రమేదీ వారి దగ్గర లేదు. అటువంటి వారికి ఏం జరుగుతుంది?

ప్రభుత్వ జవాబు : ఇది పూర్తిగా వాస్తవం కాదు. అటువంటి వారందరికీ కూడ ఏదో ఒక ప్రాతిపదిక ఉంది. వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ఏదో ఒకటి పొందుతూనే ఉన్నారు. ఆ ప్రాతిపదిక ఆధారంగానే వారి గుర్తింపును నిర్ధారించడం జరుగుతుంది.

వాస్తవం : ఈ జవాబుకు ప్రాతిపదిక ఏమిటో తెలియదు. సంక్షేమ పథకాలలో వాటా పొందడం పౌరసత్వాన్ని నిర్ధారించడానికి ప్రాతిపదిక కాదు. అలా అని ఏ చట్టమూ చెప్పడం లేదు. అసలు ఇక్కడ సమస్య గుర్తింపును నిర్ధారించడం కాదు, పౌరసత్వాన్ని రుజువు చేసుకోవడం.

ప్రశ్న 13 : ఎవరైనా ఒక వ్యక్తిని పత్రాలు ఉన్నా లేకపోయినా, ట్రాన్స్ జెండర్, నాస్తికుడు, ఆదివాసి, దళితుడు, స్త్రీ, భూమిలేని నిరుపేద అనే కారణం మీద మినహాయిస్తుందా?

రాజ్యాంగ సూత్రాలను రక్షించుకొనే ఉద్యమం

దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజలను విభజించి మైనారిటీలకు గుర్తింపు లేకుండా చేసే చట్టాలను తెచ్చి రాజ్యాంగ హక్కులను కాలరాస్తోన్న సందర్భంలో లౌకిక శక్తులు సమసమాజం కోసం ఉద్యమించాలని అంటున్నారు డా. కత్తి పద్మారావు

ఈనాడు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్‌షా పరిపాలనలో మతోన్మాదం పెచ్చరిల్లడమేకాక భారత రాజ్యాంగానికి తూట్లు పడుతున్న క్రమం నిరంతరంగా కొనసాగుతోంది. నరేంద్రమోడీ, అమిత్‌షా ఇద్దరూ కూడా భారత రాజ్యాంగ విధ్వంసకులుగా వ్యవరిస్తున్నారు. మానవ హక్కుల ఉల్లంఘనకు నిరంతరం ప్రయత్నం చేస్తున్నారు. పార్లమెంట్‌ను భారత రాజ్యాంగ విధ్వంసానికి ఉపయోగిస్తున్నారు. ఇది భారతదేశానికి పెనుముప్పు. ఈనాడు కొందరు వీరి చర్యలను మతోన్మాద చర్యలుగానే భావిస్తున్నారు కానీ.. ఇది లౌకికవాదంపై జరుగుతున్న దాడి.. రాజ్యాంగంపై జరుగుతున్న దాడి.. స్త్రీల హక్కులపై జరుగుతున్న దాడి.. మైనార్టీ హక్కులపై జరుగుతున్న దాడి.. ఈ దాడిని అర్థం చేసుకోవాలంటే భారత రాజ్యాంగం మీద, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆలోచనల మీద మనకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. స్వాతంత్ర్య కాలంనాడు అంబేడ్కర్ ఇలా చెప్పారు 'నా ఉద్దేశంలో హిందూ సమాజం కులరహిత సమాజం అయినప్పుడు మాత్రమే అది తనను తాను రక్షించుకునే శక్తిని, సామర్థ్యాన్ని సంతరించుకోగలదు. అంతరంగికమైన బలం లేకుండా హిందువులకు స్వరాజ్యం వచ్చినా, అది మళ్లీ దాస్యంవైపు ఒక అడుగు ముందుకు వెయ్యడమే కావచ్చు. బాగా ఆలోచించండి. మీ ప్రయత్నాలు ఫలించుగాక.' డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ హిందూ సామ్రాజ్యవాద భావనను ఆనాడే గుర్తించారు. ఈనాడు మోడీ, షా తీసుకువచ్చినటువంటి భారత రాజ్యాంగేతర బిల్లులు భారతీయుల హక్కులను కాలరాస్తున్నాయి. ఈ విషయం మీద జస్టిస్ చందు మాట్లాడుతూ 'మనం భారతీయులమా, కాదా అనే అనుమానం కలిగేలా కొనసాగుతున్న దేశ పాలనలో మనం ఉన్నామని వ్యాఖ్యానించారు. బిజెపి ఇప్పుడు కొత్తగా తీసుకువచ్చిన పౌరసత్వ చట్ట సవరణ బిల్లు (క్యాబ్ 2019)లో ఇతర దేశాల నుండి వచ్చిన హిందువులకు భారత పౌరసత్వాన్ని కల్పించి, ఇతర మతస్తులను దేశం నుండి వెళ్లగొట్టే దుర్మార్గపు చర్యలకు బిజెపి పూనుకుందని విమర్శించారు. క్యాబ్‌ను వ్యతిరేకిస్తున్నవారిలో ఈశాన్య ప్రజల వైఖరికి, మిగతా దేశ ప్రజల వైఖరికి తేడా ఉందన్నారు.

పాలకుల సంకుచితత్వం

విదేశీయులెవరూ ఇక్కడ ఉండరాదని ఈశాన్య ప్రజలు కోరుకుంటే, తమిళనాడులో ఉత్తర శ్రీలంక నుంచి వచ్చిన తమిళులకు పౌరసత్వం ఇవ్వాలని కోరుతున్నారు. బిజెపి ప్రభుత్వం మాత్రం బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ ఈ మూడు దేశాల నుంచి వచ్చిన ముస్లిమేతరులకు మాత్రమే పౌరసత్వం ఇచ్చేలా క్యాబ్‌లో నిబంధనలు పొందుపరిచిందన్నారు. ప్రతి న్యాయాధిపతి మతానికి అతీతంగా ఇలా ఆలోచించగలిగినప్పుడు భారతదేశంలో హిందూ సామ్రాజ్యవాద భావనలను విడనాడి రాజ్యాంగ బద్ధత పెరుగుతుంది.

రాజ్యాంగంలో చెప్పిన చట్టం ముందు అందరూ సమానులే అని 14వ అధికరణ ఇలా నిర్దేశిస్తుంది. 'రాజ్యాంగంలోని 14, 15, 16, 17, 18 అధికరణాలు చట్ట సమానత్వానికి సంబంధించినవి. చట్ట సమానత్వాన్ని రూల్ ఆఫ్ లా అంటారు. అంటే చట్టం ముందు ఎవరూ అధికులు కారు. చట్టపరమైన అవకాశాలు అందరికీ సమానంగా ఉంటాయి. అయితే ఆర్థికంగాను, సామాజికం గాను, భౌగోళిక పరంగాను, విద్యాపరంగాను అసమానతలున్న ఈ దేశంలో సమాన అవకాశాలు, చట్ట సమానత్వం ఎలా సాధ్యం? అందువలన ఈ అధికరణాన్ని వాస్తవిక దృక్పథంతో, విస్తృత పరిధిలో అన్వయించుకోవాలని సుప్రీం కోర్టు పలు సందర్భాలలో స్పష్టం చేసింది.'

అయితే ఇప్పుడు పార్లమెంట్ ఉభయ సభల్లో పాసైన పౌరసత్వ చట్ట సవరణ బిల్లు (క్యాబ్ 2019) రాజ్యాంగేతరమైనదే కాక, అంబేడ్కర్ భావించినట్లు ఆర్ఎస్ఎస్ అజెండాను మళ్లీ ముందుకు తీసుకువస్తున్నారనేది స్పష్టం. అయితే ఈ ప్రమాదాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ముందుగానే గుర్తించారు. మొదట ఈ భావజాలంపై పోరాటం చేయడానికి ఆయనే పూనుకున్నారు. గాంధీ, జిన్నాలు ఇద్దరూ కూడా దేశాన్ని మతవాద రాజకీయాలతో భగ్నం చేస్తున్నారని చెప్పాడు. ఈ సందర్భంగా అంబేడ్కర్ ఈ మతవాద రాజకీయాల పునాదుల గురించి గాంధీ, జిన్నాలు ఈ మతవాద రాజకీయాల వ్యక్తిత్వాల గురించి, వారిద్దరి వల్ల జరిగిన నష్టం గురించి ఇలా విశ్లేషించారు. 'ఈ ఇద్దరు మహా పురుషుల చేతుల్లో

ప్రభుత్వ జవాబు : లేదు. ఎప్పుడు అమలు లోకి వచ్చినా ఎన్ఆర్‌సి పైన పేర్కొన్న ఏ సమూహం మీద ప్రభావం వేయదు.

వాస్తవం : సాంకేతికంగా చూస్తే ఎన్ఆర్‌సి ఏ సమూహాన్నీ మినహాయించదు. కాని పత్రాలు ఉన్నా లేకపోయినా, పేద దళితులు, ఆదివాసులు, స్త్రీలు, భూమిలేని నిరుపేదలు, ఆ పత్రాలలో ఒక చిన్న అక్షరం పొరపాటుకు కూడ తమను తాము భారత పౌరులుగా రుజువు చేసుకోవలసి వస్తుంది. తద్వారా వారిలో అత్యధిక సంఖ్యాకులు ఏదో ఒక నిరంకుశ ప్రాతిపదికపై పౌరసత్వం నుంచి మినహాయించబడతారు.

(రచయిత ముంబాయి హైకోర్టులో సీనియర్ న్యాయవాది)

ప్రభుత్వపత్రం: https://pibindia.wordpress.com/2019/12/20/q-a-on-nrc-national-register-of-citizens/#more-20113

ఈ వ్యాసం https://cjp.org.in/advocate-mihir-desais-point-by-point-rebuttal-of-the-gois-faq-on-caa-npr-nrc/

వీ

రాజకీయాలు వికార ప్రదర్శనల పోటీ అయింది. గాంధీని 'మహాత్మా' అని జిన్నాని కాయిదే అజిం' అనవలసిందే. గాంధీకి కాంగ్రెస్ ఉంటే, జిన్నాకు ముస్లిం లీగ్ ఉండాలి. కాంగ్రెస్‌కు వర్కింగ్ కమిటీ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఉంటే, ముస్లిం లీగ్‌కూ ఒక వర్కింగ్ కమిటీ ఉండాలి. ఒక కౌన్సిల్ ఉండాలి. కాంగ్రెస్ మహాసభ జరిగితే వెనువెంటనే లీగ్ సభ జరగాలి. కాంగ్రెస్ ఒక ప్రకటన చేసిందంటే, దానివెంటనే లీగ్ ప్రకటన వస్తుంది. ఒకవేళ కాంగ్రెస్ 17,000 పదాలతో ఒక తీర్మానం చేసిందనుకొంటే లీగ్ కనీసం మరొక వెయ్యి పదాలు వేసి తీర్మానం చేస్తుంది. కాంగ్రెస్ అధ్యక్షుడు పత్రికా గోష్ఠి పెడితే ముస్లింలీగ్ అధ్యక్షుడూ పత్రికా గోష్ఠి పెడతాడు. కాంగ్రెస్ ఐక్యరాజ్య సమితికి ఒక విజ్ఞాపన పంపాలనుకొంటే ముస్లింలీగ్ అందులోనూ వెనుకపడగూడదనుకొంటుంది.' ఆనాడే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భారత ఉపఖండ విభజన పునాదులు వీరిరువురు వేశారు అని చెప్పారు. కమ్యూనిస్టులు ఆనాడు అంబేద్కర్ మతం గురించి, కులం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. వారు గాంధీ అనుచరులుగా చాలాకాలం ఉన్నారు. ఇప్పటికీ వారు ఎక్కువమంది హిందువులుగా జీవిస్తూ మార్క్సిస్టులుగా మాట్లాడుతున్నారు. నిజానికి మేము ఈ హిందూ మతంలో ఉండం. మేము బౌద్ధ మతంలోకి వెళ్లిపోతాం. ఈ హిందూ మతంలో మాకు రక్షణలేదు, సమానత లేదు. మమ్మల్ని బహిష్కరించిన మతంలో మేముండం అని చెప్తూ అంబేద్కర్ సుదీర్ఘంగా దళితుల పక్షాన ఇలా వాదించారు.

మతం మారే స్వేచ్ఛ – రాజకీయ హక్కు

'మత మార్పిడిని రెండు కోణాలలో పరిశీలించాలి–సామాజిక, మత పరమైన, భౌతిక, తాత్విక కోణాలు. కోణమేదైనా ఏ ఆలోచనా మార్గమైనా, మొదటగా అర్థం చేసుకోవలసిన విషయం ఒకటుంది. అస్పృశ్యత స్వభావం, దానిని ఆచరిస్తున్న తీరు. అది అర్థంచేసుకోకుండా మత మార్పిడిపై నా ప్రకటన వెనుక ఉన్న అర్థాన్ని మీరు గ్రహించలేరు. అస్పృశ్యత, వాస్తవ జీవితంలో దాని ఆచరణపై స్పష్టమైన అవగాహన కోసం, మీపై జరిగిన అత్యాచార ఘటనలను గుర్తుచేసుకోమంటాను. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చే హక్కును కోరినప్పుడు లేదా ఊరి బావి నుంచి నీరు తోడుకునే హక్కును లేదా గుర్రంపై పెళ్లి కొడుకుతో ఊరేగింపు తీసుకెళ్లడం వంటి చిన్న కారణాల వల్ల అగ్రవర్ణ హిందువుల చేతిలో తన్నులు తిన్న ఘటనల వంటివి జ్ఞాపకం తెచ్చుకోమంటాను. మీ కళ్ల ముందే జరిగే అటువంటి ఘటనల గురించి మీకు తెలుసు. అగ్రవర్ణ హిందువులు అస్పృశ్యులపై అత్యాచారాలు చేసేందుకు కారణాలు ఇంకా అనేకం ఉన్నాయి. వీటిని వెల్లడిస్తే హిందుస్థాన్ ఆవల ఉన్న ప్రజలు నిశ్చేష్టులవుతారు. మంచిరకం దుస్తులు ధరించినందుకు అస్పృశ్యులను కొడతారు. కంచువంటి లోహాలతో చేసిన సామాగ్రిని ఉపయోగించినందుకు వారిని చాలాసార్లు కొరడాతో శిక్షించిన సందర్భాలున్నాయి. వ్యవసాయం చేసినందుకు వారి ఇళ్లు తగులబెట్టారు. జంధ్యం వేసుకున్నందుకు హింసించారు. మృతజీవులను తీసుకు వెళ్లేందుకు తిరస్కరించినందుకు, గ్రామ వీధులలో చెప్పులు వేసుకు తిరిగినందుకు లేదా అగ్రవర్ణ హిందువులకు వంగి సలాం కొట్టనందుకు, బహిర్భూమికి వెళ్లేటప్పుడు కంచు పాత్రలో నీరు తీసుకువెళ్లినందుకు వారు తన్నులు తిన్నారు. ఒక విందులో చపాతీలు వడ్డించినందుకు ఇటీవలే అస్పృశ్యులను శిక్షించిన ఘటన వెలుగులోకి వచ్చింది. మీరంతా అటువంటి సంఘటనల గురించి వినే ఉంటారు. మీలో కొందరు అటువంటి అత్యాచారాలకు గురై ఉంటారు. కొట్టడానికి అవకాశం లేనిచోట బహిష్కరణ అనే ఆయుధాన్ని మీకు వ్యతిరేకంగా ఎలా ఉపయోగించారో తెలిసిందే.' అందుకే మనం హిందూ మతాన్ని వీడాలన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ రూపకర్తగా హిందూమతంలోని మూఢ విశ్వాసాలన్నింటికీ ప్రత్యామ్నాయంగా సామాజిక, మత స్వేచ్ఛను రాజ్యాంగంలో కలిగించారు. చాలాకాలం కమ్యూనిస్టులు, అంబేద్కర్ కుల నిర్మూలనను, హిందూ మతవాద నిరసనను పట్టించుకోలేదు. అందువల్లే ఈనాడు వారు భారత రాజ్యాంగ పరిరక్షణకు పిలుపునివ్వాల్సి వస్తుంది.

అంబేద్కర్ ఆలోచనలు

అంబేద్కర్ మతం మారే స్వేచ్ఛను ఇచ్చినందువల్లే దళితులు క్రైస్తవంలోకి, బౌద్ధంలోకి వెళ్లగలిగారు. రాజ్యాంగం ముందు అమిత్‌షా, మోడీలు నేరస్తులుగా నిలబడకతప్పదు. దేశంలో ఈనాడు ముస్లీంలు తమ జాతీయతను ఎలుగెత్తి చాటుతున్నారు. ముస్లీంలలో క్రియాశీలకమైన మార్పు వస్తుంది. వారు అంబేద్కర్ ఫొటోలు, రాజ్యాంగం ప్రతి చేబూనుతున్నారు. హిందువుల్లో సెక్యులరిస్టుల శాతం ఎక్కువగా రూపొందుతుంది. కమ్యూనిస్టుల జీవితంలో హిందూ ప్రత్యామ్నాయ జీవితాచరణ ఇప్పుడు అవసరం. అంబేద్కర్ రాజ్యాంగంలో భారతదేశ సమైక్యతతో పాటు ఇరుగుపొరుగు దేశాలతో మైత్రీ భావం ఉంది.

భారతదేశం మొదట బౌద్ధదేశం, మౌర్యులకాలంలో ఇది బౌద్ధ దేశంగా ప్రకటించబడింది. గుప్తుల యుగంలో బౌద్ధం పారద్రోలబడింది. బౌద్ధాన్ని హిందువులు ఊచకోత కోశారు. ప్రపంచవ్యాప్తంగా బౌద్ధం అనేక దేశాల్లో ఈనాడు ప్రధాన ధర్మంగా ఉంది. మళ్లీ బౌద్ధ భారత నిర్మాణంతోనే భారతదేశంలో భారత రాజ్యాంగం అమలుజరుగుతుందన్న విషయం కమ్యూనిస్టులు తెలుసుకోలేకపోతున్నారు.

'భారతదేశాన్ని పాలించిన పరిపాలికులకు రాజ్యాంగ స్ఫూర్తి లేకపోవడం వలన అనేక సంక్షోభాలు వచ్చాయి. వాళ్ల మనసుల్లో రాజ్యాంగం ప్రకారం నడవాలనే భావం లేకుండా పోయింది. రాజ్యాంగం ఏమి చెప్తుంది. జాతికి, కులానికి, లింగానికి, పుట్టుకకి అతీతంగా భారతదేశంలోని పౌరులందరిని ఒక్కటిగా చూడాల'ని రాజ్యాంగం చెప్పింది.

నిజానికి భారతదేశంలో దళితుల రాజ్యాంగ హక్కుల గురించి పాలకులకే సరైన అవగాహన లేదు. అప్పటికే ఆస్తి హక్కు ఉన్నటువంటి వాళ్లకి ఆస్తికి రక్షణ కల్పిస్తూ వారు కట్టే పన్ను నుంచి భూమి లేని, భుక్తి లేనివారికి రిజర్వేషన్లు సంక్షేమాన్ని కల్పించడానికి కూడా ద్వేషం పూనడం తెలివిలేని పని. ఆస్తి హక్కు ఎప్పుడైతే ఉందో తప్పక సంక్షేమం, రిజర్వేషన్లు అవసరం అవుతాయి. రిజర్వేషన్లు ఎత్తివేసి ఆస్తిని పంచవచ్చును. ఈ ధర్మ సూక్ష్మం తెలియాలంటే రాజ్యాంగ నిర్మాణం అర్థం కావలసిందే.' దళితులపై ఈనాటికీ అమలు జరుపుతున్న అస్పృశ్యతా నివారణ చట్టానికి సంబంధించి, కాంగ్రెస్, కమ్యూనిస్టుల విధానాల్లో ప్రధాన ఎజెండాగా లేదు. వారు దళితుల కోసం ఉపసంఘాలే పెట్టారు. చిదంబరం, కపిల్ సిబాల్ వీరంతా హిందూ ఆర్థిక వాదులే. నిన్నటివరకు అస్పృశ్యత రద్దు కాకుండా కాపాడినవారే.

కాంగ్రెస్ వాళ్లు ముందు అస్పృశ్యతా నివారణకు, మైనార్టీల రక్షణకు

కట్టుబడి ఉన్నారా! ముస్లింలు భారతదేశానికి ఎంతో సాంస్కృతిక, సాంకేతిక జ్ఞానాన్ని అందించారు. వారు భారతీయులే. వారు భారతీయులుగా నిరూపించుకోనక్కరలేదు. క్రైస్తవులు తమ బైబిల్‌తో పాటు, ముస్లింలు తమ ఖురాన్‌తో పాటు, బౌద్ధులు తమ వినయ పిటకంతో పాటు రాజ్యాంగ ప్రతిని పట్టుకోవలసిందే. కమ్యూనిస్టులు తమ చేతుల్లో అంబేద్కర్ చిత్రపటమున్న ప్లకార్డులు ధరించాల్సిందే. కమ్యూనిస్టుల్లో ఎక్కువమంది ఇప్పటికే బ్రాహ్మణుల నుండి వచ్చినవారే ఉన్నారు. పెద్ద పెద్ద బొట్టులు పెట్టి కమ్యూనిస్టులు మోడీ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

హిందూ సంస్కృతి నుండి బయటపడండి

మీరు హిందూ సంస్కృతి నుండి బయటపడండి. లౌకిక జీవన వ్యవస్థలోకి రండి. కులం జీవనం నుండి బయటపడండి. మీరు వీధి పోరాటాలతో హిందూ రాజ్యాన్ని ఓడించలేరు. ముస్లింలలో అంబేద్కర్ మీద అభిమానం పెరిగేకొలది దళితుల అభిమానం పెరిగే కొలది దళిత ముస్లింల ఐక్యత బలపడుతుంది. భిన్న వ్యవస్థలు పౌరసత్వ చట్ట సవరణ బిల్లు (క్యాబ్ 2019)ను వ్యతిరేకించాలంటే తప్పక దళితులతో మమేకం కావాల్సిందే. దళితులు తమ కుల, మత భావాలు వదిలిపెట్టాల్సి ఉంది. అమిత్‌షా, మోడీ ప్రాంతీయ పార్టీలను భయపెట్టి తమ అవసరాలకు వాడుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ ఒకపక్క దేవాలయాల చుట్టూ తిరుగుతూ, మరోపక్క పౌరసత్వ చట్ట సవరణ బిల్లు (క్యాబ్ 2019)కు వ్యతిరేక ర్యాలీల్లో పాల్గొంటున్నారు. ఈ ద్వంద్వ విధానాల వల్ల ప్రయోజనం లేదు. ఈనాడు అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగమే కాదు, ఆయన సిద్ధాంతాలూ ఒక చారిత్రక అవసరం. ఒక అనుకూల అంశం కూడా మనముందుకు వచ్చింది.

జీవించే హక్కును కాలరాస్తున్నారు

ఈ విషయంలో పీపుల్స్ డెమోక్రసీ తమ సంపాదకత్వంలో ఇలా వివరించింది. 'జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేసి ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించడం రాజ్యాంగాన్ని మోసం చేయడమేకాక ఫెడరల్ సూత్రాలకు విరుద్ధం కూడా. ఇందుకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలపై ఉక్కుపాదం మోపుతూ వారికి రాజ్యాంగం ప్రసాదించిన ఉద్యమించే హక్కు, వాక్ స్వాతంత్ర్యం, జీవించే హక్కు, స్వేచ్ఛ వంటి ప్రాథమిక హక్కులను కాలరాస్తోంది. వందలాది మంది రాజకీయ నేతలు, కార్యకర్తలు ఇప్పటికీ నిర్బంధంలోనే ఉన్నారు. ప్రపంచంలోకెల్లా అత్యధికకాలం ఇంటర్నెట్ సేవలు ఆగిపోయాయిక్కడ. దేశంలో ముస్లిం మెజార్టీ ఉన్న ఏకైక రాష్ట్రంలో వారి మనుగడను దెబ్బతీయడమే ఇటువంటి అప్రజాస్వామిక చర్యల ఆంతర్యమని చెప్పక తప్పదు. అయోధ్య వివాదంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు రాజ్యాంగంలోని లౌకిక సిద్ధాంతానికి మరో చావుదెబ్బ. ఈ వివాదాస్పద స్థల యాజమాన్య హక్కుల వివాదంలో ఒకవైపు లౌకిక వాదాన్ని సమర్థిస్తూనే, మరోవైపు వాస్తవాలు, ఆధారాలను పక్కనపెట్టి ఒక వర్గం వారి మత విశ్వాసాలకు న్యాయపాలిక ప్రాధాన్యతనిచ్చింది. ఇలా మెజార్టీ వాదంలో రాజీపడడం దేశంలో రాజ్యాంగ వ్యవస్థలు ఏ విధంగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయో మన కళ్లకు కడుతోంది. శీతాకాల సమావేశాలలో మోడీ సర్కారు పౌరసత్వ చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం పొందింది. ఈ సవరణ ద్వారా తొలిసారిగా మత ప్రాతిపదికన పౌరసత్వ అర్హతను నిర్ణయించారు. ఇతర వర్గాల అక్రమ వలసవాసులను భారత పౌరసత్వానికి పరిగణనలోకి తీసుకుంటున్న ఈ చట్టం ముస్లింలను మాత్రం ఏకాకులను చేస్తోంది. ఈ చట్టంతో పాటు జాతీయ పౌరసత్వ జాబితా ప్రక్రియను కూడా అమలు చేసేందుకు బిజెపి కృతనిశ్చయంతో ఉంది. ఈ రెండింటి మధ్య రెండు సారూప్యతలున్నాయి. ఇందులో మొదటిది పౌరసత్వ సవరణ చట్టం. ఇది హిందువులు, ముస్లిమేతర వర్గాలకు పౌరసత్వాన్ని అనుమతిస్తోంది. ఇక రెండోది భారతీయ పౌరసత్వ రిజిస్టర్. ఇది మాత్రం ముస్లింలను 'అక్రమ చొరబాటుదారుల' ముద్రతో పౌరసత్వ జాబితా నుండి తొలగించేందుకు ఉద్దేశించినది. ఈ అంశాలను పరిశీలిస్తే దేశంలో హిందూత్వ రాజ్యాన్ని నెలకొల్పేందుకు మోడీ సర్కారు 2019లో తీవ్రంగానే ప్రయత్నించిందన్న విషయం అర్థమవుతుంది. 2019లో మరో కోణం కూడా ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ నానాటికీ సంక్షోభ పరిస్థితుల్లో కూరుకుపోతున్న సమయంలో కేంద్రం విచ్ఛిన్నకర హిందూత్వ విధానాలను అమలుచేసేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. జిడిపి గణనలో అంకెల గారడీకి పాల్పడినప్పటికీ, గత ఏడు త్రైమాసిక వ్యవధుల్లో జిడిపి వృద్ధిరేటు క్రమంగా క్షీణిస్తున్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. గడచిన జూన్–సెప్టెంబర్ త్రైమాసిక కాలంలో జిడిపి వృద్ధి ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయి 4.5 శాతం నమోదయింది. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన 2017–18 అధికారిక గణాంకాల ప్రకారం వినిమయ వ్యయం తొలిసారిగా 40 ఏళ్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం తొక్కిపట్టిన డేటాను పరిశీలిస్తే దేశంలో నిరుద్యోగిత 45 ఏళ్ల గరిష్ట స్థాయికి చేరుకున్న విషయం స్పష్టమవుతోంది. ఉత్పత్తి, పారిశ్రామిక ప్రగతి, ఎగుమతులు మందగించాయి. దేశంలో నానాటికీ డిమాండ్ తగ్గిపోతుండడంతో పాటు అన్ని రంగాలకూ ద్రవ్యోల్బణం సెగ తగులుతోంది. నవంబర్‌లో విడుదలైన వినిమయ ధరల సూచీ నిత్యావసరాల ధరలు 5.5 శాతం పెరుగుతలను సూచిస్తుండగా, డిసెంబర్ సూచీలో 6 శాతానికి పెరిగి అవకాశాలున్నట్లు తెలుస్తోంది.'

లౌకికవాదుల ఐక్యతే మార్గం

ఒకపక్క మతోన్మాదాన్ని పెంచుతూ, మరోపక్క ఆర్థిక దారిద్ర్యాన్ని పెంచుతూ, మరోప్రక్క భావదారిద్ర్యాన్ని విస్తరింపచేస్తూ మనుష్యుల్లో నైరాశ్యాన్ని తీసుకువస్తున్న ఈ ప్రభుత్వం భారతీయుల హృదాయల నుండి తొలగిపోయింది. భారతదేశంలో పుట్టినవారంతా సమానులే అనేది ముఖ్యమైన అంశం. మతాన్ని బట్టి మనుషులను వివక్షతకు గురిచేయకూడదు. కులాన్ని బట్టి మనుషులను వివక్షతకు గురిచేయ కూడదు అనే ముఖ్యమైన అంశాలు ముందుకు వచ్చాయి. అంబేద్కర్ అందరి ఆలోచనల్లోకి వచ్చాడు. అయితే ఇప్పుడు ఆచరణే ముఖ్యమైన అంశం. లౌకికవాద వ్యవస్థను పునర్నిర్మించుకోవడానికి అందరూ సంసిద్ధులు కావాలి. ద్వంద్వ వైఖరి నుంచి బయటపడి భారతదేశ సమైక్యతకు, సమగ్రతకు, సమన్వయానికి, సమసమాజ నిర్మాణానికి ఉద్యుక్తులు కావాలి. అందుకు ఇది ఒక చారిత్రక నిర్దేశిత కాలం. ఈ మలుపులో అయినా తప్పక సమసమాజ ఆవిర్భావం జరుగుతుంది. మోడీ, అమిత్‌షాల ఓటమి తథ్యం. అంబేద్కర్ భావజాల చారిత్రక విజయం అనివార్యం.

(రచయిత సామాజికత తత్వవేత్త, నవ్యాంధ్రపార్టీ, వ్యవస్థాపక అధ్యక్షులు) వీ

మాట్లాడే గొంతులపై కొనసాగుతున్న నిర్బంధం

తెలంగాణలో ప్రజాభిప్రాయాన్ని ప్రకటిస్తున్న, సంఘటితం చేస్తున్న గళాలను నొక్కివేసే ప్రయత్నంలో ప్రభుత్వం ఎడతెగకుండా సాగిస్తున్న చర్యలను వివరిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

అక్టోబర్ మొదటి వారం నుంచి నవంబర్ చివరి వారందాకా తెలంగాణలో మాట్లాడే గొంతులపై రాజ్య నిర్బంధం ఎలా సాగిందో, ఆ ఆరేడు వారాలలోనే కనీసం మూడు తప్పుడు కేసులు బనాయించి, మొత్తం 64 మందిని, అందులో యాభైకి పైగా తెలంగాణలోని అనేక ప్రజాసంఘాల నాయకులను, కార్యకర్తలను ఆ అక్రమ కేసులలో నిందితులుగా చూపి, అందులో ఏడెనిమిది మందిని ఎట్లా అరెస్టు చేశారో వీక్షణం డిసెంబర్ సంచికలో వివరంగానే వెలువడింది. తెలంగాణలో పోలీసు రాజ్యం ఎంత విచ్చలవిడిగా సాగుతున్నదంటే ఈ నిర్బంధకాండలో ప్రతి వారమూ, ప్రతి నెలా కొన్ని కొత్త సన్నివేశాలు, కొన్ని కొత్త అబద్ధపు ఆరోపణలు, కొన్ని కొత్త అరెస్టులు, ప్రభుత్వం సాగిస్తున్న కొన్ని కొత్త చట్టవ్యతిరేక చర్యలు తోడవుతున్నాయి. డిసెంబర్ సంచికలో వెలువడిన సమాచారానికి అదనంగా డిసెంబర్, జనవరి నెలలలో మరొక ఏడుగురి అరెస్టు జరిగింది. ఒక నాలుగు సంవత్సరాల కిందటి పాత కేసును తవ్వి తీసి, దానికి చిలువలూ పలువలూ చేర్చి కొత్తగా నలభైకి పైగా నిందితులను చేర్చడం జరిగింది.

ఈ అన్ని నిర్బంధ చర్యలలోనూ ఒకే రకమైన పద్ధతి – ఒకరిని అక్రమంగా అరెస్టు చేయడం, వారి ఒప్పుదల ప్రకటన (కన్ఫెషన్ స్టేట్ మెంట్) పేరుతో వారి రిమాండ్ కేస్ డైరీలో మరి కొందరి మీద మరి కొన్ని ఆరోపణలు చేర్చడం, కొత్తగా కొన్ని కొత్తపేర్లను నిందితులుగా చేర్చడం, కొన్ని వారాల తర్వాత ఆ జాబితాలోంచి కొందరిని అరెస్టు చేయడం, వారి ఒప్పుదల ప్రకటనల పేరుతో మరికొందరి మీద మరి కొన్ని ఆరోపణలు చేయడం – ఇదే ఇదే పద్ధతి పదేపదే అమలవుతున్నది.

అక్టోబర్, నవంబర్ లలో పెట్టిన మూడు కేసులలో మొత్తం నిందితుల సంఖ్య 64 కాగా, అందులో ఉమ్మడిగా ఉన్న పేర్లు, అజ్ఞాత విప్లవ నాయకుల పేర్లు మినహాయిస్తే దాదాపు 50 మంది ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఏ సంఘాల తోను సంబంధం లేని వారు ఇద్దరు ముగ్గురున్నారు. ఇప్పుడు తాజాగా 2016 నాటి కేసును తవ్వి తీసి, అందులో ఎ2గా ఉన్న సి. కాశీం ను అరెస్టు చేసి, రిమాండ్ కేసు డైరీ సందర్భంలో మరొక 52 మంది నిందితుల పేర్లు చేర్చారు. అంటే అక్టోబర్ మొదటి వారం నుంచి జనవరి మూడో వారం నాటికి తెలంగాణ పోలీసులు పెట్టిన నాలుగు కేసుల్లో కలిపి నిందితుల సంఖ్య 118కి పెరిగింది. ఉమ్మడిగా ఉన్న పేర్లు, అజ్ఞాత విప్లవ నాయకుల పేర్లు మినహాయిస్తే తెలంగాణ రాష్ట్రంలో బహిరంగ ప్రజా జీవితంలో, తమ తమ వృత్తులలో, ఉద్యోగాలలో ఉంటూ బుద్ధిజీవులుగా, ఆలోచనాపరులుగా కేవలం రాజ్యాంగ బద్ధమైన హక్కులు వాడుకుంటూ తమ భావాలు ప్రకటిస్తున్న, ఏదో ఒక ప్రజాసంఘంలో పనిచేస్తున్న తొంభై మందికి పైగా ప్రజా సంఘాల కార్యకర్తలను, వ్యక్తులను తెలంగాణ పోలీసులు నిందితులుగా చూపుతున్నారన్నమాట.

అక్టోబర్ మొదటివారంలో గద్వాలలో పెట్టిన కేసులో ఎనిమిది మందిని (తెలంగాణ విద్యార్థి వేదిక గద్వాల జిల్లా కన్వీనర్ పులిగ నాగరాజు, టివివి నాయకుడు వైనమోని బలరాం, విరసం నాయకుడు కంతి జగన్, టివివి అధ్యక్షుడు బండారి మద్దిలేటి, చైతన్య మహిళా సంఘం కార్యదర్శి చుక్కల శిల్ప, కార్యవర్గ సభ్యురాలు గుంట రేణుక, తెలంగాణ ప్రజా ఫ్రంట్ కార్యదర్శి మెంచు రమేశ్, ఉపాధ్యక్షుడు నలమాస కృష్ణ) నిందితులుగా చూపగా, వీరిలో నాగరాజు, బలరాం, జగన్, మద్దిలేటి, కృష్ణలను గతంలోనే అరెస్టు చేశారు. ఈ కేసులో మిగిలిన ముగ్గురు నిందితులలో శిల్పను, రమేశ్ ను డిసెంబర్ 17న అరెస్టు చేశారు. రేణుకను డిసెంబర్ 18న అరెస్టు చేశారు. అదే విధంగా అక్టోబర్ మూడో వారంలో చర్లలో పెట్టిన మరొక కేసులో చూపిన 45 మంది నిందితుల జాబితాలో ఉన్న చైతన్య మహిళా సంఘం నాయకులు దేవేంద్ర, స్వప్న, తెలంగాణ విద్యార్థి వేదిక కార్యదర్శి మెంచు సందీప్ లను కూడ డిసెంబర్ 18న అరెస్టు చేశారు.

ఈ డిసెంబర్ 17-18 లలో అరెస్టు చేసిన ఆరుగురి విషయంలోనూ పోలీసుల ప్రవర్తన పూర్తిగా చట్టవ్యతిరేకంగా, చట్టం నిర్దేశించిన పద్ధతులకు వ్యతిరేకంగా ఉంది. వీళ్లలో ఏ ఒక్కరికీ అరెస్టు నోటీసులు ఇవ్వలేదు. అందరి ఇళ్ల మీద, లేదా వారు ఉంటున్న బంధు మిత్రుల ఇళ్ల మీద వేకువ జామున దాడులు చేశారు. ఇంట్లో ప్రవేశించగానే చట్టవ్యతిరేకంగా ఫోన్లు లాక్కుని, మరెవరికీ సమాచారం అందకుండా చేశారు. సోదా పేరుతో ఇళ్లలోని పుస్తకాలను, కాగితాలను చిందరవందర చేశారు. కనీసం మూడు సందర్భాలలో పోలీసులే తాము తెచ్చిన పుస్తకాలను, పత్రాలను ఆ ఇళ్లలో పెట్టి అవి అక్కడ దొరికాయని నమోదు చేశారు. ఇటువంటి సోదా, జప్తు జరుగుతున్నప్పుడు చట్టబద్ధంగా స్థానిక పెద్ద మనుషుల సమక్షంలో పంచనామా జరగాలని చట్టం నిర్దేశిస్తుండగా, ఈ అన్ని సందర్భాలలోను, పోలీసులు తామే తమ వెంట తెచ్చిన సొంత సాక్షులతో పంచనామాల మీద సంతకాలు పెట్టించారు. పోలీసుల సమక్షంలో ప్రకటించే ఒప్పుదల ప్రకటన చెల్లదని చట్టం నిర్దేశిస్తున్నప్పటికీ, ఈ అన్ని సందర్భాలలోను పోలీసులు తమ నోటికి వచ్చిన అబద్ధాలన్నీ, తాము ఇకముందు ఇరికించదలచుకున్న పేర్లన్నీ రాసి, దాన్ని ఒప్పుదల ప్రకటనగా చూపి, బలవంతంగా సంతకం పెట్టించుకుని, దాన్ని పత్రికలకు విడుదల చేశారు, లేదా న్యాయస్థానాలలో ప్రవేశపెట్టారు.

ఈ అరెస్టుల మీద ఆందోళన జరుగుతుండగానే, న్యాయపరమైన ప్రయత్నాలు జరుగుతుండగానే జనవరి 18న ఉస్మానియా

విశ్వవిద్యాలయ ఆవరణలో విరసం కార్యదర్శి సి. కాశీం ఇంటి మీద దాడి చేశారు. ఉదయం ఆరు గంటల ప్రాంతంలో పెద్ద సంఖ్యలో మఫ్టీలో ఉన్న పోలీసులు (అరెస్టు చేయడానికి వచ్చే పోలీసులు తప్పనిసరిగా అధికారిక దుస్తులలో, తమ గుర్తింపు తెలిపే నేమ్ ప్లేట్ ధరించి రావాలని చట్టం చెపుతుంది) కాశీం ఉండే అధ్యాపకుల క్వార్టర్స్‌ను చుట్టుముట్టి తలుపు తీయమని అడిగారు. వైస్ చాన్సలర్ అనుమతి, అధికారుల అనుమతి, అరెస్టుకూ, సోదాకూ అవసరమైన వారంట్లు ఉన్నాయా అని కాశీం ప్రశ్నిస్తుండగానే కొందరు పోలీసులు వెనుకవైపు ద్వారం పగులగొట్టి ఇంట్లో ప్రవేశించి, ఇంట్లో చిన్నారి పిల్లలతో సహ అందరినీ భయభ్రాంతులను చేసి, ఇంటిని ఆక్రమించుకున్నారు.

ఇంట్లోకి చొరబడిన వెంటనే కాశీం ఫోన్, సహచరి స్నేహ ఫోన్ మాత్రమే కాక, ఇంట్లో ఉన్న కాశీం చెల్లెలి ఫోన్, డ్రైవర్ ఫోన్, డ్రైవర్ చెల్లెలి ఫోన్ కూడ లాగేసుకున్నారు. కనీసం నాలుగు గంటల పాటు ఇంట్లోని పుస్తకాలను, కాగితాలను, చివరికి వంటసామానులను కూడ చిందరవందర చేసి, ఆ హడావిడిలో ఇంట్లో దొరికినవేవో, తామే పెట్టినవేవో తెలియని గందరగోళం సృష్టించారు.

పదిన్నర సమయంలో 131 వస్తువులు జప్తు చేసుకున్నామని పంచనామా రిపోర్టు ఇచ్చి, కాశీంను అరెస్టు చేసి తీసుకుపోయారు. ఈ జప్తు చేసిన 131 వస్తువులలో 118 పుస్తకాలు, పత్రికలు కాక మిగిలినవి లాప్ టాప్, కంప్యూటర్ హార్డ్ డిస్క్, పెన్ డ్రైవ్ లు, కెమెరాలు, సిడిలు, వీడియో కాసెట్లు. "ప్రమాదకర సాక్ష్యాధారాలు"గా జప్తు చేసిన పుస్తకాలలో మామూలు పుస్తకాల దుకాణాలన్నిటిలోను దొరికే పుస్తకాలు, పత్రికలు మాత్రమే కాక, 1969 తెలంగాణ ఉద్యమకాలం నాటి 'జైతెలంగాణ విప్లవ ఢంకా', 1938 హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిషేధం గురించిన 'హైదరాబాద్ స్వాతంత్ర్య సంరంభం', విమల కవిత్వం 'అడవి ఉప్పొంగిన రాత్రి', తెలంగాణ రచయితల వేదిక పత్రిక 'జంబి', 'ప్రస్థానం' సాహిత్య ప్రత్యేక సంచిక, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ ప్రచురణ 'ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు – విద్రోహ రాజకీయాలు' వంటి పుస్తకాలు కూడ ఉన్నాయంటే పోలీసుల అతి తెలివి అర్థమవుతుంది.

ఇక్కడ కూడ కాశీం ఒప్పుదల ప్రకటన పేరుతో ఒక తొమ్మిది పేజీల అబద్ధపు పత్రాన్ని పోలీసులు న్యాయస్థానానికి సమర్పించారు. తామే రాసిన ఆ అబద్ధాలమీద ఆధారపడి రిమాండ్ కేస్ డైరీ అనే చట్టపరంగా అవసరమైన పత్రం ఒకటి తయారు చేశారు. నిజానికి ఇండియన్ ఎవిడెన్స్ ఆక్ట్ (భారత సాక్ష్యాధారాల చట్టం) ప్రకారమే పోలీసుల దగ్గర నిందితులు చెప్పారని పోలీసులు ప్రకటించే ఒప్పుదల పత్రం న్యాయస్థానంలో చెల్లదు. ఆ చట్టం మాత్రమే కాక ఆ తర్వాత ఎన్నో సందర్భాలలో న్యాయస్థానాలు కూడ పోలీసులు చిత్ర హింసలకు గురిచేసి, తమ ఇష్టం వచ్చినది రాసి బెదిరించి సంతకం పెట్టించి ఒప్పుదల పత్రం తయారు చేసే అవకాశం ఉందని, అందువల్ల పోలీసులు సమర్పించే ఒప్పుదల పత్రాన్ని అంగీకరించ గూడదని అన్నాయి. న్యాయమూర్తి ముందర ప్రమాణ పూర్వకంగా ఇచ్చే ఒప్పుదల ప్రకటన మాత్రమే అంగీకార యోగ్యమవుతుంది.

కాని కాశీం ఒప్పుదల ప్రకటనలో తన "నేరాన్ని" అంగీకరించాడని, మావోయిస్టు పార్టీతో సంబంధాలను, ఆర్థిక లావాదేవీలను అంగీకరించాడని, తనకు సహచరులుగా పనిచేసిన మరొక నలభై మంది పేర్లు చెప్పాడని, తన పర్యవేక్షణలో ఉన్న పందొమ్మిది సంస్థల పేర్లు చెప్పాడని పోలీసులు ఒక కట్టుకథ సృష్టించారు. ఆ అబద్ధపు ఒప్పుదల పత్రాన్నీ, దాని ఆధారంగా తయారు చేసిన రిమాండ్ కేసు డైరీని పోలీసులు పత్రికలకు సరఫరా చేసి, తమకు అనుకూలమైన విలేఖరుల చేత అభూతకల్పనల వార్తలు రాయించి, ఆయా సంస్థల మీద, వ్యక్తుల మీద, కాశీం మీద బురద జల్లడానికి కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇంకా విచిత్రమైన సంగతి చెప్పాలంటే ఈ నాలుగు కేసుల్లో ఇప్పటికి బైటికి వచ్చిన దాదాపు పది "ఒప్పుదల ప్రకటన"లు అన్నీ కూడ ఒకే రకమైన వాక్య నిర్మాణంతో, ఒకే పదాలతో, ఒకే వరుస క్రమంలో అక్షరం కూడ మారకుండా, కేవలం పేర్లు, స్థలాలు, తేదీలు మాత్రం మార్పులతో ఉన్నాయి. భిన్నమైన నేపథ్యాల నుంచి వచ్చిన, భిన్నమైన ప్రజా జీవన రంగాలలో ఉన్న ఈ పది మందీ అంతగా అచ్చు గుద్దినట్టుగా ఒకే "ఒప్పుదల ప్రకటన"లు చేశారంటేనే అవన్నీ పోలీసులే రాసినవనీ, ఆయా వ్యక్తులకు ఎంత మాత్రం సంబంధం లేనివనీ తేటతెల్లమవుతుంది.

అరెస్టులు అక్రమం. ఇళ్ల మీద దాడులు అక్రమం. దాడికి రాగానే సమాచార సంబంధాలు కత్తిరించడానికి ఫోన్లు లాక్కోవడం అక్రమం. సోదాలు అక్రమం. జప్తులు అక్రమం. పంచనామాలు అక్రమం. ఒప్పుదల ప్రకటనలు అక్రమం. రిమాండ్ కేస్ డైరీల రచన అక్రమం. ఇన్ని రకాల చట్టవ్యతిరేక, అక్రమ, అనైతిక, అబద్ధపు, కుటిల ప్రయత్నాలకు పోలీసులు ఎందుకు పాల్పడుతున్నారు? అది కేవలం పాలకుల ఆదేశాల మేరకే.

ప్రభుత్వ విధానాలను విమర్శించే, ప్రభుత్వపు ప్రజావ్యతిరేక విధానాల స్వభావాన్ని ప్రజలకు విప్పిచెప్పే ఆలోచనాపరులు, మేధావులు, రచయితలు, కవులు, కార్యకర్తలు, వక్తలు ఉండగూడదని, అటువంటి వారందరి గొంతులు నొక్కివేసి, కేవలం తానా తందానా అనే భజనపరులతో, లేదా మౌనంతో నిండిన సమాజం కావాలని పాలకుల కోరిక. ప్రజల పన్నుల నుంచి జీతభత్యాలు పొందుతున్న ప్రజాసేవకులుగా తమ కర్తవ్య నిర్వహణ చేసే బదులు, పాలకుల కోరికను నెరవేర్చడం ద్వారా అదనపు భోగాలు, ముడుపులు, సౌకర్యాలు, రాయితీలు, పదోన్నతులు, తాయిలాలు పొందాలని పోలీసు అధికారుల ప్రయత్నం. అలా పాలకుల ప్రయోజనాలూ పోలీసు అధికారుల ప్రయోజనాలూ కలగలిసి ఈ అక్రమాల, చట్టవ్యతిరేక కార్యకలాపాల ప్రభ సజావుగా సాగుతున్నది. ఇటువంటి ప్రభతో కొద్దికాలం విర్రవీగిన పాలకులనూ, పోలీసులనూ చాల మందిని చరిత్ర చూసింది. వారు కాలగర్భంలో కలిసి పోయారని కూడ చరిత్ర నమోదు చేసింది. ప్రజలు నిలిచే ఉంటారు. ప్రజల కోసం పనిచేసేవారు, ఆలోచించేవారు, వ్యక్తీకరించేవారు నిలిచే ఉంటారు.

(రచయిత వీక్షణం సంపాదకుడు) వీ

మానవ ఆలోచన భౌతిక సత్యాన్ని గ్రహించగలదా అనేది సైద్ధాంతిక ప్రశ్న కాదు. అది ఆచరణలో తేలే ప్రశ్న. సత్యాన్ని, అంటే, తన ఆలోచనకు సంబంధించిన వాస్తవికతనూ, శక్తినీ, తాను చూసే పార్శ్వాన్నీ మనిషి ఆచరణలోనే రుజువు చేయవలసి ఉంటుంది. ఆలోచన వాస్తవికమైనదా, అవాస్తవికమైనదా అనే వివాదాన్ని ఆచరణ నుంచి వేరు చేస్తే అది కేవలం పండిత చర్చే అవుతుంది.

– కార్ల్ మార్క్స్

జీయర్ దొరల కనుసన్నల్లో తెలంగాణ విద్య

విద్యారంగంలో సృజనాత్మకతకోసం ఏర్పాటైన ప్రభుత్వ విద్యా సంస్థలను, విద్యారంగంలో విశేష కృషిచేసిన ప్రపంచ విద్యావేత్తలను కాదని కె.సి.ఆర్. ప్రభుత్వం ఆధ్యాత్మిక బోధనల ద్వారా విద్యలో మార్పును కోరుకోవడమంటే తిరోగమనమే అంటున్నారు **బి. రామకృష్ణ**

సమాజంలో నేర ప్రవృత్తి పెరిగిపోయిందని, మంచి విద్యా బోధన ద్వారా పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించవచ్చని తెలంగాణ ముఖ్యమంత్రి చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుండే విలువలు పెంపొందించే పాఠ్యాంశాలను బోధనలో చేర్చడానికి కమిటీ వేసి ఆధ్యాత్మిక, ధార్మిక గురువుల సలహాలతో విద్యా విధానాన్ని ఏర్పాటు చేస్తారట. వీలైనంతమేరకు నేర ప్రవృత్తిని అరికట్టే పాఠ్యాంశాల రూపకల్పన చేపట్టాలని మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎచ్.జె. దొరను కోరారు. ఎచ్.జె.దొర రాసిన 'మై జర్నీ ట్రూ టర్బులెంట్ టైమ్స్' పుస్తకావిష్కరణ సభలో చంద్రశేఖరరావు ఈ విషయాలను వివరించారు.

సమాజంలో ఒకే కులముంటుందా? అలా ఉండదు. తేడాలుంటాయి. భేదాలుంటాయి. ఒకరు పొట్టి, మరొకరు పొడుగు, ఒకరు లావు, మరొకరు సన్నం ఉంటారు కదా! వీరందరూ ఒకేలాగా ఉండాలని అనగలమా? అని సమాజంలో సమానత్వంను కోరుకునే వారిని ఉద్దేశించి హేళనగా మాట్లాడుతూ కులాలు అంతరించిపోవాలా? కుల రహిత సమాజం కావాలా, సమసమాజం కావాలా? అది కుదరదని కరాఖండిగా చెప్పిన చినజీయర్‌స్వామి విలువలు నేర్పించడానికి పనికొచ్చే నిర్దేశకుడవుతాడు. వీరి గొప్ప ఆలోచనల ముందు పాపం అంబేద్కర్ వెలవెలబోతున్నాడు.

సనాతన ధర్మం పేరిట, పుక్కిటి పురాణాలను చరిత్రగా చెప్పేవారు ఆశ్రమాలను నెలకొల్పుతూ చాతుర్వర్ణ వ్యవస్థను గొప్పదిగా కీర్తిస్తూ, రాజ్యాంగ విలువలైన సమానత్వం, సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకికత్వాలను బేఖాతరు చేసేవారు విద్యా విధానాలను రూపకల్పన చేయాలని పాలకులు ఉబలాట పడడం అంటే రాజ్యాంగానికి వారిచ్చే విలువ ఏమిటన్నది అర్థం చేసుకోవచ్చు. వీరు విలువల గురించి మాట్లాడుతుండడం ఏమిటి అని అనుకోవద్దు. వాళ్లే విలువల గురించి మాట్లాడుతుంటారనుకుంటే సరిపోతుంది.

అణచివేయబడుతున్న ప్రజలు తమ కష్టాలకు, కన్నీళ్లకు కారణాలను వెతుక్కుంటూ ప్రశ్నలను సంధించడం సహజం. సామాజికార్థిక అణచివేతలను ఎదిరించడం కూడా సహజం. చరిత్రలో పెరియార్, అంబేద్కర్, ఫూలే, కుమ్రంభీం, బిర్సాముండా, రాంజీగోండు, చాకలి ఐలమ్మ, అల్లూరి సీతారామరాజు వంటి వారెందరో గుణాత్మకమైన మార్పుల కోసం తమ జీవితాలను ధారపోశారు. ఉద్యమాలు చేశారు. ఇవి సామజంలో మార్పుకు దారితీస్తాయి. అయితే అవి ఆధిపత్య శక్తులకు, భూస్వామ్య, పెట్టుబడిదారీ భావజాల ప్రతినిధులకు ప్రమాదకరమైనవి గానే కనిపిస్తుంటాయి. నిరంతరం వాటిపై కక్ష కట్టి, కత్తికట్టి యుద్ధం చేస్తుంటాయి.

ఆయా ఉద్యమాల సందర్భంలో ఎన్నో సాంస్కృతిక కళారూపాలు ముందుకొస్తాయి. అందులో పాటలు ఒక భాగం. సామాజిక స్థితిగతులను కళ్లకు కట్టినట్లు వినిపించే 'ఊరు మనదిరా వాడమనదిరా', 'నీ కన్నీరు నా కన్నీరు కలిగినోడికి పన్నీరాయే' వంటి అద్భుతమైన పాటలు విన్నప్పుడు చలించకుండా ఉండలేని వాస్తవాలను చెబుతాయి. ఈ పాటలు విన్న పోలీసు అధికారి కూడా కంపించిపోయాడు. ఎంతగా అంటే ఇంకేమైనా ఉందా ఇది వింటే ఆ వ్యవస్థపై తిరగబడకుండా ఉండెదరని వీటికి వెంటనే అడ్డుకట్ట వేయాలన్నంతగా. ఈ వ్యవస్థను ఉన్నదున్నట్లుగా ఉంచడానికి కంకణబద్దులు కదా! వెనుకటికి రాముడు ధర్మాన్ని నిలబెట్టడానికంటూ శూద్రుడైన శంభుకున్ని వధించినట్లుగా వెంటనే కార్యోన్ముఖులు అయ్యారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావుతో మాట్లాడి, పి.వి. నరసింహారావుతో సంప్రదించి పాటలను పాటలతో, సాంస్కృతిక రూపాలతో దెబ్బకొట్టాలనుకున్నారు. వెంటనే 'భారతి' అనే నాటకం పుట్టుకొచ్చింది. ఇది విలువలను తుంగలో తొక్కుతూ అసత్యంతో, నిందలతో సాగుతుంటుంది.

తెలంగాణలో దొరల గడీలను, రజాకార్లను ఎదిరించిన చరిత్ర మట్టి మనుషులకు ఉన్నది. ఇటువంటి ధిక్కారాలను పరిపాలకులు, రాజ్య యంత్రాంగంలో భాగమైన పోలీసు అధికారులు జీర్ణించుకోలేరు. ఉక్కు పాదాలై అణచివేడయానికి ముందుకు వస్తుంటారు. అందుకోసం ఎన్నో ప్రణాళికలతో ముందుకు వచ్చి వనరులను సమకూర్చమని దొరవారు అడిగినంతనే అప్పటి ప్రభుత్వాధినేత సమకూర్చడం, దానికి తగిన ప్రభుత్వ ఉత్తర్వులు వెంట వెంటనే విడుదల చేయడం జరుగుతుంటుంది. ఇప్పటి ప్రభుత్వాధినేతకు అటువంటి అనుభవజ్ఞానామృతం ఇవ్వాళ విద్యా విధానాన్ని తయారు చేయడానికి అవసరమొచ్చింది.

విద్యా వ్యవస్థ అసలు లక్ష్యమే జ్ఞానంతో పాటుగా ఉన్నతమైన విలువలను పెంపొందించడం. ఇందుకోసం గతంలో మొదలయార్ కమిషన్ (1952), కొఠారీ కమిషన్ (1964-66)లు ఎన్నో సూచనలు చేశాయి. సమగ్ర విద్యను ప్రతిపాదించాయి. సమాన విద్యను, కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. సమాజ సంపద సమంగా పంచబడలేదని, సంపన్నులకు, పేదలకు మధ్య సామాజిక అంతరం, చదువుకున్నవారి చదువులేనివారి మధ్య అంతరాలు పెరుగుతున్నాయని, అప్రజాస్వామికమైన కుల వ్యవస్థ ఈ అంతరాలను మరింతగా పెంచుతున్నదని, ఇది రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య ప్రక్రియకు విఘాతం కలిగిస్తున్నదని కొఠారీ కమిషన్ అభిప్రాయ పడింది. ఈ అంతరాల నేపథ్యంలోను అధిగమించడానికి జరిగిన కృషి ఎంత? భారత

రాజ్యాంగంలో సమానత్వం, సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకికత్వం విలువలను లక్ష్యాలుగా ప్రకటించబడినాయి.

ఇవి సాధించడానికి సరైన పాలనా విధానాలు ఆచరించబడుతున్నాయా? ఆ క్రమంలో ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయా? వాటిని సాధించడానికి ఉపకరించే విద్యా విధానాలను అమలు చేస్తున్నారా?

డబ్బున్నోడికి ఒక చదువు, లేనోడికి మరో చదువు. చదువులు అమ్మబడే, కొనబడే సరుకుగా మార్చబడింది. నేడు సగానికి పైగా పాఠశాల విద్యార్థులు ప్రైవేట్ బడుల్లోకి నెట్టివేయబడ్డారు. ఆ పైస్థాయి చదువు చాలా వరకు ప్రైవేట్ సంస్థల ద్వారానే అందించబడుతున్నది. కొఠారీ కమిషన్ ఎప్పుడో చెప్పినటువంటి ఈ అంతరం మరింతగా పెరుగుతూ ఉన్నత విద్య దాదాపుగా ప్రైవేట్‌పరం అయిపోయింది. చదువులను అమ్ముకునే, కొనుక్కునే దుస్థితి ఏ విలువల ప్రస్థానానికి దారి తీస్తుంది?

ఎంతసేపటికీ తరగతి గదుల్లోనే కూర్చొని టీచర్లు చెప్పేవి వింటూ వాటినే వల్లెవేస్తూ పరీక్షలే పరమావధిగా, సర్టిఫికెట్లు పొందడమే లక్ష్యంగా సాగుతున్న విద్యా వ్యవస్థ నుండి బయటపడాల్సి ఉన్నది. క్షేత్ర పరిశీలనలు, అనుభవాలు తమ చుట్టూ ఉన్న సామాజిక పరిసరాల్లో జరిగే ఉత్పత్తి కార్యక్రమాలతో సంబంధం లేకుండా మిడిమిడి జ్ఞానాన్ని పుస్తకాల రూపంలో, బోధనల ద్వారా అందించడం అనేది యాంత్రికమైనది, భారమైనట్టిది. ఒత్తిడికి గురిచేసేదిగా ఉంటుంది. దీనిలో సహజంగా, ఆనందదాయకంగా, బాధ్యతాయుతంగా, అర్థవంతంగా ఉండడానికి అవకాశాలు స్వల్పంగా ఉంటాయి.

ప్రకృతి నుండి చిన్నారిని దూరం చేస్తే దానిలోని గుసగుసలు ఎలా తెలుస్తాయి. పిల్లలు బాగా తృప్తిపడే వరకు ప్రకృతిలోని ఆనందాన్ని అనుభవించనివ్వండి అని గిజుభాయి చెబుతాడు. బాల్యం అంటేనే ఆటపాటలతో కూడుకున్నది కదా! అటువంటివి ఆనందించడానికి, అనుభవించడానికి పాఠశాల వ్యవస్థ అనుకూలంగా ఉన్నదా అన్నది ముఖ్యమైనది.

పిల్లలు ఆడుకునే సామర్థ్యం కోల్పోతే మానసికంగా మృతప్రాయుడవుతాడని ఎ.ఎస్. నీల్ అనే విద్యావేత్త అంటాడు. మార్కులు, ర్యాంకులు, గ్రేడుల గొడవలే తప్పిస్తే పిల్లల మూర్తిమత్వ వికాసానికి దోహదపడే సహ పాఠ్య విషయాల పట్ల పట్టింపులేవి? సృజనాత్మకతలు, కళలు, సాంస్కృతిక విద్య, పని కంప్యూటర్ విద్య, జీవననైపుణ్యాలు. శారీరక ఆరోగ్యం విద్య వంటివి సహ పాఠ్యాంశాలుగా పాఠ్య ప్రణాళికలో చేర్చనైతే చేర్చారు గాని, వాటిపట్ల ఆసక్తి గాని, ఆచరణ గాని లేనే లేదు. వాటిని పిల్లల్లో పెంపొందించే బడి వాతావరణం ఎక్కడున్నదని? 6 శాతం ప్రాథమిక పాఠశాలల్లో ఒకరు లేదా ఇద్దరు టీచర్లే చదువులు చెబుతున్నారు. టీచర్ల కొరత, గదుల కొరత, అనేక ఇతర మౌలిక సౌకర్యాల కొరతల నేపథ్యంలో ఇవి సాధింపబడతాయా?

జాతీయ పాఠ్య ప్రణాళికా చట్రం (ఎన్‌సిఎఫ్) – 2005 గాని రాష్ట్ర పాఠ్య ప్రణాళికా చట్రం (ఎస్‌సిఎఫ్) – 2011లలో పాఠ్యాంశాలు, సహ పాఠ్యాంశాలు రెండింటికీ సమాన ప్రధాన్యతను సూచించాయి. నిరంతర సమగ్ర మూల్యాంకనం వీటిని సమానంగా గుర్తిస్తున్నది. సమగ్ర విద్య అంటేనే ఈ రెండింటిని వేర్వేరుగా కాకుండా సమ్మిళితంగా సమాన ప్రాధాన్యతతో చూస్తూ అమలు చేయడం. ఏ పాఠశాలకు వెళ్లినా కూడా పాఠ్యాంశాలకు ఇస్తున్న ప్రాధాన్యత సహ పాఠ్యాంశాలకు ఇవ్వడం లేదని తెలుసుకోవచ్చు. మరోమాటలో చెప్పాలంటే పాఠ్య గ్రంథాల చదువే సర్వస్వం అయింది. గణితం, సైన్స్, సోషల్, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ వంటి పుస్తకాల చదువులు, సిలబస్ పూర్తిచేయడం. పాఠాలు చదివించడం, రాయించడం, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ప్రయత్నాలు చేయడంగానే సాగుతున్నాయి చదువులు. ప్రైవేట్ పాఠశాలల్లో నైతే ఉదయం, సాయంకాల ప్రత్యేక చదువుల పేరిట రుబ్బుడు కార్యక్రమం జరుగుతుంటుంది. ఇదే పద్ధతి పదవ తరగతికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లోకి సహితం ప్రవేశించింది అనుకోండి. చదువులు పాఠ్య పుస్తక కేంద్రితంగా, పరీక్షల కేంద్రంగా తయారయ్యాయి. ఇది సరిచేయకుండా పిల్లల్లో విలువలను పెంపొందించడం కుదిరే పనేనా.

ఈ సందర్భంలో టాగూర్ అన్న మాటలు, ఆలోచనలు గుర్తుకురాక మానవు. సమాజంలోని అన్ని పార్శ్వాలను ప్రభావితం చేసే మౌలిక సామాజిక, రాజకీయ రంగాల్లో అవినీతిని పెంచి పోషిస్తూ కేవలం విద్యార్థులకు నీతి బోధనల వంటి పరిస్థితులను మార్చలేవని టాగూర్ అంటారు. అనేక అసత్యాలు, అవగుణాలు, కృత్రిమ విషయాలు పిల్లల ప్రవర్తనను చెడగొడుతున్నాయి. అటువంటప్పుడు విద్యా సంస్థల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు ఏదో ఒకటి రెండు పుస్తకాల్లోని పెద్దల వాక్యాలు మార్పును తీసుకువస్తాయని లేదా పిల్లలను నీతివంతులుగా చేయగలవని ఎలా ఆశించగలమని, దీనివలన పిల్లలకు ఒరిగేదేమీ ఉండకపోను, కపటత్వం అలవడుతుందని టాగూర్ అంటారు. అలాగే పిల్లలు ప్రదేశాలో కాదు తమ చుట్టూ ఉండే పరిస్థితులతో ప్రభావితమవుతారని గిజుభాయి అంటారు.

విలువలు అడుగంటుతున్నాయని అనుకుంటున్నప్పుడు, నేరాలు పెరుగుతున్నాయని అంటున్నప్పుడు నేరాలకు మూలాలు ఎక్కడో ఆలోచించాలి. మనిషి ప్రవర్తనను ప్రభావితం చేసే కారకాలను తెలుకోవాలి. సమాజంలో నేరాలకు తావిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలను లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. సంపద సృష్టికర్తలెవరు? వారిపై పెత్తనం చెలాయిస్తూ ఉత్పత్తిలో భాగం పంచుకోకుండా నేరాలకు పాల్పడుతున్నదెవరు? వీరికి వెన్నుదన్నుగా ఉన్న వ్యవస్థ ఏది? కులాలు, మతాలుగా విడగొట్టి వైషమ్యాలను పెంచుతున్న యంత్రాంగం ఏది? పీడనా పూరిత సమాజాన్ని పోషిస్తున్న వ్యవస్థలేవి? ఉత్పత్తిలో పాలుపంచుకోకుండా అశేష ప్రజానీకంపై అధికారం చెలాయిస్తూ తమ స్వలాభాలు, సౌఖ్యాలు, విలాసాల కోసం అన్యాయాలు చేయాల్సిన అవసరం ఎవరికుంటుంది? ఇలాంటివి ప్రశ్నించకుండా, ఆలోచించకుండా, అచేతనంగానో, సుప్తంగానో ప్రజలను ఉంచడానికి, జోకొట్టడానికి తప్పుడు చైతన్యాలను, తప్పుడు విలువలను విస్తారంగా వ్యాపింపచేసే అవసరం ఎవరికున్నది. అటువంటి శక్తులను, వ్యవస్థలను, వర్గాల మూలాలను ఛేదించకుండా విలువలను సాధించగలమా? అందరికీ ఒకే విలువ, గౌరవం ఉండే వర్గరహిత సమ సమాజం కోసం ప్రయత్నించకుండా, ఆ ప్రక్రియలో పాలుపంచుకోకుండా విలువలను సాధించడం సాధ్యమవుతుందా?

ఇదంతా ఓ సుదీర్ఘ ప్రయాణం. అయితే విద్యా వ్యవస్థలో ప్రయత్నించవద్దని చెప్పడం సరైంది కాదు. ఎలా విద్యా వ్యవస్థను

ఆంధ్రప్రదేశ్ రాజధాని మార్పు ప్రహసనం

***అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటూ ప్రజలు చేస్తున్న ఉద్యమంపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తోందనీ, రాజధాని వికేంద్రీకరణ పేరిట మరో ప్రహసనానికి తెరలేపిందనీ అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ 29 గ్రామాల ప్రజలు ఎవరైతే రాజధాని నిర్మాణం కోసం తమ భూములను ప్రభుత్వానికిచ్చారో వారంతా 'అమరావతి పరిరక్షణ సమితి' పేరు మీద ఒక సంఘంగా ఏర్పడి, ప్రజా ఉద్యమాన్ని నిర్మించుకొని పోరాడుతున్నారు. ఇప్పటికీ ఆ గ్రామాలలోని రైతులు, రైతు కూలీలు, యువకులు, ట్రాక్టర్ డ్రైవర్లు అందరూ కలిసి దాదాపు 15 మంది దాకా గుండెపోటుతోను, ఆత్మహత్యల వల్ల చనిపోయారు. దీనికంతటికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఖరే కారణం.

రాజధానిని విశాఖపట్టణానికి తరలించడానికి ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు, రైతుల మీద ఆధారపడిన కూలీలు, ప్రజలు చాలా పట్టుదలతో పోరాడుతున్నారు. ఈ పరిస్థితులలో రాష్ట్ర మంత్రి మండలిలోని మంత్రులు పోరాడే ప్రజలను, మహిళలను 'పెయిడ్ ఆర్టిస్టులు' (డబ్బు కోసం నటించే కళాకారులు)గా వారిని మాట్లాడడం, హేళనగా చూడడం వారిని మరింత రెచ్చగొట్టే విధంగా మీడియా ముందు వ్యాఖ్యానించడంతో ఈ ప్రాంత ప్రజలలో కసి పెరిగింది.

ప్రభుత్వం వైపు ఏమాత్రమైనా న్యాయం ఉంటే ప్రజల వద్దకు వచ్చి వివరించవచ్చు, లేదా వారిని పరామర్శించవచ్చు. నాలుగు వారాలుగా వివిధ గ్రామాల ప్రజలు వారి వారి గ్రామాల నడిబొడ్డున వేదికలు ఏర్పాటు చేసుకొని పోరాటం చేస్తూ ఉంటే, వారిపై వందలాది మంది పోలీసులను ప్రయోగించి అక్రమంగా అరెస్టులు చేసి, అక్రమ కేసులు బనాయిస్తూ, ఒకవేళ విద్యావంతులైతే వారు చేస్తున్న ఉద్యోగాలలో జోక్యం చేసుకుంటున్నారు.

దాదాపు ప్రతి గ్రామంలోనూ వందలాది మంది పోలీసులతో 'పోలీసు రాజ్యం'గా మార్చివేశారు. చివరికి జనవరి 10న బందరు రోడ్డు - విజయవాడలో వేలాదిగా మహిళలు ర్యాలీగా వచ్చినప్పుడు రాత్రి 10 గంటల వరకూ వారిని స్థానిక స్టేడియంలో నిర్బంధించి, వివరాలు తీసుకొని వదిలేశారు. అప్పటికే జాతీయ మీడియా, జాతీయ మహిళా కమిషన్ దృష్టికి ఈ సమస్యను తీసుకొని పోవడంతో, పోలీసులు కుటుంబ వివరాలన్నీ రాబట్టి వదిలేశారు. చివరకు ప్రజల 'కులం' కూడా నమోదు చేసుకున్నారు. ఈ విధంగా రాజధాని ఉద్యమంలో పోలీసులు ప్రత్యేకంగా అరెస్టుల సందర్భంలో కులాన్ని నమోదు చేస్తున్నారు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రజా ఆందోళనకు 'కులం' రంగు పూసి, కేవలం ఒకే కులానికి (కమ్మవారికి) చెందిన ఉద్యమంగా దీనిని చిత్రీకరించాలనే ఉద్దేశం కనబడుతున్నది.

పోలీసు అధికారులు కూడా ఉద్యమంలో పాల్గొనే వారిని అరెస్ట్ చేసే సమయంలో ఏమాత్రమూ చట్టాన్ని పాటించడం లేదు. మహిళలను కూడా మగ పోలీసులతో అరెస్ట్ చేయిస్తూ, వారిని తాకుతూ, అసభ్యంగా ప్రవర్తిస్తూ, వారిపట్ల చాలా చులకనగా, హేళనగా ప్రవర్తిస్తూ, దుర్భాష లాడుతూ, అడుగడుగునా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు.

రూపొందించుకోవాలన్న దగ్గర అసలు సమస్య వస్తుంది. అంతర్జాతీయంగా ప్రత్యామ్నాయ విద్యా విధానాలెన్నో ముందుకొస్తున్నాయి. సోషలిస్టు దేశాల అనుభవాలు ఇందుకు పనికొస్తాయి. గిజుభాయి, టాగూర్ నీల్, మకెరెంకో, పాపాకు కోబయాషీ వంటి మరెందరో ఆచరించిన బోధనాభ్యసన ప్రక్రియల పాఠాన్ని సంగ్రహించాల్సి ఉన్నది. ఇప్పటికే ఉపాధ్యాయ శిక్షణా సంస్థల్లో జరుగుతున్న బోధనాభ్యాసాలను, కరికులమ్‌లను పునఃపరిశీలించాలి. రాష్ట్ర జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా సంస్థలు, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సిటిఇ), జిల్లా విద్యా శిక్షణ సంస్థలు (డిఐఇటి), ఉపాధ్యాయ శిక్షణా సంస్థల అనుభవాలు, ఆచరణల వైఫల్యాలు, విజయాలను లోతుగా అధ్యయనం చేయాల్సి ఉన్నది. అనుభవజ్ఞులైన విద్యావేత్తల, ఉపాధ్యాయుల అవగాహనలను తెలుసుకోవాల్సి ఉన్నది. క్షేత్రస్థాయిలో పాల్గొంటున్న ఉపాధ్యాయుల, విద్యా మనోవైజ్ఞానిక వేత్తల, విద్యా తత్వవేత్తల ఆచరణలను, పరిశోధనలను పరిగణలోకి తీసుకుని విద్యా విధానాన్ని రూపొందించాలి కదా! అయితే చంద్రశేఖరరావు గారికి ఇవేవియూ గుర్తుకు రావడంలేదు. మాజీ పోలీసు ఉన్నతాధికారులు, మత గురువులు సరైన వారుగా కనిపిస్తున్నారు. వీరి అనుభవాలను, మేధో సంపత్తిని, ఆచరణ సారాలను రంగరించి, ఆ రంగుల్లో ముంచిన కుంచెలతో విద్యా విధానాన్ని రచిస్తారట. వీరి ఆలోచనా ధారలు ప్రసంగ ప్రవాస ధారల ముందు ఇంతకు ముందే ప్రస్తావించిన సంస్థలు, వ్యక్తులు అందరూ కూడా వెలవెల బోతున్నాయన్నమాట. వీటన్నింటికీ ఏ పక్షవాతమో సోకిందన్నమాట. వాటి మెదళ్లు మొద్దుబారి పోయాయన్నమాట. అందుకే జీయర్ దొరలు అవసరమవుతున్నారు. పాపం ఉపాధ్యాయులు, వారికి శిక్షణనిచ్చిన సంస్థలు, మార్గదర్శకంగా ఉన్న విద్యా తత్వశాస్త్రాలు, మనోవైజ్ఞానిక శాస్త్రాలు, బోధనాభ్యసన శాస్త్రాలు ఎందుకూ పనికిరానివయ్యాయి. ఇక పోలీసులు, స్వాములే దిక్కయ్యారు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

నిరసన తెలిపే హక్కు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అనే ప్రాథమిక సూత్రాన్ని సైతం పోలీసులు విస్మరిస్తున్నారు. అందుకే పోలీసులంటే ఇక్కడి ప్రజలకు పూర్తిగా గౌరవం పోయింది. అంతే కాకుండా శత్రువులుగా చూసే పరిస్థితి వచ్చింది. ప్రతిరోజూ పోలీసులు దౌర్జన్యం చేస్తుంటే ప్రజలు ఎంతవరకు ఓపిక – సహనం వహిస్తారు? దీనికి రాష్ట్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలి, బాధ్యత వహించాలి.

ప్రతిరోజూ ఈ గ్రామాలలో రైతులు, కూలీలు ఏదో ఒక కారణం చేత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ఇంతవరకూ ఎలాంటి హామీ లభించలేదు. తమకు జీవనోపాధి లేదంటూ యువకులు, వృద్ధులు ఆత్మహత్యలకు పాల్పడడం విచారకరం, శోచనీయం. ప్రజలను ఒప్పించాల్సిన ప్రభుత్వం ప్రజలపై దౌర్జన్యానికి పాల్పడుతున్నది. తమకు 151 అసెంబ్లీ సీట్లు ఉన్నాయనే భరోసాతో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తాము ఏమి చేసినా చెల్లుతుందనే ధీమాతో వ్యవహరిస్తున్నది.

'విశాఖపట్టణం' నకు రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ తరలించేందుకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించింది. అక్కడ ఉన్న పెద్ద పెద్ద భవనాలను పరిశీలిస్తూ, ఐటి పరిశ్రమలను ఖాళీ చేయించి అక్కడ సెక్రటేరియట్ పెట్టాలనే ఆలోచనలు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు మధ్యలో ఉన్నదనే కారణంతో 'అమరావతి'ని రాజధానిగా కొనసాగించాలని, అక్కడ ఇప్పటికే సచివాలయ, శాసనసభ, హైకోర్టు, కొన్ని నివాస భవనాలు తయారయి ఉన్నాయి. అయితే వాటిని కొనసాగించడం ఇప్పుడున్న ప్రభుత్వానికి ఇష్టం లేదు. కాబట్టి పోలీసులను ప్రయోగించి, బలవంతంగానైనా ప్రజలను అణచివేసి ఒప్పించాలనే భావనలో ఈ ప్రభుత్వం ఉన్నది. అక్రమంగా ఇళ్లల్లోకి ప్రవేశించి, బూటుకాళ్లతో నడుస్తూ, కొడుతూ యువకులను అరెస్టులు చేస్తున్నారు. చివరికి విజయవాడ కనకదుర్గమ్మకు పూజలు చేయడానికి మందడం గ్రామ మహిళలు ఎర్ర చీరలు ధరించి, మొక్కులతో, భక్తితో ఉదయమే బయలుదేరితే మార్గమధ్యలోనే వారిని బలవంతంగా అరెస్టు చేశారు. మహిళలని కూడా చూడకుండా లాఠీచార్జీ చేసి, బలవంతంగా వ్యాన్‌లలో ఎక్కించారు. మహిళలు పూజల కోసం వెళుతుంటే దేవాలయానికి పోకుండా నిరోధించడం ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాయడమే. ప్రజల మత స్వాతంత్ర్యపు హక్కును నిరోధించడం అవుతుంది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 25ను తృణకీరించడమే. పోలీసులు రాజ్యాంగాన్ని ఉల్లంఘించారు.

ఈ సంఘటనలో కొంత మంది ఐపిఎస్ అధికారులు కూడా పాల్గొన్నారు. వారే చట్టాన్ని ఉల్లంఘిస్తున్నప్పుడు సామాన్య ప్రజలు తమ భావనను తెలియజేయడానికి, నిరసనను తెలియజేయడానికి, పోరాటం చేయడంలో తప్పేముంది. ఈ 29 గ్రామాల ప్రజలు 33 వేల ఎకరాలను రాజధాని నిర్మాణం కోసం ధారాదత్తం చేయడం, అది కూడా ప్రజలందరికీ ఉపయోగకరం అయిన పనికి త్యాగం చేయడం ఈ దేశ చరిత్రలో ఏ రాజధాని నిర్మాణంలోనూ జరుగలేదు. అందులో కొంత తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు స్వార్థం కూడా ఉన్నది. అందుకే ఈ రాజధాని ప్రాంత రైతులకు ఈ దుస్థితి ఏర్పడ్డది. కేవలం వేయి ఎకరాలు లేదా రెండు వేల ఎకరాల లోపు భూమిని తీసుకొని ఉంటే ఇంత సమస్య వచ్చి ఉండేది కాదు. ప్రజలకు కూడా అసౌకర్యం కలిగేది కాదు. ఇంతమంది వ్యధతో, మానసికాందోళనతో మరణించేవారు కాదు. కాబట్టి ఈ పరిస్థితికి గత ప్రభుత్వం కొంత కారణమైతే, పోలీస్ హింసకు ఈ ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఇంత మంది ప్రజల మరణానికి వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. మూల్యం చెల్లించుకోక తప్పదు. చరిత్రలో నియంతలు కాలగర్భంలో కలిసిపోయారు. అదే గతి జగన్‌మోహన్‌రెడ్డికి కూడా పడుతుంది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలలో గానీ, 'మేనిఫెస్టో'లో గానీ రాజధానిని మార్చే ప్రస్తావన ఏమీ రాలేదు. కనీసం మాటల సందర్భంలో కూడా చెప్పలేదు. 151 సీట్లు వచ్చేసరికి అధికార మదంతో వైకాపా ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తున్నది.

ఈ ఉద్యమంలోని ప్రత్యేకత ఏమంటే ఎక్కువగా మహిళలు పాల్గొనడం. అంతే కాకుండా ఎన్నడూ బయటికి రాని మహిళలు పోరాటాలలో పాల్గొనడం, అరెస్టులు కావడం, పోలీసులతో లాఠీ దెబ్బలు, పోలీస్ స్టేషన్ కేసులలో ఇరుక్కోవడం. అంతే కాకుండా ఎప్పుడూ గ్రామాలలో పోలీసు కవాతులు చూడని ప్రజలు ఒకేసారి వందలాది మంది పోలీసులను చూడడం, ఏ రకమైన ప్రోత్సాహం, భావజాలం లేకుండా తమకు తాముగా చందాలు వేసుకొని, వేదికలు ఏర్పాటు చేసుకొని, సామూహికంగా వంటలు చేసుకొని, భోజనాలు చేస్తూ, పగలంతా ఏదో రకమైన కార్యాచరణలో పాల్గొంటూ తమకు తాముగానే తమ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత కొంతమంది విద్యా వంతులు, ప్రజా సంఘాల నాయకులు 'అమరావతి పరిరక్షణ సమితి' ఏర్పాటు చేసుకొని, రైతులకు సంఘీభావం తెలిపారు.

ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలు (వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ తప్ప) ఒక ఐక్య కార్యాచరణ కమిటి – జెఎసిగా ఏర్పాటై పనిచేస్తున్నాయి. వీటికి తోడు కొంతమంది ప్రొఫెసర్లు, వివిధ ఉద్యోగాలు చేసి రిటైర్డ్ అయినవారు అమరావతిని రక్షించుకోవాలంటూ రాజకీయాలకు అతీతమైన మరో ఐక్య కార్యచరణ కమిటీగా – జెఎసిని ఏర్పాటు చేసుకున్నారు. ఈ విధంగా అనేక మంది ఈ ఉద్యమానికి మద్దతు పలికారు, పలుకుతున్నారు. ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. కానీ, అధికార పార్టీ నాయకులు దిగజారి విమర్శలు చేస్తూ, ఉద్యమాన్ని కించపరుస్తూ, అవహేళన చేస్తూ మాట్లాడుతుండడం విచారకరం.

ఈ ఉద్యమం పోలీసు హింసను తీవ్రంగా ఎదుర్కొంటున్నది. ఈ ప్రాంత ప్రజలు గతంలో ఏనాడూ పోలీసు హింసను అనుభవించినవారు కాకపోవడం చేత, పోలీసు దెబ్బలకు వారు తీవ్రమైన దిగ్భ్రాంతిని, వ్యతిరేకతను వ్యక్తపరుస్తున్నారు. ఇది ఒకవేళ తీవ్రరూపం దాలిస్తే దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఈ ప్రాంత ప్రజలు కూడా అదే స్థాయిలో తీవ్రంగా ప్రతిఘటించడానికి సిద్ధంగా ఉన్నారు. అందుకు పోలీసులు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ప్రజలు తెగువతో పోరాడుతున్నారు. అంతే కాకుండా దాదాపు ఇంటికో విద్యావంతుడు ఉన్నాడు. ఉన్నత విద్యనభ్యసించి ఉన్నారు. కొంతమంది విదేశాల్లో కూడా ఉన్నారు. అందుకే ఇప్పుడు పోలీసులు వారి 'పాస్‌పోర్ట్'లను సీజ్ చేసే పనిలో ఉన్నారు. ఆ విధంగా బెదిరించడం ద్వారానైనా యువకులు

దారిలోకి వస్తారనే భావనతో పోలీసులు ఉన్నారు. కానీ పాస్‌పోర్ట్‌లు కూడా ఇవ్వడానికి ఈ ప్రాంత యువకులు సిద్ధంగా ఉన్నారు. ఆ విషయం పోలీసు అధికారులకు తెలియజేశారు కూడా. ఉన్నత ఉద్యోగాలు చేయడానికి విదేశాలు వెళ్లడానికి సిద్ధపడిన యువత పోరాడడానికి తాము సిద్ధపడి ఉన్నామనే హెచ్చరిక పోలీసు అధికారులకు తమ అభిప్రాయాలను తెలియజేసింది.

ఒక గ్రామం నుండి మరో గ్రామానికి వెళ్లే దారుల్లో కూడా పోలీసులు చెకింగ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. అప్రకటిత ఎమర్జెన్సీ విధించారు. దాదాపు ప్రతి గ్రామానికి ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ముగ్గురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, 20–30 మంది పోలీసులు కొంత మంది మఫ్టీలో ఉంటూ, ఆయా గ్రామాల ప్రజలు ఏమేమి చేస్తున్నారో విచారిస్తూ, వీడియోలు తీస్తూ, మొత్తం గ్రామాలనన్నింటినీ స్కాన్ చేసుకొని, రాత్రి వేళల్లో వేరే గ్రామాల ప్రజలను ఇతర గ్రామాలకు ఎవరినీ రానీయకుండా వారిని అక్రమంగా నిర్బంధిస్తూ, ఆధార్ కార్డులు, ఓటర్ కార్డులు చూపించమంటూ మరో 'కశ్మీర్'ను తలపిస్తున్నారు. ఇది పూర్తిగా ఆందోళనా పథంలో భారత రాజ్యాంగ వ్యవస్థ నడుస్తున్న తీరును తెలియ జేస్తున్నది. బ్రిటిష్ వారు కూడా స్వాతంత్ర్య పోరాట కాలంలో ఎన్నడూ ఈ విధమైన ప్రవర్తన ప్రజలపై చూపలేదు. బ్రిటిష్ వారిని మైమరిపిస్తున్నారు. 24 గంటలు 144 సెక్షన్ అమలులో ఉందంటూ గ్రామస్థులను బెదిరింపులకు గురిచేస్తున్నారు

2020 జనవరి 12న జాతీయ మహిళా కమిషన్ ప్రతినిధి బృందం రాజధాని ప్రాంత మహిళలను పరామర్శించడానికి ఢిల్లీ నుండి వచ్చారు. కానీ అది కూడా మొక్కుబడిగానే జరిగింది. శ్రీలక్ష్మి అనే రాజధాని ప్రాంత మహిళ పోలీస్ బూటుకాళ్లతో తన్నులు తిని ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా కనీసం ఆమెను పరామర్శించకుండా, ఆమె స్టేట్‌మెంట్ రికార్డ్ చేయకుండా వెనుదిరిగారు. పొత్తికడుపులో బూటుకాలు పడినందుకు ఆమె ఆరోగ్యం ఆందోళనకరంగానే ఉంది. రాష్ట్ర హోం మంత్రి మేకతోటి సుచరిత ఒక మహిళగా కూడా పరామర్శకు రాలేదు. అంటే పోలీసు అధికారులు చేస్తున్న విచక్షణారహిత హింసకు అధికార పార్టీ పూర్తి మద్దతు ఉన్నట్లు స్పష్టమవుతున్నది. అంతేకాకుండా కొంతమంది వైకాపా మద్దతుదారులు పోలీసుల రూపంలో మఫ్టీలో తిరుగుతున్నట్లు స్పష్టమవుతున్నది. ఎందుకనగా గుర్తింపు కార్డులు చూపించమంటే వారు చూపించకుండా, బహిరంగంగా మహిళలకు పట్టుబడి పరువు పోగొట్టుకున్నారు.

ఇంత పోలీస్ నిర్బంధంలో కూడా వారు పోలీసులతో మర్యాదగానే ప్రవర్తిస్తున్నారు. దుర్గమ్మ దగ్గరికి వెళ్లే సమయంలో పోలీసులు అడ్డుకున్నప్పుడు వారు ప్రసాదంగా తీసుకెళుతున్న తీపి పదార్థాలను, భోజనాలను పోలీసులకు కూడా వడ్డించారు. అసలు పోలీసుల అమానుష ప్రవర్తన పట్ల నేటికీ మహిళలు తమ హద్దులను మీరి ప్రవర్తించలేదు. పోలీసులే రాళ్లు, ఇటుకలు చేతుల్లోకి తీసుకొని బహిరంగంగానే విసిరారు. ప్రత్యక్ష ప్రసారంలో దృశ్య మాధ్యమం ద్వారా తెలియజేస్తున్నప్పటికీ రాష్ట్ర డిజిపి గౌతమ్ సవాంగ్ ఎందుకు ఆ పోలీసు అధికారులను సస్పెండ్ చేయలేదు? చట్టానికి వారు అతీతులా? వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదు? పోలీసు అధికారులపై విచారణ ఎందుకు జరగడం లేదు? లేదా ప్రజలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే ఈ పోలీస్ అధికారులు చూస్తూ ఊరకుంటారా? వీటన్నింటికీ కాలమే పరిష్కారం చూపుతుంది.

గ్రామాల్లో ఎప్పుడంటే అప్పుడు 144 సెక్షన్ విధించడం, శాంతి భద్రతల సమస్యగా గ్రామాలను చిత్రీకరించడాన్ని సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టింది. రాజధాని గ్రామాల పరిస్థితిపై కొంతమంది మహిళలు సుప్రీంకోర్టు 'వెబ్‌సైట్'కు ఈ–మెయిల్ కూడా పంపించారు. దీనిని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణిస్తోంది. రాజకీయ ప్రేరేపితంతో పోలీసు అధికారులు 144వ సెక్షన్ విధించడం పౌరుల హక్కులను కాలరాయడమే అవుతుందంటూ సుప్రీంకోర్టు స్పష్టపరిచింది. జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ఎచ్ఆర్‌సి)కు కూడా ఫిర్యాదు చేశారు.

రాజధాని ప్రాంత ప్రజలు తమను రక్షించేందుకు ఈ దేశంలో రాజ్యాంగ వ్యవస్థ ఉన్నదా? లేదా? అసలు ఈ దేశంలో ప్రజాస్వామ్యం మనుగడలో ఉన్నదా? అని ప్రశ్నిస్తున్నారు. పోలీసు అధికారుల అమానవీయమైన ప్రవర్తన, భౌతిక హింస, అణచివేతలను ప్రతిఘటించే శక్తి తమకు కావాలని, వారి వారి ఇష్ట దైవాలను మనస్సులో ప్రార్థించుకుంటున్నారు. ఇప్పటికే వారికి ఈ వ్యవస్థలో ఉన్న అన్ని రంగాలపై కొంత అవగాహన అవగతమై ఉన్నది. ఇప్పుడు జరగవలసింది మరో స్వాతంత్ర్య పోరాటం. అది 'అమరావతి పరిరక్షణ సమితి' రూపంలోనైనా కొంత జరిగితే అందరూ స్వాగతించాల్సిందే. పోరాటం ద్వారానే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం – హైకోర్టు 2020 జనవరి 13న పోలీసు హింసపై పత్రికా ప్రచురణల ఆధారంగా కేసును సుమోటోగా స్వీకరించి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ చీఫ్ జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ ఎం. సత్యనారాయణ మూర్తిలతో కూడిన ధర్మాసనం కేసును 'ప్రజాహిత వ్యాజ్యం' (పిల్)గా స్వీకరిస్తూ, అత్యవసర ప్రాధాన్యంగా విచారణ జరిపి, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగిందని ధృవీకరిస్తూ రాష్ట్ర డిజిపి, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రటరీ ఫర్ హోమ్‌కు నోటీసులు జారీ చేస్తూ కింది మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

1. జీవనోపాధి కోసం వ్యవసాయ పనులకు వెళ్లే ప్రజలను తమతమ ఇళ్ల నుంచి స్వేచ్ఛగా వెళ్లనివ్వాలి.
2. శాంతియుత నిరసన ప్రదర్శనలకు, ఊరేగింపులకు అనుమతించాలి.
3. దేవాలయాల సందర్శనకు, పూజలకు అనుమతించాలి.
4. క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ నిబంధనలకు అనుగుణంగా తప్ప, ఇతర సందర్భాలలో తనిఖీల నిమిత్తం గ్రామస్థుల ఇళ్లలోనికి ప్రవేశించరాదు.
5. విజయవాడ పోలీస్ కమిషనర్, గుంటూరు అర్బన్, గుంటూరు రూరల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి) లు ఐపిసి సెక్షన్ 46 నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి.
6. సూర్యాస్తమయం అయ్యాక రాణాల్లో గ్రామస్థులను అక్రమ నిర్బంధంలో ఉంచడానికి కారణమైన పోలీసులపై చర్యలకు విజయవాడ పోలీస్ కమిషనర్, గుంటూరు రూరల్, అర్బన్ ఎస్‌పిలు విచారణ జరిపి కేసులు నమోదు చేయాలి.
7. పత్రికలలో, వీడియోలలో రికార్డ్ అయిన అంశాలను పరిశీలించి

గాయపడిన వ్యక్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా వైద్య సదుపాయాలను కల్పించాలి.

8. అరెస్ట్ అయిన వ్యక్తుల జాబితాను తక్షణమే సంబంధిత జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌కు సమర్పించాలి.
9. సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను, ఐపిసి సెక్షన్ 46 నిబంధనలను ఉల్లంఘించిన పోలీసు అధికారులపై విజయవాడ నగర పోలీస్ కమిషనర్, గుంటూరు అర్బన్-రూరల్ ఎస్‌పిలు విచారణ జరిపి, కేసులు నమోదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలి.
10. చట్ట నిబంధనలను అమలు చేయని కిందిస్థాయి - సహచర సిబ్బందిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ (జిఎడి) ముఖ్యకార్యదర్శి, రాష్ట్ర డిజిపి వివరణ ఇవ్వాలి. గ్రామస్థులు శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే 144 సెక్షన్ ఎందుకు విధించాల్సి వచ్చిందో విజయవాడ పోలీస్ కమిషనర్, గుంటూరు పట్టణ, గ్రామీణ ఎస్‌పిలు, కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు వివరణ ఇవ్వండి అంటూ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. 2020 జనవరి 17 లోపుగా సమాధానం ఇవ్వాలంటూ వాయిదా వేశారు.

ముగింపు

అమరావతి పరిరక్షణ సమితి 'చలో అసెంబ్లీ' కార్యక్రమం 2020 జనవరి 20న పిలుపు ఇవ్వడం జరిగింది. అయితే అదేరోజు జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో కేబినెట్ మీటింగ్, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఒకవైపు అసెంబ్లీలో మూడు రాజధానుల నిర్ణయం ప్రకటించి, అమరావతి నుంచి విశాఖపట్టణానికి మార్చే ప్రక్రియపై చర్చ జరుగుతుండగానే వేలాది మంది ప్రజలు, రైతులు, రైతు కూలీలు వెలగపూడి అసెంబ్లీ - సచివాలయం చుట్టూ ఉన్న 29 గ్రామాల ప్రజలు గుంపులు గుంపులుగా రోడ్ల మీదికి వచ్చి నినాదాలు చేస్తూ, అసెంబ్లీకి అతికొద్ది దూరంలోనికి చేరుకోగలిగారు. దాదాపు పదివేల మంది పోలీసులను దించినప్పటికీ ప్రజా వెల్లువ ముందు పోలీసులు నిలువలేక పోయారు. ఎంతో మందిని పోలీసులు కొట్టి గాయపరిచారు. మహిళలను గాయపరిచారు. వందలాది మంది రైతులను, రైతు కూలీలను లాఠీలతో బాదుతూ చేతులతో, కాళ్లతో తన్నారు. గుంటూరు రూరల్, అర్బన్ ఎస్‌పిలు విజయారావు, విశాల్‌గున్నీ ఐపిఎస్ అధికారులు స్వయంగా లాఠీలతో ప్రజలపై విరుచుకుపడ్డారు. ప్రజలను నైతికంగా ఒప్పించాల్సిన ప్రభుత్వం ఆ గ్రామాలన్నింటినీ పోలీసులతో నింపివేసి, ప్రశ్నించిన వారినందరినీ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అయినప్పటికీ పెద్ద ఎత్తున మహిళలు రోడ్ల పైకి వచ్చి నిరసన తెలిపారు. బహిరంగంగా పోరాటంలో పాల్గొన్నారు. అయినప్పటికీ రాజధాని మార్పు బిల్లు 2020 రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదింపజేశారు. వైకాపా ప్రభుత్వం తమ ఎన్నికల వాగ్దానాలలో లేని విధంగా రాజధాని మార్పు బిల్లును ఆమోదింప జేసుకున్నది. అయితే 2020 జనవరి 21న శాసన మండలిలో వారికి బలం లేని కారణం చేత ఆ బిల్లు ఆమోదింపబడలేదు.

ఏ రాష్ట్రానికైనా రాజధాని ఒక శిరో భాగం. ఆ రాష్ట్ర పరిపాలనా సౌలభ్యం అంతా ఒక ప్రదేశంలో జరగడమనేది ప్రజలకు అలవాటైన ఒక జీవన శైలి. దానిని మూడు ప్రాంతాలుగా విశాఖపట్టణం, అమరావతి, కర్నూలుగా విభజిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ అయినంత మాత్రాన అది రేపు 'న్యాయ సమీక్ష'లో భాగంగా సుప్రీంకోర్టులో విచారణార్హతను పొందవలసి ఉంటుంది. అక్కడా న్యాయ సమీక్షలో నిలబడవలసి ఉంది. అది ఒక పెద్ద రాజ్యాంగ ప్రక్రియను గెలువవలసి ఉంటుంది. అంతేకాకుండా రాజధానులను ఈ విధంగా పాలకులు మారినప్పుడల్లా మార్చినంత మాత్రాన ఆయా ప్రాంతాలు అభివృద్ధి అవుతాయని ప్రజలను భ్రమింపచేయడం ఈ పాలకులు మానుకోవాలి. 10 సంవత్సరాలు హైదరాబాద్‌ను కొనసాగించే అవకాశం ఉన్నప్పటికీ చంద్రబాబు నాయుడు తన స్వంత కేసువల్ల 2013 విభజన చట్టాన్ని పూర్తిగా వినియోగించుకోకుండా 'అమరావతి'కి మార్పు చేయించాడు. మళ్లీ విశాఖపట్టణంకు ఈ రాజధానిని మార్చడమంటే దాదాపు 9 జిల్లాల ప్రజలకు ఎంతో దూర భారమైన సమస్య. దీనిని ఎదుర్కోవడం చాలా హృదయ విదారకరమైన సమస్య. కర్నూలు - న్యాయశాఖ రాజధాని అనేది కేవలం చాలా కొద్దిమంది ప్రజలకే ప్రయోజనంతో కూడుకున్న వ్యవహారం. 'హైకోర్టు'ను చూసినవాళ్లు, అందులో జరిగే వ్యవస్థతో ప్రత్యక్ష అనుభవం ఉన్నవాళ్లు ఈ సమాజంలో చాలా తక్కువ. ప్రజలపై ప్రభావం చాలా తక్కువ. ఇటువంటి పరిస్థితులలో దాదాపు 25 మంది రైతులు చనిపోయిన తర్వాత, 36 రోజుల నుంచీ 'ప్రత్యక్ష కార్యాచరణ'లో రైతులు ఉన్నప్పటికీ వైకాపా ప్రభుత్వం రాజధాని మార్పు బిల్లును ఆమోదింప చేయడం ఒక ప్రజా వ్యతిరేక చర్య. మెజారిటీ ప్రజల అభిప్రాయానికి విరుద్ధంగా జరిగిన చర్య తప్ప మరొకటి కాదు. అంతే కాకుండా 'విశాఖపట్టణం' లాంటి నగరానికి తరలించడం ఒక అవినీతి చర్య తప్ప మరొకటి కాదు. ఇప్పటికే అవరావతిలో అనేక విద్యా సంస్థలు ప్రారంభమై నడుస్తున్నాయి. ఇంకా దాదాపు 100 దాకా విద్యా సంస్థలు రాబోయే ప్రణాళికలున్నాయని కొన్ని సంస్థలు ప్రకటించాయి. సిఆర్‌డిఎను అమరావతి మెట్రో రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎఎంఆర్‌డిఎగా మార్పు చేశారు.

గతంలో సిఆర్‌డిఎ - అమరావతికి ప్రతి సంవత్సరం 12 వేల 60 కోట్ల ఆర్థిక రాబడి నిర్మాణ రంగం నుంచే రాబోతున్నదని ఒక నివేదిక కూడా ప్రభుత్వానికి సమర్పించింది. అంతే కాకుండా గత ప్రభుత్వ కోరిక మేరకు రైతులు తమకున్న భూములను ప్రభుత్వాన్ని నమ్మి ధారాదత్తం చేశారు. వారందరికీ నేడు తిరోగమనంలో అవసరమైన వారికి తిరిగి వెనక్కి ఇస్తామని, తిరిగి వ్యవసాయం ప్రారంభించుకో మంటూ ఒక ఉచిత సలహాను అసెంబ్లీ సాక్షిగా కూడా తీర్మానం ఆమోదయోగ్యం చేసుకున్నారు. ఇది ప్రజామోదం లేకుండా చేసుకున్న ప్రక్రియ తప్ప మరొకటి కాదు. గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను, నిర్మాణాలను రద్దుచేసే కార్యక్రమంలో భాగంగానే ఈ ప్రభుత్వం 3 రాజధానుల వ్యవస్థను తీసుకువచ్చింది. భవిష్యత్తులో ఇది ఎంత ప్రజాగ్రహానికి గురయ్యేది త్వరలోనే తేలబోతోంది. ఇది రెండు రాజకీయ పార్టీల సమస్య కాదు, 5 కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజల అస్తిత్వ సమస్యగా మారింది. దీనికి కాలమే పరిష్కారం చూపుతుంది.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

మరోసారి రాయలసీమకు ద్రోహం

***రాజధానిగా అమరావతి కొనసాగినా, మూడు రాజధానులు ఏర్పడినా ప్రయోజనం పొందేది మాత్రం రాజకీయ నాయకులు, కార్పొరేట్ సంస్థలేననీ, రాయలసీమ ప్రజలకు గాని ఇతర ప్రాంతాల అట్టడుగు వర్గాలకు గాని ఒనగూరేదేమీ లేదనీ అంటున్నారు* ఎం.కె. కుమార్**

ముఖ్యమంత్రి ప్రకటన వల్ల అమరావతిలో రైతులు ఆందోళన బాట పట్టారు. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు భయపడుతున్నారు. అభివద్ధి, పాలనను వికేంద్రీకరించడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిఎన్ రావు కమిటీ, బిసిజి కమిటీ, హై పవర్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానులను ఏర్పాటు చేయాలన్న తలంపుతో ప్రభుత్వం ఉంది. 82 సంవత్సరాల తరువాత జిఎన్ రావు కమిటీ 1937 శ్రీబాగ్ ఒప్పందాన్ని గుర్తించింది. శ్రీబాగ్ ఒప్పందం మద్రాస్ రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడానికి కీలక పాత్ర పోషించింది. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో మూడు రకాల రాజధానులు ఉండాలని ప్రభుత్వం చెపుతోంది. అమరావతిలో లెజిస్లేటివ్ క్యాపిటల్, విశాఖపట్నంలో ఎక్జిక్యూటివ్ క్యాపిటల్, కర్నూలులో జుడిషియల్ క్యాపిటల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. ప్రభుత్వ ఆలోచన పట్ల రాష్ట్ర ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. ఎందుకంటే ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. నిజానికి అమరావతి ప్రాంతంలో చంద్రబాబు, అతని అనుచరగణం పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేసింది. అమరావతి రాజధాని ప్రకటించడానికి ముందు కూడా చంద్రబాబు ప్రభుత్వం లీకులు ఇచ్చింది. రాజధానిగా కర్నూలు, ఒంగోలు, వైజాగ్ అంటూ మాటలు మారుస్తూ వచ్చింది. రియల్ ఎస్టేట్ రంగాన్ని నేలకూల్చింది. అమరావతి ప్రాంతంలో రాజధాని ప్రకటించినా అక్కడ శాశ్వత నిర్మాణాలు కట్టలేకపోయింది. రాష్ట్రం విడిపోవడం వల్ల అప్పులు ఎక్కువయ్యాయని చెప్పింది. అందుకే లక్ష కోట్లతో రాజధానిని ఒకే ప్రాంతంలో నిర్మిస్తానని చంద్రబాబు చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా రాజధాని ఉండడం వల్ల, అభివృద్ధి కేంద్రీకరించబడిందని, తెలంగాణ మొత్తం అభివృద్ధి జరగలేదని అదే చంద్రబాబు మాట్లాడారు. ప్రస్తుతం జగన్ రాష్ట్రం 2.5 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని చెబుతున్నాడు. లక్ష కోట్లతో రాజధాని నిర్మించడం ఆర్థిక భారం అవుతుందంటున్నాడు. కేవలం 5వేల కోట్లతో రాజధానిని వైజాగ్‌కు 30 కిలోమీటర్ల దూరంలో నిర్మిస్తానని అంటున్నారు. ఇక్కడ జగన్‌కు, అనుచర గణానికి వేల ఎకరాల్లో భూములు ఉన్నాయని, అందుకే రాజధానిని అమరావతి నుండి తరలిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

డిసెంబర్ 27న జరిపిన మంత్రివర్గ సమావేశంలో జి.ఎన్. రావు కమిటీ, బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూపు నివేదికలను పరిశీలించడానికి హైపవర్ కమిటీని వేస్తున్నామనే ప్రకటన వెలువడింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలను వెనక్కు తీసుకోవాలని సర్కారు జిల్లాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర రాజధానిగా అమరావతి కొనసాగాలనీ, హైకోర్టు అక్కడే ఉండాలనీ, రాజమండ్రిలో, కర్నూలులో హైకోర్టు బెంచీలు ఏర్పాటు చేయాలని కోస్తా ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు.

గత సంవత్సరం డిసెంబర్‌లో రాష్ట్రపతి అమరావతిలో హైకోర్టు ఏర్పాటుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీచేశారు. జనవరి 2019 నుండి హైకోర్టు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. కానీ అక్కడ న్యాయమూర్తులకు, న్యాయవాదులకు ఇంతవరకు సరైన సౌకర్యాలు లేవు. కక్షిదారులు, సాక్ష్యులు అనేక ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. అమరావతిలో హైకోర్టు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూనే నడుస్తోంది. కర్నూలులో జ్యుడిషియల్ క్యాపియల్ ఏర్పాటు చేస్తామనే ఆలోచన ప్రభుత్వం ప్రకటించగానే తీవ్రమైన వ్యతిరేకత ఈ ప్రాంతంలో వచ్చింది. హైదరాబాద్ నుండి, హైకోర్టు అమరావతికి వచ్చింది. మళ్లీ హైకోర్టును కర్నూలుకు తరలించాలని ప్రభుత్వం ప్రయత్నం చేయడాన్ని సర్కారు ప్రాంత న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో 25 హైకోర్టులు ఉన్నాయి. 7 రాష్ట్రాల్లో రెండు లేదా మూడు హైకోర్టు బెంచీలు పనిచేస్తున్నాయి. హైకోర్టు విచారణకు సంబంధించి రెండు రకాల బెంచీలు ఉన్నాయి. ప్రిన్సిపల్ సీట్ (ప్రధాన హైకోర్టు), పర్మినెంట్ బెంచ్, సర్క్యూట్ బెంచ్‌లుగా వివిధ రాష్ట్రాలలో న్యాయవిచారణ కొనసాగిస్తున్నాయి. ప్రధాన హైకోర్టు రాష్ట్ర రాజధానిలో కాకుండా రాష్ట్రంలోని ఇతర నగరాల్లో కూడా ఏర్పాటు చేశారు. ప్రధాన హైకోర్టుకు న్యాయవిచారణతో పాటు, న్యాయవ్యవస్థకు సంబంధించిన పరిపాలనను చేసే అధికారం ఉంటుంది. పర్మినెంట్ బెంచ్ అంటే ఇద్దరు లేదా ముగ్గురు హైకోర్టు జడ్జిలు సంవత్సరం అంతా అక్కడే ఉండి విచారణ కొనసాగిస్తారు. ఇక సర్క్యూట్ బెంచ్ అంటే హైకోర్టు జడ్జి సంవత్సరంలో రెండు మూడు నెలలు ఉండి విచారణ జరుపుతారు. హైకోర్టులు ముఖ్యంగా అప్పీల్లను విచారిస్తాయి. కాబట్టి భౌగోళికంగా ప్రజలకు చేరువుగా ఉండే ప్రాంతంలో బెంచీలు ఏర్పాటు చేస్తారని ప్రొ.ఎస్. శేషయ్య లాంటి మేధావులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని 1930ల నుండే రాయలసీమలో ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. 1937, నవంబర్ 16న రాయలసీమ నాయకులకు, సర్కారు ప్రాంత నాయకులకు మధ్య శ్రీభాగ్ ఒడంబడిక జరిగింది. ఇది రాయలసీమ ప్రాంత హక్కుల ప్రకటనగా గుర్తించాలి. మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయేటప్పుడు రాయలసీమ ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేశారు. అలాగే అని చెప్పి ప్రత్యేక రాష్ట్ర నినాదాన్ని నీరు కార్చారు. కర్నూలులో రాజాధాని పెడతామని చెప్పి పెట్టించారు. దీనికోసం శ్రీశైలం ప్రాజెక్టుకు 83 వేల ఎకరాలను రాయలసీమ ప్రాంత రైతులు ఇచ్చారు. ఇప్పటివరకు వారికి నష్టపరిహారం, భూమికి భూమి ఇవ్వబడలేదు. ప్రభుత్వాలు మారినా ప్రజలకు న్యాయం మాత్రం జరగలేదు. ఇప్పుడు 33 వేల ఎకరాలు రాజధాని కోసం ఇచ్చామని, కాబట్టి అమరావతిలో రాజధాని నిర్మించాలని అమరావతి రైతులు ఆందోళన చేస్తున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను

నెరవేరుస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలులో రాజధాని ఏర్పాటు చేసినందుకే రాయలసీమ ప్రజలు 83 వేల ఎకరాలు శ్రీశైలం ప్రాజెక్టుకు ఇచ్చారు. మరి ఇక్కడ నుండి రాజధాని హైదరాబాద్‌కు తరలిస్తున్నప్పుడు ఎవ్వరూ మాట్లాడలేదు. రాయలసీమ రైతులకు కూడా అమరావతి రైతుల తరహాలోనే నష్టపరిహారాన్ని, ప్రయోజనాలను జగన్ ప్రభుత్వం అందించాలి. అమరాతిలో రాజధాని కట్టకపోయినా, ఎకరం కోటికి పైగానే పలుకుతుంది. అదే రాయలసీమలో ఎకరం 3 లక్షల విలువ కూడా చేయదు. రాజధాని ప్రాంతంలో 15 అడుగులకే నీళ్లు వస్తాయి. రాయలసీమలో 2000 అడుగులు బోర్లు వేసినా నీళ్లు రావు.

2014 హైదరాబాద్ రాజధానిగా ఉంది. కేంద్రీకృత విధ్వంసకర అభివృద్ధి హైదరాబాద్‌లో జరిగింది. అభివృద్ధి హైదరాబాద్‌లో జరిగితే, విధ్వంసం రాష్ట్రమంతా జరిగింది. అందుకే శ్రీకృష్ణకమిటీ హైదరాబాద్‌ను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి అన్ని ప్రాంతాలలో సమానంగా ఉండాలని చెప్పింది. పచ్చని పంటపొలాలను రాజధానిగా వినియోగించుకోవద్దని చెప్పింది. గోదావరి, కృష్ణా చుట్టుపక్కల రాజధాని అవసరం లేదని చెప్పింది. కేంద్రీకృత అభివృద్ధికి వ్యతిరేకంగానే ప్రత్యేక హోదా డిమాండ్‌ను ప్రజలు చేశారు. తద్వారా సమతుల్య అభివృద్ధి రాష్ట్రమంతా జరుగుతుందని ప్రజలు ఆశించారు. కృష్ణానది ఒడ్డున రాజధాని వద్దని ప్రజాస్వామిక వాదులు, మెజారిటీ ప్రజలు అభిప్రాయపడ్డారు. వెనుకబడిన ప్రాంతాల్లో రాజధాని నిర్మాణం జరగాలని ప్రజలు ఆకాంక్షించారు. చంద్రబాబు మలేషియా, జపాన్, సింగపూర్, జర్మనీ నమూనా అభివృద్ధిని అమరావతిలో చూపిస్తానని ప్రగల్భాలు పలికారు. అమరావతికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఒప్పుకోలేదు. పర్యావరణ అనుమతులు రాలేదు. విభజన చట్టాల హామీకు, ప్రత్యేక హోదాకు పాలక, ప్రతిపక్షాల పార్టీలు కొట్లాడడం మానేశాయి. వారిలో వారు స్వార్థ ఆర్థిక ప్రయోజనాల కోసం కొట్టుకుంటున్నట్టు నటిస్తున్నారు.

నూతన రాజధాని పేరిట మరో అమరావతి తరహా భూ మాఫియా జరుగబోతోంది. భారీ పెట్టుబడులు, ప్రాజెక్టులు, సౌకర్యాల పేరిట లక్షల కోట్లు కుమ్మరించాలని జగన్ ప్రభుత్వం తలుస్తోంది. ప్రభుత్వ భూముల్లోనే, వెనుబడిన ప్రాంతాల్లోనే రాజధానిని పెట్టాలి. రాయలసీమ కన్నా వెనుకబడిన ప్రాంతం రాష్ట్రంలో మరొటి లేదు. ఉత్తరాంధ్ర మేధావులు సైతం అమరావతిలో రాజధానిని కొనసాగించాలని అంటున్నారు. విశాఖ, రాయలసీమలో ఏడాదికి ఒకసారి శాసనసభా సమావేశాలని నిర్వహించాలంటున్నారు. కార్యనిర్వాహకా రాజధానిగా విశాఖను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి ఎక్కువుగా ఉత్తరాంధ్ర, రాయలసీమల్లోనే కొనసాగాలని డిమాండ్ చేశారు.

జగన్ విశాఖ కేంద్రంగా రాజధానికి అన్ని సిద్ధం చేసేశాడు. 1953లో రాజధానిని కర్నూలులో, గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేశారు. 1956లో రాజధాని, హైకోర్టును హైదరాబాద్‌కు తరలించారు. శ్రీకృష్ణ కమిటీ 2014 ఆగస్టు 7న నివేదికను ఇచ్చింది. రాయలసీమకు రాజధాని కావాలని ప్రజలు డిమాండ్ చేస్తే, ప్రత్యేక హోదా ఉద్యమాన్ని ముందుకు తీసుకొచ్చారు. శివరామన్ కమిటీ, జి.ఎన్ రావు కమిటీ రెండు కూడా మూడు ప్రాంతాలలో న్యాయ, కార్యనిర్వాహక, శాసన రాజధానులను నెలకొల్పడం ద్వారా వికేంద్రీకరణ కొంతమేరకు సాధ్యమవుతుందని చెప్పాయి. జి.ఎన్. రావు కమిటీ రాయలసీమలో హైకోర్టు ఉండాలని ప్రతిపాదించింది. పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసే నాలుగు కమిషన్లలో, ఒక కమిషన్ రాయలసీమలో ఉండాలని చెప్పింది. బిసిజి కమిటీ కర్నూలులో హైకోర్టుతో పాటు రాష్ట్ర కమిషన్‌లు, అప్పిలేట్ అథారిటీలు ఉండాలన్నారు.

రాష్ట్రంలో 2.2 కోట్ల ఎకరాల పంట పొలాలు ఉన్నాయి. రాయలసీమలో 48 శాతం భూములు ఉన్నాయి. అంటే 98 లక్షల ఎకరాలు ఉన్నాయి. వీటికి గాను పాలకులు 19.27 లక్షల ఎకరాలకు సాగునీరు కేటాయించారు. దానికి కూడా గండి కొట్టి గత దశాబ్దంగా రాయలసీమకు 7.9 లక్షల ఎకరాలకు మాత్రమే నీటి కేటాయింపు జరుగుతోంది. కృష్ణా-పెన్నార్ ప్రాజెక్టును రాయలసీమలో కడతామని గతంలో పాలకులు హామి ఇచ్చారు. రాయలసీమ ప్రజలను ఏమార్చి నాగార్జున సాగర్ ప్రాజెక్టును కట్టి రాయలసీమ ప్రాంత రైతులకు ద్రోహం చేశారు. పాలకులు సీమను మోసం చేయడం ఆపలేదు. నాగార్జున సాగర్ ఓవర్ హెడ్ టాంక్‌గా శ్రీశైలం ప్రాజెక్టును కట్టారు. శ్రీశైలం ప్రాజెక్టును బహుళార్థక ప్రాజెక్టుగా మార్చే క్రమాన్ని కోస్తా పాలకులు అడ్డుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కర్నూలు నుండి రాజధానిని ఏకపక్షంగా తరిలించారు. అందుకుగాను రాయలసీమ ప్రజలకు ఎటువంటి ప్రత్యామ్నాయ ప్రయోజనాన్ని కల్పించలేదు. 1952లోనే గుంటూరు, విజయవాడ మధ్య రాజధానిని నిర్మించాలని పాలకులు భావించారు. శ్రీబాగ్ ఒడంబడికను ఖాతరు చేయలేదు. ప్రకాశం పంతులు కర్నూలు రాజధానిని ఏర్పాటు చేస్తే, ఆయన విగ్రహాన్ని విజయవాడలో కూల్చేశారు. అప్పటి అసెంబ్లీలో కూడా తమిళనాడు ప్రాంత శాసనసభ్యులు కర్నూలులో రాజధానిని నిర్మించాలని తమ సమ్మతి తెలిపారు. కోస్తా ప్రాంత శాసనాసభ్యులు కర్నూలు రాజధానిని అసెంబ్లీ సాక్షిగా తిరస్కరించారు.

అధికారిక వికేంద్రీకరణ, పరిపాలన వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణల గురించి ప్రభుత్వం ఆలోచనలు భిన్నంగా ఉన్నాయి. మూడు ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి కమిటీలు ఇచ్చిన నిర్ణయాలు స్వల్ప ప్రయోజనాలనే అందిస్తాయి. అయినా కమిటీ ప్రతిపాదనలను ఆచరణలో జగన్ ప్రభుత్వం చూపిస్తుందనే నమ్మకం రాష్ట్ర ప్రజలకు లేదు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాజధాని లేదా హైకోర్టును ఎన్నుకునే హక్కు రాయలసీమ ప్రజలకు ఉంది. ఈ అవకాశం లేకుండా రాజధానిని గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయించాయి. రాయలసీమ ప్రాంతంలో కీలక వ్యవస్థలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది.

కీలకమైన పాలన వికేంద్రీకరణలో రాయలసీమకు సమాన ప్రాతినిధ్యం ఉండేలా రాయలసీమలో శాసన, పరిపాలనా విభాగాలను ఏర్పాటు చేయాలని రాయలసీమ ప్రజలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన ఆరు సంవత్సరాలైనా ఎపి విభజన చట్టంలో హామీ ఇచ్చిన వాటిని ప్రభుత్వాలు ఇప్పటివరకు నెరవేర్చలేవు. విభజన చట్టంలో పేర్కొన్న బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అమలు కాలేదు. ఎపి విభజన చట్టంలోని, 11వ షెడ్యూల్ ప్రకారం గాలేరు నగరి, హంద్రీ నీవా, తెలుగు గంగ, వెలిగొండ ప్రాజెక్టులు పూర్తి చేయలేదు.

33,000 క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీ-నీవా ప్రాజెక్ట్ కాలువను అభివద్ధి చేయాలనే ప్రజల డిమాండ్‌ను పాలకులు పట్టించుకోవడం లేదు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 44,000 వేల క్యూసెక్కుల సామర్థ్యం నుండి 75,000 వేల క్యూసెక్కులకు పెంచాలి. ఎస్ఆర్ఎంసి ప్రధాన కాలువ 75,000 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో అనుసంధానించబడి ఉంది. బాలనచర్ల క్రాస్ రెగ్యులేటర్

నుండి వచ్చే ప్రధాన కాలువలు తెలుగుగంగ, ఎస్‌ఆర్‌బిసి, గాలేరు – నగరి, మద్రాస్ కాలువ నీటి నిల్వలకు అవసరమైన జలాశయాలను ప్రభుత్వం నిర్మించాలి. శ్రీబాగ్ ఒప్పందం ఆధారంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత, కష్ణ, తుంగభద్ర, పెన్నాల నీటి సరఫరా ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. రాయలసీమ నీటి అవసరాలను తీర్చిన తరువాత మాత్రమే నీటిని ఇతర ప్రాంతాలకు తరలించారు. గోదావరి నీటిని కష్ణ బేసిన్‌కు తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి సంవత్సరం 100 టిఎంసిల గోదావరి నీటిని కష్ణ డెల్టాకు పట్టిసీమ ప్రాజెక్ట్ ద్వారా తరలిస్తున్నారు.

1953లో ప్రారంభమైన తుంగభద్ర ఆనకట్ట ఆధారంగా రాయలసీమ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికాలేదు. కష్ణా డెల్టాలో మిగిలిన నీటిని అదనంగా 37,498 ఎకరాలకు ఉపయోగించుకోవడానికి తాత్కాలిక అనుమతులు పొందారు. 1953లో కెసి కెనాల్ కింద ప్రారంభమైన తుంగభద్ర ఎగువ, దిగువ కాలువలు ఇప్పటి వరకు ఉపయోగించబడలేదు. దీంతో కష్ణ డెల్టాకు 37,498 ఎకరాలకు అదనంగా వేల ఎకరాలకు నీటి వినియోగం ఇంకా కొనసాగుతోంది. తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ, వేదావతి బ్యారేజ్ లిఫ్టింగ్ పథకం, గుండ్రేవుల రిజర్వాయర్, సిద్ధేశ్వరం ఆనకట్ట, ఆర్డీఎస్ వరద కాలువ, తుంగభద్ర వరద కాలువ, 70 నుంచి 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎగువ, దిగువ కాలువలు, కెసి కాలువను సంరక్షించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదు.

రాయలసీమలో తక్కువ వర్షపాతం కారణంగా భూగర్భజలాలు తగ్గిపోయాయి. రాయల కాలంలో నిర్మించిన చెరువులు పూడిపోయాయి. ఇందువల్ల 81 లక్షల ఎకరాలు కేవలం వర్షపాతం మీదనే ఆధారపడి ఉన్నాయి. భూగర్భజలాలు అడుగంటడం వల్ల 2 వేల అడుగులు బోర్లు వేసినా చుక్కనీరు పడడం లేదు. అందుకే ఈ ప్రాంత రైతులు పొట్టచేత పట్టుకుని ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు తరలివెళుతున్నారు.

13వ షెడ్యూల్ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న సంస్థలలో ప్రభుత్వం రాయలసీమలో ఒక ప్రధాన ఎయిమ్స్, జాతీయ ప్రమోషనల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి. కర్నూలును సీడ్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కర్నూలులో ఎపిఎస్ఎస్‌డిసి, ఎపిఎస్ఎస్‌సిఎ, అగ్రికల్చరల్ కమిషనరీ, సీడ్ సర్టిఫికేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి. విభజన చట్టం షెడ్యూల్ 9 లోని 89 ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు, షెడ్యూల్ 10 లోని 107 రాష్ట్ర స్థాయి శిక్షణా సంస్థలు సంయుక్తంగా జాబితా చేయబడ్డాయి. వీటిలో కొన్ని ఇప్పటికే పరిష్కరించబడ్డాయి. వీటన్నిటిని రాయలసీమలో వెంటనే ఏర్పాటు చేయాలి.

అనంతపూర్ జిల్లా కోడికొండలో ప్రభుత్వం లేపాక్షి నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేయాలి. చిత్తూరు జిల్లాలోని మన్నవారంలో బెల్, ఎన్‌టిపిసి కొనసాగుతున్న ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపకూడదు. కడప జిల్లా తుమ్మల పల్లిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యురేనియం, మైనింగ్, ప్రాసెసింగ్ యూనిట్‌ను వెంటనే మూసివేయాలి. రాయలసీమలో పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలి. రాయలసీమ ఉద్యమంలో సాధించిన రాయలసీమ థర్మల్ పవర్ స్టేషన్‌ను ప్రభుత్వం కొనసాగించాలి. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత జిల్లాల మాదిరిగానే రాయలసీమ నెల్లూరు జిల్లాల ప్రాంతాలలో సమాన శాసనసభ స్థానాలు అమలు చేయబడాలి. రాయలసీమ ప్రాంతీయ అభివృద్ధి బోర్డును నిపుణులతో ఏర్పాటు చేయాలి. ఇతర ప్రాంతాలతో సమాన అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమకు బడ్జెట్ నిధులను కేటాయించాలి.

అభివృద్ధి వికేంద్రీకరణ జరగడం అసాధ్యం అని పాలకులు చెప్పేశారు. ఈ నేపథ్యంలో పాలనా, కార్యనిర్వాహక, శాసన వికేంద్రీకరణ జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాయలసీమలో ప్రధాన హైకోర్టును పెట్టాలి. మినీ సెక్రటేరియట్, వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు, ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం కావాలని రాయలసీమలోని కొంతమంది మేధావులు అభిప్రాయపడుతున్నారు. శ్రీబాగ్ ఒప్పందంలో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం కేంద్రం అనంతపురంలో ఒకటి పెట్టాలి. కృష్ణా, తుంగభద్ర నదీ జలాలను రాయలసీమ, నెల్లూరుకు తరలించాలి. రాజధానిని రాయలసీమలోనే ఏర్పాటు చేయాలి. సమాన నిష్పత్తిలో శాసనసభ నియోజకవర్గాలను జిల్లాలవారీగా ఏర్పాటు చేయాలి. 1952లో సీమలో ఏర్పాటు చేయాల్సిన సిద్ధేశ్వరం ప్రాజెక్టు ఏర్పాటు చేయలేదు. కె.సి.కెనాల్, తుంగభద్ర ఎగువ, దిగువ కాలువల వల్ల 100 టిఎంసిల నీళ్లు వచ్చేవి. 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. సిద్ధేశ్వరం స్థానంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మించి రాయలసీమను మరింత కరువు ప్రాంతం చేశారు. ఎపి విభజన చట్టంలో ఎయిమ్స్‌ను అనంతపురంలో పెడతామన్నారు. కాని మంగళగిరిలో ఏర్పాటు చేశారు. రాయలసీమకు 400 టిఎంసిల నీళ్లను కేటాయించాలి. కృష్ణానదీ జలాల కేటాయింపు రాయలసీమకు ప్రాంత ప్రాతిపదికగా ఎక్కువ కేటాయించేలా బ్రజేష్ కమిటీని కేంద్రం ఆదేశించాలి. కృష్ణ, తుంగభద్ర నీటి వాటా మొత్తం 1005 టిఎంసిలు. ఇందులో తెలంగాణ వాటా 298, ఆంధ్రప్రదేశ్ వాటా 513 టిఎంసిలు. 100 టిఎంసిలు అదనంగా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలనే విచారణ జరుగుతోంది. అలానే గోదావరి నదీలో ఆంధ్రప్రదేశ్ వాటా 673 టిఎంసిలు. భవిష్యత్తులో 800 టిఎంసిలు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే గోదావరి జలాలు 3 వేల టిఎంసిలు సముద్రం పాలవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాయలసీమ 42 శాతం భూభాగం, 31 శాతం జనాభాను కలిగి ఉంది. అయినా కేవలం 144 టిఎంసిలు మాత్రమే కేటాయించారు. అదే 58 శాతం భూభాగం, 69 శాతం జనాభా ఉన్న కోస్తాంధ్రకు 1356 టిఎంసిలు నికర జలాలను కేటాయించడం ఖచ్చితంగా అసమాన పంపిణీ. కాబట్టి ప్రాంత, ప్రజల ప్రాతిపదికగా రాయలసీమకు 500 టిఎంసిలు ఇవ్వాలి. చెరువులకు పూడికలు తీయాలి. వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధిని జరపాలి. ఎపి విభజన చట్టంలో 13 వ షెడ్యూల్ ప్రకారం ఎయిమ్స్, వ్యవసాయ యూనివర్శిటీ, ఉక్కు కర్మాగారం, గుంతకల్‌లో రైల్వేజోన్‌లు ఏర్పాటు చేయాలి. రాయలసీమలో నాలుగు నగరాలను పెద్ద పట్టణాలుగా తయారు చేసి, పట్టణ పేదలకు ఉచిత ఇళ్లు కేటాయించాలి. ఇక్కడ పది జిల్లాలను ఏర్పాటు చేయాలి. రాష్ట్రంలో ఉన్న 35 సెక్రటేరియట్ డిపార్ట్‌మెంట్లు, 132 హెచ్‌ఓడిలను మూడు ప్రాంతాలకు సమానంగా కేటాయించాలి. ఎపి విభజన చట్టంలోని 9వ షెడ్యూల్‌లోని 89 ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్, 10వ షెడ్యూలులోని 107 రాష్ట్ర సంస్థలు, ట్రైనీ సంస్థలు మూడు ప్రాంతాలకు సమానంగా కేటాయించాలి. కోస్తాంధ్రలో 104.28 లక్షల ఎకరాలు, రాయలసీమలో 30.16 లక్షల ఎకరాలు ఉన్నాయి. రాయలసీమలోని వనరులను దోపిడి చేయకుండా ఆ వనరుల సంపదను రాయలసీమకే కేటాయించాలి. ఖనిజ పరిశ్రమలను ఈ ప్రాంతంలోనే ప్రభుత్వ నిర్వహణలో ఏర్పాటు చేయాలి.

రాజధాని, హైకోర్టు, పరిపాలనా వికేంద్రీకరణ వల్ల 90 శాతం అణగారిన ప్రజలకు ఒరిగేదేం లేదు. ధనవంతుల, రాజకీయ నాయకుల,

యూనివర్సిటీలపై పాలక వర్గాల దాడి

విశ్వవిద్యాలయాల్లోని అధ్యాపకులపై, విద్యార్థులపై పోలీసులు, గూండాలు, మతోన్మాద విద్యార్థి సంఘాలు, సంస్థలు చేసిన దాడిని ప్రగతిశీల విద్యార్థులు, మేధావులు సంఘటితంగా ఎదుర్కోవాలని అంటున్నారు **డా. ఎ. పున్నయ్య**

వేల సంవత్సరాల సాంస్కృతిక ఐక్యతా నేపథ్యం గల భారతదేశంలో తొంభై ఏళ్లుగా ఆర్ఎస్ఎస్ చేస్తున్న భావజాల ప్రచార యుద్ధం ఒక మతానికి పట్టంగట్టే ప్రయత్నంతో సాగుతోంది. హిందుత్వ భావజాలాన్ని ప్రభలంగా పదిల పరుచుకొని ప్రపంచంలో హిందూ పేటెంట్ మాదేనని చాటే తెరచాటు కుట్ర క్రమంగా హింసావాదంతో బట్టబయలైంది. దీని వెనుక రాజ్యం రహస్య ఎజెండా ఏమిటో ప్రజలకు, ప్రపంచానికి తెలిసేలా చేయాలన్నది ఈ ప్రభుత్వ నిశ్శబ్ద విప్లవం. అందుకే ముందుగా ప్రపంచ విజ్ఞాన కేంద్రాలైన విశ్వవిద్యాలయాల్లో శతాబ్దాల చారిత్రక సాంస్కృతిక విధ్వంసానికి తెరలేపింది. హేతుబద్ధ, వామపక్ష లౌకిక ప్రజాస్వామిక మేదస్సుపై ఉక్కుపాదం మోపుతుంది. తార్కిక ఆలోచన తలలు తెగ నరుకుతుంది. మేధో శిరస్సులు పగిలి వక్కలై తున్నాయి. ఈ రాజ్యం దేశ ప్రజల చైతన్యానికి జీవదారనందించే విశ్వవిద్యాలయాలపై ఫాసిస్టు దాడులతో హిందూమత రాజ్య స్థాపనకు పునాది రాళ్లెత్తుంది. రేపటి లౌకిక ప్రజాస్వామ్య తరం విష ప్రచారాలతో స్వీయ మతోన్మాద సామ్రాజ్యానికి దారులు పరుచుకుంటున్న ఈ క్రమంలో వారు కోరుకుంటున్న హిందూ రాజ్య నిర్మాణం కోసం తమ దారికి ప్రతిబంధకంగా భావించిన అన్ని శక్తులను, విలువలను ధ్వంసం చేస్తున్నారు. వారికి కావాల్సింది కేవలం విజయం మాత్రమే కాదు, తమ భావజాలానికి వ్యతిరేకంగా, విరుద్ధంగా ఉన్న దానిని నిర్మూలి స్తున్నారు. అడ్డొచ్చిన అన్నింటిని అంతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇవ్వాళ దేశ భవిష్యత్తుకు సంబంధించి అతిపెద్ద సమస్య ముందుకొచ్చింది. అది జెఎన్‌యు నుంచి జామియా మిలియా వరకు. ఎఎంయు నుంచి జాదవ్‌పూర్ యూనివర్సిటీ వరకు, అలీగడ్, విశ్వ భారత తదితర విశ్వవిద్యాలయాలే కేంద్రాలుగా సాగుతున్న ప్రభుత్వ కుట్రలు, దాడుల ఘటనల అంతరంగాన్ని ప్రజాస్వామిక మేధావులు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేడు దేశ భవిష్యత్‌కు సంబంధించి అతిపెద్ద సమస్య ముందుకొచ్చింది. కావున దేశంలోని లౌకిక ప్రజాస్వామ్య వాదులందరు పదునైన ఆలోచనలతో తీవ్రంగా చర్చించాల్సిన చారిత్రక సందర్భమిది.

విశ్వవిద్యాలయాల లక్ష్యాలు

ఆధునిక ప్రపంచ విజ్ఞానానికి మూలాధారమైన విశ్వవిద్యాలయాలు విశ్వవ్యాప్త ప్రయోజిత పరిశోధనా కేంద్రాలుగా దేశాల, ప్రజల సాంకేతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యల పరిష్కారానికి మేధో కేంద్రాలుగా ప్రపంచ పటంపై ఫరిడవిల్లుతున్నాయి. నిజానికివి కుల, మత, ప్రాంతీయ ఆర్థిక బేధాలకు అతీతంగా జ్ఞాన ప్రసార బండాగారాలు. దేశ చరిత్రలో విశ్వవిద్యాలయాలు ప్రపంచ వ్యాప్త మేధావులను సృష్టించుకున్న అపూర్వ చరిత్ర సాక్ష్యాలు వేలకొలది ఉన్నాయి. అర్ధ శతాబ్దంకు పూర్వం ఈ దేశ రాజధాని నడిబొడ్డున వెయ్యి ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 1969లో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం స్థాపితం అయింది. ఇది ఉన్నత స్థాయి విద్యా అంశాలు, జాతీయ అంతర్జాతీయ విధాన నమూనాల తయారీలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొనేందుకు అవసరమైన పరిశోధన, బోధనను ప్రోత్సహించాలనే లక్ష్యంగా ఏర్పడింది. ప్రారంభంలో కలకత్తా ప్రెసిడెన్సీ కళాశాల నుండి అధికంగా బహుముఖ ప్రజ్ఞాశాలులు ఆచార్యులుగా చేరినారు. దీనితో జెఎన్‌యు వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల వేదికగా పాదుకుంది. నేడు అంతర్జాతీయ లీగ్ పట్టికలో ప్రపంచంలో అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లోనే మేటిదిగా గుర్తింపు పొందింది. ఇందులో 105 కోర్సులతో 11 ప్రధాన విభాగాలుగా 550 మంది బోధన సిబ్బందితో సుమారు 6,000 మంది విద్యార్థులతో ప్రపంచ స్థాయి ప్రమాణాలను సొంతం చేసుకుంది. నాటి నుండి నేటికి వందల, వేల సంఖ్యలో శాస్త్రవేత్తలు, సామాజిక వేత్తలు, నోబెల్ గ్రహీతలు, ఆర్థిక వేత్తలు, రాయబారులు, కళాకారులు, ప్రసిద్ధి పొందిన వ్యాపారులతో

కార్పొరేట్ల లబ్ధికోసమే మూడు రాజధానుల గొడవలు. సంపదను దోపిడీ చేసుకోవడంలో భాగంగానే టిడిపి, వైసిపి గొడవ పడుతున్నాయి. దీన్ని ప్రజల గొడవగా మార్చాలని చూసి, విఫలమయ్యారు. అభివృద్ధి వికేంద్రీకరణ చేయలేమని ప్రభుత్వం చేతులెత్తేసింది. నవరత్నాల అమలు తప్పితే వచ్చే 5 సంవత్సరాలలో ఇంకా ఏమీ చేయలేమని జగన్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించాడు. అందుకే రాజధాని పోరాటంలో 90 శాతం ప్రజలు లేరు. అమరావతిలోని 29 గ్రామాల ప్రజల్లో రాజధాని తరలింపు వల్ల, వాళ్ల బతుకులు నాశనమౌతాయనే భయాన్ని చంద్రబాబు కల్పించారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలని ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పార్టీలు ప్రజల మౌలిక సౌకర్యాలను, జీవించే హక్కును పట్టించుకోవడం లేదు. రాజధానుల చుట్టూనే ప్రజల ఆలోచనలను తిప్పుతున్నారు. తద్వారా జగన్ ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకతను ప్రజల్లో తగ్గించాలని ప్రయత్నిస్తు న్నారు. తాగు, సాగునీరు, ఉపాధి, వ్యవసాయ ఉత్పత్తులకు సబ్సిడీలు, ఉచిత విద్య, ఉచిత వైద్యం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజలు తమ మౌలిక సమస్యలపై పోరాటం చేయకుండా జగన్ ప్రభుత్వం రాజధాని నాటకం ఆడుతోంది.

(రచయిత పౌరహక్కుల సంఘం సభ్యులు) వీ

పాటు దేశ విదేశాల్లో పాలకుల దాకా ప్రభవించిన చైతన్య కార్య క్షేత్రమిది. దీనికి కారణం అక్కడ లౌకిక, ప్రజాస్వామ్య స్వేచ్ఛా స్వాతంత్ర్యాల భావ పరిమళం వెదజల్లడమే. పరిశోధనలకు పెట్టింది పేరుగా జెఎన్‌యు ముందుకు పోతుంది. ప్రపంచ ప్రఖ్యాత ఆచార్యులు అనేక మంది ఇక్కడ బోధించడాన్ని గొప్ప గౌరవంగా ఫీలవుతారు. ఇక్కడ చదవడాన్ని విద్యార్థులు ఒక గర్వ కారణంగా భావిస్తారు. జెఎన్‌యు గ్రంథాలయం ఓ అద్భుత విజ్ఞాన భాండాగారం. ఇక్కడ దొరకని పుస్తకమంటూ ఉండదు. దేశ, విదేశాల నుంచి సేకరించిన వేలాది పుస్తకాలు కొలువుతీరి ఉంటాయి. ఇక్కడ విజ్ఞానాన్ని ఒకరితో ఒకరు పంచుకునే సమ్మేలనాలు, ప్రశ్న జవాబులతో ఉధృతంగా జరిగే చర్చోప చర్చలు తార్కిక జ్ఞానం అనుభవసారం అధ్యయన పాఠంతో అద్భుత జ్ఞానాన్ని ఇస్తుంది.

విద్యా విధానంపై ప్రభుత్వ అదృశ్య దాడులు

భారత రాజ్యాంగంలోని సామ్యవాదం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం వంటి లక్ష్యాల ప్రాతిపదికగా వర్తమాన సమాజం ముందుకు పోవాలి. సమాజ చలన స్థితిలో భాగంగా లౌకిక విధానం అంతర్లీనంగా ఉంటూ ఆధునిక సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ సమభావన తో సమసమాజ లక్ష్యంగా విద్యా విధానం ఉండాలి. ఒక దేశ సమగ్రాభివృద్ధి ఆ దేశ విద్య విధానంపై ఆధారపడుతుందనేది సత్యం. కాని నేడు పాలన సాగిస్తున్న రాజకీయ పార్టీలు అశాస్త్రీయమైనటువంటి విధానాల ద్వారా తమ అధికారాన్ని కాపాడుట కోసం విద్యను, సంస్కృతిని, కళలను ఒకటేంటి స్థూలంగా ఉపరితల అంశాలన్నింటినీ తమ ప్రయోజనాలకు వాడుకుంటూ రాజ్యాంగ బద్ధ సంస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తున్నారు. సామాజిక విలువలతో, నైతిక సూత్రాల స్థాపన మానవీయ కోణంగా, స్వేచ్ఛతో హేతుబద్ధమైన ఆలోచనలతో చైతన్య వంతంగా సృజనకారులను, దీపకారులను తయారు చేసే విద్యా కేంద్రాలు నేడు ఉనికి కోల్పోతున్నాయి. సంస్కరణల పేరుతో మర మనుషులను తయారు చేసే సిలబస్‌లు ప్రవేశపెడుతూ విద్యను సమగ్ర వికాసాభివృద్ధికి మూలం కాకుండా పాలకులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆధునిక విద్యా మార్పులతో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి)ని రద్దుపరిచి భారత ఉన్నత విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసి, విద్యా రంగంపై రాజకీయ నాయకుల పెత్తనాన్ని పెంచేందుకు కుట్రలు పన్నుతున్నారు. విద్యా రంగాన్ని లాభాలే ధ్యేయంగా పనిచేసే కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. ఈ క్రమంలో విద్యా రంగంలో ఫాసిస్టు ధోరణులు, వ్యాపార విధానాలు ప్రబలుతున్నాయి. నూతన విద్యా విధానం అమలు పేరుతో మొత్తం విద్యా రంగాన్ని అదుపులో పెట్టుకుని కాషాయీకరణకు ప్రయతిస్తుంది. విద్యా రంగాన్ని ప్రాథమికస్థాయి నుండి విశ్వవిద్యాలయాల వరకు సింహ భాగాన్ని ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలో భాగంగా ప్రభుత్వ విద్యా రంగానికి బడ్జెట్ కేటాయింపులో ఏటేటా కోత విధిస్తోంది. ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ బలహీనం చేసేందుకు ప్రణాళికలు వేసింది. ఆ దిశగా అందమైన స్లోగన్స్‌తో నూతన జాతీయ విద్యా విధానం 2019 పేరుతో ముందుకొచ్చింది. ఈ జాతీయ విద్యా విధానం ద్వారా 50 శాతం మందికి సృజనాత్మక ఆలోచనలను దూరం చేస్తుంది. ఈ నూతన విద్యా విధానం అంతర్జాతీయంగా శ్రామికులను తయారు చేయడానికి ఉపయోగపడుతుంది కానీ, అంతర్జాతీయంగా ప్రతిభావంతులను తయారుచేయడానికి అపయోగపడదనేది నిష్ఠురసత్యం.

ఢిల్లీ నగరాన్ని ప్రయోగశాలగా ఎంచుకున్న పాలక పక్షం

అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కొంతకాలంగా పలు మతతత్వ, భావవాద అంశాలను లేవనెత్తడం ద్వారా హిందువులను ఏకంచేసి తమ ఓటు బ్యాంకును సంఘటితం చేసేందుకు ఢిల్లీని ఒక ప్రయోగశాలగా మార్చుకునే ప్రయత్నం చేస్తుంది. శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్‌లో పౌరసత్వ బిల్లును ప్రవేశపెట్టి, రాష్ట్రపతి అమోద ముద్ర వేసినప్పటి నుండి ఢిల్లీ వీధులు రగిలిపోతున్నాయి. గోవిందాపూరి, సీమాపూరి, షహీన్‌బాగ్, డిఫెన్స్ కాలనీ, ఓఖా, జంతర్‌మంతర్‌తో పాటు అనేక ప్రాంతాల్లో వేలాది మంది తీవ్రంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూనే ఉన్నారు. కొత్త ఏడాది ఎముకలు కొరికే చలిలో యువకులు, వృద్ధులు నూతన సంవత్సరం వేడుకల్ని కూడా మానుకొని పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూనే ఉన్నారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి 12 గంటలు కొట్టగానే ఇంక్విలాబ్ జిందాబాద్, ఆజాదీ, ఆజాదీ అనే నినాదాలు అంబరాన్నంటాయి. 70 స్వాతంత్ర్య భారతంలో మళ్లీ 'ఆజాదీ నినాదం' దేశవ్యాప్తంగా పెల్లుబికి ప్రభుత్వ హిందుత్వ కుట్ర మైనారిటీ ప్రజల ప్రజాస్వామిక లౌకిక వాదానికి గొడ్డలిపెట్టులా తయారైంది. ఈ ప్రభావాన్ని పలు విశ్వవిద్యాలయాల్లో చర్చించడం చాలా సాధారణం. అందువల్ల కొన్ని రోజులుగా దేశంలోని యూనివర్సిటీ విద్యార్థులు రోడ్డు మీదికి వచ్చి ప్రజాస్వామిక విలువల కోసం ఉద్యమిస్తున్నారు. సిఎఎ, ఎన్‌ఆర్‌సిలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన కీలక ఘటనలు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించి సర్వత్ర చర్చకు తెరలేపినాయి.

శాంతి భద్రతల పేరుతో అశాంతిని సృష్టించిన ఢిల్లీ పోలీసులు

ప్రశాంతమైన వాతావరణంలో జామియా మిలియా యూనివర్సిటీ విద్యార్థులు సిఎఎ, ఎన్‌ఆర్‌సిలపై నిరసన మొదలు పెట్టారు. అక్కడ ఎలాంటి అవాంచనీయ ఘటనలకు ఆస్కారం కూడా లేదు. శాంతియుతంగా జరిగే కార్యక్రమం ఐనప్పటికీ ఎలాంటి ముందస్తు అనుమతి యూనివర్సిటీ అధికారుల నుండి పొందకుండానే పోలీసులు యూనివర్సిటీలోకి చొచ్చుకొని పోయి కనపడ్డ విద్యార్థులనల్లా చితకబాదారు. లైబ్రరీలో ఉన్న విద్యార్థులను బయటకు పంపించి లైబ్రరీని కూడా ధ్వంసం చేశారు. మరీ పాశవికంగా పోలీసులు ఎలాంటి హెచ్చరికలు చేయకుండానే కొన్ని రౌండ్లు కాల్పులు జరిపారు. ప్రశాంత వాతావరణంలో నిరసన తెలియజేయడం యూనివర్సిటీలో మొదటిదేమి కాదు. కాని పోలీసుల ప్రవేశాన్ని, వారు ప్రవర్తించిన విధానాన్ని, దాని వెనుక గల కారణాలను సమీక్షించుకోక యూనివర్సిటీ అధికారులు యూనివర్సిటీని మూసినారు. ఏకపక్షంగా యూనివర్సిటీ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అధ్యాపకులు, విద్యార్థులు రోడ్ల పైనే తరగతులు నిర్వహించుకున్నారు. స్థూలంగా యూనివర్సిటీలోకి పోలీసులు ఎందుకొచ్చారని అంతటా చర్చనీయాంశంగా మారితే శాంతి భద్రతలకు బంగం వాటిల్లితే పోలీసులు నియంత్రిస్తారని యూనివర్సిటీ అధికారులు, ప్రభుత్వం సమర్థించుకున్నారు. కాని అక్కడ శాంతి భద్రతలకు ఎలాంటి హాని జరగలేదనేది యథార్థం.

ప్రభుత్వ ముందస్తు అనుమతితో జెఎన్‌యుపై దాడి

జెఎన్‌యులో భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణలు కొత్తేమీ కాదు. నిరంతరం సాంస్కృతిక, రాజకీయ, సామాజికాంశాలపై పదునైన, లోతైన

వాదనలు, చర్చలు జరుగుతూనే ఉంటాయి. పాలకుల విధానాలపై ఆరోగ్యవంతమైన చర్చలు లోతైన భావాల వ్యాప్తికి కేంద్రంగా అర్ధ శతాబ్దాలుగా విరాజిల్లుతూనే ఉంది. కాని అభ్యంతరకరమైన విషయం ఏమంటే జెఎన్‌యు అధ్యాపక సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో జెఎన్‌యు ఎస్‌యు, ఎబివిపిల మధ్య ఘర్షణ జరిగింది. దాని ఫలితంగా బయటి గూండాలను ముసుగులతో తీసుకొచ్చి పాలకుల విధానాలను వ్యతిరేకిస్తూ నిరసిస్తున్న విద్యార్థులు, బోధకులపై హాకీస్టిక్స్, క్రికెట్ బ్యాట్‌లు, సుత్తెలు, ఇనుపరాడ్లతో పాశవికంగా, ఆటవికంగా దాడి చేయడం. ఉద్దేశపూర్వకంగా వామపక్ష భావజాలం గల విద్యార్థుల, అధ్యాపకుల రూములను లక్ష్యంగా ఎంచుకొని దాడి జరపడం, ఈ దాడిలో జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషిఘోష్‌తో పాటు దాదాపు 30 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. విచిత్రమేమంటే ఆ సమయంలో విశ్వవిద్యాలయ భద్రతా సిబ్బంది కనిపించకుండా పోవడం. అదే సమయంలో యూనివర్సిటీలో లైట్లు పోవడం. వర్సిటీ వెలుపల స్వరాజ్ అభిమాన్ అధినేత యోగేంద్ర యాదవ్‌పై దాడి జరగడం వెనుక దాడి జరిపినవారికి బలమైన ప్రణాళికలతో పాటు ప్రభుత్వ అధికారుల అండదండలు ఉన్నాయన్నట్లు నిరూపితమైంది.

దాడి జరిపినంత సేపు యూనివర్సిటీకి వెళ్లే రోడ్డు మార్గమంతా పోలీసులతో నిర్బంధించబడింది. పైపెచ్చు క్యాంపస్‌లో విద్యార్థులు నిరసన తెలుపుతున్నారని క్యాంపస్‌లోకి ఎవరిని అనుమతించలేదు. కాని అక్కడ నిరసన జరుగడం లేదు. వామపక్ష విద్యార్థి, అధ్యాపకులపై రాడ్లతో దాడి అనే విషయం పోలీసు అధికారులకు కూడా తెలుసు. కాని ఈ పోలీసులు దౌర్జన్యాన్ని నిరోధించకుండా, పరిస్థితిని చక్కదిద్దకుండా గేటు దగ్గర పోలీసులు తాపీగా కూర్చోవడాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. దాడిని ఆపే ప్రయత్నాలు చేద్దామని వచ్చిన విద్యార్థులను విద్యార్థులను పోలీసులు గేటు దగ్గరనే అడ్డుకున్నారు. గేటు దగ్గరి విద్యార్థులు క్యాంపస్ లోపల దాడీ జరుగుతుందని వామపక్ష విద్యార్థి అధ్యాపకులపై ముసుగు వేసుకున్న మూకలు దాడి చేస్తున్నారని చెపితే పోలీసులు నిర్లక్ష్యంగా మాట్లాడుతూ లోపల గొప్ప పనే జరుగు తుందని, ఆ పని జరగాల్సిందేనని చెప్పడంతో లోపల జరిగే హింసకు, దౌర్జన్యానికి పోలీసుల మద్ధతు పరోక్షంగా ఉన్నట్లు రూఢీ అయింది.

బయటి గుండాలు దాడిని పూర్తి చేసుకొని వర్సిటీ గేటు వద్దకు లోపలి నుండి సుమారు 100కు పైగా ముసుగులు ధరించి, చేతుల్లో రాడ్లు, కర్రలతో వచ్చి పోలీసు గుంపులో కలిసిపోయారు. ఆ వాతావరణ తీవ్రత రాడ్లకున్న రక్తాలను, వారి ప్రవర్తన చూస్తే లోపల జరిగిన దాడిని అంచనా వేసుకోచ్చు. అది పోలీసులు వెంటనే గుర్తించవచ్చు. కాని పోలీసులు ఎవరిని ఏమీ అనకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది. ఇక్కడ పోలీసులు తమ కోడ్‌ను సమీక్షించుకోవాల్సింది ఏమంటే జామియా మిలియా, ఆలీగడ్ విశ్వవిద్యాలయాల్లోకి శాంతి భద్రతల పరిరక్షణకు ఎవరి అనుమతి లేకుండా ప్రవేశించిన పోలీసులు జెఎన్‌యు లోకి ఎందుకు ప్రవేశించలేదు. సిఆర్‌పిసి నిబంధనల ప్రకారం పోలీసులు ఎక్కడికైనా శాంతి భద్రతల పరిరక్షణకు వెళ్లే అధికారం ఉంటే కళ్లెదుటే రాడ్లు, కర్రలతో వచ్చిన ముసుగుదారులను ఎందుకు ప్రశ్నించలేదు. ఎందుకు అదుపులోకి తీసుకోలేదని ప్రజాస్వామ్యంలో ఇంత వివక్ష ఎందుకు? అన్నది జెఎన్‌యు ఘటనలో మిలియన్ డాలర్ల ప్రశ్నలు. దీనికి తోడుగా దాడి జరిగిన సమయంలో వర్సిటీ గేటు వద్ద పోలీసుల ప్రవర్తన దాడి మూకలకు అటు పోలీసు ఇటు యూనివర్సిటీ అధికారుల ముందస్తు అనుమతి ఉన్నట్లు ధృవీకరించింది. పైపెచ్చు ముసుగు ధరించిన మూకలు బయటకు వెళ్తూ గంభీరంగా మాట్లాడుతూ సర్కారు మనదే, విసి మనోడే, పోలీసులు మనోళ్లే, ఇంకేవడో కూడా మనోడే అంటూ జనంలో కలిసిపోవడాన్ని ఎట్లా అర్థం చేసుకుంటారు. ఈ దాడికి ఎంత పకడ్బంది ప్రణాళిక ఉందో తెలిసిపోతుంది. ఇంత జరిగాక దాడికి గల కారణాలను పోస్టుమార్టం చేయకుండానే దాడికి గురై హాస్పిటల్‌లో ఉన్న 19 మందిపై కేసులు నమోదు చేయడం విచారకరం. గతంలో ఇలాంటి దాడులు జరుగుతూనే ఉన్నాయి. కన్హయ్యపై దాడి జరిగింది కూడా ఇదే తరహాలోనే. ప్రజాస్వామ్య ఆలోచనలను అంతం చేయడం, అక్కడ తప్పితే వారిని జైల్లో నిర్బంధించడం లేదంటే హత్య చేయడం కేవలం ఫాసిస్టు భావజాలాన్ని అడ్డుకున్నందుకే జరుగుతున్నాయి. ఈ కోవలోనే కల్‌బుర్గీని, గౌరీ లంకేష్ లాంటి వారిని హత్య చేసినారు. ప్రొ. సాయిబాబా లాంటి వారిని జైల్లో పెట్టినారు. ప్రభుత్వాలను వ్యతిరేకించినందుకు ఎంతో మందిని జైల్లో పెడుతున్నారు.

జెఎన్‌యు దాడితో వర్సిటీ, కేంద్ర ప్రభుత్వ కుట్రలు బట్టబయలు

రాజ్యం ఆదేశానుసారమే జెఎన్‌యు విద్యార్థి, అధ్యాపకులపై దాడి జరిగిందని సిసి ఫూటేజీల ద్వారా ప్రత్యక్ష సాక్షులు అరాచక శక్తులను గుర్తించారు. మేమే దాడి చేశాం, ఇలాగే మళ్లీ మళ్లీ దాడి చేస్తాం అని హిందూ రక్షాదళ్ చీఫ్ పింకి చౌదరితో పాటు ఎబివిపి నాయకులు మీడియా ముందు బహిరంగంగా ప్రకటించారు. ఇండియా టుడే స్టింగ్ ఆపరేషన్‌తో దాడులకు పాల్పడింది తామేనని ఎబివిపి బాద్యులు ఒప్పుకున్నట్లు బయటపడింది. కాని విశ్వవిద్యాలయ అధికారులు, ఢిల్లీ పోలీసులు మాత్రం సభ్య సమాజం తలదించుకునేలా తలలు పగిలి, గాయాల పాలైన విద్యార్థులు దాడి చేశారని అనుమానితుల ఫొటోలను మీడియాకు విడుదల చేశారు. అటువైపుగా గాయాలైన వారిని మీడియా ముందుకు ప్రవేశపెట్టండి అన్న వామపక్ష నాయకుల డిమాండ్‌కు అటు పోలీసుల దగ్గర కాని ఇటు ఎబివిపి దగ్గర కాని సమాధానాలు దొరకకపోవడం చూస్తే పోలీసు కట్టుకథ ఎంత రక్తికడుతుందో. అధికారుల వత్తిళ్లకు తలొగ్గి బాధితుల పైన్నే నేరాన్ని మోపి దర్యాప్తును పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అర్థ రహితమైన దిలీప్‌ఘోష్ మాటలు

జెఎన్‌యు మొత్తం ఘటనను ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా వీక్షించిన పశ్చిమ బెంగాల్ బిజెపి చీఫ్ దిలీప్‌ఘోష్ జెఎన్‌యు అధ్యక్షురాలి తలపై ఉన్నది రక్తమా? ఎర్రని పేయింటా అంటూ స్థాయిని తగ్గించుకొని మాట్లాడిన తీరు అభ్యంతరకరంగా ఉంది. ఈ క్రమంలో అధికార సుస్థిరతకై దేశంలో సున్నితమైన విద్వేశాలను రెచ్చగొడుతూ మనుషులను మత పరంగా చీల్చుతూ, భౌతిక దాడులతో బయకంపితం చేసి లౌకిక దేశంను హత్య చేయడం లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని మరొక్కసారి ఈ ఘటనతో నిరూపితమైంది.

జెఎన్‌యు డిఎన్ఎ చైతన్యవంతమైంది

జెఎన్‌యు ఒక మినీ భారతం. దేశంలో అన్ని రాష్ట్రాల నుంచి, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులుంటారు. సుమారు

40 దేశాల నుంచి వచ్చిన విదేశీయులుంటారు. ప్రతిభే కొలమానంగా ఇక్కడ అందరికి సీట్లు లభిస్తాయి. పారిశ్రామిక వేత్త కొడుకు, రిక్షా కార్మికుడి కొడుకు, సామాన్య రైతు కొడుకు ఒకే బెంచీలో కూర్చొని పాఠాలు వింటారు. ఎవరు ఏ నేపథ్యం నుంచి వచ్చారని ఆరాలూ, ప్రత్యేక ఆధారాలు ఉండవు. ప్రతిభ ఒక్కటే కొలమానం, సంపాదించిన జ్ఞానమొక్కటే కలగలపు సాధనం. విశ్వంలోని ప్రతి అంశాన్ని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలను తార్కికంగా చర్చిస్తారు. దేశం గురించి గొప్ప కలలు కంటారు. అభ్యుదయ, లౌకిక దేశ కవచకులుగా, సమానత్వ కాంక్షకులుగా, ప్రజా వ్యతిరేక చట్టాలపై పదునైన నిరసనలు, ధర్నాలు ఈ ఐదు దశాబ్దాల నుండి చేస్తూనే ఉన్నారు. ఈ దేశం సమున్నతంగా, రాజ్యాంగ బద్ధంగా, సర్వజన శ్రేయో రాజ్యంగా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆశిస్తారు. అందుకే దేశంలో ఏ సమస్య తలెత్తినా వాళ్ల గొంతులు ముందు లేస్తాయి. వాళ్ల పిడికిళ్లు అందరికన్నా ముందు బిగుస్తాయి. అందుకే దేశంలో వివాద సంక్షోభం తలెత్తిన ప్రతిసారి భారతావనికి ప్రత్యామ్నాయ ప్రగతిశీల ఆలోచనా దారులను అవిరళంగా అందిస్తారు. సృజనాత్మకంగా, చైతన్య దీపికలుగా వెలగాల్సిన విశ్వ విద్యాలయాలు ఇటీవలి కాలంలో ప్రభుత్వాలు గుడ్డి దీపాలు చేస్తున్నాయి. ప్రభుత్వంపై అణుమాత్రం వ్యతిరేకతను అంగీకరించే స్థితిలో లేవు. ఈ కుట్రలో భాగంగా విశ్వవిద్యాలయాలను విద్యా విషయంగా నిర్వాహణ రిత్యా, ప్రవేశాల పరంగా అన్ని విధాల నిర్వీర్యం చేస్తున్నారు. విద్యార్థుల్లో స్వతంత్ర ఆలోచనా సరళి, స్వేచ్ఛా భావదారను మొగ్గలోనే చిదిమేస్తున్నారు. సమాజంలో సంఘర్షణను ఎదుర్కొనే, సామాజిక వర్గాలకు అక్కడ తావులేని స్థితి కల్పిస్తున్నారు. మేలిమైన విద్యకు వారిని క్రమంగా దూరం చేస్తున్నారు. రిజర్వేషన్లు తగ్గించి, ఫీజులు పెంచి సంఘర్షణతో ఆధిపత్యం సాధించి అల్పాదాయ, మధ్యతరగతిని విద్యకు దూరం చేసే కుట్రలు చేస్తున్నారు.

పాలకులకు ప్రశ్నించే తత్వం అంటే భయం, విద్యాలయాలంటే భయం, చదువు లక్షల మెదళ్లను కదలిస్తుందనే భయం. ఆ భయాన్ని పోగొట్టుకొనుటకు వెంట రాడ్లు తెచ్చుకొని పాలకులు ముసుగులేసు కుంటున్నారు. ముసుగుల వెనుక ముఖాలు దాచుకున్న ముష్కర మూకలకు జెఎన్‌యు ఔన్నత్యమేమి తెలుసు. ముసుగులు కిరాయివి. వారిని తీసుకొచ్చిన విద్యార్థి విభాగాలు భావపరమైన రాజకీయ దాస్యంలో మగ్గుతున్నాయి. ఆ విద్యార్థి సంఘాలను రాజకీయ పక్షాలు వెనుకేసుకొస్తున్న ధోరణి పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రశ్నించే తత్వం విస్తరించి, చైతన్యం వెల్లివిరిసే విద్యార్థి లోకాన్ని రాజకీయ కుట్రలు మళ్లీ తమ గుప్పిట్లో లాక్కుంటున్నాయి. కాని జెఎన్‌యు డిఎన్ఎ చాలా చైతన్యవంతమైంది. అక్రమాలకు, అవినీతి ఆలోచనలకు సింహస్వప్నమే. 1983లో ఆనాటి ఉపకులపతి ఆచార్య వి.ఎన్. శ్రీవాస్తవ్ విద్యార్థుల మౌలిక వసతుల పట్ల నిర్లక్ష్యం చేసినందుకు తిరగబడి జైలుకు వెళ్లిన ఈ సంవత్సర అర్థశాస్త్ర నోబెల్ విజేత ప్రొ. అభిజిత్ బెనర్జీ లాంటి ఎందరినో ఈ ప్రపంచానికి అందించింది. జనవరి 5 రాత్రి ముసుగు గుండాల దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఐషేఘోష్ ప్రతిస్పందన ఒక గొప్ప సంస్కారం, జెఎన్‌యు ఇచ్చిన నిలువెత్తు ధైర్యం 'మేం ఇలాంటి దాడులకు భయపడం. సత్యాన్ని మాట్లాడకుండా ఉండం. ఒక్కో ఇనుప రాడ్డుకు మా డిబేట్‌తో పదునైన, దీటైన జవాబిస్తామనడం జెఎన్‌యు చైతన్యానికే సొంతం. ఇదే జెఎన్‌యు వారసత్వం.

జెఎన్‌యు విద్యార్థులు విలాసవంతమైన జీవితాన్నేమి గడపరు. కాని ఆ విశ్వవిద్యాలయం వారికి సుసంపన్నమైన గౌరవప్రదమైన జీవితాన్ని ఇస్తుంది. ఈ జీవనం వారికి విమర్శనాత్మక దృక్పథం, సృజనాత్మకత, విభిన్న ప్రాపంచిక దృక్పథాలు అలవర్చుకోవడానికి తోడ్పడుతుంది. ఇందులో వామపక్ష భావజాలం ఒక అంశం మాత్రమే. ఈ విశ్వవిద్యాలయం శిక్షణ ఇవ్వడమే కాదు, వారిని జ్ఞానవంతులుగా రూపుదిద్దుకునేలా చేస్తుంది. మానవతా విలువలు, నైతిక విలువల్లాంటి సకల విషయాలను యథేచ్ఛగా నేర్చుకునే అవకాశముంది. ఇదే విశ్వ విద్యాలయానికి ఉండాల్సిన మౌలిక లక్షణం. ఈ లక్షణాన్ని కొనసాగించాల్సిందే.

ఖండాంతరాలకు పాకిన నిరసనలు – సంఘీభావ ర్యాలీలు

జెఎన్‌యు విద్యార్థులు, అధ్యాపకులపై జరిగిన దాడి అత్యంత పాశవికమైన హింసాకాండగా అంతర్జాతీయ విద్యా సంస్థలకు చెందిన 377 మంది అగ్రశ్రేణి విద్యావేత్తలు ఖండించారు. విదేశీ విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘాలు సైతం ఈ ఘటనపై మండిపడ్డాయి. జెఎన్‌యు పూర్వ విద్యార్థులు నేపాల్, బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్, అమెరికాలోని కొలంబియా, చికాగో యూనివర్సిటీల్లో దాడిని ఖండించి మౌన ప్రదర్శనలు చేశారు. భారతదేశంలోని ఐఐటిలు, ఎన్ఐటిలు, ఐఐఎంలు, టిఐఎస్ఎస్‌తో పాటు అన్ని విశ్వవిద్యాలయాల్లో దాడిని ముక్తకంఠంతో ఖండించి బాధిత విద్యార్థులకు మద్దతుగా నిరసన ర్యాలీలు తీశారు. ఈ ఘటన మనదేశాన్ని నియంత్రిస్తున్న నియంతృత్వవాద ఫాసిస్టులకు అభ్యుదయ వామపక్ష లౌకిక విద్యార్థుల, విద్యార్థి సంఘాల పట్ల ఉన్న భయాన్ని ఈ దాడి ప్రతిబింబిస్తుందన్నారు.

దాడిపై ప్రముఖుల ఖండన

జెఎన్‌యుతో పాటు పలు విశ్వవిద్యాలయాల్లో ఇటీవల ఫాసిస్టు దాడులను ప్రపంచ ప్రఖ్యాత అర్థశాస్త్ర నోబెల్ బహుమతి గ్రహీతలు జెఎన్‌యు పూర్వ విద్యార్థులు అమర్త్యాసేన్, అభిజిత్ బెనర్జీలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ దాడిని విజ్ఞానంపై అజ్ఞానం దాడిగా పరిగణించాలన్నారు. రాజకీయ ప్రముఖులు రాహుల్ గాంధీ, సీతారం ఏచూరి, రాజా, మమతా బెనర్జీ, సినీరంగ ప్రముఖులు అనురాగ్ కశ్యాప్, కమల్‌హాసన్, సోనాక్షీసిన్హా, దీపికా పదుకొనే, తాప్సి, జోయో అక్తర్, ప్రకాశ్‌రాజ్ వంటివారు ఈ దాడిని అత్యంత ఆటవికం, గుండె కోతకు గురిచేసిందని పేర్కొన్నారు. విచిత్రంగా ఈ ఘటనను ఖండించిన సినీ పరిశ్రమకు సంబంధించిన వారి సినిమాలు బ్యాన్ చేయాలని, రాజకీయ పార్టీ పెద్దలను దేశ ద్రోహులని ఎబివిపి చిత్రీకరించడమంటే ఈ ఘటనకు బాధ్యులెవరనేది ఈ సమాజం మొత్తానికి ఎలాంటి విచారణ జరపకుండానే తేలింది. ఇది ప్రమాదకర పోకడ, భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడం, పాలక పార్టీకి భజన చేయకపోవడం దేశ ద్రోహమౌతుందా? బ్రిటిష్ తెల్లజాతి పాలకులు వారిని వ్యతిరేకించిన భారతీయులను దేశ ద్రోహులుగా చిత్రీకరించారు. అలాంటి వారిని సాగనంపిన చైతన్య అనుభవమున్న జాతి మనది. మన సంస్కృతి వారసత్వాన్ని నిలబెట్టుటకు జెఎన్‌యు ముందుండాలని, ఈ దేశం విశాల భావాలతో వెలుగొందాలని అభిప్రాయపడ్డారు.

ముగింపు : జామియా మిలియా, ఆలీగడ్, విశ్వభారతి, జవహార్‌లాల్ యూనివర్సిటీల్లో జరిగిన ఘటనలు, దాడులు కేవలం విద్యార్థి సంఘాల

యోగి పాలనలో నాజీ దుర్మార్గాలు

ఉత్తర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాలనలో సాగుతున్న నాజీ దుర్మార్గాలపై **ప్రజా న్యాయస్థానం** న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పు

ఉత్తర ప్రదేశ్‌లో పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజాందోళనలపై యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండ గురించి విచారించడానికి కొన్ని పౌరసమాజ సంస్థలు జనవరి 16న ఒక ప్రజా న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశాయి. భారతీయ జనతా పార్టీ పాలనలో ఉన్న ఈ రాష్ట్రంలో పోలీసుల దుర్మార్గం గురించి ఎన్నో వార్తలు వెలువడ్డాయి. 2019 డిసెంబర్ 9 రాత్రి పార్లమెంటులో పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదం పొందిన తర్వాత దేశవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసన ప్రదర్శనల్లో భాగంగానే ఉత్తర ప్రదేశ్ లో కూడ ఆందోళనలు చెలరేగాయి.

అఖిల భారత ప్రజాస్వామిక మహిళా సంఘం, అన్‌హద్, కాన్‌స్టిట్యూషనల్ కాండక్ట్ గ్రూప్, ఢిల్లీ సైన్స్ ఫోరం, హ్యూమన్ రైట్స్ లా నెట్ వర్క్, కార్వాన్-ఎ-మొహబ్బత్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూవ్ మెంట్స్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ విమెన్, నాట్ ఇన్ మై నేమ్, సతర్క్ నాగరిక్ సంఘటన్ అనే సంస్థలు ప్రజా న్యాయ స్థానం ప్రతిపాదనకు నాయకత్వం వహించాయి.

ప్రజా న్యాయస్థానంలో జస్టిస్ ఎపి షా, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రొ. ఇర్ఫాన్ హబీబ్, జస్టిస్ వి గోపాల గౌడ, డా. శాంతా సిన్హా, డా. ఎన్ సి సక్సేనా, దేవ్ ముఖర్జీ, చమన్‌లాల్, డా. అరవింద్ కాలా న్యాయమూర్తులుగా వ్యవహరించారు.

జనవరి 17న న్యాయమూర్తులు విడుదల చేసిన తీర్పు :

ఉపోద్ఘాతం

దేశవ్యాప్తంగా పౌరసత్వ సవరణ చట్టానికీ, జాతీయ పౌర పట్టికకూ, జాతీయ జనాభా పట్టికకూ వ్యతిరేకంగా శాంతియుత ప్రదర్శనలు జరుగుతున్న నేపథ్యంలో, ఈ అసమ్మతి గళాలను అణచివేయడానికి ఉపయోగిస్తున్న కఠినాతికఠినమైన రాజ్య చర్యలతో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం అగ్రభాగాన నిలుస్తున్నది. పోలీసుల చర్యలలో కనిపించిన పాశవికత్వం గురించీ తీవ్రత గురించీ ఎంతో ఆందోళనకరమైన సమాచారం వచ్చిన తర్వాత ఆ వార్తల వాస్తవాలను విచారించడం కోసం ఈ ప్రజా న్యాయస్థానం ఏర్పాటయింది.

ఈ న్యాయస్థానం ముందు సమర్పించిన వాంగ్మూలాలు విని ప్రజా న్యాయస్థానపు న్యాయమూర్తుల బృందం తీవ్రమైన విచారానికీ ఆందోళనకూ లోనయింది. మొత్తం రాష్ట్ర అధికార యంత్రాంగం, అత్యున్నతాధికారుల నుంచి కింది దాకా ఒకానొక ప్రత్యేక సమూహానికి, రాష్ట్రంలోని ముస్లిం ప్రజానీకానికి వ్యతిరేకంగానూ, ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న సామాజిక కార్యకర్తలకు వ్యతిరేకంగానూ లోతైన ద్వేషంతో ప్రవర్తించారనీ, హింసాకాండను సాగించారనీ న్యాయమూర్తుల బృందం విశ్వసిస్తున్నది.

క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తల, మానవ హక్కుల పరిరక్షకుల, పౌరసమాజ కార్యకర్తల, వైద్యుల, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను న్యాయమూర్తుల బృందం నమోదు చేసింది. బాధితుల వీడియోలను కూడ పరిశీలించింది.

ప్రజాన్యాయస్థానపు ప్రధాన పరిశీలనలు ఇలా ఉన్నాయి:

పోలీసు హింస

ఉత్తర ప్రదేశ్ పోలీసులు ముస్లిం సమూహాన్ని, శాంతియుత నిరసనకారులను నేరుగా ఎక్కుపెట్టి భయానకమైన హింస ప్రయోగించారని, చివరికి నిరసనలలో భాగం కానివారిని కూడ వదలలేదని న్యాయమూర్తుల బృందం గుర్తించింది, నిర్ధారించింది. పోలీసు పాశవికత్వంలో నిరసనకారుల మీద ప్రయోగించిన హింసతో పాటు

- అమాయక ప్రజలను అరెస్టు చేసి తప్పుడు కేసులు బనాయించడం,
- ప్రజల ఇళ్లలోకి ప్రవేశించి అక్కడ ఉన్న వాహనాలను, ఆస్తులను, సిసిటివి కెమెరాలను ధ్వంసం చేయడం,
- నిర్బంధించిన వ్యక్తులను బెదిరించడం, దుర్భాషలాడడం, అక్కడ జరిగినది అధికారులకు గాని, ప్రచారసాధనాలకు గాని చెప్పగూడదని బెదిరించడం,
- బాధితుల మతాన్ని కించపరిచేలా తిట్టడం,

మధ్య జరిగిన ఘర్షణగా భావించలేం. దేశ వ్యాప్తంగా ప్రారంభమైన భావాల సంఘర్షణగానే దీన్ని భావించవచ్చు. ఇప్పటికే దేశంలో భారతీయ జనతా పార్టీ ఒకవైపు, మిగతా పార్టీలు ఒకవైపుగా నిట్టనిలువుగా చీలి సంఘర్షించుకునే పరిస్థితి తలెత్తింది. ప్రతి ఒక్కరు తమకు తెలియకుండానే ఒక వర్గం వైపు నెట్టబడే పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ ఈ స్థితిలో ఈ ఘటనపై ఒక ఆశారేఖ వికసించింది. ప్రపంచ వ్యాప్తంగా ఈ దాడులపై విద్యార్థులు, మేధావులు నిరసనోద్యమాలు చేసినారు. విద్యా విలువలను పరిరక్షించాలనీ ఉద్యమిస్తున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనోద్యమాలతో సంఘ్‌పరివార్ శక్తులకు ముకుతాడు వేయాలని పలువురు మేధావులు సంఘీభావం ప్రకటించినారు. ఫాసిస్టు దాడుల వెనుక ఉన్న పాలకవర్గాల అదృశ్య ఎజెండాను బట్టబయలు చేసే కార్యాచరణ కొరకు మేధావులతో కలిసి ఈ తరుణంలో ప్రగతిశీల విద్యార్థి సంఘాలు విప్లవాత్మక మార్పుల కోసం పోరాటాలు సంఘటితం చేయాలి.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

- తమ కస్టడీలో ఉన్నవారిపై, చిన్నపిల్లలపై కూడ చిత్రహింసలు అమలు చేయడం,
- చట్టాన్ని ఎంతమాత్రం పాటించకుండా జనం మీద కాల్పులు జరపడం, చంపడం,
- గాయపడినవారికి వైద్య చికిత్స జరపకుండా వైద్య సిబ్బందిని అడ్డుకోవడం, చికిత్స కోసం వైద్యుల దగ్గరికి వెళ్లవద్దని బాధితులను నిర్బంధించడం.

తమ పట్ల పోలీసుల పాశవికత్వం గురించి, హింస గురించి, ఆస్తి విధ్వంసం గురించి బాధితులు చేసిన ఫిర్యాదులను నమోదు చేసుకోలేదు, లేదా తప్పుగా నమోదు చేసుకున్నారు. మరొక పక్క వేధింపులనూ బెదిరింపులనూ సుదీర్ఘకాలం కొనసాగించే ఉద్దేశంతో పోలీసులే నిరసనకారులు హింసకు పాల్పడ్డారనే ఆరోపణతో పేరు లేని వ్యక్తులపై వేలాది ఎఫ్ ఐ ఆర్ లు నమోదు చేశారు.

రాజకీయ నిర్ణేతలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల పాత్ర

పోలీసులు పెద్ద ఎత్తున సాగించిన అత్యాచారాలను అదుపు చేయడంలో రాజకీయ, పాలనా పరమైన నాయకత్వం విఫలమైందని న్యాయమూర్తుల బృందం గుర్తించింది. ఎన్నో సందర్భాలలో ముఖ్యమంత్రి వంటి సీనియర్ నాయకులు కూడ ప్రతీకారం వంటి మాటలు వాడి నిరసనకారుల మీద పెద్ద ఎత్తున బలప్రయోగం చేయమని పోలీసులను ఆదేశించారని న్యాయమూర్తుల బృందం గుర్తించింది.

ఎన్నో జిల్లాలలో సెక్షన్ 144 సి ఆర్ పి సి విధించడం, ఇంటర్నెట్ సేవలను రద్దు చేయడం వంటి నిరంకుశ, విపరీత చర్యల ద్వారా రాష్ట్ర పాలనా యంత్రాంగం ప్రజల హక్కులను కొల్లగొట్టిందనీ, పోలీసుల హింసకు మార్గం సుగమం చేసిందనీ న్యాయమూర్తుల బృందం నిర్ధారించింది.

వైద్యాధికారుల పాత్ర

తీవ్రంగా గాయపడిన బాధితులకు కూడ అత్యవసర వైద్య సహాయం అందించడానికి ఆస్పత్రి అధికారులు, వైద్యాధికారులు నిరాకరించారని చాల మంది సాక్షులు చెప్పారు. ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగిందని, పోలీసుల, రాష్ట్ర అధికారుల ఒత్తిడి మేరకే జరిగిందని చెప్పారు. ఇది రాజ్యాంగంలోని అధికరణం 21 కి, అనేక సుప్రీం కోర్టు తీర్పులకు, భారత ప్రభుత్వం భాగస్వామిగా, సంతకందారుగా ఉన్న అనేక అంతర్జాతీయ ఒడంబడికలకు, చివరికి వైద్య అధికారులు తీసుకునే ప్రమాణానికి కూడ వ్యతిరేకం. చివరికి యుద్ధ సమయాలలో కూడ ఇటువంటి వైద్య సహాయపు నిరాకరణ జరగదు.

మిగిలిపోయిన బాధితులపై ప్రభావం

ఈ హింసాకాండకు బాధితులైన కుటుంబాలో ఇప్పటికీ నెలకొని ఉన్న భయాందోళనల పరిస్థితిని న్యాయమూర్తుల బృందం గుర్తించింది. పోలీసులు సాగించిన హింస, దౌర్జన్యం, ఇళ్ల విధ్వంసం ఘటనలు మొత్తం సమూహంలోనే తీవ్రమైన భయాన్నీ, ఆందోళననూ, ఆవేదననూ మిగిల్చాయి. స్వయంగా రాజ్యమే ఆ ఘటనలకు బాధ్యురాలైనప్పుడు ఇక బాధితులలో ఎక్కడో ఒకచోట రక్షణ దొరుకుతుందనే ఆశ కూడ మిగలదని గుర్తు పెట్టుకోవడం ముఖ్యం. బాధితులు ఇటువంటి తీవ్రమైన మానసికాందోళనలో, దుఃఖంలో, నిరాశా నిస్పృహలలో ఉన్న కష్టకాలంలో వారికి అవసరమైన వైద్య పరమైన, చట్టపరమైన సహాయం కూడ అందడం లేదు. అటువంటి సహాయం అందకపోతే ఈ ప్రజా సమూహంలో విధ్వంసానంతర మానసిక వేదనా వైకల్యం అనే మానసిక స్థితి పెద్ద ఎత్తున ప్రబలే అవకాశం ఉంది.

ఈ సంక్షోభానికి గురైన వారందరికీ తక్షణమే మానసిక వైద్యచికిత్స అందవలసిన అవసరం ఉందని న్యాయమూర్తుల బృందం అభిప్రాయ పడుతున్నది.

మానవ హక్కుల పరిరక్షకుల మీద దాడులు

అన్యాయాన్ని ఎదిరిస్తూ నిలబడిన ఎంతో మంది కార్యకర్తల పైన, జర్నలిస్టులపైన, మానవహక్కుల పరిరక్షకులపైన 'అర్బన్ నక్సల్స్' అనీ, దేశద్రోహులనీ ముద్రలు వేసి వేధిస్తున్నారని, బెదిరిస్తున్నారని, శిక్షకు గురిచేస్తున్నారని న్యాయమూర్తుల బృందం గుర్తించింది. మానవహక్కుల కార్యకర్తలనూ, పరిరక్షకులనూ ఇలా నిరంకుశంగా అరెస్టు చేయడాన్ని న్యాయమూర్తుల బృందం ఖండిస్తున్నది.

చిన్నారి పిల్లల, కౌమార దశలోని పిల్లల సమస్యలు

ఉత్తర ప్రదేశ్ పోలీసులు, రాష్ట్ర అధికార యంత్రాంగం 2015 జువెనైల్ జస్టిస్ ఆక్ట్ లో నిర్దేశించిన సూత్రాలన్నిటినీ ఉల్లంఘిస్తున్నారని న్యాయమూర్తుల బృందం అభిప్రాయపడుతున్నది. చిన్నారి పిల్లలను రక్షించడం కోసం వచ్చే అవకాశం ఉన్న ప్రతి ఒక్క ప్రభుత్వ సంస్థా, యంత్రాంగమూ తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యాయి. దీన్ని బట్టి అర్థమయ్యేదేమంటే ఎంతో సదుద్దేశంతో తయారైన మేలైన చట్టాలు కూడ అధికార యంత్రాంగం దాన్ని సక్రమంగా అమలు చేయాలని అనుకోకపోతే ప్రయోజనం సాధించజాలవు.

ప్రజల దగ్గరి నుంచి నష్టపరిహారం వసూలు చేయడం

ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లినప్పుడు, ఆ నష్టానికి కారకులని తాము ఆరోపిస్తున్నవారి నుంచి ఆ నష్టానికి పరిహారాన్ని వసూలు చేయడానికి పోలీసులు నిరంకుశంగా నోటీసులు జారీ చేస్తున్నారని న్యాయమూర్తుల బృందం గుర్తించింది. ఈ నోటీసులలో ఎటువంటి వివరాలు ఉండడం లేదు. నిజానికి ఒకరు ఒక ప్రత్యేక నేరంలో పాల్గొన్నారని, అందుకు బాధ్యులని ఒక న్యాయస్థానంలో మాత్రమే రుజువు చేయవలసి ఉంటుంది. అటువంటి రుజువు లేకుండా ఎవరి మీద పడితే వారిమీద నష్ట పరిహారం నోటీసులు ఇవ్వడానికి వీలులేదు. పోలీసులు ప్రయోగిస్తున్న ఈ నోటీసులు కేవలం బెదిరించడానికి ఉద్దేశించిన, చట్టవ్యతిరేక ఎత్తుగడలు మాత్రమే. నిజానికి అమాయక ప్రజల సొంత ఆస్తుల విధ్వంసంలో చాల సందర్భాలలో పోలీసుల పాత్ర ఉందని చూపడానికి చెప్పుకోదగిన ఆధారాలున్నాయి.

ముగింపు

ఉత్తర ప్రదేశ్‌లో కొనసాగుతున్న స్థితిగతులు చట్టబద్ధపాలనా యంత్రాంగం కుప్పకూలిపోయిందని సూచిస్తున్నాయి. నిజానికి చట్టబద్ధపాలనను పరిరక్షించడానికి బాధ్యత వహించవలసిన రాజ్యా పాలనా యంత్రాంగమే స్వయంగా తన సొంత ప్రజల మీద హింసాకాండను సాగిస్తున్నది.

https://www.sabrangindia.in/article/intense-harshness-state-action-crush-voices-dissent-peoples-tribunal వీ

కార్మిక వ్యతిరేక చట్టాల క్రోడీకరణ

కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే కేంద్రం కార్మిక చట్టాలను సవరించడానికి ప్రయత్నిస్తోందనీ, కార్మిక వర్గం ప్రతిఘటించకపోతే ప్రైవేట్‌పరమై కనీస హక్కులు కూడా ఉండవనీ అంటున్నారు ఎం. శ్రీనివాస్

2020 జనవరి 8న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతంగా ముగిసింది. దేశ కార్మిక వర్గంలో సుమారు 25 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులు ఈ సమ్మెలో భాగస్వాములయ్యారనేది ఒక అంచనా. సమ్మెకు ప్రాతిపదికగా ఉన్న డిమాండ్లలో అత్యంత కీలకమైన ప్రాథమిక డిమాండ్ కార్మిక చట్టాల సవరణ. కార్మికులకు సహజరంగానూ, రాజ్యాంగ పరంగానూ సంక్రమించిన ప్రాథమిక హక్కులను రద్దు పరిచే ప్రక్రియను బేషరతుగా ఉపసంహరించుకోవాలన్నదే. కార్మికుల మౌలిక హక్కులను కాలరాసే విధానం కలిగిన నరేంద్ర మోడీ ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించాలని ఈ సమ్మె నొక్కి చెప్పింది. సాధారణంగా ఉత్పన్నమయ్యే ప్రశ్న కార్మిక చట్టాల సవరణకు మోడీ ప్రభుత్వం ఎందుకు పూనుకున్నదన్నదే. కార్మికవర్గ ప్రయోజనాలు, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారి హక్కుల పరిరక్షణకు మరింత ధృఢత్వాన్ని చేకూర్చడానికో కాదు, స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల పరిరక్షణయే లక్ష్యంగా సాగుతున్న ప్రక్రియ ఇది. ఈ ప్రక్రియ మోడీ ప్రభుత్వ హయాంలోనే మొదలు కాలేదు. కాకపోతే, ప్రస్తుతం మరింత నిర్మాణాత్మకంగా వేగవంతమయ్యింది. కార్మిక చట్టాల సవరణలో పాలకుల ప్రధాన ఉద్దేశం కార్మికుల్లో పెద్ద సెక్షన్‌కు ఎలాంటి చట్టబద్ధమైన రక్షణలు లేకుండా చేయడమే కాకుండా అంతిమంగా వారి హక్కులను పూర్తిగా నిరాకరించడం కోసమే. కేంద్ర ప్రభుత్వం గణాంకాల ప్రకారం దేశంలోని మొత్తం శ్రామిక శక్తిలో 93 శాతం కార్మికులు అసంఘటిత రంగానికి చెందినవారే. వీరికి ఎలాంటి కార్మిక చట్టాలు వర్తించవు. ఇక మిగిలిన శ్రామిక శక్తిలో 7 శాతం కార్మికులకు మాత్రమే కార్మిక చట్టాలు వర్తిస్తాయి. ఈ కొద్దిపాటి కార్మికులలో 90 శాతానికి పైగా కార్మిక చట్టాలు వర్తించకుండా చేయడమే ఈ సంస్కరణల ముఖ్య ఉద్దేశం. కార్మిక చట్టాల్లో సవరణలు కార్మిక వర్గం తన మౌలిక హక్కులను కోల్పోవడానికి ఉపయోగపడతాయి. కార్మికులను ఇష్టానుసారంగా తొలగించడానికి, ఉపాధి, ఉద్యోగ భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడుతుంది. యజమానులకు అవసరమైన నిరంకుశ అధికారాలు చట్టబద్ధంగా పొందడానికి అవకాశం ఏర్పడుతుంది. ప్రభుత్వ పరిశ్రమలు క్రమంగా పూర్తిస్థాయిలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు మార్గం ఏర్పడుతుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు విచ్చలవిడిగా దేశంలోకి వచ్చి పడతాయి.

మన దేశంలో 90వ దశకంలో అమలులోకి వచ్చిన నయా ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో దేశీయ పారిశ్రామిక రంగంలో ఒక మౌలిక మార్పు వచ్చింది. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు చట్టబద్ధత చేకూర్చడమే ఆ మార్పు. నిజానికి 1956లో ఏర్పడిన తొలి పారిశ్రామిక విధానం మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పునాదుల మీద నిర్మాణమైంది. భారత ప్రజల ఆకాంక్షలకు, జాతీయోద్యమ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రైవేటీకరణకు పునాదులిక్కడే పడ్డాయి. నూతన ఆర్థిక విధానాల అమలులో మందగమనం కొనసాగుతున్నదని ప్రపంచ ఆర్థిక సంస్థలు, శక్తులు ప్రపంచ బ్యాంకు ద్వారా భారతదేశంతో సహా ఆయా దేశాల మీద ప్రధానంగా వర్ధమాన దేశాల మీద ఒత్తిడిని పెంచాయి. ఫలితంగా 1995లో ప్రపంచ బ్యాంకు ఒక నివేదికను (ప్రపంచ బ్యాంకు నివేదిక – 1995)ను విడుదల చేసింది. అంతకు ముందే మన దేశం 1991లో ఐఎంఎఫ్ వద్ద 1.8 బిలియన్ డాలర్ల అప్పు తీసుకున్నది. నాడు ఐఎంఎఫ్ విధించిన షరతుల్లో ఒకటి "భారతదేశంలో వ్యాపారం చేయడానికి, పెట్టుబడి పెట్టేందుకు, భారత ఉత్పత్తుల్లో పోటీ పడేందుకు విదేశీ సంస్థలకు అనుమతి ఇవ్వాలి. వాటికి ఏ విధమైన ఆటంకాలు కల్పించరాదు. భారత పాలకవర్గం అందుకు అనుగుణంగా చట్టాలను సవరించాలి. ఆ సంస్థలు దేశ వ్యాపార రంగంలో ప్రవేశించేందుకు, వెనక్కి వెళ్లేందుకు, లాభాలు తరలించేందుకు ఏ విధమైన ఆటంకాలు కలిగించకుండా భారతదేశ చట్టాలను సవరించాల"న్నదే ఆ షరతు. వాస్తవానికి కార్మిక చట్టాలలో మార్పులు, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు 80వ దశకానికి ముందే భారత దళారీ పాలకవర్గం దృష్టి సారించినప్పటికీ ఆ తర్వాత కాలంలో అంటే తొలిసారి 80వ దశకంలో ఐఎంఎఫ్ విధించిన షరతులతో ప్రైవేటీకరణకు నిర్మాణాత్మకమైన పునాది పడింది. దీనికంటే ముందే దేశీయ బడా బూర్జువా వత్తిడితో కార్మిక చట్టాల సవరణకు 1977–78 మధ్య కాలంలో జనతా ప్రభుత్వం ప్రయత్నించింది. 1987లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం, 2002లో వాజ్‌పేయి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు కార్మికవర్గం ప్రతిఘటనలతో వెనకడుగు వేశాయి.

ఈ క్రమంలో 2014లో తొలి దశలో స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ ఆర్థిక శక్తుల సహకారంతో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన నరేంద్ర మోడీ ప్రభుత్వం వారి ఆర్థిక ప్రయోజనాలు, వ్యాపార, వాణిజ్య వర్తక అవసరాల కోసం పారిశ్రామిక రంగంలో మౌలిక సంస్కరణలను తీవ్రతరం చేయడానికి రంగాన్ని సిద్ధం చేసుకున్నది. కార్మిక చట్టాల "ఆటవిక పాలన" ఉన్నదని, అది సులభతరంగా వ్యాపారం చేయడానికి అవరోధం కలిగిస్తుందని, తద్వారా పెట్టుబడులు రావడానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని ప్రధాని మోడీ పదే పదే చెబుతూ రావడం దీనిలో భాగమే. అందుకు అనుగుణంగానే 2015లో "పారిశ్రామిక సంబంధాలు – కార్మిక నియమావళి" బిల్లును తెచ్చింది. ఈ బిల్లును ఆమోదించుకునే

ప్రక్రియలో భాగంగా ఆనాడు మోడీ ప్రధానమంత్రి హోదాలో రాష్ట్ర ప్రభుత్వాలకు రాసిన లేఖలో "మన దేశంలో కార్మిక చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయి. వాటిని సవరించకుండా దేశంలోకి విదేశీ పెట్టుబడులు, పరిశ్రమలు రావడం సాధ్యం కాదని, కనుక కార్మిక చట్టాల్లో సవరణలు అనివార్యమని స్పష్టం చేసాడు". 2019 మలివిడత మహాబలంతో అధికారం చేపట్టిన మోడీ ప్రభుత్వం సంస్కరణల అమలుకు నిర్మాణాత్మక చర్యలకు పూనుకున్నాడు. తమ వ్యూహాత్మక లక్ష్యాల సాకారం కోసం ప్రభుత్వ రంగం మీద వ్యూహాత్మక దాడిని ముమ్మరం చేశాడు. కార్మిక వర్గం తమ పోరాటాలు, బలిదానాలతో కూడిన, జాతీయోద్యమ ఆకాంక్షల స్ఫూర్తితో రాజ్యాంగం నిర్దేశిత హక్కులు, దాని ఆధారంగా వచ్చిన చట్టాలను క్రమంగా బలహీనపరచడం ద్వారా కార్పోరేట్ ఆర్థిక సంస్థలకు సేవలు చేయడానికి గత పాలకుల కంటే మరింత దూకుడుగా మోడీ వ్యవహరిస్తున్నాడు. ఈ ప్రక్రియలో భాగంగా కార్మిక చట్టాలలో మౌలిక మార్పులకు పూనుకున్నది మోడీ ప్రభుత్వం.

కేంద్ర ప్రభుత్వం చాలా మొండిగా, ఏకపక్షంగా కార్మిక వర్గ ప్రయోజనాలు, సంక్షేమం, వారి మౌలిక హక్కులను హరించే విధంగా కార్మిక చట్టాలను సవరిస్తోంది. 1947 తర్వాత వచ్చిన 44 రకాల కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా కుదించింది. అవి : కోడ్ ఆన్ వేజ్, కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ, కోడ్ ఆన్ హెల్త్ & సేఫ్టీ, కోడ్ ఆన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్‌గా మార్చారు. వేతనాల చెల్లింపు చట్టం, కనీస వేతనాల చట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమాన వేతనాల చట్టాలను కలిపి వేతనాల కోడ్‌గా మార్చింది. ట్రేడ్ యూనియన్ యాక్టు – 1926, పారిశ్రామిక వివాదాల చట్టం – 1947, ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ (స్టాండింగ్ ఆర్డర్స్ – 1946లను కలిపి ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ బిల్లుగా మార్చారు. ఫ్యాక్టరీస్ చట్టం – 1948, మైన్స్ చట్టం – 1952, డాక్ వర్కర్స్ చట్టం – 1986, బిల్డింగ్ & అదర్ వర్కర్స్ చట్టం – 1996, ప్లాంటేషన్ చట్టం – 1951, కాంట్రాక్టు లేబర్ చట్టం – 1970, ఇంటర్ స్టేట్ మైగ్రేట్ వర్కర్స్ చట్టం – 1979, వర్కింగ్ జర్నలిస్ట్, న్యూస్ పేపర్ ఎంప్లాయీస్ చట్టం – 1955, వర్కింగ్ జర్నలిస్టు (ఫిక్సేషన్ రేట్స్ ఆఫ్ వేజెస్) చట్టం – 1958లను కలిపి అక్యూపేషనల్ సేఫ్టీ హెల్త్ & వర్కింగ్ కండీషన్స్ కోడ్‌గా మార్చారు. ఎంప్లాయీస్ కాంపెన్‌సేషన్ చట్టం – 1923, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ చట్టం – 1948, ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ & మిస్‌లీనియస్ ప్రావిజన్ చట్టం – 1952, మెటర్నటీ బెన్‌ఫిట్ చట్టం – 1961, పేమెంట్ ఆఫ్ గ్రాట్యుటీ చట్టం – 1972, సినీవర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ చట్టం – 1981, బిల్డింగ్ & అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సెస్ చట్టం – 1996, అసంఘటిత రంగం సోషల్ సెక్యూరిటీ చట్టం – 2008లను కలిపి కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీగా మార్చారు.

"కోడ్ ఆన్ వేజెస్ బిల్లు" ఇప్పటికే ఇది ఆమోదిత చట్టం. ఈ వేతనాల కోడ్ చట్టంలో 8 గంటల పనిదినాన్ని 9 గంటల పని దినంగా సవరించారు. దానిపై కూడా స్పష్టమైన నిర్వచనం లేదు. కార్మికుల నైపుణ్యవర్గానికి (స్కిల్ లేబర్) అప్‌గ్రేడ్ చేయడానికి పరిధిపై నిబంధనలలో స్పష్టత లేదు. వేతన స్థిరీకరణ (నిర్ణాయక) కమిటీలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. దేశంలో అమలవుతున్న కనీస వేతనాలు ఆకలి వేతనాలుగా కొనసాగుతున్నాయి. ఆకలి వేతనాలను మరింతగా స్థిరీకరించే విధంగా వేతనాల కోడ్ చట్టం దోహదం చేస్తుంది. కనీస వేతనాలను నిర్ణయించడానికి ఈ చట్టంలో పొందుపరిచిన ఆరు అంశాలను పరిశీలిస్తే ఇదే విషయం స్పష్టమవుతుంది. కార్మికుడు జీవించడానికి అవసరమైన వేతనాలను పొందడం కార్మికుల హక్కుగా సుప్రీంకోర్టు 1991లో రాప్టకాస్త కేసు సందర్భంగా ఇచ్చిన తీర్పులో పేర్కొన్నది. కుటుంబ అవసరాల రీత్యా కనీస వేతనాలు నిర్ణయించబడాలని, అందులో పోషక ఆహారం, ఆరోగ్య రక్షణ, విద్య, ఇల్లు, ముసలితనంలో తోడ్పాటుకు అనుగుణంగా ఈ వేతనాలు ఉండాలని సుప్రీంకోర్టు వెల్లడించింది. కానీ, 1948 కనీస వేతన చట్టం ప్రకారం చట్టబద్ధ వేతన నిర్ణయం హాస్యాస్పదంగా మారింది. ఇటుక బట్టీలు, ఆయిల్ మిల్స్, భవన నిర్మాణ రంగం, వ్యవసాయ రంగంలో ఉన్న కార్మికులకు వాస్తవిక వేతనాలు మరింతగా పడిపోయాయని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) భారత వేతనాల నివేదిక 2018లో పేర్కొన్నది. ఈ పరిస్థితుల్లో నూతనంగా వచ్చిన వేతనాల చట్టంనీ పరిస్థితిని మరింత దిగజార్చుతుంది. ట్రేడ్ యూనియన్ యాక్ట్ – 1926, ఇండస్ట్రీయల్ డిస్‌పూట్ యాక్ట్ – 1947, ఇండస్ట్రీయల్ ఎంప్లాయిమెంట్ (స్టాండింగ్ ఆర్డర్స్) యాక్ట్ – 1946ను కలిపి ఒకే చట్టంగా కుదిస్తున్నారు. ఇది పార్లమెంటులో ఆమోదానికి సిద్ధంగా ఉన్నది. ఆక్యూపేషనల్ సేఫ్టీ హెల్ప్, సర్వీసు కండీషన్ల కోడ్, సాంఘిక భద్రత కోడ్‌లు కూడా ఆమోదానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ కోడ్‌లు ట్రేడ్ యూనియన్ ఉద్యమ అస్థిత్వానికి తీవ్ర ముప్పుగా ఉండబోతున్నాయి. రాజ్యాంగం, దాని ఆధారంగా వచ్చిన చట్టాల మౌలిక స్ఫూర్తికే ఇది విరుద్ధం, కార్మిక చట్టాల సవరణల వల్ల కార్మికులు మౌలిక హక్కులను కోల్పోతారు. అంటే సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు, యాజమాన్యాలతో బేరసారాలాడే హక్కులను కార్మికులు ప్రధానంగా కోల్పోతారు. ఉపాధి, ఉద్యోగ భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడుతుంది. పని గంటల (పని దినం) మార్పుకు చట్టబద్ధత రావడానికి మార్గం ఏర్పడుతుంది. మధ్యయుగాల నాటి పరిస్థితి పునరావృతం అవుతుంది. కార్మికులు వెట్టిచాకిరి చేసే కట్టుబానిసల స్థితికి నెట్టబడతారు.

పారిశ్రామిక సంబంధాల బిల్లుపై తయారు చేసిన కోడ్‌లో కార్మికులు సంఘటితమయ్యే హక్కుతో సహా ఉమ్మడి బేరసారాలు జరిపే ప్రాథమిక హక్కుకు సంబంధించి ఈ కోడ్ నుండి మినహాయించారు. ఈ చట్టం కార్మిక సంఘం ఏర్పాటులో మరింత క్లిష్టతరం చేసింది. కార్మికులకు ఇష్టమైన వ్యక్తిని నాయకునిగా ఎన్నుకునే ప్రజాతంత్ర హక్కును తగ్గించింది. కార్మికులు సమ్మె చేయడాన్ని పూర్తిగా అసాధ్యం చేసింది. అన్ని రకాల సమ్మెలను చట్ట విరుద్ధంగా పేర్కొన్నది. ఒకవేళ చట్ట విరుద్ధంగా సమ్మెలు చేస్తే పెద్ద ఎత్తున పెనాల్టీలు విధించడం, కార్మికులను జైలుకు పంపడం వంటి అంశాలను చట్టంలో చేర్చారు. అంతేకాదు, వారి యూనియన్లను శిక్షించడం జరుగుతుందని బిల్లులో పేర్కొన్నారు. ఈ బిల్లు ద్వారా పర్మినెంటు ఉపాధి, ఉద్యోగ భద్రత గత కాలపు అంశాలుగా మిగిలిపోనున్నాయి. అసంఘటిత, సంఘటిత రంగాలకు చెందిన పర్మినెంటు కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులు, మహిళా, పురుష కార్మికులందరి వృద్ధాప్యం, ఆరోగ్యం, కవర్ చేస్తూ సార్వత్రిక, సామాజిక భద్రత

కల్పించాల్సిన ఆవశ్యకతను విస్మరించడమేకాక, అందుకు భిన్నంగా కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ బిల్లులో కార్మికుల సంక్షేమానికి సోషల్ సెక్యూరిటీకి సంబంధించి ఈ పథకాలకు వచ్చే నిధులన్నీ ప్రధాని ఆధ్వర్యంలో గల నేషనల్ కౌన్సిల్ వద్ద ఉంటాయని బిల్లు పేర్కొంటుంది. కాగా, గ్రాట్యూటీ, పెన్షన్, మెటర్నిటీ ప్రయోజనాలతో సహా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేసే బాధ్యత రాష్ట్ర సంక్షేమ బోర్డులకు వుండగా, నిధులు మాత్రం నేషనల్ కౌన్సిల్ నిర్వహణలో ఉంటాయి. "మెరుగైన మదుపు" అనే సాకుతో కార్మికులు పొదుపు చేసుకున్న డబ్బులు కేంద్ర ప్రభుత్వం షేర్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతోంది. అంటే భవిష్యత్ కార్మికుల సంక్షేమ ప్రయోజనాలు షేర్‌మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడి ఉంటుంది. అసంఘటిత రంగానికి సంబంధించి నిర్దిష్టంగా ఎలాంటి యజమాని లేని, అత్యధికంగా ఉన్న కార్మికులు తమ ఆదాయం నుండి 25 శాతం చెల్లించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం తన కాంట్రిబ్యూషన్‌కు సంబంధించి, ఏ విధమైన ప్రత్యేకమైన నిబద్ధత కనబర్చకపోగా, కార్మికుల వాటాను ప్రభుత్వం చెల్లిస్తుందని మాత్రమే ఈ కోడ్ బిల్లులో ఉన్నది.

ట్రేడ్ యూనియన్ల అభిప్రాయాలను బలంగా అణచివేసే లక్ష్యం కార్మిక చట్టాల సవరణలో ఇమిడి ఉన్నది. వేతనాల కోడ్ బిల్లు తుది రూపం తీసుకునే ముందే ప్రయోజనాలు ఇమిడి ఉన్న కార్మిక వర్గాలతో విస్తృతంగా చర్చించకపోవడంగానీ, వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకపోవడం దీనిలో భాగమే. పారిశ్రామిక సంబంధాలపై "శాసన సంహిత – 2019 బిల్లు" ఇది కార్మిక చట్టాల సవరణలలోకెల్లా అత్యంత వివాదాస్పదమైనది. మానవ శక్తికి సంబంధించి కార్మికులను రిట్రెంచ్ (తొలగించేందుకు), లే ఆఫ్‌కు (తాత్కాలిక తొలగింపు) అధికారుల నుండి అనుమతి లేకుండానే సంస్థను గానీ, కంపెనీని కానీ మూసివేసే వెసులుబాటు అధికారం యాజమాన్యాలకు కల్పించారు. తత్ఫలితంగా లేఆఫ్‌కు, రిట్రెంచ్‌మెంట్‌కు గురైన కార్మికులకు పరిహారం పెంచాలనే ప్రతిపాదనకు అవకాశం లేకుండా పోయింది. కాంట్రాక్ట్ కార్మికులను నేరుగా నియమించుకోవడంలో పరిశ్రమకు, సంబంధిత యాజమాన్యాలకు మరింతగా దోహదం చేసేందుకు కార్మిక చట్టాలలో "నిర్ణీత కాలవ్యవధి ఉపాధి" (ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్) భావనను ప్రవేశపెట్టడానికి మార్గం ఏర్పరుస్తున్నది. పారిశ్రామిక వివాదాల చట్టం – 2015లో ప్రభుత్వ ప్రతిపాదిత 300 మంది కార్మికులు ఉన్న ఫ్యాక్టరీలను, సంస్థలను మూసివేసేందుకు ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి అవసరం లేదు. ప్రస్తుతం దీనిని కూడా కాదని 100 మంది కార్మికులున్న ఫ్యాక్టరీలకు, సంస్థలకు కుదించారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమల్లో శాశ్వత, కాంట్రాక్టు కార్మికులు 30 శాతం, 70 శాతానికి చేరుకున్నారు.

దేశంలో అమలులోకి వచ్చిన ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగాలు, నీమ్ (నేషనల్ ఎంప్లాయిబులిటీ ఎన్‌హౌమెంట్ స్కీం) వంటి ఉపాధి అనేక భారీ పరిశ్రమలకు ప్రవేశించింది. 2014లో మోడీ ప్రభుత్వం చేసిన అప్రెంటీస్ చట్ట సవరణలతో అనేక ఆటోమొబైల్ పరిశ్రమలతోపాటు భారీ పరిశ్రమల్లో కూడా కాంట్రాక్టు కార్మికులను తొలగించి, అతి తక్కువ స్టైఫండ్ ఇచ్చి అప్రెంటీస్‌లతో పనిచేయించుకుంటారు. దేశ ఆర్థిక వ్యవస్థలో రవాణా రంగం పాత్ర చాలా ముఖ్యమైనది. రోడ్డు భద్రత పేరుతో రవాణా రంగాన్ని కార్పొరేటు శక్తులకు కట్టబెట్టాలన్న ప్రయత్నాలలో భాగమే "రోడ్డు ట్రాన్సుపోర్టు సేఫ్టీ బిల్ – 2014" వివిధ రాష్ట్రాల ప్రతికూల వైఖరి, కార్మికవర్గ ప్రతిఘటనతో ఈ బిల్లు వెనక్కి వెళ్లింది. అయినా కార్పొరేటు శక్తుల వత్తిడితో మోడీ ప్రభుత్వం దొడ్డి దారిన మోటారు వెహికిల్ యాక్టు సవరణ బిల్లు – 2016.ను ముందుకు తెచ్చింది. ఈ బిల్లు ఆమోదం పొందితే లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు, రెన్యువల్స్, ఫైన్‌లు, శిక్షలు ఎన్నో రెట్లు పెరుగుతాయి. ప్రైవేటు ఆపరేటర్ల, బ్రోకర్ల ఏజెన్సీలదే ఆధిపత్యం వుంటుంది. తస్మాత్ జాగ్రత్త!

(రచయిత ఇఫ్టూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

పదిహేడు సంవత్సరాలు పూర్తి చేసుకొని
పద్దెనిమిదవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన వీక్షణంకు
అభినందనలు

కా. దశరథ్ గారి జ్ఞాపకార్థం

రచయితలకు సూచన : *తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. మరొక పత్రికకు పంపిన, మరొక పత్రిక పరిశీలనలో ఉన్న, మరొక పత్రిక ప్రచురణకు ఆమోదించిన రచనను వీక్షణంకు పంపగూడదు. – సం.*

ఎల్గార్ పరిషత్ కేసు వెనుక ఆర్ఎస్ఎస్

భీమా కోరేగాం కేసులో పోలీసులూ, ఆర్ఎస్ఎస్ నాయకులూ కలిసికట్టుగా పనిచేసిన ఉదంతాన్ని వివరిస్తున్నారు

ప్రతీక్ గోయల్

ఒక 2018 డిసెంబర్ చలి ఉదయం, డి.ఇ.ఎస్. నవల్మల్ ఫిరోడియా లా కాలేజ్, పుణె, ఆవరణలో ఒక విచిత్రమైన సమావేశం జరిగింది. ఒక ఊహించని సమావేశం కోసం స్టాఫ్‌ను కాలేజీ స్టాఫ్ రూంలోకి అతి జాగ్రత్తగా తీసుకుపోయారు. గది నిండా అదనంగా కుర్చీలు వేశారు. అన్నీ నిండిపోయాయి. తలుపులు మూశారు. గదిలోపల కళాశాల పాలకవర్గ సీనియర్ సభ్యులతో పాటు అతి నిగూఢమైన మొహాలతో పోలీసు అధికారులు నిలబడి ఉన్నారు.

సమావేశాన్ని పాలకవర్గం ఒక దేశభక్తి గీతంతో ప్రారంభించింది. అది ఎట్లాగో జాతీయత మీద ప్రసంగంతో, మన మాతృ భూమికి మన రుణాన్ని ఎట్లా తిరిగి చెల్లించాలో చేసే ఉద్బోధగా మారింది. వెంటనే పోలీసు అధికారి మైక్ తీసుకొని అర్బన్ నక్సలిజం మీద ప్రసంగం ప్రారంభించాడు. కోరేగాం భీమా ఎల్గార్ పరిషత్ కేసులో ముద్దాయిలైన వ్యక్తుల గురించి మాట్లాడాడు.

మెల్లమెల్లగా, సమావేశ సందర్భం, ప్రయోజనం ఏమిటో బయట పెట్టారు. ఈ అత్యవసర సమావేశానికి, డక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు (లా కాలేజీ నడిపిస్తున్న పాలకవర్గ సభ్యులు), పోలీసులు ఉపాధ్యాయులను పిలిపించిన పని ఏమిటంటే, వాళ్లు కోరేగామ్– భీమా ఎల్గార్ పరిషత్ డాక్యుమెంట్ (దస్తావేజు) లను మరాఠీ నుంచి ఇంగ్లిష్‌లోకి అనువదించాలి. ఈ సమావేశంతో సహా, ఈ నియోగింపబడిన పనికి సంబంధించిన విషయాలన్నీ అత్యంత గోప్యంగా ఉంచాలి.

ఒక భాష నుంచి మరొక భాషలోకి కోర్టు డాక్యుమెంట్లను (సంబంధిత పత్రాలను) అనువదించడానికి ప్రొఫెసర్ల సహాయం తీసుకోవడం కొత్తకాదు. సెల్వి జయలలిత వర్సెస్ స్టేట్ కేసులో కూడా ఒక ప్రొఫెసర్ల బృందాన్ని కోర్టు పత్రాలను తమిళం నుంచి ఇంగ్లిష్‌లోకి అనువదించాలని అడిగారు. ఈ (ఎల్గార్ పరిషత్) కేసులో సమస్య ఏమిటంటే, ఈ పనిచుట్టూ రహస్యం ఆవరించింది. రెచ్చగొట్టే దేశభక్తి ఉద్బోధనలో, ముద్దాయిలను అమానుషంగా చిత్రించడం ఈ కేసును ఒక ప్రత్యేకమైన కేసుగా మార్చాయి.

సమావేశం తర్వాత కళాశాలకు రెండు రోజుల కోసం సెలవులిచ్చారు. విద్యార్థుల కోసం గ్రంథాలయాన్ని కూడా మూసివేశారు. ఈ కాలేజీ టీచర్లు కొంతమంది ఫెర్గూసన్ కాలేజీ టీచర్లు, బృహన్ మహారాష్ట్ర వాణిజ్య కళాశాల అధ్యాపకులు కొందరు, కొందరు న్యాయశాస్త్ర విద్యార్థులు స్టాఫ్ రూంలో సమావేశమై ఈ కోర్టు కేసు పత్రాలను అనువాదం చేయడంలో నిమగ్నమయ్యారు. ఈ సమయమంతా ఈ 'ఆపరేషన్' మొత్తాన్ని రహస్యంగా ఉంచాలన్న విషయం పలుమార్లు నొక్కి వక్కాణించబడింది. ఇప్పటికి ఎనిమిది (ఇది రాసినప్పటికి) నెలలు గడిచిపోయినవి. ఈ చర్య చుట్టూ రహస్యం అట్లాగే అలుముకొని ఉన్నది. పోలీసులను ఈ 'రహస్య కర్తవ్యం మిషన్' గురించి అడిగితే, వాళ్లు స్పందించడానికి నిరాకరించారు. వీళ్లు ఇంకా ఒక అడుగు ముందుకు వెళ్లి ఈ విషయంలో లోతుగా తెలుసుకోవడానికి ప్రయత్నించవద్దని కూడా ఈ రిపోర్టర్‌ను హెచ్చరించారు.

ఈ కథనం ప్రారంభమైంది 3 డిసెంబర్, 2018. కోరేగామ్ భీమా ఎల్గార్ పరిషత్ కేసులో ముద్దాయిలైన క్రియాశీలక కార్యకర్తలు, న్యాయవాదుల పైన దాఖలు చేసిన చార్జిషీటును 5 రోజుల్లో అంటే డిసెంబర్ 8 వరకు అనువాదం చేసి తన ముందు ఉంచాలని సుప్రీంకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ముద్దాయిలపై పుణె పోలీసులు పుణె స్పెషల్ కోర్టులో దాఖలు పరిచిన ఆరోపణలను ప్రధాన న్యాయమూర్తి బెంచి చూడదలచుకుంది. ఐదు రోజుల వ్యవధిలో ఇంత బరువైన చార్జిషీటును మరాఠీ నుంచి ఇంగ్లిష్‌లోకి ఎట్లా అనువదించబోతున్నారు?

కనుక, పత్రాలను సమర్పించవలసిన మూడు రోజుల ముందు పుణె పోలీసులు డక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ సహాయాన్ని అర్థిస్తూ వెళ్లారు. డి.ఇ.ఎస్. ప్రఖ్యాత ఫెర్గూసన్ కళాశాలను కూడా నిర్వహిస్తున్నది. ఈ కళాశాల సంస్థాపకులు వి.కె. చిప్లొంకర్ లోకమాన్యతిలక్, గోపాల్ గణేష్ అగార్కర్ల వారసత్వం గురించి కూడా ఈ సొసైటీ గొప్పగా గర్వంగా చెప్పుకొంటోంది. ఈ సొసైటీ ఆర్ఎస్ఎస్, బిజెపిలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. చాలా మంది సభ్యులు ఆర్ఎస్ఎస్‌తో సన్నిహిత సంబంధాలలో ఉన్నారు. కొందరికి విశ్వహిందూ పరిషత్ నిర్వహణలో ఉన్నత పదవులు కూడా ఉన్నాయి. వీరిలో జి.ఇ.ఎస్ చైర్మన్ శరత్‌కుంటే కూడా ఉన్నారు.

తెలిసిన సమాచారం ఏమిటంటే, డిసెంబర్ 5, 2018 ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో డి.ఇ.ఎస్. నవల్మల్ ఫిరోడియా లా కాలేజీ (డి.ఇ.ఎస్. లా కాలేజీగా పిలువబడుతుంది) ప్రిన్సిపల్ రోహిణి హోనప్ స్టాఫ్ రూంకు వచ్చి స్టాఫ్ (అధ్యాపక బృందాని)కి వాళ్లతో శరత్‌కుంటే 15 నిమిషాల్లో అత్యవసర సమావేశం నిర్వహించ బోతున్నాడని ప్రకటించాడు.

అప్పటిదాకా డి.ఇ.ఎస్. లా కాలేజీ అధ్యాపకులు మాత్రమే స్టాఫ్ రూంలో ఉన్నారు. మరో పది నిమిషాల్లో ఫెర్గూసన్ కాలేజీ (జూనియర్/ సీనియర్) అధ్యాపకుల కోసం, బృహన్ మహారాష్ట్ర కామర్స్ కాలేజీ అధ్యాపకుల కోసం, ప్రతిభాశీలురైన 20,25 మంది లా కాలేజీ విద్యార్థుల కోసం అదనంగా కుర్చీలు తెప్పించి స్టాఫ్ రూంలో వేశారు. ఉదయం 10 గంటల కల్లా కుంటే, కోరేగామ్ – భీమా ఎల్గార్ పరిషత్ ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్ కూడా అయిన, అసిస్టెంట్ పోలీసు కమిషనర్ శివాజీ పవార్, మరికొందరు పోలీసు ఆఫీసర్లతో పాటు స్టాఫ్ రూంకి వచ్చాడు. (ప్రత్యక్షంగా పాల్గొన్న వ్యక్తి సమాచారం ప్రకారం సమావేశం డి.ఇ.ఎస్. చైర్మన్ కుంటే నాయకత్వంలో హిందీలో ఒక దేశభక్తి గీతం చేపట్టి అధ్యాపకులంతా బృందగానం చేశారు. దీని తర్వాత కోరేగామ్ – భీమా ఎల్గార్ పరిషత్ కేసు గురించి, అందులో నక్సలైట్లు పాల్గొన్న ఆరోపణల గురించి, కోరేగామ్ – భీమా హింసలో వాళ్ల పాత్రల గురించి వివరించి

వారు సమాజంలో సంఘర్షణలు ఎట్లా సృష్టించదలచుకున్నారో చెప్పినట్లు తెలిసింది. ఈ సోర్స్ (ఆధారాల)ను బట్టి, కుంటే ఇట్లా మాట్లాడాడు: "ఇవ్వాళ మన జాతి కొరకు, మన మాతృ భూమి కొరకు పనిచేసే అవకాశం వచ్చింది. మనం కోరేగామ్ భీమా కేసు చార్జిషీటు కాగితాలను ఇంగ్లిష్‌లోకి అనువదించాలి. దీనిని పోలీసులు సుప్రీంకోర్టుకు సమర్పించాల్సి ఉన్నది. కాని మీరు దీనిని చాలా గోప్యంగా ఉంచాలి. దయచేసి మీరు ఇది మీ కుటుంబ సభ్యులకు గాని, మిత్రులకు గాని, బంధువులకు గాని చెప్పవద్దు. మీరిది ఎవరికీ చెప్పకూడదు. రేపటి నుంచి రెండు రోజులు మీకు వేరే ఏ పని ఉండదు. పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదు. చార్జిషీటు అనువాదం చేయడమే మీ పని. ఈ పనిని చేయడం ఆదేశంగా భావించండి".

తన ప్రసంగాన్ని ముగించే ముందు కుంటే ఎసిపి పవార్‌ను స్టాఫ్‌కు పరిచయం చేశాడు. పవార్ నక్సలైట్ ఉద్యమం దేశమంతా విస్తరిస్తున్నదని, అందువల్ల పుణె కూడా ఎంతమాత్రం భద్రమైన ప్రాంతం కాదని అన్నాడు. ఆయన కోరేగామ్ ఎల్గార్ పరిషత్ కేసులో అరెస్టు చేసిన క్రియాశీల కార్యకర్తలు, లాయర్ల పేర్లు పేర్కొన్నాడు. వాళ్లంతా అర్బన్ నక్సలైట్లని అన్నాడు. వీళ్లు నక్సలైట్ల వలె అనిపించరు. వీళ్లను నక్సలైట్లు అని ఎవరూ ఎప్పుడూ అనుమానించరు. కాని మేము ఈ కేసులో సమాచారం సేకరించాం. దానిని బట్టి వీళ్లు నిజంగా నక్సలైట్లేనని ధృవపడింది. వీళ్ల చర్యల కోసం వీళ్లకు శిక్ష పడేలా చేయడం, ఇప్పుడింక మీ బాధ్యత. వీళ్లను బలపరిచే న్యాయవాదులు చాలా పెద్దవాళ్లు చాలా మంది ఉన్నారు. వాళ్లు మాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. వాదిస్తున్నారు. మీరు ఈ చార్జిషీటును రెండు రోజుల్లో అనువాదం చేయలేకపోతే, మేము వాళ్లకు శిక్షలు పడేలా చేయలేం. మీకు సహాయం అందించడానికి ఇక్కడ మావాళ్లు కూడా ఉంటారు. ఆఖర్న మీకు ప్రశంసా పత్రాలు కూడా ఇస్తాం అన్నాడు పవార్.

సమావేశంలో ఉండి సమాచారం ఇచ్చిన వాళ్లు, స్టాఫ్ మెంబర్స్‌ను కళాశాలలో వచ్చే రెండు రోజులు క్లాసులు ఉండవని విద్యార్థులకు చెప్పమన్నట్లు కూడా జ్ఞాపకం చేసుకొని చెప్పారు. ఇది విద్యార్థులకు వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా, ఫోన్ల ద్వారా తెలియజేయబడింది. సమావేశం ముగియగానే, స్టాఫ్, 20–25 మంది విద్యార్థులు అంటే వందమంది – జంటలు జంటలుగా పనిచేయాలని సూచించబడింది. ప్రతి జంటకు వరుస క్రమం (సీరియల్ ఆర్డర్)లో చార్జిషీట్ పత్రాలు 20–30 పేజీలు ఇవ్వబడతాయి. సమావేశం అయిపోయిన తర్వాత వి.ఎం.సి.సి, ఫెర్గూసన్ కాలేజీ స్టాఫ్ తమకిచ్చిన చార్జిషీట్ పేజీల కాపీలతో పాటు తమతమ కాలేజీలకు వెళ్లిపోయారు.

డి.ఇ.ఎస్. లా కాలేజీ అధ్యాపకులను కాలేజీ లైబ్రరీలో, కంప్యూటర్ రూంలో, స్టాఫ్ రూంలో కూర్చొని అనువాద పని పూర్తి చేయమన్నారు. ఈ అనువాద ప్రక్రియలో పాల్గొన్న 20–25 మంది విద్యార్థులకు తప్ప మిగతా ఏ విద్యార్థికి ఈ పని పూర్తి అయ్యేదాకా ఈ మూడు స్థలాలు అందుబాటులో లేకుండా పోయాయి. ఈ పనిలో పాల్గొన్న అందరిని మరునాడు (డిసెంబర్ 5, 2018) మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ పని పూర్తి చేయమన్నారు. పుణె పోలీసు శాఖకు చెందిన ఇద్దరు పోలీసులు, ఐదారుగురు న్యాయవాదులు ఈ పనిలో సహాయం చేయడానికి కాలేజీలోనే ఉండిపోయారు.

తెలిసిన సమాచారం ప్రకారం వీళ్లంతా డిసెంబర్ 5 సాయంత్రం ఆరు గంటల వరకు ఉండి సగం అనువాదం పని పూర్తి చేయగలిగారు. మిగతా సగం డిసెంబర్ 6న సాయంత్రం నాలుగు గంటలకు పూర్తి చేశారు. ఇది పూర్తికాగానే మళ్లీ స్టాఫ్ రూంలో కుంటే సమావేశం ఏర్పాటు చేశాడు. అందులో ఎసిపి పవార్ పాల్గొన్నాడు.

ఇదంతా బయటికి ఇట్లా ఎట్లా వచ్చిందంటే మొత్తం మీద, డి.ఇ.ఎస్. లా కాలేజీ, బిఎంసిసి, ఫెర్గూసన్ కాలేజీ అధ్యాపక సభ్యులు ఈ వ్యవహారం పట్ల అంత సంతృప్తికరంగా లేరని, అందులో పాల్గొన్నవారు చెప్పారు.

'ఎసిపి పవార్ ఇతర పోలీసు అధికారులతో కలిసి డిసెంబర్ 6న అనువాదమైన చార్జిషీటు పత్రాలను సేకరించడానికి వచ్చాడు. ఆయన అందరికీ ధన్యవాదాలు తెలిపి వెంటనే ఢిల్లీ విమానం అందుకొని వెళ్లి సుప్రీంకోర్టులో చార్జిషీట్ దాఖలు పరచవలసి ఉన్నదని చెప్పాడు. కుంటే కూడా అందరికీ కృతజ్ఞతలు తెలిపి మాట్లాడాడు'. మీరందరు గొప్ప అంకిత భావంతో పనిచేశారు. మీరు ఒక మహత్తర కార్యం నిర్వహించారు. మీ వంటి వాళ్లు జాతికి తమ సేవలు అందించినంత కాలం దేశానికి ఎవరూ హాని చేయలేరు.'

'న్యూస్ ల్యాండ్రీ' (వెబ్ మ్యాగజైన్) శివాజీ పవార్‌ను 'డి.ఇ.ఎస్. నిర్వహించే కాలేజీల అధ్యాపకులకు ఈ అనువాదం ఇచ్చారా' అని అడిగినప్పుడు ఆయన జవాబు దాటవేత ధోరణిలో ఉన్నది. "అది మీకు చెప్పాల్సిన అవసరం ఉందనుకోను. మాకు చాలా స్వల్ప వ్యవధి ఉండింది గనుక మేము చాలా మంది ప్రొఫెషనల్స్ (అనువాదమే వృత్తిగా జీవించేవారు), మరి కొందరు లా, ఇంగ్లిష్ విద్యార్థుల సహాయం తీసుకున్నాం" అన్నాడు. అయితే మరి స్టాఫ్‌ను అదంతా గోప్యంగా ఉంచమని ఎందుకు చెప్పారు? మీరు స్టాఫ్‌కు అర్బన్ నక్సలిజం గురించి, అందులో ఈ కేసులో ముద్దాయిల పాత్ర గురించి స్టాఫ్‌ను ప్రభావితం చేసే ఉద్దేశంతో ప్రసంగించారని అడిగితే 'మీరు ఈ విషయంలోకి ఇంత లోతుగా ఎందుకు అనవసరంగా పోతున్నారు? మేము చార్జిషీటు సమర్పించాం. అందులో ఏముందో మీరు చూడవచ్చు. దాని గురించి నేనేమీ చర్చించాలని అనుకోవడం లేదు' అన్నాడు.

పవార్ ప్రశ్నలను దాటవేస్తున్నప్పటికీ, 'న్యూస్ ల్యాండ్రీ', వాళ్ల పనికోసం స్టాఫ్‌కు, 20–25 మంది విద్యార్థులకు ఇచ్చిన ప్రశంసా పత్రాన్ని సంపాదించగలిగింది. దాని మీద పవార్ – కుంటేల సంతకాలు ఈ అనుబంధాన్ని స్పష్టంగా ధృవపరుస్తున్నాయి.

కుంటేను ఈ విషయాన్ని ఎవరికీ వెల్లడించవద్దని ఎందుకన్నారు అని 'న్యూస్ ల్యాండ్రీ' ప్రశ్నించినప్పుడు 'నేనీ విషయం గురించి ఏమీ చెప్పాలనుకోవడం లేదు. అది ఎందుకు రహస్యంగా ఉంచబడిందో వివరించాల్సిన అవసరం లేదు. అవును పోలీసులు మా సహాయం కోరి మా దగ్గరికి వచ్చారు. ఒక పరిపాలనా సంస్థకు సహాయం చేయడం మా విధి' అని అన్నాడు.

అరెస్టయిన వ్యక్తులను నక్సలైట్లతో సంబంధమున్న వారుగా చిత్రించినప్పుడు స్టాఫ్‌కు అటువంటి ఉపన్యాసాలు ఇవ్వవచ్చునా అని ప్రశ్నించినప్పుడు కుంటే అరెస్టయిన వ్యక్తులు నక్సలైట్లే గనుక అని అన్నాడు. "నేను ఈ విషయంలో నిపుణుణ్ని కాను. ఇది వాస్తవమా కాదా తెలుసుకోవలసిన బాధ్యత కూడా మాకు లేదు. వాళ్లు (పోలీసులు) మా కాలేజీ దగ్గరకి వచ్చారు. మేము వాళ్లకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నాం" అని అన్నాడు. ఈ అనువాద ప్రక్రియలో వేరే కళాశాలలు కూడా పాల్గొన్నాయా అని అడిగినప్పుడు "లేదు, మా (డి.ఇ.ఎస్.) కాలేజీలు మాత్రమే పోలీసులకు అనువాద పనిలో సహాయం చేశాయి" అన్నాడు.

(ఆగస్టు 31, 2019 ఎచ్‌టిటిపిఎస్:// న్యూస్‌లాండ్రీ.కామ్)

(రచయిత న్యూస్ ల్యాండ్రీ విలేఖరి) వీ

ఇనుప ముళ్ల తీగెల మానసిక సరిహద్దు

అధికరణం 370 రద్దు నేపథ్యంలో కశ్మీర్ సమస్యపై కశ్మీరీ పండిట్‌గా ప్రొ. సువీర్ కౌల్ అభిప్రాయాలను వివరిస్తున్నారు

పార్థ బి. చటర్జీ

కశ్మీర్‌లో ఇపుడు నెలకొన్న సంక్షోభం గురించి, భారత ప్రజాస్వామ్యం లో కేంద్ర ప్రభుత్వ అధికారం మరింతగా కేంద్రీకృతం కావడం వల్ల వచ్చే సమస్యల గురించి ప్రొఫెసర్ సువీర్ కౌల్ స్పందించారు.

ప్రొఫెసర్ సువీర్ కౌల్ పెన్సిల్వేనియా యూనివర్సిటీలో ఎ.ఎం. రోసెంథాల్ ఇంగ్లిష్ ప్రొఫెసర్. 2015లో వెలువడిన ఆఫ్ గార్డెన్స్ అండ్ గ్రేవ్స్ పుస్తక రచయిత. కశ్మీరీ పండిట్‌గా, ఒక మేధావిగా శ్రీనగర్ గురించి తను, పత్రికా రచయిత, ఫొటోగ్రాఫర్ అయిన జావేదార్ తీసిన ఫొటోలతో పాటు కవిత్వం, తన అనుభవాలను కలిపి అల్లిన పుస్తకం అది. ఆయన 'మింట్' పత్రిక కోసం పార్థ బి. చటర్జీతో చేసిన సంభాషణ లోతుగా ఎన్నో వివరాలను మన అవగాహన ముందుంచుతుంది. ఇక్కడి పరిస్థితులలో ఉన్న సంక్లిష్టతలను సవాల్ చేస్తుంది. తాను కశ్మీరీ కవితల నుంచి చేసిన అనువాదాలతో, దార్ ఫొటోగ్రాఫ్‌లతో ఆధారాలతో పాటు కశ్మీరీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మనముందుంచుతుంది. ఇందులో ఆయన చెప్తున్న ప్రతి అంశాన్ని సోపపత్తికంగా నిరూపిస్తుంది. కశ్మీరీ ప్రజల కష్టాలను కళ్లకు కట్టి మనను నిలదీస్తుంది. ముఖ్యంగా కశ్మీరీ కవితలపై ఆయన చేసిన వ్యాఖ్యానం హృదయ విదారకంగానూ, పదునుగానూ ఉంటుంది.

ఈ ఇంటర్వ్యూలో ఆయన, మళ్లీ ఒకసారి, 'ఆగస్టు 5 తర్వాత ఒక బృహత్ బందీ శిబిరమైన కశ్మీరీ ప్రజలు నిజమైన బాధితులు' అని మనకు గుర్తుచేస్తున్నాడు.

ప్రశ్న: మీ కుటుంబం ఇంకా కశ్మీరులోనే ఉన్న సందర్భంగా ఈ 'ముట్టడి' మీ మీద ఎటువంటి ప్రభావం వేసింది? గతంలోని అశాంతికి దీనికి పోలికలు, తేడాలు ఏమిటి?

ప్రొ. కౌల్ : నా కుటుంబ సభ్యులు శ్రీనగర్‌లో ఉన్నారు. కానీ మా బంధువొకాయన వెళ్లి వాళ్లను ఢిల్లీకి తీసుకవచ్చాడు. వాళ్లతో మాట్లాడడానికి ఏ మార్గమూ లేకపోవడం వల్ల వాళ్లను కశ్మీరు వదిలి రావాల్సిందని ఒత్తిడి పెట్టాల్సి వచ్చింది. ఎందుకంటే అర్ధసైనిక బలగాల ఉనికికి తీవ్ర ప్రతిఘటన ఉన్న ప్రాంతానికి మా కుటుంబం చాల దగ్గరలో ఉంటుంది. మా ల్యాండ్ లైన్ పునరుద్ధరించలేదు. మొబైల్ ఫోన్లు, ఇంటర్‌నెట్ పనిచేయడంలేదని చెప్పనక్కరలేదు కదా. ఎందుకో ఆశ్చర్యంగా నేను ఈసారి వాళ్లకేమీ అభద్రత ఉందని అనుకోలేదు. కాని వాళ్లకు ఆహారం, ఔషధాలు అందుబాటులో లేకపోవడం గురించి ఆందోళన చెందాను.

గతంలో దీర్ఘకాలం పాటు కర్ఫ్యూ ఉండేది. అశాంతి ఉండేది. నిరసనకారులకు, భద్రతా దళాలకు మధ్యన వీధి ఘర్షణలు ఉన్న సందర్భాలెన్నో. అందువల్ల జీవితం కష్టతరమయ్యేది. కాని ఈసారి ఈ ముట్టడి సర్వవ్యాప్తమై మా పరిసరాలను నిర్జీవంచేసింది. మా చిన్నమ్మ ఢిల్లీకి చేరుకున్నాక నాకు ఒక సందేశం పంపింది. '(కశ్మీర్)లోయ ముట్టడితో గుండెబద్దలయి, ఆగ్రహంతోను, అసహాయతతోను గతరాత్రి ఢిల్లీకి చేరుకున్నాను' అని.

అయితే నా భయాలు కశ్మీరు గురించి మాత్రమే కావు. ఒక లోహాన్నో, రాయినో, కొయ్యనో కోయడానికి ఉపయోగించే ఫలకం వలె చట్టాలను ఉపయోగిస్తున్న ఇపుడున్న రాజకీయ, శాసన సంబంధమైన పరిస్థితుల్లో రాజ్యాంగానికున్న అర్ధ సమాఖ్య స్వభావాన్ని మార్చి ఇండియాలో జమ్మూ కశ్మీరు (జెకె)ను 'సమైక్య' పరచడాన్ని నేను అర్థం చేసుకోగలను. ఆ అర్ధ సమాఖ్య రాజ్యాంగం అమలవుతున్న తీరుతోనే ఆ వెసులుబాటుకు అవకాశం వచ్చింది. యూనియన్ (కేంద్రం)తో వివిధ రాష్ట్రాలకు రాష్ట్రాల పరంగా ఉన్న ప్రత్యేక సంబంధాల వలన (ఆర్టికల్ 371) వలన సమకూరిన సంబంధాలే కేంద్రానికి ఈ సంబంధాలను పునర్లిఖించే అధికారాన్ని తనకు తాను ఇచ్చుకునే అధికారం ఉంది. (తనకులేని అధికారం ఉందని చెప్పే అధికారం ఉంది) ఈ కేంద్రీకృత అధికారం భారత ప్రజాస్వామ్యాన్ని తీవ్రమైన చిక్కుల్లో పడేస్తున్నది.

ప్రశ్న: మీరు మీ పుస్తకంలో కశ్మీరీ పండిట్‌గా 'ఇండియన్‌గా, ప్రజాస్వామ్యవాదిగా గర్వపడుతున్నాను' అని పేర్కొన్నారు. ఆర్టికల్ 370 విషయంలో చర్యను సమర్థించుకోవడానికి కశ్మీరీ పండిట్‌లను అడ్డుపెట్టుకున్నారు. ఈ ప్రస్తుత పరిణామాలు కశ్మీరీ పండిట్‌ల ఆకాంక్షల మీద ప్రభావం వేస్తాయని మీరు భావిస్తున్నారా?

జవాబు: చాల మంది – కశ్మీరీ పండిట్‌లు – అందరు కాదు, ఈ రద్దును ఆహ్వానిస్తున్నారు. (వేడుక చేసుకుంటున్నారు). ఆర్టికల్ 370ని జమ్ము కశ్మీర్ ముస్లింలు మైనారిటీలను వేధించడానికి వాడుకున్నారని భావించేవాళ్లు కూడ ఉన్నారు...అటువంటిది ఒకటి జరిగినట్లు నేను ఇప్పటివరకు ఎప్పుడూ చూడలేదు. (ఇది చాల విద్ధూరమైన ఆరోపణ) కేంద్రం చర్య పండిట్లు కశ్మీర్‌కు తిరిగి వెళ్లే అవకాశాలను దుస్తరం, మరింత దుస్తరం చేసింది. వాస్తవం ఏమిటంటే తిరిగి వెళ్లదలుచుకున్న వాళ్లు ఇదివరకే వెళ్లారు. వెళ్లని వాళ్లకు, వెళ్లాలన్న ఉద్దేశం లేదు. గత మూడు దశాబ్దాలలో చాల మంది పండిట్‌లు తమ ఆవాసాలను వేరే చోట్ల ఏర్పరుచుకున్నారు. కశ్మీర్‌లో తమ ఆస్తులను అమ్ముకున్నారు. వాళ్లు కశ్మీర్‌కు, ముఖ్యంగా మతపరమైన స్థలాలను సందర్శించడానికి మాత్రమే వెళ్తున్నారు. అటువంటి సందర్శనాలు చాల స్వల్ప కాలం కొరకే. వాళ్ల పిల్లలెవరూ కశ్మీర్ తమ జన్మ స్థలం అనుకోవడం లేదు. తమదనుకోవడం లేదు. ఒకవేళ అనుకున్నా కేవలం సైనిక శక్తితో అదుపులో పెట్టిన కశ్మీర్‌కు వాళ్లు పోగలరా? పండిట్లు లేకపోవడం కశ్మీరీ జీవన కలనేతను మార్చివేసింది. వాళ్లు లేని లోటును వాళ్లు మాత్రమే అనుభవించడం లేదు. కశ్మీరీ ముస్లింలు కూడ ఎంత కోల్పోయారో, ఎంత ఎన్నటికో తిరిగి పొందలేరో గుర్తిస్తారని నాకు తెలుసు.

370 ఆర్టికల్ కోల్పోవడం ఎన్ని సమస్యలకు దారితీస్తుందో పండిట్లు

కానీ, ప్రభుత్వం కానీ ఎపుడైనా ఆలోచించారా నాకు ఆశ్చర్యం కూడ ఉంది. ఢిల్లీ విశ్వవిద్యాలయం 'కశ్మీరీ కాందిశీకుల' కోసం సీట్లు రిజర్వు చేసింది. ఇపుడు కశ్మీర్, జమ్మూ కేంద్రపాలిత ప్రాంతాలయ్యాయి. కనుక (అవబోతున్నాయి కనుక) పండిట్లను ఇప్పటికీ 'కాందిశీకులు'గా పరిగణిస్తారా? ఇపుడింక ఆర్టికల్ 35 వర్తించదు కనుక (లేదుగనుక), రాష్ట్ర ప్రజలకు ప్రత్యేకమైన ప్రాముఖ్యాలు (ప్రివిలేజెస్) కూడ ఉండవు. కనుక పండిట్లకు తరచుగా లభించే ప్రాముఖ్యతలతో ప్రభుత్వ ఉద్యోగాలు అందుబాటులో ఉండే ప్రాథమ్యాలు ఇకముందు ఉండవు. గతంలో జమ్మూ, లడక్‌లోని హిందు, ముస్లిం, బుద్ధిస్టు, సిఖ్ఖు ప్రజలు ఎంత కోల్పోతారో వాళ్లూ అంత నష్టపోతారు.

ప్రశ్న: ఇండియన్ యూనియన్‌లో చేరడానికి కశ్మీర్‌కు ఆర్టికల్ 370 అటువంటి రిజర్వేషన్లు కొనసాగుతాయా? ఒక 'మానసిక సరిహద్దు'గా ఉన్నదని కేంద్ర హోం మంత్రి అన్నాడు. మీ పుస్తకం ఇన్నాళ్ల ఘర్షణాయుత వాతావరణం వేసిన మానసిక ప్రభావం మీద ఎక్కువ వెలుగు ప్రసరించిందనే వ్యాఖ్య పట్ల మీ స్పందన ఏమిటి?

జవాబు: ఇండియన్ యూనియన్‌లో పాల్గొనడానికి కశ్మీరీలు ఆర్టికల్ 370 వలన కాదు, తమకు స్వీయ నిర్ణయం పట్ల ఉన్న విశ్వాసం వల్ల నిరాకరించారు. ఈ ఆదర్శాన్ని భారత ప్రభుత్వం గుర్తించి హామీ పడింది గనుకనే ఆర్టికల్ 370ని సృజించింది. ఒకవేళ కశ్మీరీ ప్రజలకు, ఇండియన్ యూనియన్‌కు మధ్యన 'మానసిక సరిహద్దు' ఉన్నదనుకుంటే, అది ఆ రెంటి మధ్యన ముళ్ల తీగెల కంచె, పక్కా అడ్డుగోడల నిర్మాణాలు, భారత భద్రతా యంత్రాంగ అమానుష చర్యల వల్ల ఏర్పడింది. ఒక్కరైనా దెబ్బలు తినని, దేహమంతా వడిపెట్టబడని, చంపబడని, అదృశ్యంకాని మనుషులున్న నికార్సయిన కశ్మీరీ కుటుంబం ఒక్కటి కూడా లేదు. ఈ దుశ్చర్యలను ఎంతో విస్తారంగా మానవ హక్కుల సంస్థలు సంకలితం చేశాయి. కశ్మీరీలను అమానుష చర్యలకు గురిచేసి కశ్మీరీలనందరినీ పరాయీకరించిన ఈ దారుణమైన దైనందిన అనుభవాల బీభత్స కథనాలు ఈ నివేదికల నిండా చోటుచేసుకున్నాయి.

ప్రశ్న: ఆర్టికల్ 370 గురించి తీసుకున్న చర్య ప్రాథమిక లక్ష్యం కశ్మీరీ ప్రజల అభివృద్ధికి, పురోగతికి అది అడ్డంకిగా ఉన్నదనే భావన. ఈ చర్య అభివృద్ధిని త్వరిత పరుస్తుందా?

జవాబు: అదెట్లా సాధ్యమో నాకు తెలియదు. జాన్‌డ్రెజ్ తదితరులు చాలా అభివృద్ధి చెందిన రాష్ట్రాల కన్నా, ఉదాహరణకు 'సంపన్న' గుజరాత్ వంటి రాష్ట్రంకన్నా చాలా అభివృద్ధి సూచికలలో ముందుందని రాశారు. ఇందుకు కారణం కూడా జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం ఉండడమేనంటారు జాన్‌డ్రెజ్. 1950లో కశ్మీర్‌లో పెద్ద ఎత్తున భూసంస్కరణలు జరిగాయి. (షేక్ అబ్దుల్లా 'నయాకశ్మీర్' మానిఫెస్టో - ప్రణాళిక చూడండి) ఆర్టికల్ 370 వల్లనే కశ్మీర్ రాజకీయార్థిక ప్రగతి సాధ్యమైందని ప్రభాత్ పట్నాయక్ కూడ జాన్‌డ్రెజ్ వలెనే వాదించాడు. తప్పుడు సమాచారం వల్ల చాలా మంది కేంద్రం నుంచి (ఇతర రాష్ట్రాలతో పోలిస్తే) పోల్చడానికి వీలులేనంత పెద్ద మొత్తంలో రాష్ట్రానికి నిధులు వస్తాయనుకుంటున్నారు. అటువంటి నిధులన్నీ కశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల (పథకాల) కోసమే. ఉదాహరణకు ఎన్‌ఎచ్‌పిసి(నేషనల్ హైడ్రో పవర్ కమిషన్). వ్యూహ రీత్యా (సరిహద్దు రాష్ట్రం కావడం వల్ల - అను) కశ్మీర్ జల విద్యుత్ శక్తి పథకాలు అభివృద్ధి పరచి రాష్ట్ర ఆదాయం పెంచుకోవడానికి వీలు లేదు. అది తన రాష్ట్ర సరిహద్దులలోనే ఉత్పత్తి అయిన విద్యుత్తును కొనుక్కోవాలి.

భారతదేశ శైలి 'అభివృద్ధి' ఈ ప్రాంతానికి చాల వంచనా పూర్వకమైంది. పదుల వేల సంఖ్యలో బీహార్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి వృత్తిపనుల వాళ్లు కశ్మీర్‌కు వచ్చి తమ రాష్ట్రాలకన్నా, ఇండియాలో ఇంకే రాష్ట్రం కన్నా ఎక్కువ ఆదాయం (కూలీరేట్లు) పొంది తిరిగిపోతారు. 370 ఆర్టికల్ వల్ల కశ్మీరీలు మరింత పేదవాళ్లయినట్లయితే, (ఇంత ఎక్కువ కూలీలిచ్చి పని చేయించుకునే) స్థితి ఎట్లా సాధ్యం? అవును. భారతదేశంలోని మిగతా రాష్ట్రాలలోవలె (భారత అభివృద్ధి నమూనా వలన) అంతర్గత నిర్మాణం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పెరుగుతుంది. అయితే ఒకసారి గమనించండి. కశ్మీర్‌లోని అంతర్ రాష్ట్ర నిర్మాణమంతా-రోడ్లు, వంతెనలు, కంటోన్మెంటులు (సైనిక స్థావరాలు)-భద్రతా దళాల ప్రాధమ్యాలకు విధేయమైనవే. ఉత్తమ రోడ్డు మార్గాలు సైన్యం ఆధీనంలో ఉండి, సైనిక చర్యలకు వాడుకునేదే అంటే ఆశ్చర్యపడనక్కర్లేదు.

ప్రశ్న: కశ్మీరీ ప్రజల అనుభవాలను దగ్గరగా అర్థంచేసుకోవడానికి కళలు, కవిత్వానికి ఉన్న ప్రాధాన్యం గురించి మీ పుస్తకం మాట్లాడుతుంది. అవి మనకు ఇంకా ఎక్కువగా ఏం చెప్తాయి?

జవాబు: మనం సాధారణంగా కనిపెట్టలేని అనుభవ, అనుభూతి వంటి ప్రజల భావ ఉద్వేగ ప్రాంతాలలోకి ప్రవేశించి కళాకృతుల వల్ల మన ఊహాలోకాలు విస్తరించి సంఘటితపరచగలుగుతాం. అవి అనుభవాలను క్రోడీకరించడానికి ఒక రూపాన్నిస్తాయి. పాఠకులకు ఎంతో శక్తిమంతమైన లోచూపును ప్రదానం చేస్తాయి. పత్రికా రచనలు, హక్కుల నివేదికలు కూడ ఈ పని కొంతవరకు చేస్తాయి. కాని వాటి రూపం, శైలివేరు. అట్లాగే వాటి లక్ష్యం కూడ కొన్ని ప్రత్యేకమైన అంశాలు, సందర్భాలు. నేను నా పుస్తకంలో జావేద్‌దార్ ఫోటోలు వరుసగా ప్రచురించాను. అవి నా సమాజ కవిత్వానికి దృశ్య రూపకాలు. నా ఆకాంక్ష, ఆశ ఏమిటంటే పాఠకులు చాల స్పష్టంగా 'చూడడానికి' (పాఠకులకు 'చూపు'నివ్వడానికి) నేను సహకరించాలి.

ప్రశ్న: గత ప్రభుత్వాలు అసలు పట్టించుకోని సమస్యలలో కశ్మీర్ ఒకటని కేంద్ర ప్రభుత్వమంటున్నది. 'ఏమీచేయలేదు' అంటున్నది. ఒక సంక్లిష్టమైన సమస్యను పరిష్కరించడానికి ఇది ఉత్తమ మార్గమని వాళ్లు భావిస్తున్నారు. 'చిక్కుముడి' విప్పడం.

జవాబు: అవును. చిక్కుముడి. ఆసియా ఖండాన్ని జయించడానికి అలెగ్జాండర్‌కు తట్టిన విజయానికి 'చిక్కుముడి' (మన దేశం మీద) దండెత్తడంలో ఉందని మీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఈ ప్రభుత్వ హిందుత్వవాది భావనలో నిజంగానే ఆ పోలిక సరిపోతుంది. ఇప్పుడీ చర్య ఒక రాష్ట్రంపై కేంద్రం సాధించిన విజయంగా స్థాపించు కోవచ్చు. గతంలో రెండిటి మధ్యన ఉన్న ఒప్పందాలను (యూనియన్‌కు కశ్మీర్‌కు మధ్యన ఉన్న ఒప్పందాలను) ఆయా ప్రభుత్వాలు గౌరవించాలి. ఆ ప్రభుత్వాలు ఆ క్రమంలో స్వయం ప్రతిపత్తిని ఉద్దేశించిన చాల అంశాలను నిర్వీర్యం చేశాయి అనేది కూడ చేదునిజమే.

ప్రశ్న: మీకున్న విస్తృత అధ్యయనంలో ఈ సమస్య పరిష్కారానికి మీకేమైనా ప్రత్యామ్నాయ మార్గాలు కనిపించాయా?

జవాబు: ఈ ప్రశ్నకు నేను దృఢంగా (కచ్చితంగా) జవాబు చెప్పడానికి నిరాకరిస్తున్నాను. ఈ ప్రశ్న అకడమిక్స్‌కు (విద్యారంగంలో పనిచేస్తున్నవారికి), పరిపాలనా యంత్రాంగంలో ఉన్నవాళ్లకు, రాజకీయ నాయకులకు వేయవలసింది కాదు, జమ్ము కశ్మీరులో నివసిస్తున్న ప్రజలకు వేయవలసింది. అవును. ఎల్లవేళలా ప్రత్యామ్నాయాలు ఉంటాయి. ఏ ప్రజల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉన్నదో ఆ ప్రజలను సంభాషణ ద్వారా, చర్చల ద్వారా ముందు మీరు అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉన్నది.

(రచయిత ఇంగ్లిష్ అధ్యాపకులు) వీ

1857 నుంచి అయోధ్య కథ

అయోధ్య తీర్పు నేపథ్యంలో బాబ్రీ మసీదు గురించీ, అయోధ్య గురించీ తన జ్ఞాపకాలను పంచుకుంటున్నారు

ఆనంద్ పట్వర్ధన్

'రామ్ కె నామ్' (డాక్యుమెంటరీ) నిర్మిస్తున్నపుడు మేము ఎల్.కె. అద్వానీ ఏర్‌కండిషన్ టయోటా ట్రక్ వెంట ప్రయాణం చేశాం. అది రాముని యుద్ధ రథం వలె ఉండేలా బాలీవుడ్ సెట్ డిజైనర్ రూపొందించాడు. ఆ రథయాత్ర గ్రామీణ భారతదేశాన్ని చుట్టివచ్చింది. అయోధ్యలోని బాబ్రీ మసీదు ఉన్న చోటనే రామాలయం నిర్మించాలనే హిందూ భావనను రెచ్చగొడుతూ సాగింది. వాళ్లు ముస్లిం వ్యతిరేక నినాదాలు ఇస్తూ ఉంటే ఆ దారి పొడుగునా చాలా ఘర్షణలు జరిగాయి. చాల మంది చనిపోయారు. చివరకు బీహార్‌లో అద్వానీని అరెస్టు చేశారు. రథ యాత్రను ఆపారు. కాని కరసేవకులు అయోధ్యదాకా ప్రయాణం కొనసాగించారు. తాము దాడిచేయాలనుకున్న స్థలానికి 1990 అక్టోబర్ 30న చేరుకున్నారు.

బాబ్రీ మసీదు ప్రవేశ ద్వారం ముందు ఒక శాసనం ఉంది. మొఘల్ చక్రవర్తి బాబర్ (1528) కమాండర్ మీర్ బాఖీ ఈ నిర్మాణం చేశాడు అని. అప్పటికి పండితులు, పురోహితులు (అప్పటికి సంస్కృతం చదువుగల వాళ్లు వీళ్లే) మాత్రమే వాల్మీకి రామాయణం చదివారు. రాముడు అప్పటికి ప్రజలందరికీ తెలిసిన దేవుడు కాదు. ఆ తర్వాత 16వ శతాబ్దంలో తులసీదాస్ అవధి మాండలికం (హిందీ మాండలికంగా భావించబడుతుంది. ఇప్పటి ఉత్తరప్రదేశ్‌లోని అప్పటి అవధ్ రాజ్య ప్రజల భాష–అను)లో 'రామ చరిత మానస్' రాసాడు. మొట్ట మొదటిసారి సామాన్య ప్రజలకు రామాయణం అందుబాటులోకి వచ్చింది. ఈ కృషి చేసినందుకు, పేద బ్రాహ్మడు తులసీదాస్‌పై ఛాందస బ్రాహ్మణులు దాడిచేశారని, అతడు అనాథ అని, కనుక మసీదులో ఆశ్రయం తీసుకొని మహాకవ్యం 'రామ చరిత మానస్' పూర్తి చేశాడని అక్కడ ఐతిహ్యం ఉంది. చక్రవర్తి అక్బర్ పరిపాలనా కాలానికి తులసీదాస్ 'రామ చరిత మానస్' రామలీలా అని పిలవబడే జానపద ప్రదర్శనల వల్ల చాల ప్రచారమైంది. రామ మందిరాల నిర్మాణం ప్రారంభమైంది.

కరసేవకులు అక్టోబర్ 1990లో అయోధ్యకు చేరుకోకముందే మా ఫిల్ము బృందం ఇద్దరం అయోధ్యకు చేరుకున్నాము. మేమక్కడ ఇరవైకిపైగా రామ మందిరాలు చూసాం. అందరూ ఎవరికి వారే అక్కడే రాముడు పుట్టాడని చెప్పారు. ఎందుకంటే ఇట్లా చెప్పుకుంటే ఎక్కువమంది సందర్శకులు వస్తారు. విరాళాలు వస్తాయి. గుర్తుచేసుకోవాల్సిన ఒక అంశమేమిటంటే తులసీదాస్ ఎక్కువగా (తరచుగా) అయోధ్యలో ఉన్నాడు. తన మహాకావ్యంలో కానీ, తన జీవితకాలంలో ఎప్పుడూకానీ రామజన్మ స్థలంగా భావించబడిన మందిరాన్ని బాబర్ కూల్చివేసాడని రాయలేదు. వాస్తవానికి మూడు వందల సంవత్సరాల తర్వాతకానీ మందిర్–మసీదు వివాదం తలెత్త లేదు! సుప్రీం కోర్టు తీర్పులో హిందూ ముస్లిం ఘర్షణలు మొట్టమొదటి రికార్డు (నమోదైన కాలం) బ్రిటిష్ వలసపాలనలో 1856–57. అప్పుడు వలస పాలకులే ఈ 'వివాద స్థలం'లో ఆరు అడుగుల ఇటుక గోడ నిర్మించి లోపలి భాగం ముస్లింలకు మసీదు అని, బయటి స్థలం హిందువులకని పేర్కొన్నారు. ఎందుకు 1857లోనే గంట మోగింది? ఎందుకంటే అదే సంవత్సరం ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం (బ్రిటిష్ వలస వాదులతో) జరిగింది. దానిని బ్రిటిష్ వాళ్లు గ్రేట్ మ్యూటినీ (మహత్తర తిరుగుబాటు) అన్నారు. నిజానికి అప్పుడు హిందూ ముస్లింలు ఐక్యంగా వీరోచితంగా పోరాడి దాదాపు బ్రిటిష్ పాలకులను హతాశులను చేశారు. ఇంకో విధంగా చెప్పాలంటే బ్రిటిష్ పాలనను పారదోలడానికి యుద్ధ రంగంలో హిందూ ముస్లింలు ఐక్యంగా ఆయుధాలు ఎత్తినపుడే మత ఘర్షణలు రగిలించడానికి బ్రిటిష్ పాలకులు అయోధ్యలో ఈ గోడ లేపారు.

సుప్రీంకోర్టు 1857 అనే సంవత్సరాన్ని చూసి చారిత్రక కుదుపును అనుభవించినట్లులేదు. అప్పుడే విభజించి పాలించే బ్రిటిష్ ప్రారంభమైంది. అట్లాగే అత్యున్నత న్యాయస్థానం ఈ వివాదం తలెత్తిన మూలాలకు చారిత్రకంగా వెళ్లాలని తర్కించలేదు. నమోదైన ఆధారాలను బట్టి బాబా రామ్‌చరణ్‌మానస్ నాయకత్వంలో హిందువులు, అయోధ్య ముస్లిం భూస్వామి అచ్చన్‌ఖాన్ నాయకత్వంలో ముస్లింలు కలిసి మతసామరస్యం పాటించాలని నిర్ణయం తీసుకొని ఈ నిర్మాణమైన గోడకిరువైపుల లోపల ముస్లింలు, బయట హిందువులు ప్రార్థనలు నిర్వహించుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. ఈ సఖ్యత 23 డిసెంబర్ 1949 వరకు కొనసాగింది. అర్ధరాత్రి హిందూ దుండగులు బాబ్రీ మసీదు లోపలికి వెళ్లి (ద్వారాల తాళాలు పగులగొట్టి) అక్కడ రామ (లక్ష్మణ, సీత) విగ్రహాలు పెట్టారు. ఫిల్మ్ నిర్మాతలుగా మేము ఆ రాత్రి అక్కడ స్వయంగా విగ్రహాలు పెట్టిన వారిలో ఒకరి వాంగ్మూలాన్ని రికార్డు చేశాం. తనకు, తనతోపాటు ఆ విగ్రహాలు పెట్టిన వారికి (అంతకు ముందు రాత్రి) కలల్లో రాముడు వచ్చాడని చెప్పాడు. ఈ దుశ్చర్యకు ఆయనను (పోలీసులు అరెస్టుచేసి) జైలుకు పంపించారు. కాని ఆ తర్వాత వాళ్లందరూ జమానతుపై విడుదలయ్యారు. కొన్ని సంవత్సరాల తర్వాత విశ్వహిందూ పరిషత్ ఒక వీడియో తీసి చాల విస్తృతంగా పంచింది. అందులో రాముడు ఒక బాలుని వేషంలో వివిధ భంగిమలలో మసీదు లోపలి భాగంలోనే సంభ్రమాశ్చర్యాలుకొల్పేలా మొదటి నుంచీ ఉన్నట్లు భ్రమపడేలా చిత్రీకరించారు. స్థానిక జిల్లా మెజిస్ట్రేట్ (కె.కె. నాయర్) 'శాంతిభద్రతల' సాకు చూపి ఆ విగ్రహాలు తొలగించడానికి నిరాకరించాడు. అతడు ఆ తర్వాత ఇప్పటి భారతీయ జనతాపార్టీ అయిన జనసంఘ్‌లో చేరి ఎంపి అయ్యాడు. కోర్టు 1949 తర్వాత ముస్లింలను

ప్రాంతీయం

ప్రసవంలో శిశువు తల, మొండెం వేరుచేసిన డాక్టర్లు

ప్రభుత్వ వైద్య రంగంలో రోజురోజుకూ పెరిగిపోతున్న నిర్లక్ష్యానికి ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, ఇటీవల అచ్చంపేటలో శిశువు తల మొండెంను వేరు వేరుగా ప్రసవం చేసిన ఉదంతాన్ని సాక్ష్యంగా వివరిస్తున్నారు **లక్ష్మణ్ గడ్డం**

'కంటే' నే ఓ మహిళ అమ్మ అవుతుంది. జీవితంలో అమ్మ కావాలని ప్రతి మహిళ కల కంటుంది. ఓ ప్రాణికి ఊపిరి పోయడం కోసం తన ఊపిరి అగి పోవడానికైనా సిద్ధపడుతుంది. తన కడుపులో ఓ ప్రాణి మొలకెత్తినప్పటి నుండి తన తనం మరిచిపోయి ఆ ప్రాణి కోసమే బతుకుతుంది. కడుపులోని తీయని కదలికలను చేతితో స్పృజించి పరవశించి పోతుంది. పొట్ట పెరుగుతూ ఉంటే తనకు తెలియని ఎత్తైన శిఖరాల అంచులకు ఎదుగుతున్నట్లుగా ఆనందిస్తుంది. అవ్యక్తమైన అనుభూతులకు లోనవుతుంది. జీవిత పరిపూర్ణతను అందుకున్నానని ఆస్వాదిస్తుంది. నిండు గర్భిణితో ఆసుపత్రికెళ్లి పండంటి బిడ్డను చేతిలోకి అందుకోవాలని ఆతురత పడుతుంది. కాని ఆసుపత్రిలో డాక్టర్లు తన బిడ్డ మొండంను కడుపులో ఉంచి తలను మాత్రమే తీసి చేతిలో పెడితే భూమి బద్ధలైనట్లుగా అగాధానికి గురవుతుంది. ఆశల సౌదాలన్ని కళ్లెదుటే కుప్పకూలిపోతుంటే కుమిలి కుమిలి రోధిస్తుంది.

గత డిసెంబర్ 18న ప్రసవం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన స్వాతి చేతిలో తలను మాత్రమే ఉంచి ప్రాణం లేని మొండెంను హైదరాబాదు జజిఖానాలో తీసుకోమన్నారు మన డాక్టర్లు. మహా గొప్పోళ్లు! వాయిదాల డెలివరీ కూడా చేయగలరు.

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం లింగోటం గ్రామానికి చెందిన కేశమోని స్వాతి(22)కి అదే మండలం నడింపల్లికి చెందిన సాయిబాబాతో 2016లో వివాహమైంది. భార్యా భర్తలిరువురు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. స్వాతి కొద్ది నెలలకే గర్భం దాల్చింది. తల్లిదండ్రి హోదాలోకెళ్తున్నామని ఆనందానికి అవధులు లేవు. కెసిఆర్ కిట్టులో రిజిస్ట్రేషన్ చేయించుకొని నెల నెల రెగ్యులర్ పర్యవేక్షణలో ఉన్నా కూడా వీరి ఆనందం ఎన్నో రోజులు నిలువలేదు. అర్ధాంతరంగా అబార్షన్ అయింది. చాలా బాధపడ్డారు. సాయిబాబా తల్లి మరింత బాధపడింది. కోడలి రెండవ కాన్పును ఎలాగైనా నిలబెట్టుకోవాలని గట్టిగా నిశ్చయించుకుంది.

అనుకున్నట్లుగానే కొంతకాలం తరువాత స్వాతి రెండవ సారి గర్భం దాల్చింది. అందరికంటే ఎక్కువ సంతోషించింది స్వాతి అత్త. ఈసారి అందరూ జాగ్రత్తలు పడడం మొదలు పెట్టారు. గ్రామంలోని ఆశా వర్కర్లను కలిసి కెసిఆర్ కిట్టులో మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించుకుంది. నెల నెలా సక్రమంగా కిట్టు ప్రకారం మందులు, ఇంజక్షన్లు అందుతూనే ఉన్నాయి. అత్త స్వాతిని కంటి రెప్పలా కాపాడుకుంది. అయినా తృప్తి చెందక తల్లి గారింట్లో మరింత రక్షణగా ఉంటుందని, ఏ శ్రమను చేయనివ్వరని భావించి స్వాతిని లింగోటం పంపించివేసింది. స్వాతిని క్షేమంగా చూసుకోవాలని వియ్యంకురాలిని హెచ్చరించింది కూడా.

లింగోటం చేరుకున్న స్వాతి క్రమం తప్పకుండా ఇక్కడి ఆశా వర్కర్ ద్వారా చికిత్స పొందుతూనే ఉంది. అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కడుపులో బిడ్డ ఎదుగుదల తెలుసుకోవడానికి స్కానింగ్ చేయమని డాక్టర్లను అడిగింది. నీకు తొమ్మిదవ నెల నిండిన తరువాత మాత్రమే చేస్తాం కాని ఇపుడు చేయమని చెప్పి ఏ మందులు ఇవ్వకుండా చికిత్స జరుపకుండానే తిప్పి పంపించారు. మొదటి కాన్పు అనుభవం మనసులో ఉంది కనుక జాగ్రత్త పడి స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లింది. వైద్యులు పరీక్షించి అంతా బాగానే ఉంది, సాధారణ ప్రసవం జరుగుతుందని

మసీదులోకి పోవడాన్ని నిషేధించింది. కాని లోపల ప్రార్థనలు చేయడానికి వరుసగా హిందూ పురోహితులను నియోగించింది. మేము వీరిలో చాల ప్రఖ్యాతి పొందిన పూజారి లాల్‌దాస్‌ను ఇంటర్వ్యూ చేసాం. ఆయన డిసెంబర్ 30న మసీదు మీద మొదటి దాడి జరగడం పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశాడు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ వ్యక్తులు రామ మందిరంలో ఎప్పుడూ ప్రార్థనలు చేయలేదని చెప్పాడు. కనుక ఈ ప్రచారమంతా డబ్బుకోసం, రాజకీయాధికారం కోసం మాత్రమేనన్నాడు. ఆయన మతం పేరుమీద అవినీతి, లంచగొండితనానికి సంబంధించిన చాల ఉదాహరణలు చెప్పాడు.

1992 డిసెంబర్ 6న, ఉత్తరప్రదేశ్‌లో బిజెపి అధికారంలో ఉండగా, హిందూ తీవ్రవాద శక్తులు (మిలిటెంట్లు) బాబ్రీ మసీదు విధ్వంసం చేశాయి (చేశారు). ఆ ప్రాంతంలో చాల మంది ముస్లింలను చంపారు. 1949లో మసీదులో ప్రార్థనలు చేసిన ఇమామ్ కొడుకును కూడ చంపేసారు. ఒక సంవత్సరం తర్వాత లాల్ దాస్‌ను కూడ హత్య చేశారు. ఈ కథకు ఇంకొక ఆసక్తి దాయకమైన పాదసూచిక (ఫుట్ నోట్) ఉన్నది. హిందువులను ముస్లింలను, (ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఢిల్లీ ఎడిషన్, 2019 డిసెంబర్ 4న అచ్చయిన వ్యాసానికి అనువాదం – చంద్రమల్లిక) బయటి వైపు హిందువులను సామరస్యంతో ప్రార్థనలు చేయడానికి కృషి చేసిన అచ్చన్ ఖాన్ బాబా రామ్‌చరణ్ దాస్‌లపై రాజద్రోహ నేరం మోపి 9 నవంబర్ ఉరితీశారు. మన జాతీయ నిర్మాణాన్ని (మాన్యుమెంటును) విధ్వంసం చేసిన, ప్రభావ రీత్యా ఉపఖండమంతటా వేలాది మంది హత్యలకు కారణమైన వారికి, వాళ్లు డిమాండు చేసిన స్థలం (బాబ్రీ మసీదు లోపలి భాగంలోని 2.7 ఎకరాల స్థలం –అను) చట్టబద్ధంగా ఇవ్వబడింది.

లౌకిక ప్రజాస్వామ్యం ఇపుడింక శాశ్వతంగా విశ్రాంతి తీసుకోవచ్చు.

(రచయిత డాక్యుమెంటరీ ఫిల్మ్ నిర్మాత, దర్శకుడు) వీ

చెప్పారు. శిశువు ఎదుగుదల కొంత బలహీనంగానే ఉందని అన్నారు. దానికి సరిపడే మందులిచ్చారు. పేద కుటుంబం కనుక ఆసుపత్రి ఖర్చులు భరించలేక సతమతమయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రిలో తొమ్మిది నెలలు నిండిన గర్భిణికి ప్రతి మంగళవారం మాత్రమే స్కానింగు చేస్తారు. తొమ్మిది నెలలు నిండాక స్కానింగ్ చేస్తే ఉపయోగమేమిటి? స్కానింగ్ నెలనెలా చేసి శిశువు ఎదుగుదల నిర్ధారించాలి కదా! ప్రభుత్వ ఆసుపత్రుల వైఫల్యం వల్ల ప్రైవేటు ఆసుపత్రులు కాసులు పోగు చేసుకుంటున్నాయి. పేద కుటుంబాల నడ్డి విరుగుతుంది. కేసిఆర్ కిట్టు ప్రచారానికి బాగా పనికొస్తుంది కాని ఆచరణలో ఎంత విఫలమౌతుందో తెలిసిపోతుంది. కేసిఆర్ కిట్టు రిజిస్ట్రేషన్ పొందిన మహిళ గర్భం విశాదాంతంగా ముగిస్తే ఎవరు బాధ్యత వహించాలి? ప్రభుత్వ పాలసీలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నవో తెలుసుకునే, ఆడిట్ చేసి రిపోర్టింగ్ చేసే వ్యవస్థ ప్రభుత్వం దగ్గర ఉందా? ప్రభుత్వ పథకాలు ప్రచార ఆర్భాటాలేనా, లేక ధ్యేయాలను చేరుకుంటున్నాయా?

ప్రభుత్వ పరంగా వైద్య సహాయం అందకపోవడంతో కల్వకుర్తిలో ఓ గైనకాలజిస్టును సంప్రదించారు. టెస్టులు, స్కానింగులు చేసారిక్కడ, అంతా బాగానే ఉంది. అయితే శిశువుకి కొంత నీరు వచ్చింది మందులతో తగ్గిపోతుందని చెప్పారు. ఆ మేరకు మందులు రాసిచ్చారు. అక్కడి నుంచి హైదరాబాదులో రేయిన్‌బో ఆసుపత్రిని కూడా సంప్రదించారు. ఇక్కడ సమగ్ర పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు కడుపులో శిశువు ఎదుగుదల సక్రమంగా లేదని, వెంటనే అబార్షన్ చేయించుకోవాలని సలహా ఇచ్చారు. స్వాతి అయిష్టంగానైనా సిద్ధపడింది. కాని అత్తమ్మ అడ్డుపడింది. మొదటి కాన్పు విఫలమైంది కాబట్టి ఈ రెండవ కాన్పునైనా జరగాల్సిందేనని పట్టుపట్టింది. అంగ వైకల్యంతో పుట్టినా సరే నా వంశాంకురం జరగాల్సిందేనని మొండికేసింది. స్వాతి తన అత్తమ్మకు ఎదురు చెప్పలేకపోయింది. భయం, అనుమానంతోనే గర్భాన్ని మోసింది. తొమ్మిది నెలలు దాటి నాలుగు రోజులు పడ్డాయి. 2019 డిసెంబర్ 18న ఉదయం ఆరు గంటల నుండి పురిటి నొప్పులు మొదలయ్యాయి. కడుపంతా నొప్పులతో మెలికలు తిరుగుతున్నాయి. అయినా కూడా లేచి స్నానం చేసింది. టిఫిన్ చేసింది. నొప్పులు మరీ ఎక్కువవడంతో ఆటో తీసుకొని అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిపోయింది. అత్త, అమ్మ, వదినలు తోడొచ్చారు. పరీక్షించిన డాక్టర్లు ఇంజక్షన్లు ఇచ్చి లేబర్ రూములోకి తీసుకెళ్లారు. చికిత్స పొందిన రిపోర్టులన్ని పరిశీలించారు. నార్మల్ డెలివరీ అవుతుందని తెలియపరిచారు. లేబర్ రూంలో చుట్టూ చేరిన నర్సులు కడుపు వత్తడం మొదలు పెట్టారు. డాక్టర్లు వచ్చి కూడా గట్టిగా వత్తడం మొదలు పెట్టారు. దీంతో బేబీ తల బయటకు వచ్చింది. పొట్టపై మళ్లీ వత్తుతూ మరింత బాధకు గురిచేశారు సిబ్బంది. చూసిన డాక్టర్లు అక్కడి నుండి వెళ్లిపోయినారు. మిగిలిన సిబ్బంది తలను పట్టి బయటికి లాగడం మొదలెట్టారు. ఎంతకీ రాకపోయే సరికి బలమంతా ఉపయోగించి మరీ గట్టిగా లాగేసరికి తల తెగిపోయి చేతిలోకి వచ్చింది. మొండెం మాత్రం కడుపులోనే మిగిలి పోయింది. కంగారుపడిన సిబ్బంది డాక్టర్లకు తెలియజేశారు. అంతకంటే ఎక్కువగా భయపడిన డాక్టర్లు విషయాన్ని గోప్యంగా ఉంచాలని నిర్ణయించారు. స్వాతికి గాని కుటుంబీకులకు గాని విషయం తెలియజేయలేదు. హడావిడి చేస్తూ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది, కనుక వెంటనే హైదరాబాదు ఆసుపత్రికి తీసుకెళ్లాలని తొందర పెట్టారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ కనీసం రెఫరల్ పత్రంలో కేసు వివరాలు సరిగ్గా రాసివ్వకుండానే పంపించేశారు. ప్రైవేట్ వాహనాన్ని ఏర్పాటు చేసి, ఒక అటెండరును కూడా ఇచ్చి పంపించేశారు. వాహనం ఖర్చులు బాధితులే భరించారు. హైదరాబాద్ జజిఖానాలో పరీక్షలన్ని నిర్వహించి కడుపులో మొండెం మాత్రమే మిగిలిపోయిందని గుర్తించారు. తల ఏమైందని స్వాతిని, కుటుంబీకులను అడిగారు. వారు బిక్క మొహం వేశారు. వారికి కూడా అప్పుడే తెలిసింది కడుపులో తల తెగిన మొండెముందని, వెంటనే అచ్చంపేట అసుపత్రికి ఫోన్ చేస్తే విషయాలన్ని బయటపడ్డాయి. మీడియా ద్వారా విషయాలన్ని బయటి ప్రపంచానికి తెలియవచ్చింది. తదుపరి శస్త్ర చికిత్స ద్వారా మొండాన్ని బయటికి తీశారు. అదృష్టం కొద్ది స్వాతి ప్రాణాలకు ముప్పు వాటిల్ల లేదు. మందులు రాసి తర్వాత డిశ్చార్జి చేశారు. డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తమ పాప చనిపోయిందని కుటుంబీకులు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నాకు దిగారు. ప్రభుత్వం ఏం చేస్తుంది, ఎవరినో ఒకరిని బలి పెడుతుంది, విచారణకు ఆదేశిస్తుంది. ఆందోళనను నీరుగారుస్తుంది. వైద్యులు తారాసింగ్, సుధారాణిలను సస్పెండు చేశారు.

తల్లి కడుపులో శిశువు ఎప్పుడో చనిపోయిందని అచ్చంపేట డాక్టర్ల వాదన. అదే నిజమైతే సాధారణ ప్రసవం జరుగుతుందని వెల్లడించి అటు దిశగా డెలివరీ ప్రయత్నాలు ఎందుకు చేసినట్లు? ప్రసవ సమయంలో శిశువు తల తెగిపోయి చేతిలోకి వచ్చినపుడు తల్లికి, కుటుంబీకులకు ఎందుకు వెల్లడించలేదు? ఒక గర్భిణీ స్త్రీ ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చినపుడు కడుపులో ఉన్నది మృతశిశువా, జీవమున్న శిశువా తెలుసుకోలేని దీన స్థితిలో ఉందా మన వైద్య వ్యవస్థ? ఇంతకీ ఏ డాక్టరు బాధ్యత పడి డెలివరీ చేశారో అచ్చంపేట ఆసుపత్రి సూపరింటెండెంట్ చెప్పగలడా? ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంత నిర్లక్ష్యం పేరుకుపోయిందో ఇదొక సజీవ సాక్ష్యం. కేసిఆర్ కిట్టు ఆచరణలో ఎంత వైఫల్యం చెందుతుందో స్పష్టమౌతుంది. ఈ ప్రపంచంలోనికి ఆడుగుపెట్టబోతున్న ఓ నిండు ప్రాణాన్ని కాపాడలేకపోయింది కెసిఆర్ కిట్టు. ఈ పథకానికి అత్యాధునిక వైద్య సేవలందించే ప్రక్రియను ఎందుకు అనుసంధానం చేయలేదు?

అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. గైనకాలజిస్టులు ఆ రోజు ఎవరూ లేరు. ఉన్న వారిలో నిర్లక్ష్యం గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. పేద ప్రజలను పురుగులుగా చూస్తారు. మనసు పెట్టి వైద్యం అందించరు. ఒక పేషంటుకు పట్టుమని పది నిమిషాలు కేటాయించి పరీక్షించరు. నాణ్యమైన మందులు దొరకవు, ప్రభుత్వ ఆసుపత్రి అంటేనే భయంగొలిపే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి వెయ్యి మంది జనాభాకు కనీసం ఒక డాక్టరు ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధేశిస్తుంది. ఇది మన దేశంలో భ్రమగానే మిగిలిపోతుంది. డాక్టర్ల కొరత ఆరోగ్య సేవల నాణ్యత ప్రమాణాన్ని కుళ్ల బొడుస్తుంది. మన దేశంలో లక్షా పదిహేను వేల డెబ్భై నాలుగు మందికి ఒక డాక్టరు ఉన్నాడు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జవాబు దారితనం పెంచాలి. కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బడ్జెట్‌లో అవసరమైన నిధులు కేటాయించి ప్రజలకు వైద్యం అందుబాటులోకి తెచ్చి తల్లీ బిడ్డలను బతికించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(రచయిత రాష్ట్ర అధ్యక్షులు పౌర హక్కుల సంఘం) వీ

ఎ.బి.కె. ప్రసాద్‌తో ముఖాముఖి

ఏడు దశాబ్దాలుగా పాత్రికేయుడిగా, ఎన్నో దినపత్రికల ప్రారంభకుడిగా విశేష అనుభవం గడించిన ఎబికె ప్రసాద్‌తో సంభాషించారు **గోవిందరాజు చక్రధర్**

ఎ.బి.కె. ప్రసాద్‌గా ప్రసిద్ధుడైన అన్నే భవానీ కోటేశ్వర ప్రసాద్ సమకాలీన పత్రికారంగంలో ఓ లైట్‌హౌస్. ఆయనో గ్లామరస్ ఎడిటర్. ఏ పత్రికలో చూసినా ఎ.బి.కె. శిష్యులు చాలామందే కనిపిస్తారు. ఆ శిష్యుడు ఆ పత్రికకు ఎడిటర్ కావచ్చు, ఎడిట్‌పేజీ ఇన్‌చార్జి కావచ్చు.

కులం, మతం, ప్రాంతం ఊసేలేకుండా మంచి టీమును తయారు చేసుకోవడం. ఆ టీమును సానబెట్టి ప్రతిభను వెలికితీయడం ఎ.బి.కె. సక్సెస్ మంత్రం. ఇన్నేళ్లుగా చదవడం ఆపలేదు. రాయటమూ మానలేదు. 'ఏరా! అబ్బాయ్!' అంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించే బోళాశంకరుడు. కార్డు హోల్డరును కాకున్నా ఇప్పటికీ నేను మార్క్సిస్టునే అని తెగేసి చెప్పగల నిబద్ధుడు.

ఈనాడు, ఉదయం, వార్త దిన పత్రికలు, సుప్రభాతం వీక్లీ ఆయన సంపాదకత్వంలోనే మొగ్గతొడిగాయి. అయితే రాజీపడని మనస్తత్వం ఎక్కడా పట్టమని పదికాలాల పాటు కుదురుకోనివ్వలేదు.

సొంతూరు కృష్ణాజిల్లా ఉప్పులూరు. మేనమామల ఊరైన ఉయ్యూరులో 1935 ఆగస్టు 1న జన్మించారు. తల్లి చంద్రావతమ్మ, తండ్రి బుచ్చి వీరయ్య. నాగపూర్‌లో ఎం.ఎ. చదువుతూ అక్కడి తెలుగు వారి కార్యక్రమాలను విశాలాంధ్రకు రాస్తుండే వారు. చదువు మధ్యలో మానేసి 1956లో విశాలాంధ్రలో సబ్‌ఎడిటర్‌గా చేరారు. అలా అవిశ్రాంత అక్షరయోధుడి జైత్రయాత్ర మొదలైంది.

విశాలాంధ్రలో అక్షరాలు దిద్దుకుని, జనశక్తిలో రాటుదేలి, ఆంధ్రజ్యోతిలో సరికొత్త దీపాలు వెలిగించారు.

ఈనాడు వ్యవస్థాపక ఎడిటర్‌గా ఆ పత్రిక వికాసానికి గట్టి పునాదులు వేశారు. కొత్త పందిళ్లలో సరికొత్త శీర్షికల సుమాలను పూయించారు. ఉత్తరాంధ్ర పలుకుబడికి పట్టంగట్టి పత్రికను ప్రజలకు దగ్గర చేర్చారు.

ఈనాడు రామోజీరావు గురించి పత్రికా రచయిత డాక్టర్ గోవిందరాజు చక్రధర్ రాస్తున్న పుస్తకం కోసం ఎ.బి.కె. ప్రసాద్ ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈనాడు తొలి రోజుల తబ్బిళ్లను, రామోజీరావు వ్యక్తిత్వాన్ని, పత్రికా యజమానుల వ్యవహార శైలిని నీళ్లు నమలకుండా వివరించారు. తెలుగుదేశం పార్టీ వ్యవహారాల్లో రామోజీరావు పాత్రను విశ్లేషించారు. హైదరాబాద్ కొండపూర్‌లోని సి.ఆర్. ఫౌండేషన్‌లో రెండు రోజులపాటు అయిదు గంటలకు పైగా సాగిన ఈ ఇంటర్వ్యూలో అన్ని ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చారు. ఎ.బి.కె. ప్రసాద్ చెప్పిన ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

వి.ఎచ్. మధ్యవర్తిత్వంతో ఈనాడులోకి: విశాఖపట్నం యు.ఎన్.ఐ.లో వి. హనుమంతరావు (వి.ఎచ్) పనిచేస్తుండేవారు. హైదరాబాద్‌లో మూడు నెలలపాటు అసెంబ్లీ రిపోర్టింగ్ చేశాను. అప్పటి నుంచి ఆయనతో నాకు స్నేహ సంబంధాలున్నాయి. రామోజీరావు ఒకసారి విశాఖపట్నం వచ్చినప్పుడు వి.ఎచ్.ను కలుసుకున్నారు. 'ఆంధ్రజ్యోతిలో పనిచేస్తున్న ఎ.బి.కె. ప్రసాద్ గురించి విన్నాను. అతనైతే నేను పెట్టబోయే పత్రికకు బావుంటుంది. మీకు ఎ.బి.కె. తెలుసు కనుక ఈ ప్రపోజల్‌ను ఆయనకు చెప్పి ఒప్పించాలని' వి.ఎచ్.ని రామోజీ కోరారు.

వి.ఎచ్. ఇదే పనిమీద విశాఖ నుంచి ప్రత్యేకంగా విజయవాడ వచ్చి నన్ను కలిసి విషయం చెప్పారు. ఆంధ్రజ్యోతిలో నా పొజిషన్ బావుంది. ఏ రకమైన సమస్యలూ లేవు. న్యూస్ ఎడిటర్‌గా ప్రమోషన్ కూడా ఇచ్చారు. అన్నింటికి మించి పార్వతీపురం కుట్రకేసులో కె.ఎల్.ఎన్. ప్రసాద్, నార్ల వెంకటేశ్వర రావు నాకు అన్ని రకాలుగా మద్దతునిచ్చి అండగా నిలిచారు. వి.ఎచ్. ఈ ఆఫర్ తెచ్చేనాటికి జ్యోతి నుంచి నార్ల తప్పుకున్నట్లున్నారు.

అలాంటి కె.ఎల్.ఎన్.ను కాదని జ్యోతి నుంచి బయటకు రావడం సమంజసం కాదనిపించింది. ఇదే విషయాన్ని వి.ఎచ్.కి చెప్పాను. 'ఏ జర్నలిస్టు అయినా ఎడిటర్ స్థానానికి ఎదగాలని కోరుకుంటాడు. ఎడిటర్ అయ్యే అవకాశం ఏ ఒకరిద్దరికో అరుదుగా వస్తుంది. ఇప్పుడది నీ తలుపు తట్టింది. ఈ అవకాశం చేజార్చుకుంటే మళ్లీ మళ్లీ రాకపోవచ్చు' నని వి.హెచ్. నాకు గట్టిగా చెప్పడంతో ఇక కాదనలేక సరేనన్నాను.

జ్యోతికి రాజీనామా సమర్పించినపుడు కె.ఎల్.ఎన్. ప్రసాద్‌ను కలుసుకున్నాను. 'నీకు ప్రమోషన్ ఇచ్చి ఢిల్లీ పంపుదామనుకున్నాం' అని కె.ఎల్.ఎన్. చెప్పారు. ఎడిటర్‌గా మంచి అవకాశం వచ్చిందని... చెప్పి కె.ఎల్.ఎన్. దగ్గర సెలవు తీసుకున్నాను.

పదిహేను పేర్ల జాబితా నుంచి ఎంపిక చేశాం: హైదరాబాద్ అబిడ్స్‌లో మార్గదర్శి ఆఫీసులో రామోజీరావును కలుసుకున్నాను. రెండవ సమావేశం విశాఖపట్నం క్లబ్‌లో జరిగింది అక్కడ డిన్నర్ చేస్తూ మాట్లాడుకున్నాం. విశాఖ సీతమ్మధారలో పత్రిక పనులు సాగుతున్నందున డాల్ఫిన్ హోటల్‌లోనే తాత్కాలిక ఆఫీసు ఏర్పాటైంది.

నాలుగు నెలల పాటు గ్రౌండ్ వర్క్ చేశాను. కొమ్మినేని వాసుదేవరావు వంటి సీనియర్లను తీసుకున్నాం. పత్రికల్లో ప్రకటన వేసి ఫ్రెష్ గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి సబ్ ఎడిటర్లను ఎంపిక చేశాం. ఇంగ్లిష్ అనువాదం, మఫిసిల్ కాపీ ఎడిటింగ్‌లో వీరికి శిక్షణ ఇచ్చాం. పత్రిక లాంఛనంగా ప్రారంభించడానికి ముందు డమ్మీలు వేశాం.

అప్పట్లో 'ఆంధ్ర' అనే పదం లేకుండా పత్రికలు ఉండేవి కావు. రామోజీరావు 15 పేర్ల జాబితాను నా ముందుంచారు. వాటిలో ఈనాడు సహా రెండు మూడు పేర్లను ఎంపికచేసి రామోజీకి ఇచ్చాను. చివరకు ఇద్దరి అంగీకారంతో ఈనాడు పేరు ఖరారు అయింది. అంతకుముందు కర్నూలుకు చెందిన కొంతమంది కలిసి, అబ్బూరి రామకృష్ణారావు సంపాదకత్వాన ఈనాడు పేరుతో పత్రిక తేవాలనుకున్నారు. అయితే ఏ కారణాల వల్లనో వారి ప్రయత్నాలు ఫలించలేదు. వారి నుంచి రామోజీరావు ఈనాడు టైటిల్‌ను పొందారు.

విధిలేక ఎడిటర్‌గా నా పేరు ముద్రించారు: ఈనాడు పత్రిక

ఇంప్రింట్‌లో ఎడిటర్‌గా నాపేరు, చీఫ్ ఎడిటర్‌గా రామోజీరావు పేరు ఉండేది. విధిలేని పరిస్థితిలో రామోజీరావు నా పేరును ఎడిటర్‌గా ప్రచురించాల్సి వచ్చింది.

పత్రిక ప్రారంభ తేదీ దగ్గరపడుతోంది. ఆ దశలో చివరి నిమిషంలో మాటమార్చడానికి, కొత్త మెలిక పెట్టడానికి రామోజీరావు చూశారు. డాల్ఫిన్ హోటల్‌లో ఒకరోజు రామోజీరావు నన్ను పిలిచి, 'ఇటు వెళ్దాం రా' అంటూ పక్కకు తీసుకెళ్లారు. 'నీకు అసిస్టెంట్ ఎడిటర్ పోస్ట్ కదా ఇస్తానని చెప్పింది' అంటూ నడకలో సంభాషణ మొదలుపెట్టాడు.

'అసిస్టెంట్ ఎడిటర్ పోస్ట్ కోసమైతే ఆంధ్రజ్యోతిని వదిలి రావలసిన పనేం లేదు. అక్కడ కంఫర్టబుల్‌గానే ఉన్నాను. మీరు ఎడిటర్ పదవి ఇస్తానన్నారని వి.హెచ్. చెప్పబట్టే నేను వచ్చాను. ఏదైనా ఈ విషయంలో వి.హెచ్. మధ్యవర్తిత్వం, వహించారు. ఆయన మాటకు నేను కట్టుబడి ఉంటాను అని రామోజీకి స్పష్టం చేశాను.

ఆ తర్వాత వి.ఎచ్. దగ్గరకు పరుగెత్తికెళ్లి విషయం చెప్పాను. మీరు ఎ.బి.కె.కు ఎడిటర్ పోస్ట్ ఇస్తానని చెప్పడం వల్లే పనిగట్టుకుని నేను విజయవాడ వెళ్లి ఆయనకు నచ్చచెప్పాను' అని వి.హెచ్. తేల్చిచెప్పారు.

ఇక విధిలేని పరిస్థితిలో, కక్కలేక మింగలేక ఎడిటర్‌గా ఇంప్రింట్‌లో నా పేరు వేయక తప్పలేదు రామోజీకి.

తొలి రోజుల్లో గట్టి పునాదులు: రామోజీరావు హైదరాబాద్‌లోనే ఉండేవారు. అడపాదడపా విశాఖకు వచ్చి వెళ్తుండేవారు. ఎడిటర్‌గా నేను ఆయనను కలుస్తుండేవాణ్ణి. 'హలో ఎ.బి.కె.' అంటూ రామోజీ మాటకలిపేవారు. రామోజీ అర్ధాంగి శ్రీమతి రమాదేవి ఆపేక్షగా పలకరించేవారు. రామోజీ తోడల్లుడు అప్పారావు విశాఖ ఎడిషన్ బాధ్యతలన్నీ చూసుకునేవారు. ఎడిటోరియల్ విషయాల్లో ప్రత్యక్షంగా తలదూర్చేవారు కారు.

శీర్షికా రచనలో, పేజి మేకప్‌లో సరికొత్త బాణిని నేనే ప్రవేశపెట్టాను. రెండులైన్ల శీర్షిక స్థానే ఒక లైనులో క్లుప్తంగా, సూటిగా శీర్షిక ఉండేలా శ్రద్ధ తీసుకున్నాను. అప్పటివరకూ మార్కెట్‌లో ఉన్న పత్రికలకు భిన్నంగా పేజి డిజైన్‌ను తీర్చిదిద్దాను. రిపోర్టర్లంతా ఉత్తరాంధ్రవారే కనుక వారు అక్కడి పలుకుబడిలో వార్తలు రాస్తే ఆ భాషనే ప్రోత్సహించాను.

టూకీగా, రైతేరాజు, భూభ్రమణం మొదలుకొని ప్రారంభంలో శీర్షికలన్నింటినీ నేనే ప్రవేశపెట్టాను. నాలుగు పేజీల ఆదివారం అనుబంధాన్ని విశాఖ నుంచే వెలువరించాం. ఈ అనుబంధంలో డాక్టర్ జి. సమరం చేత సెక్స్-సైన్స్ కాలమ్‌ను నేను మొదలు పెట్టించాను. అప్పట్లో సెక్స్ విజ్ఞానంపై మరేఇతర పత్రికలలోనూ ఈ తరహా కాలమ్ ఉండేదికాదు. హైదరాబాద్ ఎడిషన్ మొదలయ్యాక చలసాని ప్రసాదరావు ప్రోద్బలంతో ఆదివారం అనుబంధాన్ని హైదరాబాద్‌కు మార్చారు. ఈ అనుబంధాన్ని చలసాని చూడసాగారు. ఆయన నాకు బంధువే. కాకుంటే కబుర్లు చేరవేస్తుండేవాడు.

ఆరు నెలలపాటు ఎడిటోరియల్ లేదు: ఎడిట్ పేజి ఉన్న ఆరు నెలల వరకూ రాజకీయం మాత్రం ఉండేది కాదు. నేను ఏం రాస్తానోనన్న భయంతో నన్ను రాయన్వికుండా నిరుత్సాహపరిచేవారు.

ఎడిటోరియల్ మినహా మిగిలిన వ్యాసాలు, ఉత్తరాలు ప్రచురించే వాళ్లం. నా ప్రోద్బలంతో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'మరవరాని ముచ్చట్లు' రాసేవారు. తనకు తెలిసిన, ప్రత్యక్షంగా పాల్గొన్న శతాబ్దపు పరిణామ క్రమాలను ఇంద్రగంటి వారు రాస్తుండేవారు. రాంభట్ల కృష్ణమూర్తి, గజ్జెల మల్లారెడ్డి లేనిపోనివి రామోజీకి నూరిపోసి, హనుమచ్ఛాస్త్రి కాలమ్ కొనసాగకుండా అడ్డుకున్నారు. ఆ తర్వాత పురాణం సుబ్రహ్మణ్యశర్మ, ఆంధ్రజ్యోతి వీక్లీలో హనుమచ్ఛాస్త్రి కాలమ్‌ను మరో పేరుతో కొనసాగించారు.

ఎడిట్ పేజీల్లో ఉత్తరాంధ్ర సాహితీ వేత్తల రచనలను కూడా ప్రచురించేవాణ్ణి. మినీ కవిత్వానికీ చోటు కల్పించాం.

సమకాలీన విషయాలపై పత్రిక అభిప్రాయం ఏమిటో తెలుసుకునేందుకు ఎడిటోరియల్‌ను ప్రవేశపెట్టాలని పాఠకుల నుంచి పెద్ద సంఖ్యలో ఉత్తరాలు రావడం మొదలైంది. ఈ విషయాన్ని రామోజీ దృష్టికి తెచ్చాను.

'నువ్వు ఎడిటోరియల్ రాయి, నేను సంతకం పెడతాను' అని అన్నారు రామోజీరావు. 'అటువంటి అలవాటు లేదు, ఆ పనిచేయలేను' అని కుండబద్దలు కొట్టినట్లు చెప్పాను. ఆరు నెలల తర్వాత రామోజీ సంతకం లేకుండానే సంపాదకీయాలు రాయడం మొదలు పెట్టాను.

ఏదైనా మంచి ఈవెంట్ జరిగితే వార్త ప్రచురించే వాళ్లం. అలాంటి వార్తలు ఆసక్తిగా చదివేవారు. పాఠకులకు జ్ఞాపక శక్తి ఉండదని కనుక ఆ వార్తలను పునర్ముద్రించమని కోరేవారాయన.

రామోజీకి నేను ఒక పట్టాన మింగుడు పడకపోవడంతో నాపై బాగా గుర్రుగా ఉండేది. ఈనాడు నుంచి ఉద్వాసన పలకటానికి బీజాలు పడ్డాయి.

నన్ను తగ్గించేందుకు తెరపైకి సంపాదకవర్గం: హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభిస్తూ నన్ను అక్కడికి రావాలని కోరారు. విశాఖ ఎడిషన్ బాధ్యతలను వాసుదేవరావు చూసుకోగలరని చెప్పారు.

హైదరాబాద్ ఎడిషన్‌లో నాతోపాటు పొత్తూరి వెంకటేశ్వరరావు, వి.హెచ్., టివి కృష్ణలను కూడా ఎడిటర్ హోదా కట్టబెట్టి రిక్రూట్ చేశారు. వీరెవరికీ అప్పటివరకు ఎడిటర్ హోదాలో పనిచేసిన అనుభవం లేదు. పత్రికను వారిలో ఎవరూ స్వతంత్రంగా అప్పటివరకు లాంచ్ చేయలేదు. హైదరాబాద్ ఎడిషన్ ఇంప్రింట్‌లో ఎడిటర్‌గా నా పేరు వేసేవారు కాదు. చీఫ్ ఎడిటర్‌గా రామోజీ పేరొక్కటే కొనసాగింది.

ఈ విషయాన్ని నేను అడిగితే 'నీ ఒక్కడి పేరు ఇస్తే మిగిలిన వారు అభ్యంతర పెడతారు. పైగా వైజాగ్ ఎడిషన్‌లో నీ పేరు వస్తోందని మరిచిపోకు' అన్నారు రామోజీరావు. పేరుకోసం గట్టిగా పట్టుబడితే వైజాగ్‌లో కూడా పేరు తీసేస్తానని పరోక్షంగా హెచ్చరించడం ఈ మాటల్లోని ఆంతర్యం. 'ఎడిటర్‌గా నీ పేరు లేకుండా చేసేందుకు మా అందరికీ ఎడిటర్లుగా డిజిగ్నేషన్లు ఇచ్చాడు. ఓ రకంగా ఇందుకు నీకు థాంక్స్ చెప్పుకోవాలి' అని వి.ఎచ్., టి.వి. కృష్ణ నాతో అనేవారు.

ఈనాడులో రెండేళ్లకు మించి నేను కొనసాగలేకపోయాను. నిజానికి హైదరాబాద్ ఎడిషన్‌లో నా పేరు లేకుండా చేసినపుడే రాజీనామా చేసి బయటకు వెళ్లాల్సి ఉంది. అయితే కుటుంబ అవసరాల కోసం రు. 5000 అడ్వాన్స్ తీసుకుని ఉన్నాను. ఆ రోజుల్లో ఇది పెద్దమొత్తమే. ఈ బాకీని నెల నెలా జీతంలో చెల్లించేవాణ్ణి. అవకాశమున్నమేరకు ఎక్కువ మొత్తం జీతంలో చెల్లువేసి త్వరగా ...విముక్తుణ్ణి అయ్యాను.

ఈనాడులో ఎడిటర్‌గా రు. 1500కు చేరిన నేను రిజైన్ చేసి వెళ్లేనాటికి రు. 3 వేల జీతం అందుకున్నాను.

నంబర్ వన్ కావాలని పాటుపడ్డాం: ఈనాడును నంబర్ వన్ పత్రికగా తీర్చిదిద్దాలని మేమంతా కష్టపడి పనిచేశాం. ఉత్తరాంధ్ర నుంచి వెలువడిన తొలి తెలుగు దినపత్రిక కావడంతో పత్రిక అభివృద్ధి కోసం పట్టుదలతో పాటుపడ్డాం. బాగా రాయగలిగిన సమర్థులైన కరస్పాండెట్లను నియమించాను. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నుంచి అన్నాజీరావును, ది హిందూలో రిటైర్మెంట్‌కు చేరువగా ఉన్న గోపాలరావు వంటి వారిని పట్టుబట్టి ఈనాడులో చేరేలా చూశాను. ఓపిక ఉన్నంతవరకు పనిచేయాలని గోపాలరావును కోరితే ఆయన కాదనలేకపోయారు.

అన్ని మాండలికాలకు పట్టంగట్టాను: ఒక్క ఈనాడు అనే ఏముంది

ఎడిటర్‌గా నేను ఏ పత్రికలో పనిచేస్తున్నా మాండలికాలను ప్రోత్సహిస్తూ వచ్చాను. ఆయా ప్రాంత రచయితలు, జర్నలిస్టులతో మాండలిక భాషల్లో కాలమ్ రాయించాను. వారంలో ఏడు రోజులు ఏడు మాండలికాలకు పట్టంగడుతూ కాలమ్స్ ప్రవేశపెట్టాను. అబ్బూరి వరద రాజేశ్వరరావుతో వరద కాలమ్, ఉత్తరాంధ్ర మాండలికంలో పతంజలి బాష్యం, తెలంగాణ మాండలికంలో తెలిదేవర భానుమూర్తి, చల్సేదో బాలకిషన్, రాయలసీమ మాండలికంలో నామిని సుబ్రహ్మణ్యం నాయుడు కాలమ్‌ను ప్రవేశపెట్టాను.

విశాఖలో సమ్మెకు విఫల యత్నం: విశాఖ ఎడిషన్‌లో తొలిరోజుల్లోనే ఒకరిద్దరు సమ్మె చేయాలని విఫల ప్రయత్నం చేశారు. నిజం శ్రీరామమూర్తి, లా చదివిన వై. కోటేశ్వరరావు ఈ సమ్మె యత్నాలకు సూత్రధారులు. ఏడాది కూడా గడవకముందే ఇలా సమ్మెకు యత్నించడం సబబుకాదని వారికి చెప్పాను. సమ్మె ఒక రూపం తొడక్కముందే సమసిపోయింది.

మంచి ఆర్గనైజర్: రామోజీ మంచి ఆర్గనైజర్. డబ్బుంది కనుక సంస్థలను నెలకొల్పి వాటిని నిర్వహించుకుంటూ వచ్చాడు. అధికారంతో తనకు కావలసిన పనులు చేయించుకోవడంలో ఆరితేరినవాడు. రామోజీకి రచనా నైపుణ్యం ఏమీలేదు. అలాంటి ఆయనకు సంపాదకుడి పద్మ విభూషణ్ ఇచ్చారు. వ్యాపార రీత్యా ఈ గౌరవం దక్కి ఉంటే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. మొదట్లో రామోజీకి చిట్‌ఫండ్ వ్యాపారమంటే అంతగా ఇష్టం ఉండేది కాదు. ఆ తర్వాత ఎలాగో ఈ వ్యాపారం 'రుచి' తెలిసింది. ప్రారంభంలో రిజిస్ట్రేషన్ లేకుండా చిట్టీల వ్యాపారం మొదలు పెట్టారని తెలిసింది. దీంతో అబిడ్స్ పోలీస్ స్టేషన్ లాకప్‌లో పెట్టారని చెబుతారు.

లాభాపేక్షతోనే కులాన్ని అధిగమించారు: లాభాపేక్ష ఉన్నవాళ్లు కులాన్ని సైతం అధిగమిస్తారు. కులాలకు అతీతంగా సమర్థులను రిక్రూట్ చేసుకోవడం కూడా వ్యాపార లక్షణమే. రామోజీ, చంద్రబాబు మనస్తత్వాలకు బాగా కుదిరింది. ఇద్దరూ కుట్రదారులే. ఎన్‌టిఆర్ వల్ల తనకు ఏమీ ఉపయోగం ఉండదన్న సంగతి రామోజీరావుకు తెలుసు. కానీ చంద్రబాబు అలా కాదు. తన చెప్పుచేతల్లో ఉండి పనికి వస్తాడు. ఇందువల్లే ఎన్‌టిఆర్‌ను కాదని చంద్రబాబును చేరదీశాడు. తన కుర్చీకి వీరిద్దరూ ఎసరు పెట్టారని ఎన్‌టిఆర్ స్వయంగా నాతో చెప్పాడు.

ఒకానొక దశలో రామోజీరావు కొంత మంది కలెక్టర్లను కూడా శాసించే స్థితికి చేరాడు. తానే సిఎం అన్నట్లు వ్యవహరించాడు.

నాదెండ్ల భాస్కరరావు నెల రోజుల పాటు పీఠం అధిష్టించినప్పుడు ఎన్‌టిఆర్ పక్షానే రామోజీ నిలిచాడు. ప్రజాభీష్టం ఎన్‌టిఆర్‌కు అనుకూలంగా ఉంది. పైగా నాదెండ్ల కాంగ్రెస్ మనిషి. ఇందిర మాట వింటాడే తప్పించి తన మాటకు మన్నన ఉండదు. అప్పుడప్పుడే పైకి వస్తున్న చంద్రబాబును ప్రోత్సహిస్తే వ్యాపార రీత్యా తనకు ఉపయోగం ఉంటుందని రామోజీ భావించాడు. క్యాంపు రాజకీయాలు నడపడంలో చంద్రబాబు శక్తియుక్తులేమిటో రామోజీ గ్రహించగలిగినాడు. బాబు తోక జాడిస్తే ఎలా కత్తిరించవచ్చో రామోజీకి బాగా తెలుసు.

పెయిడ్ జర్నలిజానికి రామోజీ శ్రీకారం: ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి చైతన్య రథంపై రాష్ట్రమంతటా విస్తృతంగా పర్యటించారు. నిద్రాహారాలన్నీ ఆ వాహనంలోనే రోడ్డు పక్కనే స్నానం చేసేవాడు. ఎన్‌టిఆర్ ఎక్కడ ఏం మాట్లాడితే బావుంటుంది, ఏయే అంశాలను, సమస్యలను ప్రస్తావించి ప్రజలను ఆకట్టుకోవచ్చు అనే విషయాలపై దృష్టి నిలిపి, గజ్జెల మల్లారెడ్డితో ప్రసంగాలు రాయించి రామోజీ అందజేశారు. ఎన్‌టిఆర్ సభల కవరేజికి విశేష ప్రాధాన్యం ఇచ్చింది ఈనాడు. రోడ్డు పక్కన స్నానం చేస్తున్న దృశ్యాలను, చెట్లకింద గ్రామీణుల సమస్యలను వింటున్న దృశ్యాలను ప్రముఖంగా ప్రచురించింది.

చివరకు ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభంజనం సృష్టించి, అఖండ విజయం సాధించింది. ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆ దశలో రామోజీరావు రు. 34 లక్షల బిల్లును ప్రచార ఖర్చుల కింద చూపించి ఆ మొత్తాన్ని చెల్లించాలని కోరారు. ఏడాది కాలంలో ఎన్‌టిఆర్ ప్రచారం కోసం అంత ఖర్చయిందని చెప్పారు.

ఈ డబ్బును చెల్లించడానికి ఎన్‌టిఆర్ ససేమిరా అన్నారు. సినిమా నటుడిగా తనకున్న గ్లామర్ వల్లే ప్రజలు పెద్ద సంఖ్యలో తన సభలకు తరలి వచ్చారని, అంతే గానీ ఈనాడు ప్రచారం వల్ల కాదని స్పష్టం చేశారు. పైగా తన ఫోటోలు వాడుకుని ఈనాడు సర్క్యులేషన్ పెంచుకుందని కూడా తిప్పికొట్టారు. సీనియర్ ఫోటో గ్రాఫర్‌గా ఎన్‌టిఆర్ ప్రచార బాధ్యతలు చూసిన జనతా స్టూడియో కోటేశ్వరరావు స్వయంగా నాకీ విషయం చెప్పారు. ఒకసారి ఎన్‌టిఆర్‌ను నేను కలిసినప్పుడు కూడా దీన్ని ధ్రువీకరించారు.

ఎన్‌టిఆర్ నో చెప్పడంతో ఆయనపై ఈనాడులో కార్టూన్ క్యాంపైన్ నడిపారు. ఎన్‌టిఆర్‌తో దూరం పెరగడానికి ఇది కూడా ఒక కారణం.

యజమానులంతా ఒకటే: పత్రిక నిలబడే వరకు ఏ యజమాని అయినా ఎడిటర్‌తో సఖ్యంగానే ఉంటాడు. ఆ తర్వాతే అసలు కథ మొదలవుతుంది. పత్రిక నిలబడ్డాక తమ పట్టు పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు. రెవెన్యూ ఇంట్రెస్టులు మొదలయ్యాక మీడియా ప్రమాణాల్లో పతనం మొదలైంది. గతంలో ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, మెయిన్ కరస్పాండెంట్ల ద్వారా వాణిజ్య ప్రకటనలు సేకరించేవి. అయితే దీనివల్ల పత్రికకు చాలా ఇబ్బంది ఎదురవుతోందని గ్రహించి ఈ పద్ధతికి ది హిందూ స్వస్తి పలికింది. ఎక్స్‌ప్రెస్ కూడా దాన్నే అనుసరించింది.

ఇప్పుడు అన్ని పత్రికలు రెవెన్యూ వెంపర్లాటలో ఎంతకైనా దిగజారుతున్నాయి. విశాఖలో ఈనాడు మొదలయ్యాక ప్రభుత్వ రంగ సంస్థ భారత్ హెవీప్లేట్స్ (బిహెచ్‌పి)లో సమ్మె జరిగింది. ఈ సంస్థ ఈనాడుకు వాణిజ్య ప్రకటనలు ఇచ్చేది. ఈ కారణంగా సమ్మె తీవ్రతను తగ్గించి ఇవ్వమని రామోజీ ఆదేశించారు. అసలు సమ్మె కారణాలేమిటి? కార్మికుల డిమాండ్లలో ఎంతవరకు సమంజసమైనవి ఉన్నాయంటూ లోతుగా విశ్లేషిస్తూ అప్పటి వరకూ సమ్మె వార్తలను ప్రముఖంగా ఇచ్చేవాళ్లం. రామోజీ ఆదేశంతో మొక్కుబడిగా రాయడం మొదలెట్టాం.

పాలసీపై ప్రకటనల ప్రభావం: వాణిజ్య ప్రకటనలకు సంబంధించి ది హిందూ, ఈనాడు మధ్య ఒప్పందం ఉంది. దీని ప్రభావం ది హిందూ కవరేజిపై ఎంతో కొంత ఉంది. 2019 ఎన్నికల్లో చంద్రబాబు, వై.ఎస్. జగన్‌ల మధ్య పోటాపోటీగా సాగిన ప్రచారంలో ది హిందూ కొంతమేరకు చంద్రబాబు వైపే మొగ్గు చూపింది. రామోజీతో ఉన్న సాన్నిహిత్యంతో తమపై చంద్రబాబు ఒత్తిడి తెచ్చే అవకాశం ఉందన్న ఆలోచనలతో చంద్రబాబు విషయంలో ది హిందూ దూకుడుగా వెళ్లలేకపోయింది. స్వీయ కట్టడి చేసుకుంది. పత్రికల మధ్య ఉన్న వాణిజ్య ప్రయోజనాలనేవి వార్తల కవరేజి పైన, పాలసీల పైన ప్రభావం చూపుతాయని చెప్పేందుకే ఉదాహరణ.

వార్త ఎడిటర్‌గా నేను ఉన్నప్పుడు చంద్రబాబు ప్రాక్సీగా ఉన్న వ్యక్తి గురించి ఒక వార్త ప్రచురించబోతే గిరీష్ సంఘీ అడ్డుకున్నాడు. చంద్రబాబు పరోక్షంగా సంఘీపై ఒత్తిడి తెచ్చి ఆ వార్త రాకుండా జాగ్రత్తపడ్డాడు. నాకు చెప్పకుండానే గిరీష్ సంఘీ కొంతమంది రిపోర్టర్లను మార్చేసేవాడు. వాణిజ్య ప్రకటనలు సేకరించడమే మీ పని అని వారికి

చెప్పేవాడు. ఎప్పుడైనా తారసపడితే ఒకటో అరో వార్తలు రాయమనేవాడు. ప్రతి వార్తను మీకు చూపించి ప్రచురించడం సాధ్యపడదని, మీకు అస్మదీయులెవరో, తస్మదీయులెవరవో చెబితే అస్మదీయుల వార్తల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకునే వీలుంటుందని గిరీష్ సంఘీకి చెప్పేవాణ్ని.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రామనాథ్ గోయెంకా ఒక్కడే ఈ విషయంలో ఆదర్శంగా నిలిచాడు. తన వ్యాపార ప్రయోజనాలు కాపాడుకోవడానికి తాను ఎంత దూరమైనా వెళతానని, అందుకోసం పత్రికా స్వేచ్ఛను తాకట్టు పెట్టబోనని స్పష్టంగా ప్రకటించి ఆ మాటకే కట్టుబడ్డారు. తనపై వచ్చిన విమర్శలను కూడా ఎక్స్‌ప్రెస్‌లో ప్రచురించమనేవారు. వాటికి ఏం సమాధానం ఇవ్వాలో తాను చూసుకుంటాననేవారు.

ఇంతకంటే దిగజారడానికేం లేదు: ఇప్పుడు మీడియా పతనావస్థ పరాకాష్టకు చేరుకుంది. ఇంతకంటే దిగజారడానికి ఏమీ లేదు. యజమానులు, జర్నలిస్టులపై తమ పట్టు బిగించి ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. 1970ల వరకూ యూనియన్లు ఎంతో కొంత పాత్ర నిర్వహించేవి. ఇప్పుడు యూనియన్ల పాత్ర ఏమీ లేదు. వారు నిస్సహాయులుగా మిగిలారు. యజమానులు ఆడిందే ఆట, పాడిందే పాటగా కొనసాగుతోంది.

పార్వతీపురం కుట్ర కేసులో ఇరికించి రెండేళ్ల పాటు ఇబ్బందులు పెట్టారు: అప్పటికీ, ఇప్పటికీ నేను మార్క్సిస్టు ఐడియాలజీకే అంకితమైన వాణ్ని. అయితే నేను ఎన్నడూ కార్డు హోల్డరును కాను. నా మేనమామ చలసాని వాసుదేవరావు, ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ కమిటీలోని ఆరుగురు అగ్ర కమ్యూనిస్టుల్లో ఒకరు. మిగిలిన వారు – చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవ పున్నయ్య, మద్దుకూరి చంద్రశేఖరరావు, రాధాకృష్ణమూర్తి. చిన్న నాటి నుంచి కమ్యూనిస్టు భావజాల ప్రభావం నాపై పడింది. వాసుదేవరావుకు మేనల్లుడిని కావడమే ఇందుకు కారణం.

విశాలాంధ్ర దిన పత్రికలో సబ్ ఎడిటర్‌గా ఉన్నప్పుడు కాట్రగడ్డ రాజగోపాల్, కంభంపాటి సీనియర్ ఏటుకూరి బలరామమూర్తి, మోటూరు హనుమంతరావులతో కలిసి పనిచేశాను. 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయింది. నేను సిపిఐతో సంబంధాలను పూర్తిగా తెగతెంపులు చేసుకున్నాను. ఆ తర్వాత పుచ్చలపల్లి సుందరయ్య మార్క్సిస్టు పార్టీ తరఫున జనశక్తి వీక్లీ ప్రచురణను చేపట్టారు. నా చేతనే పత్రిక డిక్లరేషన్ వేయించారు. కొంతకాలం తర్వాత జనశక్తిని దిన పత్రికగా మార్చారు. ఆ తదనంతర పరిణామాల్లో మార్క్సిస్టు పార్టీలో కూడా చీలికవచ్చింది. పాలకొల్లులో జరిగిన సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టగా, తరిమెల నాగిరెడ్డికి అనుకూలంగా ఎక్కువ ఓట్లు వచ్చి తీర్మానం నెగ్గింది. మోటూరు హనుమంతరావు, నండూరి ప్రసాదరావు నాతో పత్రిక విషయమై సంప్రదింపులు జరిపారు. మెజారిటీ పక్షం వైపు మొగ్గుచూపి, తరిమెల నాగిరెడ్డికి జనశక్తిని బదిలీ చేశాను. దీంతో నన్ను పార్టీ విద్రోహిగా చిత్రీకరిస్తూ ప్రజాశక్తిలో మోటూరు హనుమంతరావు నాపై ప్రచారం మొదలు పెట్టారు.

నేను మౌలికంగా జర్నలిస్టును. ఈ చీలికలతో ఇన్ని తిరుగుళ్లు కష్టమని భావించాను. జర్నలిజంలోనే నా శక్తియుక్తిల్ని పూర్తిగా కేంద్రీకరించి పనిచేయాలని అనుకున్నాను.

సంధికాలం: రామకృష్ణారెడ్డి తెలుగు వెలుగు వార పత్రికను నడిపేవారు. బ్లిట్జ్‌లో కె.ఎ. అబ్బాస్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ పత్రికలో మలిపుట పేరుతో కాలమ్ రాసేవాణ్ణి. నా కాలమ్ పలువురిని ఆకట్టుకుంది. దిగంబర కవుల్లో చీలిక రాబోతోందని ఆరు నెలల ముందే ఊహించి ఈ కాలమ్‌లో రాశాను. వీరి రచనల్లో పొడసూపుతున్న సైద్ధాంతిక విభేదాలను గమనించి ఈ అంచనాకు రాగలిగాను. ఆ తర్వాత నా ఊహ నిజమై దిగంబర కవుల్లో చీలిక వచ్చింది. నేను ముందుగానే అంచనాకు వచ్చిన విషయాన్ని జ్వాలాముఖి రికార్డు చేశాడు కూడా. నా కెరీర్‌లో ఇదొక సంధికాలమనుకోవాలి.

ఆంధ్రజ్యోతిలో అడుగుపెట్టాను: ఆంధ్రజ్యోతి ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు కబురు పెట్టడంతో 1972లో విజయవాడ డెస్కులో చీఫ్ సబ్ ఎడిటర్‌గా చేరాను. జ్యోతిలో కుదురుకుని ఉద్యోగం చేసుకుంటున్నాను. ఇలా రోజులు గడుస్తున్నాయి.

ఒకరోజు సరుకులు కొనుక్కుని ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా పోలీస్ వ్యాన్ నన్ను అడ్డగించింది. వ్యానులో నుంచి పోలీసులు దిగి నా ఆటోను చుట్టుముట్టారు. ఆటోలో నుంచి నన్ను దింపి వ్యాను ఎక్కమన్నారు. నన్నెందుకు అరెస్ట్ చేస్తున్నారని అడిగితే పై నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి లాకప్‌లో ఒకటిన్నర రోజులు ఉంచారు. నాతో పాటు మరో నలుగురు మిత్రులను కూడా అరెస్టు చేసి లాకప్‌లో పడేశారు. వీరిలో ఇద్దరికి తీవ్రవాద ఉద్యమంతో సంబంధాలున్నాయి. నాతో సహా మిగిలిన వారందరూ సానుభూతి పరులం మాత్రమే.

పార్వతీపురంలో జరిగిన దొమ్మీలో మేమంతా పాల్గొన్నామని, నక్సలైట్లకు డబ్బులిచ్చామని మాపై అభియోగం మోపారు. వారం రోజులుగా విజయవాడ జ్యోతిలో నైట్ డ్యూటీలో ఉన్న నేను పార్వతీపురం వెళ్లడం ఎలా సాధ్యం? తమ తప్పుడు కేసుకు బలం చేకూర్చేందుకు మమ్మల్ని పార్వతీపురం తరలించారు. ఆ రోజుల్లో ఇలా ఎవరినైనా పట్టుకొస్తే ఎన్‌కౌంటర్ పేరిట కాల్చేసేవారు.

నన్ను అరెస్ట్ చేశారని తెలియగానే చుట్ట రామారావు, వి. హనుమంతరావు, టి.వి. కృష్ణ హైదరాబాద్‌లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావును కలిశారు. ఆంధ్రజ్యోతి రామకృష్ణ సహా హైదరాబాద్‌లోని ఇతర జర్నలిస్టు మిత్రులు కూడా వీరికి అండగా నిలిచారు. నైట్ డ్యూటీ చేసుకుంటున్న జర్నలిస్టులపై తప్పుడు అభియోగాలు మోపి అరెస్టు చేయడం అన్యాయమని, నన్ను వెంటనే విడుదల చేయాలని వీరంతా జలగం వెంగళరావును డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి వ్యవస్థాపకులు కె.ఎల్.ఎన్. ప్రసాద్, ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు కూడా నా అరెస్టును నిరసిస్తూ ముఖ్యమంత్రికి ఘాటుగా ఉత్తరం రాశారు. పోలీసు కేసులు ఎందుకు వీగిపోతున్నాయో ఇప్పుడు మరింత బాగా అర్థమవుతోందని నన్ను వెంటనే విడుదల చేయాలని వారు ఆ లేఖల్లో డిమాండ్ చేశారు. ఈ ఒత్తిళ్లు, నిరసనలకు పోలీసులు ఏమాత్రం తలొగ్గలేదు. కేసును కొనసాగించారు. నన్ను విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. కానూ సన్యాల్, నాగభూషణ్ పట్నాయక్‌ను కూడా ఇదే జైలులో వేరే సెల్‌లో పెట్టారు.

బొడ్డపాడులో నక్సల్ సమావేశంలో పన్నిన కుట్రలో పాల్గొన్నట్లు ఒప్పుకుని అప్రూవర్‌గా మారితే బెయిల్ ఇస్తామని నాపై పోలీసులు ఒత్తిడి తెచ్చారు. ఆ బొడ్డపాడు ఎక్కడుందో కూడా నాకు తెలీదని, అప్రూవర్‌గా మారే ప్రసక్తే లేదని తేల్చి చెప్పాను. ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడంతో చివరకు రెండు నెలల తర్వాత బెయిల్ ఇచ్చారు. ఈ కుట్ర కేసులో మొదటగా బెయిల్ పొందింది నేనే.

ఇలా ఏ నేరం చేయని నేను రెండేళ్ల పాటు వ్యయ ప్రయాసల కోర్చి కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఆ తర్వాత కేసు నుంచి పూర్తిగా విముక్తి లభించింది.

(రచయిత జర్నలిస్టు)

అమెరికా-ఇరాన్ యుద్ధ మేఘాలు

అమెరికాలో ట్రంప్ పట్ల పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను దృష్టి మళ్లించి ఎన్నికల్లో గెలుపొందడానికే సోలిమనీని హత్యచేయించాడనీ, ఈ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ చర్యలు చేపట్టవచ్చని అంటున్నారు ఎ. నర్సింహా రెడ్డి

అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ బాధ్యత చేపట్టినప్పటి నుండి ఇరాన్-అమెరికా మధ్య మాటల యుద్ధం జరుగుతూనే ఉంది. అప్పుడప్పుడు ఘర్షణలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఆరోపణలు, పత్యారోపణలు వింటూనే ఉన్నాం. నిత్యం ఉద్రిక్తతలతో సతమతమవుతున్న పశ్చిమాసియాలో అమెరికా మరో దుస్సాహసానికి పాల్పడింది. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) కమాండర్ మేజర్ జనరల్ ఖాసిం సోలిమనీని జనవరి 3న డ్రోన్ మిసైల్ దాడిలో హతమార్చి ఇరాన్‌పై యుద్ధభేరి మోగించింది. ఇంతకాలం నివురుగప్పిన నిప్పులా ఉన్న ఉద్రిక్త వాతావరణం ఒక్కసారిగా భగ్గుమన్నది. ఖాసీం సోలిమనీ మరణం ఇరాన్ ప్రభుత్వానికి అతిపెద్ద దెబ్బ. పశ్చిమాసియాలో ఇరాన్ శక్తిని వ్యాపింపజేయటానికి వ్యూహాత్మకంగా కృషి సల్పిన వ్యక్తి. ఈ దాడిలో సోలిమనీతోపాటు ఇరాక్ కుర్దిష్ మిలీషియా డిప్యూటీ చీఫ్ కమాండర్ అబు మహందీస్‌తో సహా మరో 8 మంది మృతి చెందారు. సోలిమనీని అంతం చేస్తే ఇరాన్‌కు చెక్ పెట్టవచ్చనీ అమెరికా తెగబడింది. నిజానికి ట్రంప్ స్వయంగా జనవరి 1న ఇరాక్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ముట్టడి తర్వాత ఇరాక్ ప్రధానికి ఫోను చేసి మధ్యవర్తిత్వం వహించమన్నాడు. ఇరాక్ ప్రధాని ఆహ్వానం మేరకు ఇరాన్ సైనిక జనరల్ సోలిమనీ, ప్రజల ప్రీతిపాత్రుడు డమస్కస్ (సిరియా) నుండి బాగ్దాద్‌కు చేరుకొన్నాడు.

రాయబారానికి, శాంతి సాధనకు వచ్చిన సైనిక కమాండర్ (జనరల్) ఖాసీం సోలిమనీని అంతర్జాతీయ న్యాయసూత్రాలకు, యుద్ధనీతికి భిన్నంగా అమెరికా హత్య చేసింది. దౌత్యపరమైన రక్షణ ఉన్న నాయకుడిపై సైనిక చర్య తీసుకోవడమంటే అమెరికా యుద్ధ నీతిని ఖాతరు చేయకపోవడానికి తార్కాణం. యుద్ధ రంగాన్ని మరింత విస్తరించడానికి నిదర్శనం. అంతర్జాతీయ నీతి ప్రకారం విదేశీ నేతలను అంతమొందించడం దారుణం. ఇలాంటి హత్యలను 'ద్రోహ పూరిత' చర్యల కింద పరిగణిస్తారు. ట్రంప్ ప్రభుత్వం నియమబద్ధమైన అంతర్జాతీయ వ్యవస్థకు విఘాతం కలిగిస్తోంది. బర్బరత్వాన్ని పోషిస్తోంది. మధ్య యుగాల నాటి హత్యా రాజకీయాలకు పాల్పడుతోంది. దీంతో అమెరికా, ఇరాన్‌ల మధ్య ఇరాక్ భూభాగంపై పరోక్ష యుద్ధం మొదలైంది. ఇరాక్‌పై తమకున్న పట్టు సడలనీయకూడదని అమెరికా.. అక్కడి నుంచి అమెరికా సైన్యాన్ని పూర్తిగా సాగనంపాలని ఇరాన్ పోటీపడుతున్న తీరు చివరకు రెండు దేశాల మధ్యా ప్రత్యక్ష పోరుకు దారితీసే ప్రమాదముంది.

ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఖాసీం సోలిమనీపై దాడిని అధికారికంగా ప్రకటించిన ట్రంప్. అమెరికా పౌరులను కాపాడుకోవడానికే ఈ చర్యలు చేపట్టినట్టు పునరుద్ఘాటించారు. తమ దౌత్యాధికారులు, సైనికులే లక్ష్యంగా దాడులకు సోలిమనీ నేతృత్వంలో ఇరాన్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం అందిందని, అందుకే ఆయన్ని మట్టుబెట్టాల్సి వచ్చిందని బుకాయిస్తున్నారు. జనవరి 1 బాగ్దాద్‌లోని అమెరికా దౌత్యకార్యాలయం ఇరాక్‌లో అమెరికా మిత్రపక్షాల సైనిక స్థావరాలపై దాడులకు అతడే సూత్రధారి అని ట్రంప్ పేర్కొన్నాడు. సంకీర్ణ దళాలకు చెందిన వందలాది మంది సైనికుల మరణాలకు అతడే కారణమని ఆరోపించారు. తమ దౌత్యాధికారులు, సైనికులపై చేయబోయే మరిన్ని దాడులను అడ్డుకోవడానికే సోలిమనీని హతమార్చామని సమర్థించుకున్నారు.

సోలిమనీ హత్యకు నేపథ్యం

ప్రజాస్వామ్య ఇరాన్ ప్రభుత్వాన్ని 1953లో అమెరికా సిఐఏ కూల్చి మొహమ్మద్ రెజా పహ్లావి అనే నియంతను సింహాసనంపై కూర్చోబెట్టింది. ఇరాన్ విప్లవం తర్వాత ఆయా తొల్లాహ్ ఖోమైనీ 1979 ఏప్రిల్ 22న ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి)ని స్థాపించాడు. ఇది ఇరాన్ సైన్యంలో భాగంగానే ఉంటుంది. కానీ దీని ప్రత్యేకత ఇస్లామిక్ భావాజాలాన్ని కాపాడడం, మత ప్రవక్తకు రక్షణగా ఉండడం, విదేశీయుల దాడుల నుండి ఇస్లాంను కాపాడడంగా ఉంది. ఖుద్స్ ఫోర్స్ ఇందులో ఒక విభాగం. ఖుద్స్ దళాలను సోలిమనీ అత్యంత పకడ్బందీగా నిర్మించారు. ఇరాక్ భూభాగం నుంచి విదేశీ సైన్యాలు వెళ్లిపోవాలని ఈ దళాలు ఉద్యమిస్తున్నాయి. సోలిమనీ ఇరానియన్లకు ఆరాధ్యుడు, ఇరాన్ అధినేత ఖమేనీకి బాగా సన్నిహితుడు. షియాల దృష్టిలో రక్షకుడు. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్‌కు చెందిన ఖుడ్స్ ఫోర్స్ అధినేత. ఇరాన్‌కు అనుకూలంగా ఇరాక్, ఇతర దేశాల్లో ప్రజలను సమీకరించి ప్రజాదళాలను నిర్మించాడు. ఈ దళాలనే హషద్ అష్ షా అని పిలుస్తారు.

సోలిమనీ లేనంత మాత్రాన ఖుడ్స్ ఫోర్స్ కుప్పకూలిపోయే ప్రమాదం ఏమీ ఉండదు. దానికి కొత్తగా వచ్చిన నాయకుడు ఘనీ కూడా వ్యూహాత్మకమైన, ప్రతిభావంతుడైన నాయకుడే. మధ్యప్రాచ్యంలో సౌదీ అరేబియా, ఇరాన్‌లను రెండు కళ్లుగా అమెరికా అధ్యక్షులు చెప్పేవారు. మధ్యప్రాచ్యంలో చమురు దోపిడీలు పెంచారు. ఆయుధ అమ్మకాలు పెరిగాయి. 1972లో కోటీ మూడు లక్షల డాలర్ల అమ్మకాలు జరుగగా, 1978 నాటికి 5 కోట్ల 52 లక్షల డాలర్లకు పెరిగాయి. ప్రజాస్వామ్యవాదుల్ని, కమ్యూనిస్టుల్ని హత్యలు చేశారు. 1978 నాటికి ప్రజావెల్లువతో కూడిన విప్లవం ఇరాన్ నియంతను దించి అమెరికా దోపిడీలకు అడ్డుకట్ట వేశారు. అప్పటి నుండి అమెరికా ఇరాన్‌తో యుద్ధానికి సన్నద్ధమవుతూనే ఉన్నది. అమెరికా, యూరపు దేశాలు పలు రకాల ఆంక్షల్ని విధించి అభివృద్ధికి ఆటంక మవుతూనే ఉన్నాయి. 1979లో దేశ సేవకు సోలిమనీ ఐఆర్‌జిసి లో చేరాడు.

ఇజ్రాయిల్ మినహా మరే దేశమూ సోలిమనీ హత్యను బలపరచకపోయినా, ట్రంప్ చర్యకు అనుగుణమైన విధానాలు అనుసరించే దేశాలు మధ్యప్రాచ్యంలో అనేకం ఉన్నాయి. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ), బహరైన్ వాటిలో ప్రధానమైనవి.

ఇజ్రాయిల్ 2016లో ట్రంప్ ఎన్నికను బలపరిచింది. ఆయన తిరిగి పోటీ చేయడాన్ని బలపరుస్తున్నది. అనేక దశాబ్దాల క్రితం అమెరికా తొత్తు షా ప్రభుత్వాన్ని ఇరాన్ తిరుగుబాటు తొలగించినప్పటి నుంచీ ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చాలని అమెరికా, ఈ దేశాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. 2002లో అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్, దుష్ట రాజ్యాల కూటమిలో ఇరాన్‌ను కూడా చేర్చారు. ఇరాన్‌ను ఏదో విధంగా ప్రపంచ ఆర్థిక, రాజకీయ సముదాయంలోకి రాబట్టాలని కోరుకునే బడా వ్యాపార వర్గ విభాగాలు అమెరికాలో, యూరప్‌లో ఉన్నాయి. మధ్యప్రాచ్యంలో ఇరాన్ ప్రాబల్యాన్ని తగ్గించాలన్నది అమెరికా ధ్యేయం. అంతేగాక చమురు సమృద్ధిగా ఉన్న ఇరాన్‌పై ఆధిపత్యం కోసం అమెరికా దశాబ్దాలుగా ప్రయత్నం చేస్తున్నది.

ఇరాక్, లెబనాన్, యెమెన్, సిరియా, ఇతర పశ్చిమాసియా దేశాల్లో అమెరికన్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు సోలిమనీ గట్టి దన్నుగా నిలవడమే ట్రంప్ కంటగింపునకు కారణం. అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్‌ను ఒబామా, ఐఎస్ పెద్దదిక్కు అబు బకర్ అల్ బగ్దాదీని ట్రంప్ యంత్రాంగాలు హత్య చేసినా వాళ్లిద్దరూ ప్రైవేటు వ్యక్తులు, భయానక తీవ్రవాద శక్తులు! వాళ్లకు భిన్నంగా మేజర్ జనరల్ సోలిమనీ ఇరాన్ సర్వోన్నత నేత ఖమేనీకి అత్యంత సన్నిహితుడే కాదు, పశ్చిమాసియాలో టెహరాన్ ప్రాబల్య విస్తరణ వ్యూహ నిర్మాణ కోవిదుడు! అమెరికా చర్యతో ప్రపంచం పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందన్న ఆందోళనల నేపథ్యంలో-పశ్చిమాసియా ప్రస్థానంలో అక్షరాలా అసురసంధ్య ఇది!

ట్రంప్ ఏకపక్షంగా 2018లోనే ఆ అంతర్జాతీయ అణు ఒప్పందం నుంచి అమెరికాను ఉపసంహరించారు. ఇరాన్‌లో యురేనియం శుద్ధి, శుద్ధి చేసిన యురేనియంను ఎంతమేరకు నిల్వ చేసుకోవచ్చు. దాని పరిశోధన అభివృద్ధిపై ఆ ఒప్పందం పరిమితులు విధించింది. ఒబామా ప్రభుత్వ కాలం (2015)లో కుదిరిన ఒప్పందం నుంచి ట్రంప్ వైదొలగడమేగాక, ఇరాన్‌పై కఠినమైన ఆంక్షలు విధించారు. ప్రస్తుత యుద్ధ ప్రమాద బీజాలు అందులో ఉన్నాయి. గత జూన్‌లో గల్ఫ్ ప్రాంతంలోని రెండు చమురు ట్యాంకర్లపై దాడి, పిమ్మట అమెరికా నౌకదళానికి చెందిన గ్లోబల్ హాక్ డ్రోన్ కూల్చివేతలతో అమెరికా ఇరాన్ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. గత డిసెంబర్ 27న ఇరాక్‌లోని కిర్కుక్ అమెరికా సైనిక స్థావరంపై రాకెట్ దాడి జరిగింది. ఈ దాడిలో అమెరికన్ కాంట్రాక్టర్ మరణించగా, నలుగురు సైనికులు గాయపడ్డారు. దీని వెనుక సోలిమనీ హస్తం ఉందని అమెరికా అనుమానించడంతో ప్రతీకారంగా డిశంబర్ 29న అమెరికా కతైబ్ మిలీషియా స్థావరంపై వైమానిక దాడి చేసి 24 మంది మిలిటెంట్లను చంపివేసింది. దీంతో ఖుడ్స్ మిలీషియా అమెరికా దౌత్య కార్యాలయాన్ని డిసెంబర్ 31న చుట్టుముట్టి 24 గంటలకు పైగా దిగ్బంధించింది. జనవరి 1న అక్కడి ఔట్‌పోస్టుకు నిప్పుబెట్టింది. తమపై రాకెట్ దాడికి ప్రతీకారం తీర్చుకుంటే దౌత్య కార్యాలయంపై దండయాత్ర వంటి ఘటనలతో ట్రంప్ ఏకంగా సోలిమనీని టార్గెట్ చేశాడు.

అమెరికా పట్ల పెరుగుతున్న ఇరాన్ వ్యతిరేకత

గత నవంబర్ నుండి ఇరాన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు, ఆర్థిక సంక్షోభానికి, నియంతృత్వ పాలనకు, పెరిగిన గాసోలిన్ (పెట్రోల్, డీజిల్) ధరలకు వ్యతిరేకంగా, మరింతగా ప్రజాస్వామ్యం కొరకు దేశ వ్యాప్త ప్రజా నిరసన ప్రదర్శనలు జరిగాయి. అయితే ప్రభుత్వం ప్రజల నిరసనలను డిసెంబర్ మాసంలో క్రూరంగా అణగదొక్కింది. దేశం అంతర్యుద్ధ పరిస్థితులకు లోనైంది. సోలిమనీ హత్యతో నిరసనోద్యమం మూగబోయింది. సోలిమనీ హత్యకు నిరసనగా ఇరాక్‌లో, ఇరాన్‌లో ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. ప్రతీకార జ్వాలతో జనం రగిలిపోయారు. ప్రభుత్వ వ్యతిరేక, ప్రభుత్వ అనుకూల విభాగాలు రెండింటికీ చెందిన లక్షలాది మంది అమెరికా దాడిని ఖండించారు. తమ దేశంలో అమెరికా ఉనికికి వ్యతిరేకంగా వేలాది మంది ఐక్యంగా జాతీయ భావంతో ప్రదర్శనలు జరిపారు. అమెరికాకు చావు తప్పదంటూ నినాదాలు చేశారు.

సోలిమనీ అంత్యక్రియల్లో జరిగిన తొక్కిసలాటలో 35 మంది మృత్యువాత పడ్డారంటే ఎంత భారీ సంఖ్యలో జనం హాజరయ్యారో అర్థం చేసుకోవచ్చు. ఇరాన్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు సయ్యద్ ఆయాతోల్లాహ్ రూహోల్లా ఖోమెయినీ 1989లో చనిపోయినప్పుడు కూడ ఇంతమంది జనం అంతిమయాత్రలో పాల్గొనలేదంటే సోలిమనీకి ప్రజల్లో ఉన్న ఆదరణ ఏమిటో అర్థమవుతున్నది. ఇరాన్ పలుకుబడిని అనేక మధ్యప్రాచ్య దేశాలకు విస్తరించిన తమ దేశ ఖుడ్స్ దళం నాయకుడు సోలిమనీ చేసిన కృషిని ఇరానియన్‌లు గౌరవిస్తున్నారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (సైన్యం) అనుబంధ మిలీషియా విభాగం ఖుడ్స్ ఇరాక్, లెబనాన్, ఎమెన్, సిరియా దేశాల్లో బలంగా ఉంది. ఐఎస్ఐఎస్‌తో పోరాటంలో అది ప్రధాన పాత్ర వహించింది. సోలిమనీ తన వీర మరణంతో దేశంలోని అనేక రాజకీయ గ్రూపులను ఐక్యం చేయగలిగాడు. తను బతికి ఉంటే ఈ ఐక్యతను కలలో కూడా ఊహించలేడు.

సోలిమనీ అంత్యక్రియల్లో పాల్గొన్న ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ హుస్సేని ఖమేనీ 'గట్టి ప్రతికార చర్యతో అమెరికాకు సమాధానం చెబుతానని' ప్రతిన చేశాడు. ఇజ్రాయిల్ నగరాలైన హయిఫా, టెల్ అలీవ్‌లను సర్వనాశనం చేయడం కూడా అందులో ఉండవచ్చని ఇరాన్ ప్రకటించింది. సోలిమనీ హత్య నేపథ్యంలో, అణు ఒప్పందం నుంచి తక్షణం ఉపసంహరించుకుంటున్నట్లు ఇరాన్ ప్రకటించింది. 'అమెరికా చేసిన పెద్ద పొరపాటుకు రానున్న సంవత్సరాల్లో క్షోభ తప్పదని ఇరాక్ ప్రధాని అబ్దుల్ మహిందీ అన్నాడు. ఇప్పటి వరకూ ఇరాక్, ఇరాన్ దేశాల్లో అంతర్గత సమస్యలతో సతమతమవుతున్న ప్రజలలో అమెరికా వ్యతిరేకత పెరిగి జాతీయవాదాన్ని పరిరక్షించుకోడానికి ప్రజలంతా ఒకటైనారు. ఇప్పుడు ప్రతీ మనిషీ ఒక సైనికునిగా అమెరికాకు వ్యతిరేకంగా పోరాడడానికి సన్నద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా, ఎటువంటి అనుమతి కోరకుండా ఇరాక్ గడ్డపై సోలిమనీని అమెరికా మట్టుపెట్టినందున, ఆ హత్యను తమ దేశ సార్వభౌమత్వాన్ని ధిక్కరించడంగా ఆ ప్రభుత్వం భావించింది. ఇరాక్ నుంచి అమెరికా సైన్యాలను బహిష్కరిస్తూ జనవరి 8న ఇరాక్ పార్లమెంట్ తీర్మానం ఆమోదించింది.

ట్రంప్ దుస్సాహసం ఎన్నికల ఎత్తుగడ

2020 అధ్యక్ష ఎన్నికలకు అభ్యర్థిత్వం కొరకు పోటీపడుతున్న డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థులందరూ ట్రంప్ చర్యను ఖండించారు. యుద్ధం విషయంలో నిర్ణయం తీసుకునే క్రమంలో కాంగ్రెస్‌ను దూరంగా ఉంచడం రాజ్యాంగ వ్యతిరేకమని వారన్నారు. సెనెటర్ బెర్నీ శాండర్స్ తీవ్రంగా స్పందిస్తూ, ఇరాక్‌పైకి యుద్ధానికి వెళ్లకుండా ట్రంప్‌ను నిరోధించే శాసనాన్ని రూపొందించాలని ఆయన డిమాండ్ చేయగా ప్రతినిధుల సభ ఆ ప్రతిపాదనను ఆమోదించింది. ట్రంప్ చర్య ప్రభావం 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయానికి తోడ్పడుతుందేమో కానీ

పశ్చిమాసియాను మాత్రం తగులబెట్టబోతున్నది. అమెరికా-ఇరాన్ ఘర్షణల్లో ఇరాక్ యుద్ధక్షేత్రంగా మారే ప్రమాదముంది. యుద్ధోన్మాదం ప్రకోపింపజేసి మెజార్టీ ప్రజలను తనవెనుక కూడగట్టడం ఆయన ఉద్దేశంగా కనబడుతోంది. అంతేగాక, తాను ఎదుర్కొంటున్న అభిశంసన నుంచి ప్రజల, డెమోక్రాట్ల దృష్టి మరల్చడం కూడా అందులో భాగంగా ఉంది. తాజా పోల్స్ ప్రకారం ఆయన్ను అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని 52 శాతం కోరుతున్నారు.

అమెరికాలో ఈ ఏడాది చివరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మళ్లీ పోటీచేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. దేశంలో ట్రంప్ విధానాలపై తీవ్ర అసంతృప్తి చెలరేగుతోంది. అమెరికా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. దేశంలో పేదరికం, నిరుద్యోగం పెరిగింది. ఈ నేపథ్యంలో ఆయనపై పార్లమెంట్‌లో అవిశ్వాసం కూడా పెండింగ్‌లో ఉన్న విషయం విదితమే. అమెరికా అధ్యక్ష ఎన్నికలు దగ్గర పడుతున్నాకొద్దీ డోనాల్డ్ ట్రంప్ యుద్ధోన్మాద పోకడలు వికృత స్థాయికి చేరుకుంటున్నాయి.

సోలిమనీ హత్య యుద్ధ నేరమని తెలిసినా, ఇది అమెరికా రాజ్యాంగానికి వ్యతిరేకమైనదైనప్పటికీ, నిరంతరాయంగా లక్షలాది ప్రజల ప్రాణాలను బలితీసుకునే ఘోరమైన యుద్ధాలు చేస్తున్నా అమెరికా సామ్రాజ్యవాద ప్రాబల్యం క్షీణత ఆగడంలేదు. అమెరికాలో ఆర్థిక అస్థిరత, సామాజిక అసమానతల తీవ్రత, వర్గ పోరాటాల వృద్ధి వంటి విషయాలు అమెరికాను మరింతగా కుంగదీస్తున్నాయి. నేరాలకు పాల్పడడం ద్వారా మాత్రమే పాలకవర్గాలు తమ సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చుకోగలిగే పరిస్థితులు నెలకొన్నాయి. పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతకు భయపడి అమెరికా ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తోంది. అమెరికాలో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు డెమోక్రాటిక్ లేక రిపబ్లిక్ పార్టీలు సిద్ధంగా లేవని ఖాసీం సోలిమనీ హత్య మరోసారి నిరూపించింది.

ఇరాన్-అమెరికాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత

ఎన్నో ఏళ్ల నుంచి ఉప్పు నిప్పుగా ఉన్న అమెరికా, ఇరాన్ల మధ్య ఉన్న విభేదాలు సోలిమనీ హత్యతో ఒక్కసారిగా భగ్గుమన్నాయి. అమెరికా చర్యను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. సోలిమనీని చంపినందుకు ప్రతీకార జ్వాలతో రగిలిపోతుంది. దీనికి తీవ్ర ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా సైన్యాన్ని ఉగ్రవాదులుగా పేర్కొంటూ ఇరాన్ పార్లమెంట్ జనవరి 7న తీర్మానించింది. దీంతో మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు పెరిగాయి. మరోవైపు ఇరాక్‌లోని యుఎస్ సైనిక స్థావరాలపై జనవరి 8న ఇరాన్ క్షిపణుల దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 11 మంది అమెరికా సైనికులు గాయపడినట్టు పెంటగాన్ ధ్రువీకరించింది. గాయపడ్డవారంతా సైనిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపింది.

ఓ వైపు యుద్ధం ప్రారంభించడానికి తాము దాడి చేయలేదంటూనే మరోవైపు అమెరికా అదనపు బలగాలను మోహరిస్తుండడం గమనార్హం. అమెరికా ప్రయోజనాన్ని దెబ్బతీసేందుకు ఇరాన్ ప్రణాళికలు రచిస్తున్నదని తొలుత గత మే నెలలో ప్రకటించిన నాటి నుండి ఇప్పటి వరకు పశ్చిమాసియాలో యుఎస్ 14,000 బలగాన్ని మోహరించింది. సోలిమనీ హత్య తర్వాత నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆ ప్రాంతంలో అదనంగా నార్త్ కరోలినాలోని 82వ ఎయిర్‌బోర్న్ విభాగంలోని గ్లోబల్ రెస్పాన్స్ ఫోర్స్‌కు చెందిన 3000 మంది సైనికుల్ని తరలిస్తున్నట్లు ప్రకటించింది. అదనపు సైనిక దళాలను మధ్యప్రాచ్యానికి దింపుతూ, ఇరాన్‌లో 52 ప్రధాన వ్యూహాత్మక ప్రదేశాలను, సాంస్కృతిక చారిత్రాత్మక స్థలాలను ధ్వంసం చేస్తామని ట్రంప్ ప్రకటించాడు. ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడంగా ఆయన భావించడం లేదు. కాగా అంతర్జాతీయ చట్టాన్ని గౌరవిస్తామని రక్షణ మంత్రి దిద్దుబాటు ప్రకటన చేశారు.

గోబెల్స్‌ను మించిన ట్రంప్ అబద్ధాలు

అమెరికా మాత్రం ఇరాక్ ప్రజలు సంబరాలు చేసుకొంటున్నారని తప్పుడు ప్రకటనలిస్తూ, యుద్ధం అనివార్యమని ప్రచారం చేస్తున్నది. సోలిమనీ నరహంతకుడని, సైతాన్ అని అమెరికా మీడియా ప్రచారం ప్రారంభించింది. ఫ్రెంచ్, జర్మనీ మీడియా మాత్రం ట్రంప్‌కు పూర్తిగా వంతపాడడం లేదు. అమెరికా ఉపాధ్యక్షుడు, విదేశాంగ మంత్రి అప్పుడే గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. అమెరికా ట్రూపులను చంపడానికి ఈ కమాండరే కారణమని చెబుతూ, వందసార్లు అబద్ధాలు చెబితే నిజమవుతుందని నమ్మబలుకుతున్నారు. 17 సంవత్సరాల ఆఫ్ఘన్‌పై యుద్ధం, 16 సంవత్సరాల ఇరాక్ అశాంతి, 6 సంవత్సరాల సిరియా మారణహోమం, నాలుగు సంవత్సరాల ఎమెన్‌లో యుద్ధం, కరువుకు కారణాలై మొత్తం మీద 10 లక్షల మందిని చంపిన అమెరికా సేనలు, అమెరికా సామ్రాజ్యం అబద్ధాలను చెబుతూ, మానవ హక్కులపై మొసలి కన్నీరు కారుస్తుంది. కోట్లాది మందిని నిరాశ్రయులుగా మార్చి శరణార్థులను చేసిన క్రూరత్వ మనస్తత్వం అమెరికా పాలకులదే.

ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిపి) విదేశీ విభాగమైన ఖుద్స్ ఫోర్స్ అధిపతి సోలిమనీ ప్రపంచ నెంబర్ వన్ ఉగ్రవాది అని ట్రంప్ ముద్ర వేయడం ఈ శతాబ్దిలోనే అతిపెద్ద జోక్. నిజానికి ట్రంపే అతి పెద్ద ఉగ్రవాది అని ఇరాన్ పార్లమెంట్ తీర్మాణం కూడా చేసింది. ఈ దాడి తరువాత ట్రంప్ ఇరాన్‌ను మరింతగా రెచ్చగొట్టేలా చేస్తున్న ప్రకటనలు, బెదిరింపులే ఇందుకు తార్కాణం. ట్రంప్ తన నీతిమాలిన చర్యను నిస్సిగ్గుగా సమర్థించుకుంటూ, భారత్‌లో ఉగ్రవాద దాడులకు సోలిమనీ కుట్రపన్నారని అలవోకగా చెప్పారు. భారత్‌ను ఇరాన్‌కు శత్రువుగా నిలపాలన్న దుర్బుద్ధి తప్ప దీనికి ఎలాంటి హేతుబద్ధత లేదు. కుక్కను చంపే ముందు అది పిచ్చిది అని ముద్ర వేసినట్టే, ట్రంప్ సోలిమనీని చంపేసి, ఇటువంటి కట్టుకథలను ప్రచారంలో పెడుతున్నారు. గతంలో బుష్ కూడా ఇరాక్‌పై దండెత్తడానికి అవసరమైన ప్రాతిపదికను ఏర్పరచుకునేందుకు సద్దాం హుస్సేన్ వద్ద సామూహిక మారణాయుధాలు పెద్దఎత్తున పోగుపడి ఉన్నాయని తప్పుడు ఆరోపణలు చేశాడు. అబద్ధాలు ప్రచారం చేయడంలో బుష్‌కీ, ట్రంప్‌కీ పెద్ద తేడా ఏమీ లేదు.

న్యూయార్క్, వాషింగ్టన్లపై సెప్టెంబర్ 11నాటి ఉగ్రదాడులకు ఎక్కడెక్కడో అసంబద్ధమైన లంకెలు పెడుతూ స్వీయ వ్యూహాత్మక తప్పిదాల్ని కప్పిపుచ్చేందుకు అమెరికా పెద్దల ప్రయాసలు అన్నీఇన్నీ కావు. అప్పట్లో అమెరికాపై దాడులకు పాల్పడిన 10-12 మంది ఉగ్రవాదుల్ని రహస్యంగా అఫ్గనిస్తాన్‌కు పంపింది సోలిమనీయేనని ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ కొత్త కథ అల్లుతున్నారు. నిజానికి అఫ్గాన్‌లో తాలిబన్ల అణిచివేయడానికి అమెరికాకు సోలిమనీయే సహకరించాడని ఎన్నో మిలిటరీ విశ్లేషణలు మొత్తుకొంటున్నాయి. సున్నీ షియా వర్గీయుల మధ్య పెను వైషమ్యాల రణక్షేత్రంగా పశ్చిమాసియాలో సెగలు పొగలు కక్కుతున్నాయి. బాగ్దాద్‌లో అమెరికా దాడిని 'దురాక్రమణ'గా ఇరాక్ ప్రధానమంత్రి గర్హించగా, అమెరికా దళాల్ని దేశం నుంచి బహిష్కరించాలని అక్కడి పార్లమెంటు తాజాగా తీర్మానించింది. ఒకవంక అమెరికా, మరోపక్క ఇరాన్‌ల ప్రచ్ఛన్న రణస్థలిగా మారి ఇరాక్ మరో

సిరియాగా రూపాంతరం చెందుతుందేమోనన్న భయాందోళనలూ ముప్పిరిగొన్నాయిప్పుడు!

తానిచ్చింది వరం, పెట్టింది శాపంగా చలాయించుకొనే అమెరికా ఉగ్రవాదం. అధ్యక్షుడిగా ట్రంప్ తీసుకొన్న రెండు వివాదాస్పద నిర్ణయాల్లో బుసలుకొట్టింది. అందులో మొదటిది వాతావరణ మార్పుల దుష్ప్రభావాన్ని కట్టడి చెయ్యడానికి ఉద్దేశించిన ప్యారిస్ ఒడంబడిక, రెండోది ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపివేయించేలా కుదిరిన కీలక ఒప్పందం. ఈ రెండింటి నుంచీ ఏకపక్షంగా వైదొలగిన ట్రంప్ సర్కారు మాటలకు చేతలకు పొంతన లేని విధానాల్ని అనుసరిస్తోంది. ఇరాన్‌తో అణు ఒప్పందానికి దూరం కావడానికి ముందే జెరూసలేమ్‌ను అధికారికంగా ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తించాలని నిర్ణయం తీసుకొన్నానని, పశ్చిమాసియా సంక్షోభ పరిష్కారానికి అది కొత్తదారి చూపుతుందంటూ ట్రంప్ ప్రభుత్వం విచిత్ర వాదనలు వినిపించింది. దరిమిలా ఇరాన్‌ను ఆర్థికంగా దిగ్బంధించేందుకు ఆ దేశం నుంచి చమురు దిగుమతుల్ని పూర్తిగా నిలిపివేయాలంటూ భారత్ సహా 8 దేశాలకు ఫర్మానాలూ జారీ చేసింది.

పశ్చిమాసియాలో పెత్తనమే అమెరికా లక్ష్యం

పశ్చిమాసియాలో ఇరాన్ ప్రాముఖ్యాన్ని పెంచేందుకు సోలిమనీ నేతృత్వంలోని ఖుడ్స్ దళం ప్రయత్నిస్తోంది. పశ్చిమాసియాలో తమకెదురులేదనే సంకేతాలను ప్రపంచ దేశాలకు పంపాలని సోలిమనీ కృషి చేస్తున్నారు. ఆయన చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు అమెరికా హత్యచేసింది. ప్రపంచంలో ఏ దేశంలోనైనా లేక ఏ ప్రాంతంలోనైనా తమ ప్రాబల్యం పెంచుకుంటే తప్పులేదనీ, మరోదేశం తన సరిహద్దు ప్రాంతంలో తిరుగులేని శక్తిగా ఆవిర్భవిస్తే మాత్రం అమెరికా తట్టుకోలేకపోతుందనేందుకు చరిత్రలో మనకు అనేక సాక్ష్యాలు నిలుస్తాయి. అగ్రరాజ్యంగా చెలామణి అవుతూ ప్రపంచ పోలీసు పాత్రను పోషించడంలో అమెరికా ముందుంటుంది. అభివృద్ధి చెందిన దేశంగా పలు దేశాలపై పెత్తనం చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చే అమెరికా మరో దేశ ప్రాబల్యాన్ని గానీ, ప్రాముఖ్యాన్ని గానీ సహించలేదు.

ప్రపంచ దేశాల్లో తాము ఎంపిక చేసుకున్న దేశాల్లో అణ్వాయుధాలను తనిఖీ చేసే అధికారం తనకు తాను కల్పించుకుని అణ్వాయుధాల అంశంలో కొరియాతో ఘర్షణకు కారణంగా నిలిచింది. ఒకదశలో ఉత్తరకొరియా, అమెరికా బాహాబాహీకి సంసిద్ధం కావడం. అణ్వాయుధాల అంశంలో ట్రంప్, కిమ్ ఒకరిపై మరొకరు సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకోవడం విధితమే. అలాగే మధ్యప్రాచ్యంలో ప్రాబల్యం కోసం ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌ను బలి పశువు చేసి ఉరితీయడంలోను, ఇప్పుడు ఇరాన్‌తో వైరం విషయంలోనూ అమెరికా ముందుంది. ఈ రకమైన బెదిరింపులు, దాడులతో తనకుతాను పాలకులెవరైనా ప్రపంచ ఆధిపత్యం కోసం ప్రయత్నించడం అమెరికాకు వెన్నతోపెట్టిన విద్య. ప్రచ్ఛన్న యుద్ధం నేపథ్యంలో వియత్నాంపై దశాబ్దాలపాటు యుద్ధం చేసినా, చివరకు చావు తప్పి కన్నులొట్టపోయినట్లుగా యుద్ధ విరమణకు సిద్ధపడ్డా అమెరికా ఇంకా గుణపాఠం నేర్చుకోలేదు. పశ్చిమాసియాలో ఎలాంటి ఉద్రిక్తతలు ప్రజ్వరిల్లినా, దాని ప్రభావం చమురు ధరలపై పడి అవి భగ్గుమన్నప్పుడల్లా దేశ దేశాలు తెల్లమొగమేయక తప్పడం లేదు. గల్ఫ్‌లో మరో యుద్ధం రాకుండా అందరూ సంయమనం పాటించాలంటున్న సమితి ఆశాభావం నెరవేరుతుందా, సోలిమనీ దళాల మెరుపుదాడుల ముప్పు అమెరికా, దాని మిత్రదేశాలను దెబ్బతీస్తే, అది అంతటితో ఆగుతుందా?

ఇరాన్‌పై దాడి అమెరికాకు అంత సులభమా

అమెరికా భౌగోళిక రాజకీయాలను ఇరాన్ పూర్తిగా అర్థం చేసుకుంది కాబట్టి పశ్చిమాసియాలోని అనేక దేశాలలో దాని కనుసన్నలలో పని చేసే సాయుధ సంస్థల్ని ఏర్పాటు చేసుకోగలిగింది. వాటి దగ్గర ఆయుధాలు కూడా గణనీయంగా ఉన్నాయి. దాడులకు పాల్పడడం వంటి పిచ్చి పనులకు అమెరికా పూనుకుంటే అవన్నీ అమెరికా అనుకూల దేశాలన్నింటా తమ ప్రతాపాన్ని చూపుతాయి. గతేడాది సౌదీలోని రెండు చమురు సంస్థలపై దాడులు వాటికి చిహ్నం. అవసరమైతే తనను వ్యతిరేకించే అన్ని గల్ఫ్, పశ్చిమాసియా దేశాలకు వాటిని విస్తరించవచ్చు. ఈ ప్రాంతానికే అవి పరిమితం అనుకుంటే పొరపాటు. గల్ఫ్‌లోని హోర్ముజ్ జలసంధి నౌకల రవాణాకు ప్రత్యేకించి చమురు నౌకలకు ఎంతో కీలకమైనది. అది ఇరాన్ బలం అని చెప్పవచ్చు. ఆ ప్రాంతంగుండా ప్రయాణించే అమెరికా యుద్ధనౌకలు, అమెరికన్ కంపెనీల చమురు ట్యాంకర్లను క్షిపణులు, సముద్ర జలాల్లో మందుపాతరలు, జలాంతర్గాముల ద్వారా దెబ్బతీసే అవకాశాలు ఉన్నాయి. అందువలన ఒకవేళ అమెరికా గనుక యుద్ధానికి దిగితే దాని ప్రభావం అమెరికాతో పాటు ప్రపంచం మీద కూడా ఉంటుంది.

ఇరాక్‌లో ఉన్న ఐదువేల అమెరికా సైన్యాలు వెనక్కుపోవాలని అక్కడి పార్లమెంట్ తీర్మానించింది. దానికి ఆ దేశం కట్టుబడి ఉంటుందా లేదా అన్నది ఒక అంశమైతే జాతీయంగా, అంతర్జాతీయంగా అమెరికా ఒత్తిడిని ఎదుర్కోవడం అనివార్యం. ప్రస్తుతం అమెరికా గల్ఫ్ చమురు మీద ఆధారపడడం నానాటికీ తగ్గిపోతోంది. గత ఆరేండ్లలో రోజుకు 20 లక్షల పీపాల నుంచి ప్రస్తుతం 8.75 లక్షల పీపాలకు తగ్గిపోయింది. అమెరికా తమ దగ్గర వెలికి తీసే చమురు ఎగుమతులను క్రమంగా పెంచుతోంది. దీనికి కారణం షేల్ చమురు నిల్వలు. అయితే గల్ఫ్ చమురుపై అమెరికా, ఇతర ధనిక దేశాల కార్పొరేట్లే పట్టుకలిగి ఉన్నాయి. అందువలన హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ వైపు నుంచి తలెత్తే సమస్యలు వాటి ప్రయోజనాలనూ దెబ్బతీస్తాయి. అందుకు కార్పొరేట్ కంపెనీలు ట్రంప్ లేదా మరొక పాలకుడిని అయినా యుద్ధానికి అనుమతిస్తాయా? ప్రపంచ వ్యాపితంగా ఎదురయ్యే వ్యతిరేకతను అమెరికా తట్టుకోగలదా?

ఆర్థిక, సామాజిక, రాజకీయ సంక్షోభాలు ఎదురవుతుండగా ప్రజల దృష్టి మరల్చడానికే కాకుండా రాజ్య అణచివేతను, ప్రజాస్వామిక హక్కులను కాలరాయడాన్ని న్యాయసమ్మతం చేయటానికి ట్రంప్ పాలన యుద్ధంతో జూదమాడుతోంది. ప్రస్తుత ఇరాన్ ఘటనల నేపథ్యంలో అమెరికా ఏ విధంగా బయటపడగలదు. ఇరాన్ ప్రభుత్వాన్ని మార్చడం అమెరికాకు సాధ్యమౌతుందా? ఇరాన్‌ను యుద్ధం ద్వారా ఆక్రమించడమంటే అమెరికా ఒక విపత్తును కొనితెచ్చుకున్నట్టే. కాబట్టి ఇరాన్‌పై మరిన్ని ఆర్థిక ఆంక్షలు విధించి కట్టుదిట్టం చేయడం ద్వారా ఆర్థికంగా కుంగదీయడం తద్వారా అంతర్జాతీయంగా ఇరాన్‌ను బలహీనపర్చడం అమెరికా వ్యూహంగా కనిపిస్తోంది.

ముగింపు

అమెరికా పాత పాలకుల (బుష్, ఒబామా) యుద్ధ రీతిని, నీతిని దుయ్యబడుతూ 2017లో అధికారికంలోకి వచ్చిన ట్రంప్ తిరిగి 2021లో అధికారంలోకి రావాలంటే యుద్ధమే శరణ్యమని అనుకుంటున్నారు. ట్రంప్ చర్య కొన ఊపిరితో ఉన్న ఇరాక్‌ను రణరంగంగా మార్చి మరింత భస్మీపటలం చేయబోతున్నది. సోలిమనీ హత్య ఇరాన్‌కు సైనిక పరంగా దెబ్బ తగిలినప్పటికీ రాజకీయంగా నైతిక ఆయుధాన్ని అందించి, అమెరికాకు వ్యతిరేకంగా నలుగురినీ కూడగట్టుకొనేందుకు అవకాశం

ముషారఫ్ ఉదంతం - నేతలకు హెచ్చరిక

రాజ్యాంగ వ్యవస్థలను విధ్వంసం చేసి, కనీస ప్రజాస్వామిక హక్కులను అమలు చేయకుండా నియంతృత్వ పాలనను సాగించినందునే ముషారఫ్‌కు ఉరి శిక్ష విధించారనీ, అది ఇతర దేశాధినేతలకు ఒక హెచ్చరికనీ అంటున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

ప్రపంచ దేశాలన్నింటిలో పాకిస్థాన్‌ది విచిత్రమయిన రాజకీయం. ఆ దేశ రాజకీయాలలో సైన్యం పాత్ర ఎక్కువ, ప్రజల పాత్ర తక్కువ. ఒకప్పుడు, ప్రధానమంత్రి జుల్ఫికర్ అలీ భుట్టోను పాకిస్తాన్ సుప్రీంకోర్టు తీర్పుననుసరించి ఉరికంభం ఎక్కించారు. ఆ కాలంలో ఇందిరాగాంధీతో సమానంగా భుట్టో పేరు కూడా భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా ప్రచారంలో ఉండేది. ఆయన కూతురు, రెండు సార్లు ప్రధాన మంత్రిగా పాకిస్తాన్ రాజకీయాలలో కీలకపాత్ర వహించిన బెనజిర్ భుట్టో ఎన్నికల ప్రచారంలో ఉండగా హత్య కావించబడ్డది. ఇప్పుడు, 2001 నుండి 2008 వరకు దేశానికి అధ్యక్షునిగా పనిచేసిన సయ్యద్ ముషారఫ్ వంతు వచ్చింది. ఆయనను విచారించడానికి ఏర్పాటైన ప్రత్యేక కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది.

ముషారఫ్ నాలుగు నక్షత్రాల మిలిటరీ జనరల్. కొంత కాలం సైన్యాధ్యక్షునిగా పనిచేశాడు. పాకిస్తాన్ రాజకీయ వ్యవస్థలో పరోక్షంగా సైన్యం ఆధిపత్య పాత్ర వహించినా, గతంలో సైన్యాధ్యక్షులు ప్రత్యక్షంగా సైనిక పరిపాలకులుగా పాకిస్తాన్ దేశాన్ని పరిపాలించిన ఉదంతాలు చాలానే ఉన్నాయి. అయితే వారెవ్వరూ ముషారఫ్ వలె న్యాయస్థానాలచే అభిశంసించబడలేదు. జనరల్ అయ్యూబ్ ఖాన్, జనరల్ యాహ్యా ఖాన్ సహజ మరణమే పొందారు. చివరి ఘడియల్లో వారు మిలిటరీ ఆసుపత్రిలో మరణించగా వారికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి.

మరొక సైనిక పాలకుడు జనరల్ జియా ఉల్ హాక్ విమానంలో వస్తుండగా విమానం పేలిపోయి శరీరం తునాతునకలై మరణించాడు. అగమ్యగోచరమైన బాంబు పేలుడు అది. ఈ సైనిక పాలకులెవ్వరు కోర్టుల ముఖం చూడలేదు. అందుచేత పాకిస్తాన్ సైన్యం ముషారఫ్‌కు కోర్టు మరణశిక్ష విధించడాన్ని నివ్వెరపోయి చూసింది. అయితే, ప్రజల నుండి పెద్దగా ప్రతిస్పందన లేదు. నిరసన ధ్వనులు ప్రత్యేకంగా వినిపించలేదు.

13 జనవరి 2020 నాడు ముషారఫ్ తనకు మరణశిక్ష విధిస్తూ ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాలు చేశాడు. వెంటనే లాహోర్ హైకోర్టు ఆ తీర్పు చెల్లదని, అసలు ముషారఫ్‌పై వచ్చిన అభియోగాలను విచారించడానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయడమే రాజ్యాంగ వ్యతిరేక చర్య అని తేల్చి చెప్పింది. ముషారఫ్‌ను కోర్టుకు ఈడ్చడమే రాజకీయ దురుద్దేశంతో కూడుకున్న చర్య అని కూడా రిమార్క్ పాస్ చేసింది. రాజద్రోహం కాని, రాజ్యాంగాన్ని బలహీనపర్చడం లాంటి చర్యలు గాని, ఒక్కళ్లే చేయలేరని అది సమష్టిగా చేసే వ్యవహారమని వ్యాఖ్యానించింది. పాకిస్థాన్ రాజకీయ రంగాన్ని అధ్యయనం చేసిన పరిశీలకులకు ఈ తీర్పు వెనక సైన్యం హస్తం ఉండవచ్చునన్న అనుమానం రాకమానదు.

ముషారఫ్‌పై తీవ్రమైన ఆరోపణలే ఉన్నాయి. దేశానికి అధ్యక్షుడిగా ఉండి రాజ్యాంగాన్ని సస్పెండ్ చేసి, రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డాడన్నది ప్రధానమైన ఆరోపణ. దాంతో పాటు, బెనజిర్ భుట్టో

కల్పించింది. ప్రతీకారం ఏ రూపంలో, ఏ స్థాయిలో ఉంటుందో ఇప్పుడే తెలియదు కానీ, అమెరికాకు అపార నష్టాన్ని కలిగించే చర్య సత్వరమే కాకున్నా సమీప కాలంలో తప్పదు.

పశ్చిమాసియాలో యుద్ధం అనివార్యమయితే ప్రపంచ ప్రజలకు మరింత భారమవుతుంది. ఈ యుద్ధం కేవలం అమెరికా–ఇరాన్‌లకే పరిమితం కాదు. మొత్తం ప్రపంచాన్నే సంక్షోభంలోకి నెడతాయి. ఆర్థిక వ్యవస్థల్ని అస్తవ్యస్థం చేస్తాయి. ప్రతీకారేచ్ఛతో రగులుతున్న ఇరాన్ ఇప్పుడు సౌదీ అరేబియా, ఇజ్రాయెల్‌తో ఘర్షణకు దిగుతుందా లేక పశ్చిమాసియాలో ఉన్న అమెరికా సైనికులను లక్ష్యంగా చేసుకుంటుందా అన్నది వేచి చూడాల్సి ఉంది. సామ్రాజ్యవాద, మితవాద, ఫాసిజం ఒకవైపు– స్వేచ్ఛా, ప్రజాస్వామ్య పోరాట దేశాల శక్తులు మరొకవైపు కేంద్రీకృతమయ్యే అవకాశాలు లేకపోలేదు. యుద్ధ ప్రమాదం ఇరాన్–అమెరికా మధ్య మాత్రమే గాక, ఎమెన్, సిరియా, లెబనాన్, ఇరాక్ తదితర చోట్ల అమెరికా–ఇరాన్ అనుకూల సైన్యాల మధ్య సంఘర్షణ జరిగే అవకాశముంది. ట్రంప్ చర్య మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలు, యుద్ధ నౌకలు, సైనికులకు ప్రమాదంగా పరిణమించవచ్చునని లెబనాన్‌లోని హిజ్‌బోల్లా ప్రకటించడం గమనార్హం.

ఇప్పటికిప్పుడైతే ఇరాన్ అమెరికాతో పూర్తి స్థాయి యుద్ధానికి దిగే అవకాశం లేదు. గెరిల్లా యుద్ధ పద్ధతులతో ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నాలు చేస్తుంది. పైకి శాంతియుత వాతావరణం కనిపిస్తున్నప్పటికీ ప్రచ్ఛన్నంగా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రచ్ఛన్న యుద్ధం పూర్తి స్థాయి యుద్ధంగా మార్చాలని అమెరికా భావిస్తుందని కూడా అనుకోలేం. పూర్తి స్థాయి యుద్ధం అమెరికాకు కూడా ఊబిలాంటిదే. ఇరాన్‌లో అత్యంత ప్రముఖుడైన వ్యక్తిని హతమార్చడం అన్నది చాలా తీవ్రమైన సంఘటన. దీనికి ప్రతీకారం ఉండదని అనుకోలేం. బహుశా పర్షియన్ గల్ఫ్‌లో ఇరాన్ అనుకూల శక్తులు అమెరికా నౌకలపై దాడులు చేయవచ్చు. అమెరికా నౌకలు పర్షియన్ గల్ఫ్‌లో మునగవచ్చు. అమెరికా వ్యాపార ప్రయోజనాలపై దాడులు జరగవచ్చు. ఈ పరిస్థితులను ప్రపంచ దేశాలు ఒక్కటై అదుపు చేయకపోతే పశ్చిమాసియా మరింత అస్థిరతకు గురవుతుంది. ఈ ప్రకంపనలు ప్రపంచ వ్యాప్తంగా కనిపిస్తాయి. ఇరాన్ ఇప్పుడు అణుబాంబు తయారు చేయగలిగిన స్థాయికి చేరుకున్న దేశం అనేది మరిచిపోరాదు.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, రాజనీతిశాస్త్ర విద్యార్థి)

వీ

హత్యకు సంబంధించిన కుట్రలో ఈయనది ప్రధాన పాత్ర అన్న అభియోగం. దీనిమీద ఫెడరల్ విచారణ కూడా జరిగింది. 2007లో లాల్ మజీద్ ప్రార్థనా స్థలంలో అల్లర్లు జరిగాయి. ఆ ఘటనలో అబ్దుల్ రషీద్ ఘాజి అనే మౌల్వీ మరణించాడు. అది ముషారఫ్ చేసిన కుట్ర ఫలితమే అని 2013లో ఆయన కుమారుడు కోర్టుకు మొరపెట్టుకున్నాడు. వీటన్నింటితో పాటు ఆయనపై అవినీతి ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ వ్యాజ్యాలలో వెలువడిన తీర్పును హైకోర్టు తప్పు పట్టినా, అది సాంకేతిక కారణాల వల్లనే కానీ, ఈ అక్రమాలలో ముషారఫ్ పాత్ర లేదని నిర్ద్వందంగా నిరూపణ కాలేదు.

పాకిస్తాన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 6 ప్రకారం రాజద్రోహాన్ని నిర్ణయించి, ముషారఫ్‌కు న్యాయస్థానం మరణశిక్ష విధించింది. 1973లో ఈ నిబంధనను పాకిస్తాన్ రాజ్యాంగంలో చేర్చారు. 1972లో ఒక చారిత్రాత్మక వ్యాజ్యంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ప్రముఖమైన ఆదేశాల రూపంలో దీనికి భూమిక ఏర్పడింది. మాలిక్ గులాం జిలాని అన్న మానవ హక్కుల కార్యకర్త అరెస్ట్ అయిన సందర్భంలో ఆయన కూతురు ఆస్మా జిలాని సుప్రీం కోర్టు ను ఆశ్రయించింది. ఆ వ్యాజ్యం సందర్భంగా సుప్రీంకోర్టు ఈ క్రింది వ్యాఖ్య చేసింది.

“ఏ వ్యక్తి అయినా అక్రమంగా దేశ న్యాయ ప్రక్రియను చిన్నాభిన్నం చేయ పూనుకుంటే, ఆ వ్యక్తి, ఆ అధికారం చట్టాలు చేసేందుకు సరైన వనరుగా భావించాల్సిన అవసరం లేదు. అణచివేత స్వభావం కల అధికార యంత్రాంగం ఆ వ్యక్తి చేతిలో కేంద్రీకృతమైనందు వల్ల తాత్కాలికంగా ప్రజలు, న్యాయస్థానాలు మౌనంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడినా, ఆ వ్యక్తి బలవంతంగా అమలులో ఉంచిన నియమ నిబంధనలు చట్టానికి వ్యతిరేకమని, వాటిని న్యాయస్థానాలు గుర్తించవని మేము నిర్ద్వంద్వంగా ప్రకటించదలుచుకున్నాం. ఆ వ్యక్తి హస్తాల నుండి అధికార యంత్రాంగం స్వేచ్ఛ పొందిన వెంటనే, ఆ అవకాశం దొరికిన మరుక్షణమే ఆ వ్యక్తిని రాజద్రోహ నేరం కింద విచారించి, తగిన విధంగా శిక్షించాలి. ఇలా చేస్తేనే, భవిష్యత్తులో పరిపాలనను దుర్వినియోగం చేసే వారికి హెచ్చరికలాగా ఉంటుంది.” ఈ హెచ్చరిక పాకిస్తాన్‌కే కాదు నిజంగా ప్రపంచ దేశాల రాజకీయ నాయకులందరికీ వర్తించే విధంగా ఉంది. అయితే ఈ పరిస్థితిని సైన్యం ముందే ఊహించింది. ఇలాంటి సందర్భంలో పాకిస్తాన్ రాజకీయాలలో తన ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి సైన్యం మాయోపాయాలు ఎన్నో పన్నుతూనే ఉంది. ముందయితే, ముషారఫ్ ను కాపాడుకోవడానికి ఆయన్ను దేశం దాటించింది. 2018 ఎన్నికల్లో ముషారఫ్‌కు వ్యతిరేకంగా ప్రత్యేక కోర్టు ను నియమించిన నవాజ్ షరీఫ్‌ను తొలగించడానికి ప్రయత్నించి, తనకు అనుకూలంగా ఉండే ఇమ్రాన్ ఖాన్‌ను గద్దెనెక్కించింది. సైన్యంలో ఉన్నతాధికారి ఒకరు, ఈ తీర్పు సైన్యాన్ని చాలా కలతకు గురిచేసిందని, “పాకిస్తాన్ సైన్యం ఒక వ్యవస్థ మాత్రమే కాదు, ఒక కుటుంబం. మాకు దేశాన్ని రక్షించడం మాత్రమే కాదు, మా సంస్థ గౌరవాన్ని, హుందాతనాన్ని ఎలా కాపాడుకోవాలో కూడా మాకు బాగా తెలుసు” అని చేసిన వ్యాఖ్య గమనార్హం.

1999లో భారత్‌తో జరిగిన కార్గిల్ సంఘర్షణలో సైన్యాధ్యక్షునిగా పాకిస్తాన్ వైపు నుండి పోరాడిన ముషారఫ్‌కు సైన్యంలో అత్యుత్తమ పదవిని కట్టబెట్టింది అప్పటి పాక్ ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్. అయితే, కార్గిల్ యుద్ధం సందర్భాంగానే ముషారఫ్‌కు షరీఫ్‌తో సంబంధాలు బెడిసి కొట్టాయి. కార్గిల్ యుద్ధం ముగియగానే పర్వేజ్ ముషారఫ్ ప్రధాని షరీఫ్‌కు వ్యతిరేకంగా కుట్ర పన్ని అతన్ని పదవిలోంచి దింపేసి, కొంతకాలం తర్వాత తాను దేశాధినేతగా పగ్గాలు చేపట్టాడు. కుట్ర విజయవంతమైందని వార్త వచ్చే సమయానికి ముషారఫ్ శ్రీలంక నుండి వస్తూ విమానంలో ఉన్నాడు. విమానం కరాచీ చేరుకోగానే దిగి సరాసరి ప్రభుత్వ రేడియో స్టేషన్‌కు వెళ్లి సైన్యం ప్రధాని నవాజ్ షరీఫ్‌ను పదవీచ్యుతుణ్ణి చేసిందని ప్రకటించాడు. అదే నవాజ్ షరీఫ్ 2013లో ప్రధాన మంత్రి గా తిరిగి ఎన్నికయిన తర్వాత ముషాఫ్‌పై దేశద్రోహం నేరం కింద అరెస్ట్ చేయాలని ప్రయత్నించాడు. అప్పటికే ముషారఫ్ దేశాన్ని వదిలి పెట్టి విదేశాలలో తలదాచుకున్నాడు. పాకిస్తాన్‌లో దిగిపోయిన దేశాధినేతలు చాలావరకు విదేశాలలో తలదాచుకుంటారు. అక్కడి ప్రజలతో సంబంధాలలో ఉండరు. మళ్లీ ఎన్నికలప్పుడు స్వదేశానికి తిరిగి వచ్చి ఎన్నికల సభలలో పాల్గొంటారు. బెనజిర్ భుట్టో అంతే. పదవీచ్యుతురాలైన తర్వాత లండన్‌లో చాలా నాళ్లు ఉండి ఎన్నికలప్పుడు పాకిస్తాన్‌కు తిరిగి వచ్చి ఎన్నికల సభలో పాల్గొంటూ హత్యకు గురైంది. ముషారఫ్ ఎన్నికలలో పాల్గొనే నిమిత్తం 2013లో స్వదేశం తిరిగివచ్చాడు. అయితే, బెనజిర్ భుట్టో హత్య కేసులో అరెస్ట్ వారెంటు జారీ చేసి, ఎన్నికలలో పాల్గొనకుండా అనర్హత వేటు వేశారు. ఇప్పుడు ముషారఫ్ దుబాయ్‌లో ఉంటున్నాడు. ఆమిలోడాయసిస్ అన్న అరుదైన వ్యాధితో బాధపడుతూ లండన్, దుబాయ్‌లలో చికిత్స పొందుతున్నాడు. ‘ఇన్ ది లైన్ ఆఫ్ ఫైర్’ అన్న పేరుతో తన ఆత్మ కథ రాసుకున్న ముషారఫ్ బ్రిటిష్ ఇండియా కాలంలో దేశ రాజధాని ఢిల్లీలో జన్మించాడు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, బిజెపి నాయకుడు లాల్ కృష్ణ అద్వాని పాకిస్తాన్‌లోని కరాచీ పట్టణంలో జన్మించాడు. ఈ ఇద్దరు కార్గిల్ యుద్ధ కాలంలో ప్రత్యర్థులు.

ముషారఫ్ తన పదవీ కాలంలో అమెరికాకు మంచి మిత్రుడుగా ఉండేందుకు తాపత్రయ పడ్డాడు. 9/11 బాంబు దాడుల తర్వాత అమెరికా ప్రారంభించిన ‘ఉగ్రవాదం పై యుద్ధం’ (వార్ ఆన్ టెర్రర్) కార్యక్రమాన్ని పూర్తిగా సమర్థించాడు. అందులో తన శక్తికి మించి తోడ్పాటునందించే ప్రయత్నం చేశాడు. తన పరిపాలనలో పాక్‌ను ఉదారవాద సమాజంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశాడు. ఆర్థిక రంగంలో ‘సరళీకృత’ విధానాలను ప్రవేశపెట్టే ప్రయత్నం చేశాడు. (దేశీయ మార్కెట్ ను విదేశీ కార్పొరేట్లకు అప్పజెప్పే విధానానికి ముద్దు పేరే ‘సరళీకృత’ విధానం), ట్రేడ్ యూనియన్‌లను నిషేధించాడు. కార్మికవర్గ వ్యతిరేకిగా నిరూపించుకున్నాడు. ముషారఫ్ పరిపాలనా కాలంలో జిడిపి బాగా పెరిగింది కానీ, దేశంలో ద్రవ్య నిలువలు పూర్తిగా తగ్గిపోయాయి. సమాజంలో ఆర్థిక అసమానతలు ఊహించలేని రీతిలో పెరిగిపోయాయి. అయితే ఈ కాలంలో మధ్య తరగతి తన శక్తిని కూడగట్టుకుందని మాత్రం చెప్పగలం. ఈయన ప్రభుత్వ హయాంలో మానవ హక్కుల హననం తీవ్రస్థాయిలో జరిగిందని ప్రపంచ పత్రికలూ ఘోషించాయి. ముషారఫ్ పై చాలా సార్లు హత్యాప్రయత్నం కూడా జరిగింది. 2007లో కోర్టుల వ్యవస్థను సస్పెండ్ చేసే దుస్సాహసానికి కూడా ఒడిగట్టాడు. రాజ్యాంగబద్ధమయిన వ్యవస్థల నెన్నింటినో బలహీన పరిచాడు. ఇలాంటి చర్యల వల్ల పాకిస్తాన్ ఒక దేశంగా, ఒక సమాజంగా బలహీన పడింది. రాజ్యాంగ బద్ధమయిన వ్యవస్థలు, పౌర సమాజ సంస్థలు బలహీనపడితే దేశం, సమాజం బలహీనపడుతుందన్నది నిర్వివాదాంశం. దురదృష్టవ శాత్తూ, మన దేశం కూడా ఈనాడు అదే స్థితిని అనుభవిస్తూ ఉన్నది.

ఏది ఏమయినా దేశాధినేతగా తిరుగులేని అధికారాలు హస్తగతం చేసుకొని, రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు, హత్యా నేరాలకు పాల్పడితే ఎప్పటికయినా ఇబ్బందులకు గురికాక తప్పదన్న వాస్తవం ముషారఫ్ ఉదంతం ద్వారా ఇతర దేశాల నేతలు గ్రహిస్తే మంచిది.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ


మరో హైదరాబాద్

- లంకా పాపిరెడ్డి

హైదరాబాద్ అనగానే పాతతరం వారికి చార్మినార్, హుస్సేన్ సాగర్, ఉస్మానియా యూనివర్సిటీ, గోల్కొండ కోట లాంటివి గుర్తుకు వస్తాయి. ఇప్పటి వారికి హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, అంతర్జాతీయ విమానాశ్రయం లాంటివి గుర్తుకు వస్తాయి. అయితే ఇవేవి కాకుండా హైదరాబాద్‌లో మరో హైదరాబాద్ ఉన్నదని చాలా మందికి తెలవదు. లేదా తెలుసుకోవాలని అనుకోరు. హైదరాబాద్‌లో ఉన్న మరో హైదరాబాద్, మురికివాడల హైదరాబాదే. తళుకు బెళుకుల హైదరాబాద్ కు, వెలుగు జిలుగుల హైదరాబాద్‌కు ... తళుకు బెళుకులు, రంగులు వెలుగులు అద్దేది ఈ మురికివాడల హైదరాబాదే. నగరానికి నగిషీలు చెక్కి, మెరుపులు అతికించి నరకం లాంటి మురికి కూపాలలో కూరుకు పోయిన హైదరాబాద్ మురికివాడల బాధామయమైన గాథలే 'మూసీనది మాట్లాడితే' అనే పుస్తకంగా రూపుదిద్దుకున్నది. ఇటువంటి మురికివాడల శ్రామిక ప్రజల గురించి ఆలూరి కవిని గారు ఎంతో శ్రమించి ఎన్నో వివరాలు సేకరించి, ' మూసీనది మాట్లాడితే' అనే ఒక మంచి పుస్తకంగా అందించారు. కేవలం ఎంతో శ్రమించారు అని మాత్రమే చెప్పితే సరిపోదు. ఎంతో ధైర్యం కూడా చేశారు. ఒక్కో సారి వస్తామన్న వారు రాకపోయినా, వచ్చిన వాళ్లు భయపడినా, ధైర్యంగా ఒంటరిగానే అయినా మురికివాడలలో తిరిగి అమూల్యమైన వివరాలు సేకరించారు.

ఈ పుస్తకం చదివిన తరువాత కవిని ధైర్యాన్ని, ఓపికను, సమయస్ఫూర్తిని అభినందించకుండా ఉండలేం. నిజానికి ఈ పుస్తకం హైదరాబాద్ మురికివాడల పైన ఒక పరిశోధన పత్రము. మురికివాడలపై అధ్యయనం చేయాలనుకునే వారికి, శ్రామికవర్గ ఉద్యమాలు నిర్మించా లనుకునే వారికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పుస్తకం లోని వివరాలపై ఆధారపడి ఎన్నయినా డాక్యుమెంటరీలు నిర్మించవచ్చు.

ఈ పుస్తకంలో హైదరాబాద్ మురికివాడల సమస్యలను మాత్రమే చర్చించలేదు. మురికివాడల పెరుగుదలకు కారణాలను కూడా చూపిస్తారు రచయిత్రి. 1990 తరువాత నుండి గ్రామాలలో వ్యవసాయం దెబ్బ తిని గ్రామీణ ప్రజలు పట్టణాలకు చేరుకున్న తీరు కనిపిస్తుంది పుస్తకంలో. 'మాది సిద్దిపేట జిల్లా వ్యవసాయం చేసేటోళ్లం వ్యవసాయానికి పెట్టుబడి పెట్టుకోలేక, ప్రకృతి వైపరీత్యాలు, పిల్లల చదువులు ఇవన్నీ భారం మోయలేక పరిస్థితులు అనుకూలించక ఏదో ఒకటి చేసుకుందా మని వచ్చాం' (123 పే) అని ఒక రైతు అంటే, మరో వ్యవసాయ కూలి 'ఊర్లలో వ్యవసాయం దెబ్బతిని కూలి పనులు దొరకక హమాలీ పనులు చేసుకుంటున్నాము' (122పే) అని చెప్పుతాడు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ధ్వంసం అవుతున్న క్రమంలో గ్రామాలలో ప్రత్యామ్నాయ ఉపాధి ఏది లేకపోవడంతో రైతులు, కూలీలు, చేతివృత్తుల వాళ్లు, కళాకారులైన ఆశ్రిత కులాల వాళ్లు అందరూ హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాని నగరంలో పారిశ్రామిక అభివృద్ధి లేకపోవడంతో ఇలా చేరిన వారందరు అసంగటిత రంగానికి, అసంఖ్యాకమైన చిన్నా చితకా పనులకు పరిమితమయ్యారు.



మూసీనది మాట్లాడితే...!

కవిని ఆలూరి

త్రిలోచన ప్రచురణ

196 పేజీలు, రు. 150,

ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక షాపులు

దానితో నగరానికి వలస వచ్చిన ప్రజలకు సరి అయిన ఆదాయాలు లేక మురికివాడలు నిర్మాణం అయ్యాయి. కొనసాగుతున్నాయి, ఇంకా పెరుగుతున్నాయి. ఎన్నో ఇంటర్వ్యూలతో ఈ విషయాన్ని నిరూపిస్తారు రచయిత్రి. నగరానికి వలస వచ్చిన వారిలో ప్రధానంగా ఎస్.సి. లు, బి.సి.లు ఉన్నారు. ఈ స్లమ్‌లలో కూడా గ్రామాలలో జరిగే పంచాయితీలు, సాంఘిక అసమానతలు కనిపిస్తాయి. గ్రామీణ ప్రాంతం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి ఇతర దేశాల నుండి కూడా హైదరాబాద్‌కు వలస వచ్చిన వారు ఉన్నారని తెలుసుకుంటాం.

హైదరాబాద్ మురికివాడలలోని ప్రజలు ప్రధానంగా అసంఘటిత రంగంలోనే పని చేస్తున్నారు. గతంలో రకరకాల వృత్తులు, పనులు చేసుకునే వాళ్లు నగరంలో ఇతర పనులకు మారిన క్రమాన్ని చక్కగా చూపించారు రచయిత్రి. స్లమ్‌లలో ఉండే ప్రజలు ఎన్ని రకాల పనులు చేస్తున్నారో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. నగరం ఎలా నడుస్తుందో అర్థమవుతుంది. గాజులకు పూసలు అతికించడం, బ్యాగులు, పర్సులు కుట్టడం, అగరుబత్తీలు, కొవ్వొత్తులు, పతంగులు, ఎన్విలాప్ కవర్లు, ఐస్‌క్రీమ్ కోన్‌లు, మెహందీ కోన్‌లు, చేయడం, బీడీలు చుట్టడం, చర్మాలకు ఉప్పు పెట్టడం, డ్రెస్‌లకు గుండీలు కుట్టడం లాంటివి ఎన్నో పనులు చేస్తుంటారు. ఇందులో వచ్చే అత్తెసరు ఆదాయాలకు బదులుగా అంతులేని దోపిడి అనంతంగా ఎలా సాగుతున్నదో ఈ పుస్తకంలో చూడవచ్చు. ఏ కార్మిక చట్టాలు వీరికి పనికిరావు, వాటి పరిధిలోకి వీరు రారు.

గతంలో హైదరాబాదులో ఉన్న కొన్ని పెద్ద పరిశ్రమలు మూతపడ్డాయి. తిరిగి ఆ స్థాయి గల పరిశ్రమలు కానీ అంతకంటే పెద్ద పరిశ్రమలు కానీ ఏవి నెలకొల్పబడలేదు. కాటేదాన్, నాచారం, జీడిమెట్ల, బాలానగర్ లాంటి పారిశ్రామిక ప్రాంతాలలోని మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలలో పని చేసే కార్మికుల కష్టాలను, సమస్యలను కళ్లకు కట్టి చూపించారు రచయిత్రి. పని గంటలకు పరిమితి లేదు. 12 గంటల కంటే ఎక్కువ సమయం పని చేయిస్తారు. 20 శాతం మాత్రమే పర్మినెంటు కార్మికులు ఉంటారు. 80 శాతము కార్మికులు కాంట్రాక్టు కార్మికులే ఉంటారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే ఎటువంటి పథకాలు,

డిసెంబరిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు - 4

***జారిజం మీద 1825 డిసెంబర్‌లో జరిగిన తిరుగుబాటు రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రభావం చూపుతున్నదంటున్నారు* ఎన్.వి.యస్. నాగభూషణ్**

(...గత సంచిక తరువాయి భాగం)

4) అలెగ్జాండర్1 అస్థిర వ్యక్తిత్వం

తన తండ్రి అయిన జార్‌పాల్1 మరణానంతరం, అధికారం చేపట్టిన అలెగ్జాండర్1 ఆ సమయానికి కేవలం 23 సంవత్సరాల యువకుడు మాత్రమే. సెయింట్ పీటర్స్ బర్గ్‌లోని ప్రముకులంతా అలెగ్జాండర్ వైపు తిరిగి ఎదురు చూశారు. యువకుడైన ఇతడు పీటర్ దిగ్రేట్ ఎలాంటి రష్యాను దర్శించాడో అలాంటి ఆధునిక రష్యాను ఇతడు నిర్మించి చూపిస్తాడని! అలెగ్జాండర్ పాలనా కాలపు తొలి రోజులు అలాంటి ఆశల్నే వాగ్దానం చేశాయి. ఎతైన, పాలిపోయిన పసుపు వర్ణపు జుత్తు కలిగి, చూపరులకు ఎంతో అందంగా కనిపించే అతడు, సైనిక పెరేడ్‌లు చేసే మైదానాల్లోనూ, బాత్‌రూముల్లోనూ కూడా ఎంతో ఆకర్షణీయమైన వ్యక్తిగా కనిపించేవాడు. అతడు బాగా చదువుకున్నవాడు, మంచి మాటకారి, మనోహరమైనవాడు. అదీగాక అతడు రష్యన్ భాషకన్నా కూడా ఫ్రెంచి భాషను చక్కగా మాట్లాడగలవాడు. ఆనాటి ప్రభు వర్గానికి చెందిన వారంతా ఎలాంటి అలవాట్లను మెచ్చుకుంటారో అలా చక్కని ఆలోచనలు కూడగల చక్రవర్తి కావడం వల్ల, రష్యాను ఆధునిక ప్రపంచంలోకి నడిపించగలడని, ప్రభుత్వంలోకి ఉదార భావాలను ప్రవేశపెట్టి బానిసత్వాన్ని పోగొట్టగలడని యువతరం నిమ్మింది. అయితే అతడి పాలనా కాలం యావత్తు తీవ్రమైన బాధాకర నాటకంగా, సెయింట్ పీటర్స్ బర్గ్ నగరం ఆ నాటకానికి రంగస్థలంగా నిలవడం చరిత్రలో జరిగిన ఒక విషాదకర పరిణామం!

అలెగ్జాండర్1 స్వయంగా ఒక వివాదాస్పద వ్యక్తిత్వం గలవాడు కావడం వల్ల, అతడెంత ఆసక్తికరమైన వాడైనప్పటికీ అందులో అభ్యదయకర అంశం అతికొద్ది భాగంగానే ఉన్నది. అతడి నేపథ్యంలో పలు శక్తులు మోహరించి, అతడితో జతకలవడం వల్ల అతడి వ్యక్తిత్వాన్ని సులభంగా అంచనా వేయలేం. అలెగ్జాండర్ శైశవం, బాల్య జీవితాలు పలు సంక్లిష్టతలతో కూడి, ప్రత్యేకించి తన తండ్రి అయిన పాల్1 తోటి, నాన్నమ్మ అయిన కేథరిన్ దిగ్రెట్ తోటి అతడి సంబంధాలు ఒకదానితో ఒకటి సంవాదనీయంగా మారాయి. పలు వైరుధ్యాలు కూడా ఏర్పడ్డాయి. ఎందుకంటే ఆ ఇద్దరూ ఒకరినొకరు ద్వేషించుకున్నారు. తన తల్లిదండ్రులతో కన్నా, తన నాయనమ్మ తోటే ఎక్కువ సమయం గడిపేటా ఆమె ఏర్పాట్లు చేసింది. దాంతో అతడు (అలెగ్జాండర్1)

రాయితీలు వర్తించవు. కార్మిక చట్టాలు ఏవి అమలు కావు. పని స్థలాల వద్ద ఎటువంటి రక్షణ ఏర్పాట్లు ఉండవు. బిస్కెట్ కంపెనీలలో 80 శాతం మహిళలే కార్మికులుగా పని చేస్తున్నారు. మహిళా కార్మికుల కనీస అవసరాలను పట్టించుకోరు. టాయ్‌లెట్స్ ఉండవు. ఈ కాంట్రాక్టు కార్మికుల పరిస్థితుల గురించి చదువుతుంటే, మళ్లీ వెనక్కి 19 శాతాబ్దంలోకి వెళ్తున్నట్లు అనిపిస్తుంది.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ లెక్కల ప్రకారం నగరంలో ప్రభుత్వం గుర్తించిన మురికివాడలు 1476. నాలుగు లక్షల మంది వరకు ప్రజలు ఈ మురికివాడలలో నివశిస్తున్నారు. అయితే ఇవి వాస్తవ లెక్కలు కావని, ఇంతకంటే ఎక్కువగా రెండు వేలకు పైగా మురికివాడలు ఉంటాయని ఇతరుల అంచనా. కొన్ని సీజనల్‌గా, ఆ సీజన్ లలో పనుల కొరకు ఏర్పడే తాత్కాలిక మురికివాడలు కూడా ఉంటాయి. మురికివాడలు అన్నీ ఒకే విధంగా లేవు. కొన్ని మురికివాడలకు వివిధ సౌకర్యాలు, ఒక తీరు ఇళ్లు ఉన్నప్పటికి, చాలా మురికివాడలకు ఎటువంటి సౌకర్యాలు లేవు. సెప్టిక్ ట్యాంక్ వద్ద కూడా ఒక వాడ ఉన్నదంటే కొయ్యబారిపోతాం.

ఈ మురికివాడలలో అక్కడక్కడ డిగ్రీలు, పిజిలు చదువుకున్నవారు ఉన్నారు. అందులో ఉద్యోగాలు చేసేవారు కొందరే. నీళ్ల కొరత, కరెంటు కొరత, రోడ్లు లేకపోవడం, మురికి కాలవలు, పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యం, దుర్గంధం, రోగాలు ఇవన్నీ మురికివాడల సాధారణ లక్షణాలు. గంజాయి లాంటి మాదక ద్రవ్యాలు కల్తీ లాంటివి మురికివాడల ప్రజలకు ప్రాణాంతకంగా మారుతున్నది. తాము ఉంటున్న జాగాలకు గ్యారంటి అయిన హక్కు పత్రాలు ఏమి ఉండవు. కాని అందరికి ఓటు హక్కు పత్రాలు కార్డులు మాత్రం ఉంటాయి. అప్పుడప్పుడు మురికివాడల నిర్మూలన పేరుతో వారి ఇండ్లను కూలకొడుతుంటారు, కాలపెడు తుంటారు. మరో చోటికి తరలిస్తుంటారు. అక్కడ ఉపాధి ఉండదు.

మురికివాడలను నిర్మూలించాలని అనుకుంటారు ప్రభుత్వ పెద్దలు. కాని ఆ మురికివాడల ప్రజలు లేకుండా హైదరాబాద్‌కు తెల్లవారదు. ప్రభుత్వం మురికివాడలను నిర్మూలించడం కాదు, వాటిని అన్ని సౌకర్యాలు కల వాడలుగా తీర్చిదిద్దాలి. అప్పుడే మురికివాడలు ఉండవు. అని వార్యం అయ్యి ఏ మురికివాడనైనా అక్కడి నుండి వేరేచోటికి తరలించాల్సి వస్తే వారి ఉపాధికి ఆటంకం కలగకుండా చూడాలి. దగ్గరలోనే పునరావాసం కల్పించాలి. వారి ఉపాధికి అనుకూలంగా రవాణా సౌకర్యాలు కల్పించాలి. ఆలూరి కవిని గారు తన పుస్తకం 'మూసినది మాట్లాడితే'లో ఎంతో వివరంగా చర్చించారు. అందరు తప్పకుండా చదవాల్సిన పుస్తకం.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

పొగడ్తలు కురిపించే కళలో చిన్నప్పుడే ఆరితేరిపోయాడు. నిజాయితీ లేని మాటలు, ద్వేముఖంగా, ద్వంద్వార్థాలతో మాట్లాడడం – ఇదంతా చిన్నప్పుడు రాసిన అక్షరాలను బట్టి కూడా తెలుసుకోవచ్చు.

అలెగ్జాండర్ పెంపకంలో కేథరిన్ దిగ్రేట్ వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంది. (ఇదంతా తండ్రికి ఇష్టం లేకపోయినా, ఆమె జారినా కాబట్టి సహించి ఊరుకోవలసి వచ్చింది. నిజానికి ఆమె ఒక తల్లిగా తన కొడుకు పాల్ పట్ల కూడా ద్వేష భావాన్నే నింపుకున్నది. అందువల్ల పాల్‌ని చిన్నప్పటి నుండీ తల్లివద్ద నుండి వేరుచేసి, ఆమెతో ఏమాత్రం సంబంధం లేకుండా, నాటి జారినా ఎలిజబెత్ పెంచినట్లుగానే – రచ). ఇక అతడికి మార్గదర్శనం చేస్తూ, పునరుజ్జీవనయుగం గురించిన విషయ బోధనలో కూడా కేథరిన్ దిగ్రేట్ బోధకురాలిగా అలెగ్జాండర్‌కి పాఠాలు చెప్పింది.

సిద్ధాంతానికి, ఆచరణకి మధ్య ఉన్న వైరుధ్యం అలెగ్జాండర్1 పాలనలో ప్రతిఫలించడానికి – కొందరు మేధావుల వాదన ప్రకారం అతడికి ఒకవైపుగానే నడిచిన విద్యా బోధనే, ఆ విద్యా బోధనలో ప్రధాన గురుత్వం కేథరిన్ నుంచే కావడం కారణం. అంతేగాక, అలెగ్జాండర్1 రాజ్యాధికారాన్ని స్వీకరించేనాటి పరిస్థితులు కూడా అతడి పాలనా విధానంపైన ప్రభావం చూపాయని చెప్పవచ్చును.

అలెగ్జాండర్‌కు తన తండ్రిని హత్య చేసిన నాటి పరిస్థితులు, అందుకు కారణమైన కుట్ర అంతా తెలుసు. అతడు ఆ హత్య జరిగిన సమయంలో ఆ భవనంలోనే మరో గదిలో ఉన్నాడు. ఆ హత్య కారణంగా అతడు పెద్ద షాక్‌కు గురయ్యాడు కూడా. అంతేకాదు, హత్యానంతరం ఆస్థాన వైద్యుడు తన పోస్టుమార్టమ్ రిపోర్టులో అంతర్గత రక్తస్రావం వల్లనే మరణం సంభవించిందని చప్పుడు దృవీకరణ పత్రం రాసిచ్చినప్పుడు కూడా ఆ షాక్‌లోనే, ఎదిరించిప ధైర్యం లేక సంతకం పెట్టాడు. దీంతో కొన్ని తీవ్రమైన, నిర్దిష్టమైన విమర్శలు, హత్య వలన పదవి లభించిందనే పుకార్లు వ్యాపించినప్పుడు అలెగ్జాండర్‌లో గట్టి అపరాధ భావనలు కలిగించాయి. ఇది అతడి పాలనపై ప్రభావాన్ని చూపి, దెయ్యాల భయం వెన్నాడి, అతడి పాలన సమతూకాన్ని కోల్పోయిందని చెప్పవచ్చు.

అలెగ్జాండర్1 ఏ నిర్ణయం తీసుకోలేని, స్థిరత్వం లేని, అయినప్పటికీ ఇతరులపై ప్రభావాన్ని చూపించగల వ్యక్తి. అతడి వ్యక్తిత్వంలోని ఈ సమస్యలు కూడా అతడి వయస్సుతో పాటే పెరిగాయి. అతడు పెరిగేకొద్దీ ఉద్రేకి గాను, అలసిపోయినవాని గాను, తన ప్రజల్ని అలాగే అధికారుల్ని, ఆస్థానంలోని వారికి కూడా అనుమానించే వానిగాను, జీవితం పట్ల పరమ అసంతృప్తి పరునిగాను, ప్రతి విషయానికీ హడావుడి పడుతూ, మత సంబంధమైన లేదా ఆత్మలకు సంబంధించిన సమాధానాల కోసం ఎదురుచూసే వానిగాను తయారయ్యాడు. ఇతడు రాజధానికి దూర ప్రాంతమైన 'తగన్‌రోగ్' పట్టణంలో, ఎవరూ ఊహించని విధంగా, హఠాత్తుగా జబ్బుపడి, అతికొద్ది వ్యవధిలోనే చనిపోయాడు. అప్పుడతడి వయస్సు కేవలం 48 సంవత్సరాలు మాత్రమే.

ఏమైనా అలెగ్జాండర్1 మరణం విషయంలో గల కారణాల గురించి కొంతమంది ఇప్పటికీ అనుమానాలు వ్యక్తం చేస్తుండడం గమనార్హం. ఈ విషయంలో కొందరు పరిశోధకులు గట్టిగా చెప్పేదేమంటే అలెగ్జాండర్ చనిపోలేదని, తన పదవీ బరువు బాధ్యతల నుండి తప్పించుకుని సైబీరియా వెళ్లి ఒక సన్యాసిలాగా రహస్యంగా జీవిస్తూ, థియోడోర్ లేదా ఫెదోర్ కుజ్‌మిచ్ అనే పేరుతోనో జీవించాడని. ఈ కథనానికి ఆధారం అతడు తను పదవిలో ఉన్నంత కాలం అది చాలా బరువుగా ఉన్నదని అంటుండడం, అలాగే అతడి మరణ దృవీకరణ పత్రంపై ఆస్థాన వైద్యుడు సంతకం చేసేందుకు నిరాకరించడం! అయితే ఈ మాత్రంతోటే అతడు సైబీరియాకు పారిపోయాడనేందుకు తగిన సాక్ష్యం అనలేం. అందుకు గట్టి ఆధారాలు కావాలి. అయినా గాని ఆ అనుమానాల్ని కూడా పూర్తిగా కొట్టిపారేయలేం. అలాగే మరికొంత మంది అతడు ఆత్మహత్య చేసుకున్నాడని కూడా ప్రచారం చేయడం జరిగింది.

5) మారిన యూరోపియన్ దేశాల పరస్పర పొందికలూ, అది రష్యాపై చూపిన ప్రభావం

జార్‌పాల్1 అనంతరం పాలకుడైన అలెగ్జాండర్1 ఆధ్వర్యంలో రష్యా తటస్థంగా ఉండే పరిస్థితిని అనుసరించినప్పటికీ ఎక్కువ కాలం పాటు వివాదాలకు దూరంగా ఉండలేకపోయింది. దాంతో అది ఫ్రాన్స్‌తో జతకట్టింది. అంతమాత్రం చేత అది ఇతర దేశాలతో శతృత్వంతో ఉండక, గ్రేట్ బ్రిటన్‌తో ఆర్థిక సంబంధాలను కొనసాగించ సాగింది. అలాగే తన చిరకాల మిత్ర దేశమైన ఆస్ట్రియాతోనూ స్నేహ బంధాన్ని కొనసాగించింది. ఇందుకు గ్రేట్ బ్రిటన్ కూడా కినియర్ సహకరించింది. కానీ కొంతకాలం గడిచాక నెపోలియన్ దుందుడుకు స్వభావాన్ని గమనించి, అతడు యూరప్ మొత్తానికే హానికరమని అలెగ్జాండర్1 గుర్తించడంతో ఫ్రాన్స్‌కు దూరంగా ఉండడం మొదలెట్టాడు.

మూడో మిత్ర మండలి కాస్తా 1805 నాటి యుద్ధంతో విచ్ఛిన్నమై పోయింది. రష్యా, గ్రేట్ బ్రిటన్‌తో కలిసి, ఇంకా ఆసియా, స్వీడన్‌లతో జతకట్టి ఫ్రాన్స్, దాని మిత్ర దేశమైన స్పెయిన్‌ని వ్యతిరేకించింది. దీంతో నెపోలియన్ కలిసి, పెద్ద సైన్యంతో దండెత్తి వచ్చిన రష్యాన్‌పై తీవ్ర స్థాయిలో దాడి చేయడంతో ఆస్ట్రియా, రష్యాల సంయుక్త సైన్యాలు 1805 డిసెంబర్ 2నాడు ఆస్టర్లిడ్జ్ వద్ద ఘోర పరాజయాన్ని చవి చూడవలసి వచ్చింది.

ఇక 1807 జూన్ 14న జరిగిన అతిపెద్ద ఫ్రెడ్లాండ్ యుద్ధంలో నెపోలియన్ రష్యాపై నిర్ణయాత్మకమైన విజయాన్ని సాధించాడు. 'ఫ్రెడ్లాండ్' ఓటమి కారణంగా గత్యంతరం లేక రష్యా, నెపోలియన్‌తో రాజీపడుతూ, 1807 జూలై 7న శాంతి సంధి కుదుర్చుకో వలసి వచ్చింది. అలాగే రష్యాకూడా నెపోలియన్‌తో, రెండు రోజుల తర్వాత 'తిల్సిత్' వద్ద శాంతి సంధి కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కారణంగా అలెగ్జాండర్1 యూరప్ ఖండ చిత్రపటాన్ని నెపోలియన్ తిరగరాయడానికి అంగీకరించాల్సి రావడమే గాక, గ్రేట్ బ్రిటన్‌తో వాణిజ్యాన్ని కూడా ఆపుజేసుకోవాల్సి వచ్చింది.

'ఫ్రెడ్లాండ్' ఓటమి, 'తిల్సిత్' శాంతి సంధి శరతుల కారణంగా అలెగ్జాండర్1 సెయింట్ పీటర్స్ బర్గ్‌లో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. ప్రత్యేకించి భూస్వాములు, వ్యాపారులు మండిపడసాగారు. ఎందుకంటే వారంతా ఇంగ్లాండ్‌తో జరిగే వ్యాపారంపై అధికంగా ఆధారపడి ఉన్నారు. ఇప్పుడు అది ఆగిపోయినందువల్ల తీవ్రంగా నష్టపోవలసిన పరిస్థితి ఎదురైంది. దీనికి తగ్గట్టుగా యుద్ధ కాలంలో

ప్రభుత్వం అధికంగా చలామణిలోకి తెచ్చిన డబ్బు, అందుకోసం అధికంగా ముద్రించిన కరెన్సీ నోట్ల వల్ల ద్రవ్య చలామణి అదుపుతప్పి, కరెన్సీ విలువ పాతాలానికి దిగజారిపోయింది. వీటన్నింటి ఫలితంగా అలెగ్జాండర్1 ప్రతిష్ట కూడా వేగంగా దిగజారిపోయింది. దాంతో అతడు తీవ్ర అభద్రతా భావానికి గురై, గాఢమైన ఆత్మ పరిశీలన చేసుకోవలసి వచ్చింది. తన ప్రతిష్టను దక్కించుకునే మార్గాల కోసం అతడు తీవ్రంగా ఆలోచించి, తాను స్థిర సంకల్పంతో వ్యవహరించక తప్పదన్న నిర్ణయాని వచ్చాడు. ఫలితంగా యుద్ధానంతర అసంతృప్తులపై కఠినంగా వ్యవహరించడం మొదలెట్టాడు. అంతేగాక, అప్పటి దాకా అంతర్గత సంస్కరణలపై పెట్టిన తన దృష్టిని కొంత పక్కకు మరల్చి ఈసారి 'స్పెరాన్స్కీ' పైకి మళ్లింది. 1808లో అతణ్ని న్యాయ శాఖ ఉప మంత్రిగా చేశాడు. అలెగ్జాండర్ 'స్పెరాన్స్కీ' నుంచి ఆశించింది ప్రధానంగా – న్యాయ సంస్కరణలు, ప్రభుత్వ వ్యవస్థల పునర్నిర్మాణం! దీని ఫలితంగా పాలనా వ్యవస్థను, శాసన నిర్మాణాన్ని, న్యాయ పాలనను విడదియ్యాలని స్పెరాన్స్కీ ఆలోచించాడు. ఇప్పటిదాకా ఇవి మూడు కలిసే ఉన్నాయి రష్యాలో. అలా ఉన్నప్పుడు ప్రజలకు సరైన న్యాయం అందదని అతడు ధృడంగా నమ్మాడు. 'పాలకుడు, అధికారము అక్కరే అయి చట్టాన్ని రూపొందించడం, దాన్ని అమలు చేయడం ఒక్కరే చేస్తున్నప్పుడు, న్యాయం ఆధారంగా పాలన జరగడం అసాధ్యం' అని స్పెరాన్స్కీ గట్టిగా వాదించాడు. దీంతో అలెగ్జాండర్, రష్యన్ పౌర చట్టాన్ని క్రోడీకరించమని, అలాగే రాజకీయ సంస్కరణల గురించి ఒక సాధారణ ప్రణాళికను తయారు చేయమని స్పెరాన్స్కీకి చెప్పాడు.

1809లో అలెగ్జాండర్ సూచనల మేరకు స్పెరాన్స్కీ తాను తయారు చేసిన ప్రణాళికా పత్రాన్ని సమర్పించాడు. 'రాజ్యాంగ చట్టాల క్రోడీకరణకు ముందు మాట' అనే పేరుతో. ఈ ప్రణాళిక రెండు భాగాల్ని కలిగి ఉన్నది. మొదటి భాగం 'దేశ వ్యవహారాలకు సంబంధించిన సాధారణ పరిస్థితులపై పత్రం', రెండో భాగం 'ప్రభుత్వ చట్టాలకు రచయిత సూచించిన సవరణలు'.

రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిని స్పెరాన్స్కీ ముందుగానే గమనించాడు. కానీ అది అప్పుడున్న ప్రభుత్వ రూపంతో ఏకీభవించడం లేదు. అందువల్ల పాలనా పరంగా పునర్‌వ్యవస్థీకరణ జరిగి తద్వారా రాజకీయ హక్కుల్ని, ఇప్పటిదాకా కేవలం అల్ప సంఖ్యాకులైన ఉన్నత వర్గం వారికే అందుబాటులో ఉన్న వారికిగల రాజకీయ హక్కుల్ని, ప్రజానీకంలో అత్యధిక సంఖ్యాకులకు కూడా ఇవ్వాల్సి ఉంటుందని అతడు సిఫార్సు చేశాడు. తద్వారా బానిసత్వం కూడా తగిన విధంగా మారిపోయి రద్దవుతుందని అతడు విశ్వసించాడు. అయితే అలా రద్దు కావడం వల్ల హాని జరుగుతుందని అతడు భయపడ్డాడు కూడా. అయితే అది ఎంతో ముందుగా ఊహించిన చర్య మాత్రమేనని, ఇంకా కార్యరూపం దాల్చని చర్యద్వారా ఎప్పుడో భవిష్యత్తులో జరిగే చర్య అని అతడు భావించాడు. కనుక రాజకీయ సంస్కరణల నుంచి, బానిసత్వం నుంచి రద్దు చర్యను విడదియ్యలేమని అతడు వక్కాణించాడు.

6) స్పెరాన్స్కీ ప్రణాళిక వైఫల్యం, అనంతర పరిణామాలు

స్పెరాన్స్కీ చేసిన చట్టాల నూతన క్రోడీకరణ, నెపోలియన్ గావించిన క్రోడీకరణ చేత అధికంగా ప్రభావితమైంది. 1812లో ఈ చట్టాల క్రోడీకరణ పత్రం రాజ్యం కౌన్సిల్ ముందు పరిశీలనార్థం వచ్చినప్పుడు దానిమీద గల ఫ్రెంచి ప్రభావం అందరికీ ప్రస్ఫుటమైంది. దాంతో స్పెరాన్స్కీ శతృవర్గం ఎవరైతే ఉన్నారో వారు ఇప్పటిదాకా కేవలం అతణ్ని ఫ్రెంచి విప్లవకారులైన జాకోబిన్ పేరుతో రష్యన్ జాకోబిన్ అని పిలిచేవారు కాస్తా ఇప్పుడు ఈ కొత్త క్రోడీకరణ పత్రం కేవలం నెపోలియన్ క్రోడీకరణకు కేవలం అనువాదం తప్ప, అందులో కొత్తదనం ఏమీ లేదని ఆరోపించారు. నిరంకుశత్వం తోటి, ప్రాచీన మత విశ్వాసాల తోటి ఉండే రష్యాలో విదేశీ చట్టాలను – రష్యాకు కేవలం విరుద్ధమైన సాంఘిక, రాజకీయ పరిస్థితులకు అనువుగా అభివృద్ధి చెందిన వాటిని రుద్దాలని ప్రయత్నిస్తున్నాడంటూ స్పెరాన్స్కీని లక్ష్యం చేసుకుని అతని ప్రత్యార్థులు తీవ్ర విమర్శలు సాగించారు.

పై సంఘటనతో స్పెరాన్స్కీకి వ్యతిరేకంగా ప్రచారం మాస్కో నగరంలోనూ మొదలైంది. ఏ ప్రభు వర్గానికి ఇప్పటిదాకా అతడు ప్రాతినిధ్యం వహిస్తున్నాడో వారంతా విదేశీ సంస్కృతిని, నాగరికతను అభిమానించే శక్తిగా ఇప్పటిదాకా ఉన్న వారంతా ఇప్పుడు సెయింట్ పీటర్స్ బర్గ్ గురించి, దాని సంస్కృతి గురించి వ్యతిరేకంగా ఉన్నారు. స్పెరాన్స్కీ గనుక ఇప్పుడు తన మార్గంలోనే మరింత ముందుకెళితే, వారంతా ఎంతైనా దిగులు చెంది ఉండేవారు. తమ జాతి మరో పునాది మెట్టు – జాతి అనూచాన విధానమైన నిరంకుశత్వం, ప్రాచీన మతం, తమ జాతికి సంబంధించిన గుర్తింపు – ఇదంతా దిగజారిపోతుందని, అలాగే చివరాఖరికి (క్రమంగా) బానిసత్వం కూడా నశించిపోతుందని కూడా ఈ రకమైన వ్యతిరేకతకు మేధోపరమైన వ్యక్తీకరణ 'కరమేజిన్' యొక్క ప్రసిద్ధికెక్కిన 'ప్రాచీనమైన, ఆధునికమైన రష్యా గురించిన జ్ఞాపకాలు'లో సరిగ్గా వ్యక్తమవుతుంది. కరమేజిన్ ఇలా ఆరోపించాడు: 'స్పెరాన్స్కీ రష్యా గతానికి చెందినవాడు కాడు, ఆ గతానికి చెందిన శక్తివంతమైన ఆచారాలను అంగీకరించడాన్ని అతడు వ్యతిరేకిస్తాడు, అంతేగాక, ఆ ఆచారాలను గౌరవించే భూములు కలిగిన ప్రభు వర్గాన్ని అతడు భయపెడతాడు'.

అతడింకా అంటాడు 'ఏ చట్టం చేసైనా సరే నిరంకుశత్వాన్ని శాశ్వతంగా కొనసాగించాలి, ప్రభు వర్గాన్ని కొనసాగించాలి, దాని ప్రాచీన కాలం నుండీ వస్తున్న పాత్ర – జార్‌కు వ్యక్తిగత సేవకులుగా ఉండడాన్ని, ఇంకా ఉద్యోగ వర్గాన్ని తగ్గించాలి, వారిలో పెక్కుమంది ప్రభువర్గం స్థానాన్ని ఆక్రమించడాన్ని సహితంగా'.

ఫ్రాన్సు చేత అధికంగా ప్రభావితుడని మాత్రమే గాక, ఫ్రాన్సుకు గూఢచర్యం కూడా చేస్తున్నాడని అతడి మీద ముద్ర వేయడంతో స్పెరాన్స్కీ అధికారచ్యుతిని అడ్డుకునే అవకాశమే లేకుండా పోయింది. చివరికి అతడు ఎంతో ప్రశమించి సిద్ధం చేసిన ప్రణాళిక తిరస్కరించబడింది. ఆ విధంగా అలెగ్జాండర్1 ఉదారవాద కాలం రెండో దశ కూడా (1807-12) మొదటి దశలాగే మారి, రష్యా సమాజ నిర్మాణంలో పునాదికి చెందిన ఎలాంటి మార్పులూ లేకుండానే గడిచిపోయింది.

(ఇంకా ఉంది)

(రచయిత రష్యన్ విప్లవాల, లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకుడు, సాహిత్యకారుడు, విమర్శకుడు)

డేవిడ్ హార్వే: పెట్టుబడి - 7 ప్రధాన వైరుధ్యాలు

పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని పదిహేడు అంతర్ వైరుధ్యాల వల్ల పతనం దిశగా పయనిస్తుందని డేవిడ్ హార్వే చేసిన విశ్లేషణలోని ఏడు ప్రాథమిక వైరుధ్యాలను వివరిస్తున్నారు **రమేష్ పట్నాయక్**

(...గత సంచిక తరువాయి భాగం)

డేవిడ్ హార్వే తన ప్రతిపాదనల పరిమితులను స్పష్టంగా పేర్కొనకపోయినా, మనం ముందుగానే గమనించినట్లు తను అమెరికా లేదా అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలకు చెందిన ఈ మధ్యకాలపు, అంటే రెండవ ప్రపంచ యుద్ధానంతర ఆర్థిక చరిత్రను ఇక్కడ క్రోడీకరిస్తున్నాడు. డేవిడ్ హార్వే: '... ఆర్థిక విధానం, సిద్ధాంతాల మధ్య సమాంతరమైన మార్పులు జరుగుతూ వచ్చాయి. .... మార్క్స్ పెట్టుబడి వాల్యూం రెండులో సుమారు ఒడంబడికలో ఉన్న కీన్స్ డిమాండు మానేజ్‌మెంట్ అనే ఆర్థిక శాస్త్ర ఆలోచనలు 1960లలో ఆధిపత్యంలో ఉండగా 1980ల తరువాత మార్క్స్ వాల్యూం ఒకటిలో పేర్కొన్న విషయాలతో సుమారు ఒడంబడికతో ఉన్న ద్రవ్య నియంత్రణ వాదుల, సప్లై సైడ్ మానేజ్‌మెంట్ సిద్ధాంతాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పెట్టుబడిదారీ దేశాలలో ఆలోచనలలోనూ, ప్రభుత్వ విధానాలలోనూ సంభవించిన ఈ మార్పుల చరిత్ర మార్క్స్ పెట్టుబడి మొదటి, రెండవ వాల్యూంలలో విశ్లేషించబడిన ఉత్పత్తికి, విలువ వాస్తవీకరణకు మధ్య ఉన్న వైరుధ్యపూరితమైన ఐక్యతకు ఒక సంబంధాన్ని చూడడం ప్రధానమైన విషయమని నేను భావిస్తాను....' అంటాడు. అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాల ప్రస్తుత వైరుధ్యాలకు సంబంధించినంత వరకు డేవిడ్ హార్వే చెప్పిన ప్రతి విషయం, ప్రధానంగా సరుకుల ఎగుమతికి అవకాశం లేని దేశాలకు పూర్తిగా వాస్తవమైనదే.

తరువాత డేవిడ్ హార్వే రుణ సౌకర్యం గురించి మాట్లాడుతున్నాడు. ఈ విషయంలో కొన్ని అంశాలను ముందుగా మనం చర్చించుకున్నాం. డేవిడ్ హార్వే పరిశీలనలను ఇక్కడ గమనిద్దాం. డేవిడ్ హార్వే: 'కష్టకాలంలో పెట్టుబడి ఎదుగుదలకు రుణవ్యవస్థ 'కొనుగోలు దారులకు రుణాలు ఇవ్వడం' నిర్మాణాత్మక పాత్ర పోషించింది. అయితే రుణ వ్యవస్థ వలన అదనపు విలువ ఉత్పత్తికి, దానిని లాభంగా వాస్తవీకరించుకోవడానికి మధ్య వైరుధ్యం సరుకులలో ఉన్న విలువకు, డబ్బురూపంలో దాని వ్యక్తీకరణకు మధ్య వైరుధ్యంగా మారిపోయింది.

ఈ రుణ వ్యవస్థ ఒక వైపు .... పెట్టుబడి నిరంతరాయ ప్రవాహానికి ఆటంకం కలిగించే ఎన్నో సమస్యలకు ఉపశమనం కలిగించగా అదే సందర్భంలో సరకుల ధరల అధివూహాగానాల (స్పెక్యులేషన్)కు దారితీసింది..... గృహ సౌకర్య ధరల బుడగ ఇందుకు ఉదాహరణ. ... రుణ సౌకర్యంపై నియంత్రణలు అదనపు విలువను ఉత్పత్తి చేయడం, దానిని వాస్తవీకరించు కోవడం అనే సమస్యను తీవ్రతరం చేస్తుంది. కాగా రుణ సౌకర్య వితరణకు ఉన్న నిబంధనలను తొలగిస్తే, నియంత్రణలను ఉపసంహరిస్తే అది అడ్డూ అదుపూ లేని అధివూహాగానాలకు ప్రధానంగా ఆస్తుల విషయంలో అధివూహాగానాలకు వరద గేట్లను తెరుస్తుంది. 'పెట్టుబడి ఎన్ని కుప్పిగంతులు వేసినా' ఎప్పటికీ మౌలిక సమస్య అయిన ఉపయోగపు, మారకపు విలువల మధ్య ఉన్న వైరుధ్యం, సామాజిక శ్రమకు, డబ్బురూపంలో వ్యక్తమయ్యే దాని విలువకు మధ్య ఉన్న వైరుధ్యం మాత్రం రద్దుకాజాలవు. ....ఈ వివిధ వైరుధ్యాల మధ్య అంతఃసంబంధాలు పదే పదే ద్రవ్య, వాణిజ్య సంక్షోభాలకు దారి తీస్తాయి' అంటాడు. డేవిడ్ హార్వే: 'అదనపు విలువ ఉత్పత్తి, లాభాల వాస్తవీకరణ అనే వైరుధ్యానికి అనేక ద్వితీయ వైరుధ్యాలు అంటిపెట్టుకుని ఉన్నాయి. ....అదనపు విలువ ఉత్పత్తి అయ్యేది పని స్థలం అంటే పరిశ్రమ వద్ద .... కాగా అది వాస్తవీకరణ పొందేది అంటే ధన రూపంలో లాభంగా మారేది మార్కెట్‌లో అన్న విషయం తెలిసిందే. ....అయితే ఈ లాభంలో బ్యాంకువాడు, భూయజమాని, సరుకులు అమ్మిపెట్టే వ్యాపారి, పన్ను రూపంలో ప్రభుత్వం వాటాలు అడుగుతారు. కొన్ని సందార్భాలలో ఆ వాటాలే ఎక్కువై పారిశ్రామిక పెట్టుబడి దారుడికి మిగిలేది స్వల్పం అవుతుంది. ప్రధానంగా 'ద్రవ్య రంగంలోనూ, వ్యాపార రంగంలోనూ మోనోపలి ఏర్పడినప్పుడు' బ్యాంకులు అధిక వడ్డీని, వ్యాపారులు అధిక రిబేటును గుంజుతారు ...చైనాలో వ్యాపార రంగంలో ప్రవేశించిన వాల్ మార్ట్ అక్కడ పరిశ్రమలలో ఉత్పత్తి అయిన లాభాలన్నింటిని గుంజుతుంది....' అంటాడు.

అదనపు విలువ సృష్టి పరిశ్రమలలో జరిగినా దాని నుండి లాభం పారిశ్రామిక పెట్టుబడిదారునికి కాక ఇతర పెట్టుబడిదారులకు చెందడం వలన పారిశ్రామిక పెట్టుబడి తగినంతగా పెరగదు అంటాడు డేవిడ్ హార్వే. అది నిజమే. కాని పెట్టుబడి ఎక్కడికీ పోదు. స్థిరాస్తి యజమానుల వద్దకు చేరిన లాభాలతో వారు మోనోపలి కనిష్ట ధరలకు చిన్న ఆస్తిపరులు ఆస్తిని కొనివేస్తారు. స్థిరాస్తిపరుల ఆస్తి పెరుగుతూ ఉంటుంది. తమ ఆస్తులు అమ్ముకున్నవారు వచ్చిన ధనంతో మార్కెట్‌లో వస్తు సేవలు కొనుగోలుచేస్తారు. ఇదికొంత డిమాండును సృష్టిస్తుంది. ఇక లాభాలు పొందిన వ్యాపార సంస్థలు చిన్న చిన్న వ్యాపార సంస్థలను దివాళా తీయిస్తాయి. తమ వ్యాపారాలను తెగనమ్ముకున్న చిన్న చిన్న వ్యాపారులు కూడా ఫకీరులుగా మారిపోయే క్రమంలో వివిధ సరుకులకు కొంత కాలం కొంత డిమాండును కల్పిస్తారు. బ్యాంకులు కూడా ఇదే విధంగా మోనోపలివైపు ప్రయాణిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాదు, ఆ పెట్టుబడి వర్గాలలో (వస్తు తయారీ పరిశ్రమ, స్థిరాస్తి, వ్యాపారం) ఎవరికైనా విస్తరణావకాశాలు లేనప్పుడు వారు తమ లాభాలను బ్యాంకులలో వేస్తూంటారు, లేదా లాభాలు వచ్చే రంగాలలో షేర్లు కొనుగోలు చేస్తూంటారు. ఈ పెట్టుబడి విభాగాల మధ్య బ్యాంకింగ్, షేర్ మార్కెట్ వ్యవస్థల ద్వారా ఒక విధమైన సంలీనత ఉంది. కార్ల్ మార్క్స్ చెప్పినట్లు పెట్టుబడి అధిక లాభాల విభాగాల వైపు కదులుతూ లాభాల రేటులో ఒక సరాసరి పరిస్థితిని కల్పిస్తూ ఉంటుంది. స్థిరాస్తి, వ్యాపార రంగాలు లాభాల పంపకంలో అధికాధికంగా బలమైన పోటీదారులుగా పారిశ్రామిక పెట్టుబడిని ఒక గడ్డు సమస్యలోనికి నెట్టివేసాయి. అలాగే స్థిరాస్తిలో భూమి మాత్రమే కాక రైల్వేలు రోడ్లు, ఓడ రేవులు, విమానాశ్రయాలు వంటివి కూడా ఉన్నప్పుడు, అవి కూడా మోనోపలి పెట్టుబడిగా మారినప్పుడు పరిశ్రమలు తమకవసరమైన రవాణాకు మోనోపలి ధరలు

చెల్లించాల్సి వస్తుంది. అంటే ఆ మేరకు సరుకులు ఉత్పత్తి చేసే పరిశ్రమల లాభాలలో కోత పడుతుంది . దీనినే డేవిడ్ హార్వే ఇక్కడ నొక్కిచెప్తున్నాడు.

కార్మికుల నుండి వారు సృష్టించిన అదనపు విలువ దోపిడీ చేయబడిన తరవాత దానిని ఎవరు భుక్తం చేస్తే మనకేమని ఊరుకోలేము. ఎందుకంటే ఆర్థిక అభివృద్ధి అనేదానిని వస్తువుల ఉత్పత్తి, పరిమాణాలు, ప్రమాణాలతో కొలుస్తారు. కాబట్టి ఉత్పత్తి అవుతున్న లాభాలు పారిశ్రామిక పెట్టుబడిదారులకు ఎక్కువగా చేరితే, వస్తూత్పత్తి రంగం మరింత అభివృద్ధి చెందుతుంది. అందుకే లాభాలు స్థిరాస్తిదారులకు, వ్యాపారులకు, బ్యాంకులకు అధికాధికంగా దఖలు పడడం అభివృద్ధికి ఆటంకంగా చెప్తారు. స్థిరాస్తిదారులను, వ్యాపారులను, బ్యాంకర్లను ఉత్పత్తిచేయకుండా అద్దెలు వసూలు చేసుకుని బతికే వర్గాలుగా పారిశ్రామిక పెట్టుబడిదారులే కాక ఆర్థిక వేత్తలు కూడా విమర్శిస్తారు. పారిశ్రామిక పెట్టుబడిదారుడు ఉత్పత్తిని నిర్వహించి అదనపు విలువ సృష్టికి కారకుడైతే మిగిలిన పెట్టుబడి వర్గాలు (బ్యాంకులు, వ్యాపారులు, స్థిరాస్తిదారులు) ఉత్పత్తి ప్రక్రియతో సంబంధం లేకుండా లాభాల పంపకంలో మాత్రం వాటాకు వస్తారపూ విమర్శ ఉంది. ఇది న్యాయాన్యాయాలకు సంబంధించిన విషయం కాదు. అదనపు విలువ సృష్టించిన కార్మికుల నుంచి అది లాగివేయబడిన తరువాత న్యాయాన్యాయాల చర్చ ఏం ఉంటుంది. లాభాలలో వాటా పారిశ్రామిక పెట్టుబడిదారులకు ఎక్కువగా మిగిలితే పెట్టుబడి వస్తూత్పత్తి వైపు ఎక్కువగా జరుగుతుందనేది, వస్తూత్పత్తి పెరుగుతుందనేది ఇక్కడ ప్రధాన విషయం. రిబేటు తీసుకుని వ్యాపారం చేయవలసిన వ్యాపారులు మోనోపలిగా మారి, పైచేయి ఎలా సాధించారో డేవిడ్ హార్వే వివరించలేదు. నిజానికి వ్యాపారంలో మోనోపలి ఏర్పడడం వలన వాణిజ్య సంక్షోభం రాలేదు. పారిశ్రామిక సరుకులు కొనుగోలు చేసేవారు లేకపోవడంతో వస్తువును ఉత్పత్తి చేయడం కంటే అమ్మి పెట్టడమే గొప్ప విషయంగా మారిపోయింది. అందుకే పారిశ్రామిక వర్గాల కంటే వ్యాపార వర్గాలకు ప్రాధాన్యత పెరిగింది. అంతేకాదు, పారిశ్రామిక రంగం క్యాపిటల్ ఇంటెన్సివ్ కాగా వ్యాపార రంగం లేబర్ ఇంటెన్సివ్. ఫలితంగా లాభం రేటు వ్యాపారం రంగంలో ఎక్కువగా ఉంటుంది. ఈ విషయాలను మనం గత అధ్యాయాలలో కూడా చర్చించాము.

డేవిడ్ హార్వే ఇక్కడ మరొక్క సమస్యను చర్చిస్తున్నాడు. డేవిడ్ హార్వే కార్మికులు తమ సమిష్టి పోరాటాల ద్వారా తమ కనీస వేతనాల కంటే అదనంగా తాము సృష్టించిన అదనపు విలువలో కొంత భాగాన్ని జీత భత్యాలుగా పొందగలిగితే దానిని తిరిగి హస్తగతం చేసుకోవడానికి పెట్టుబడి వివిధ రూపాలలో ప్రయత్నిస్తుంది.... వారు వాడే సరుకుల ధరలు పెంచడం ద్వారా, ఇంటి అద్దెలు పెంచడం ద్వారా వారిపై పన్నులు పెంచడం ద్వారా దీనిని సాధిస్తారు అంటాడు. పరిశ్రమలలో ట్రేడ్ యూనియన్ పోరాటాల ద్వారా సాధించుకున్న వేతనాల పెరుగుదలను మార్కెట్‌లో ధరలు పెంచడం ద్వారా పెట్టుబడిదారీ వర్గం కాజెయ్యడానికి ప్రయత్నించడం వాస్తవమే. అయితే, ఇలా చెపితే ఎలా ఉంటుందంటే జీతాలు పెంచుకోవడానికి కార్మిక వర్గం చేసిన పోరాటాల వలన ప్రయోజనం ఏమీ ఉండదని చెప్పినట్లు ఉంటుంది. వెస్టర్న్ ఇటువంటి వాదనలనే లేవనెత్తినప్పుడు మార్క్స్ ఆ వాదనను తిరస్కరించాడు. కార్మికులు తమ పోరాటాల ద్వారా వేతనాలు పెంచుకుంటే వారు కొనుగోలు చేసే సరుకులకు డిమాండు పెరుగుతుందని, అప్పుడు తాత్కాలికంగా వాటి ధరలు పెరుగుతాయని, ఆ సరుకులు ఉత్పత్తి చేసే పరిశ్రమలు అధిక లాభాలు చూస్తాయని, అయితే అనతి కాలంలోనే ఆ రంగం వైపు పెట్టుబడులు ప్రవహించడం వలన ఉత్పత్తి పెరుగుతుందని ధరలు తగ్గి సరుకులు విలువకు సర్దుకుంటాయని చెప్తాడు. మరొక విషయం ఏమంటే, ఒక దేశంలో కార్మికుల పోరాటం సార్వత్రికమైతే ఆ దేశంలో కార్మికుల జీవన ప్రమాణాలు ఉన్నత స్థాయిలో స్థిరీకరించబడతాయి. అప్పుడు 'అవసర శ్రమ' వాటా పెరిగి 'అదనపు శ్రమ' వాటా తగ్గుతుంది. అయితే, ఇదంతా సాధారణంగా అభివృద్ధిచెందిన దేశాలలో జరుగుతుంది. ఏదేమైనా పోరాట ఫలితాలను తిరిగి గుంజుకోవడానికి ప్రయత్నం జరగదని కాదుకాని ఆ ప్రయత్నంలో పెట్టుబడి ప్రతీసారి విజయం పొందుతుందని చెప్పలేము.

ఈ సందర్భంలో డేవిడ్ హార్వే సామాజిక భద్రత విషయం చర్చించాడు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఒకవైపు మార్కెట్ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి, ఇంకా ప్రధానంగా కార్మికుల విప్లవ తిరుగుబాటును ఎదుర్కోవడానికి పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాలు సంక్షేమ రాజ్య విధానాలను అమలు చేయడం ప్రారంభించిన విషయం తెలిసిందే. అత్యధిక సోషలిస్టు రాజ్యాలు కూలిపోయిన తరువాత, పెట్టుబడిదారీ రాజ్యాలు తిరిగి రెండవ ప్రపంచ యుద్ధ పూర్వ పరిస్థితికి మారుతున్నాయి, కఠినమైన రాజ్యాలుగా మారిపోతున్నాయి. పెట్టుబడిదారీ రాజ్యాలు సామాజిక రక్షణలను రద్దుచేస్తున్నాయి. దీనినే డేవిడ్ హార్వే నిరాశ్రయులను చేయడం ద్వారా పెట్టుబడి సమీకరణ (అక్యూమిలేషన్ బై డిస్పొజిషన్) అని అన్నాడు. ఇప్పుడు పెట్టుబడిదారీ దేశాలు పెన్షన్లను రద్దుచేయడమే కాక విద్యా, వైద్యం, సాగునీరు, తాగునీరు, మునిసిపల్ సేవలన్నింటినీ ప్రైవేటు పరం చేస్తూ మొత్తం సామాజిక భద్రతలను తుడిచిపెడుతున్నాయి. దీని వలన పెట్టుబడికి రెండు లాభాలు జరుగుతున్నాయి. ఒకటి ప్రభుత్వానికి డబ్బులు మిగులుతాయి, కాబట్టి ప్రభుత్వం పెట్టుబడిదారులకు (రైతులకు కాదు) రుణమాఫీ పథకాన్ని అమలు చేయవచ్చు. దీనినే వారు నిర్వహణలో లేని ఆస్తులు (నాన్ ఫంక్షనింగ్ అసెట్స్)ను రద్దుచేయడమని సాధారణ ప్రజలకు అర్థం కాని భాషలో చెప్తారు. రెండవ ప్రయోజనం ఏమంటే విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, మునిసిపల్ సేవలు వంటి సామాజిక రంగాల నుండి ప్రభుత్వం వైదొలుగుతున్నందున ఆయా రంగాలలో పెట్టుబడిదారులు వ్యాపారం చేసుకోవచ్చు. ప్రపంచంలో అనేక దేశాలు ఈ విధంగా ప్రజలను పెట్టుబడి కోరలకు అప్పజెప్తున్నాయి. అందుకు అంగీకరించని దేశాలనే అమెరికా వివిధ దొంగ సాకులు చూపి రోగ్ దేశాలని పేరుపెట్టి వాటిపై దండయాత్ర చేసి వాటిలో తమ తాబేదారులను నియమించి సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అమలు జరిగేటట్లు చూస్తున్నది.

ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సామాజిక వేతనం అని కూడా అనవచ్చు. విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, మున్సిపల్ సేవలు వంటి సామాజిక రక్షణ చర్యలు ఉపసంహరిస్తే పెట్టుబడిదారులకు ఒనగూడే ప్రయోజనాలు మనం పైన పరిశీలించాము. అయితే అక్కడతో విషయం పూర్తి అయినట్లు కాదు. ఈ రంగాల నుంచి ప్రభుత్వం ఉపసంహరించుకున్నందున కార్మికులు విద్యా, వైద్యం వంటి ప్రతి సేవా కొనుగోలు చేయవలసి రావడం వలన వారి కనీస జీవితావసరాల కొనుగోలుకు అదనంగా డబ్బు అవసరం అవుతుంది. గతం కంటే అదనంగా వేతనం అవసరం అవుతుంది. కనీస వేతనాలు పెరగవలసి ఉంటుంది. అందుకె వారు సమరశీలంగా పోరాడుతారు. పోరాటాలు అనేక సందర్భాలలో విజయవంతం అవుతాయి. వారు చేసే శ్రమలో అవసర శ్రమ శాతం పెరిగి అదనపు శ్రమ శాతం తగ్గుతుంది. అంటే అదనపు విలువ తగ్గుతుంది. అంటే లాభాలకు ప్రాతిపదిక కుంచించుకు పోతుంది. ఈ ప్రక్రియ అభివృద్ధిచెందిన దేశాలకు పూర్తిగా వర్తిస్తుంది. అంటే సామాజిక వేతనం రద్దయినప్పుడు పరిశ్రమలో ఇచ్చే వేతనాలు పెరగవలసి ఉంటుందన్న మాట. అంతేకాదు, సుమారు అభివృద్ధిచెందిన దేశాలలో వాస్తవంగా వేతనాలు పోరాటాల వలన పెరుగుతాయి కూడా.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో విషయం ఇంత సరళంగా ఉండదు. ఇక్కడ నిరుద్యోగ సైన్యాలు ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వం కల్పించే సామాజిక రక్షణలు తగ్గినంత మాత్రాన కార్మిక వేతనాల

పెంపుదలకు చేసే పోరాటాలు విజయవంతం కావు. పూర్తిగా వేతనాలపై ఆధారపడే కార్మికులు కనీస అవసరాలు కూడా తీరకుండా పనిచేయవలసి వస్తుంది. వారి పిల్లలను వారి స్థాయికి కూడా వారు అభివృద్ధిచేయలేక పోతారు. అంటే కనీస వేతనాలు లేక తమను తాము పునరుత్పత్తి చేసుకోలేకపోతారు. వేతనాలు మాత్రమే కాకుండా భూములు ఇతర ఆస్తులు ఉన్న వారు వాటిని అమ్ముకుంటూ తమ పిల్లలను చదివించుకుంటారు. వారు భవిష్యత్ కార్మికులవుతారు. ఇప్పటి కార్మికుల పిల్లలు పరిచారికలవుతారు. అంటే రైతులు ఆస్తులు కోల్పోయి ఏమీ లేని కార్మికులవుతారు. ఇప్పటికే ఏమీ లేని కార్మికులు ఆ స్థితిని కూడా కోల్పోయి పరిచారికలవుతారు. అత్యంత తక్కువ వేతనాలు ఉన్న సేవారంగాలలో బతుకు తెరవుకై ప్రయత్నిస్తారు. కాని అదికూడా గ్యారంటీ ఉండదు. పీడిత వర్గాలు అతలాకుతలం అవుతాయి. అందుకే అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వం సంక్షేమ రంగాన్ని నీరుకారిస్తే తీవ్ర సామాజిక సంక్షోభం ఏర్పడుతుంది. తీవ్ర వ్యతిరేకత వస్తుంది. సామాజిక సేవలు, సంక్షేమ రంగాలను రద్దుచేయాలంటే ముందుగా ప్రజల మధ్య సాధారణ ఐక్యతను విచ్ఛిన్నం చేయవలసి ఉంటుంది., ఎన్నికలను రద్దుచేయవలసి ఉంటుంది. అంటే ఫాసిజమే మార్గం. ప్రస్తుత పాలకులు అటువైపే అడుగులు వేస్తున్నారు. కార్మికులు, రైతులు, దళితులు, మహిళలు, మైనారిటీలు దీనిని ఆపగలరా అని చూడవలసి ఉంది.

ఆర్థిక సూత్రం మేరకు మనం చెప్పుకోవాలంటే పరిశ్రమ యజమాని ఇచ్చే వేతనం, ప్రభుత్వం సామాజిక సేవల ద్వారా అందించే విలువల మొత్తం కార్మికుల కనీస వేతనంగా ఉంటుంది. అభివృద్ధిచెందిన దేశాలలో సామాజిక సేవలు తగ్గితే, సుమారు వెంటనే పరిశ్రమలో ఇచ్చే వేతనాలు పెరగాలి, పెరుగుతాయి. అయితే, అభివృద్ధి చెందుతున్న దేశాలలో సామాజిక సేవలు తగ్గినంత మాత్రాన పరిశ్రమలలో వేతనాలు పెరగవు. రైతులు, వృత్తికారులు చిన్న చిన్న ఆస్తులున్న వారు తమ ఆస్తులను కోల్పోయి (అంటే వివిధ మార్గాలలో పెట్టుబడిదారులకు తమ ఆస్తులు అప్పజెప్పి) బికారులవుతారు. ఈ విధంగా వర్గ విభజన తీవ్రతరమతుంది. అంతేకాదు, జనాభా అదనంగా తేలుతుంది! అంటే మార్కెట్‌కు కార్మికులు గా గాని లేదా కొనుగోలుదారులుగా గాని అవసరం లేని జనాభా! వివిధ విభాగాల ప్రజలు జీవితపు అంచులకు నెట్టివేయబడతారు. ఆత్మహత్యలు ఒక నియమం అవుతాయి. అయితే, దీనితోపాటు మరొక ప్రక్రియ సమాంతరంగా జరుగుతుంది. అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడిదారు లు మొత్తం భూములను, అడవులను, గనులను, నదులను, సామాజిక సంపదనంతా తమ ప్రైవేటు ఆస్తిగా మార్చుకున్న చరిత్ర తెలిసినదే. అటువంటి ప్రక్రియ నేడు భారత దేశం వంటి దేశాలలో జరుగుతున్నది. పెట్టుబడిదారుల దృష్టి పరిశ్రమలలో, వ్యాపారాలలో లాభాల మీద కంటే నేడు వీటిమీదే ఎక్కువ ఉందని చెప్పవచ్చు. ఇది ఒకప్పుడు ఇంగ్లాండులో జరిగిన ఆదిమ సంచయం (ప్రిమిటివ్ అక్యూములేషన్) వంటిది. ఈ పరిస్థితులలో ఇతర కారణాల వలన సామాజిక తిరుగుబాట్లు వస్తే అవి ఈ ప్రక్రియను కూడా అడ్డుకుంటాయి. అందుకే సామాజిక సేవలను రద్దుచేయడానికి ప్రభుత్వాలు అంత ధైర్యం చేయడం లేదు. అయితే ప్రపంచ సలహా మేరకు సామాజిక సేవలను ప్రభుత్వ సంస్థల ద్వారా కాకుండా ప్రైవేటు యాజమాన్యాల ద్వారా రీయింబర్స్‌మెంట్ పద్ధతిలో ఇస్తున్నారు. ఇది కూడా బెడిసి కొడుతుంది. పెట్టుబడి ఏ మార్గం ఎంచుకున్నా ఆదారి వారిని ఎక్కువ దూరం తీసుకు వెళ్లలేదు.

అనేక విషయాలు చర్చించిన తరువాత డేవిడ్ హార్వే ఒక సూత్రీకరణ చేస్తాడు. డేవిడ్ హార్వే సూత్రీకరణలో ఉత్పత్తి పక్షం, వాస్తవీకరణల పక్షం అన్న మాటలను వాడతాడు. పరిశ్రమలో వేతనాల వాటా తగ్గించి ఎక్కువ అదనపు విలువను ఉత్పత్తి చేయడానికి ప్రయత్నించడాన్ని ఉత్పత్తి పక్షం ఆర్థిక వ్యవస్థ అని, వాస్తవీకరణ వద్ద అంటే ఎక్కువగా అమ్ముకునేందుకు వీలైన పరిస్థితులు కల్పించుకునే విధానాన్ని డిమాండు పక్షం లేదా వాస్తవీకరణ పక్ష ఆర్థిక వ్యవస్థ అని అంటారు. డేవిడ్ హార్వే: 'ఉత్పత్తికి, దాని వాస్తవీకరణకు మధ్య ఉన్న వైరుధ్య పూరిత ఐక్యత కార్మికుల తలరాతకు ఎంతవరకు వర్తిస్తుందో పెట్టుబడికి కూడా అంతవరకు వర్తిస్తుంది. ఈ పరిస్థితి నుంచి చేయదగ్గ తార్కికమైన నిర్ధారణ ఏమంటే జీవితం, కార్యాచరణల వ్యాప్తంగా వర్గ వైరుధ్యం, వర్గ పోరాటాల మధ్య ఆవశ్యకంగా ఒకానొక వైరుధ్య పూరితమైన ఐక్యత ఉన్నదన్నదే'... అంటాడు. ఈ వ్యక్తీకరణ చూస్తుంటే కార్మిక వర్గం, పెట్టుబడిదారీ వర్గం రెండు వర్గాలు కూడా సమస్యలను ఎదుర్కొంటు న్నాయి, అవి రెండూ వైరుధ్యంలో ఉన్నా కలసి జీవించాలి, కలసి కార్యాచరణ సాగించాలి, కావున, రెండు వర్గాలు ఒక సామాన్య పరిష్కారం కనుగొనడం సాధ్యమే అని డేవిడ్ హార్వే చెప్తున్నట్లు అనిపిస్తున్నది. మనకు తెలిసినంత వరకు సాధారణ సందర్భంలో రెండు వర్గాలు వివిధ నిర్దిష్ట పోరాటాల వారిగా రాజీ పడతాయి. రాజీ సహజంగానే వర్గ బలాబలాలపై ఆధారపడి ఉంటుంది. అయితే, రాజీ పడడం సామాన్య పరిష్కారం కనుగొనడం ఎంతమాత్రమూ కాదు. సామాన్య పరిష్కారం అన్న పదబంధాన్ని హార్వే వాడకపోయినా ఐక్యతకు హార్వే ఇచ్చిన ప్రాధాన్యత అదే అర్థాన్ని ఇస్తున్నది. ఈ కింద ఆయన చూపిన ప్రత్యామ్నాయం కూడా అదే అర్థాన్ని ఇస్తున్నది. ఇక విప్లవ సందర్భంలో వర్గ పోరాటం అమీ తుమీ తేల్చుకుంటుంది. ఈ విషయం డేవిడ్ హార్వే అసలు రాయడు.

డేవిడ్ హార్వే : 'ఉత్పత్తి, దాని వాస్తవీకరణల మధ్య సంబంధాన్ని తారుమారు చేయడమే ఈ వైరుధ్యం మనలను నడిపించే రాజకీయ లక్ష్యం కాగలదు. విస్తృత ప్రజానీకానికి అవసరమైన ఉపయోగపు విలువలను అంచనా వేయడం, దానికనుగుణంగా ఉత్పత్తిని నిర్వహించడం అనేది వాస్తవీకరణ స్థానాన్ని ఆక్రమించాలి. దీనిని రాత్రికి రాత్రి చేయడం సాధ్యం కాకపోవచ్చు. అయితే క్రమ క్రమంగా మౌలిక అవసరాలను సరుకు లక్షణం నుండి విముక్తి చేయడం అనేది సాధ్యమయ్యే ఒక దీర్ఘకాల పథకంగా ఉండగలదు. ... మారకపు విలువను పెంచుకుంటూ పోవడం అనే లక్ష్యం కాకుండా ఉపయోగపు విలువను ఉత్పత్తి చేయడం అనే లక్ష్యం ఆర్థిక వ్యవస్థను నడిపించే సాధనంగా ఉండాలన్న భావనకు ఇది (తారుమారుచేయడం) సరిగా సరిపోతుంది.' అంటాడు. ఇంకా 'ఇది చాలా పెద్ద లక్ష్యంగా కనిపిస్తే ఐరోపాలో సోషల్ డెమోక్రాటిక్ రాజ్యాలు (ప్రధానంగా స్కాండినేవియన్ దేశాలు) 1960ల నుండి తమ పెట్టుబడిదారీ వ్యవస్థను ఒడిదుడుకులు లేకుండా నడుపుకోవడానికి డిమాండు పక్ష మేనేజ్‌మెంటు వైపు తమ ఆర్థిక విధానాన్ని దిశానిర్దేశం చేసుకున్న విషయాన్ని గుర్తుచేసుకుంటే ఉపయోగంగా ఉంటుంది.... ఉత్పత్తి – వాస్తవీకరణ పద్ధతిని తారుమారు చేయడం అనే పెట్టుబడిదారీ వ్యతిరేక ఆర్థిక విధానం కాంక్షించే పనిని వారు, అర్ధ మనస్కంగా చేసినా పాక్షికంగా సాధించారు.' అంటాడు. నిజానికి 'ఉత్పత్తి, దాని వాస్తవీకరణల మధ్య సంబంధాన్ని తారుమారు చేయడం' అంటే మారకపు విలువను పెంచుకుంటూ పోవడం అనే లక్ష్యం స్థానంలో ఉపయోగపు విలువలను ఉత్పత్తి చేయడం అనే లక్ష్యం పాదుకొల్పడమా? ఈ విషయంపై హార్వే ఎటువంటి వివరణ ఇచ్చినట్లు లేదు. ఒకప్పుడు కీన్స్ విధానాలను అవలంబించిన అమెరికా క్రమంగా లాభాల సంక్షోభాన్ని ఎదుర్కొని ఆ విధానాలను పక్కన పెట్టేసింది. స్కాండినేవియన్ దేశాలు ఒక్క మినహాయింపు. అటువంటి మినహాయింపు మరికొన్ని దేశాలకు సాధ్యం కావచ్చునేమో కాని అటు అమెరికాకు గాని ఇటు భారతదేశానికి గాని సాధ్యం కాదు. డేవిడ్ హార్వే చూపిన రాజకీయ పరిష్కారాలు ఆమోదించడం కొంత కష్టంగానే ఉంది. ఇంతటితో ఏడవ వైరుధ్యంపై చర్చ ముగిద్దాం.

(ఇంకా ఉంది)

(కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి)

గిరిజనేతరులు మన్యాన్ని వీడాలి

1/70, పెసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, గిరిజనేతరుల అక్రమ కట్టడాలను తొలగించాలని విశాఖ జిల్లా చింతపల్లిలో ఆదివాసీల పరిరక్షణ సమితి (జెఏసి) ఆధ్వర్యంలో డిసెంబర్ 31న భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన గురుకుల జూనియర్ కళాశాల నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ సభలో జెఏసి కన్వీనర్ రామారావు దొర గిరిజన చట్టాలను తుంగలో తొక్కిన గిరిజనేతరుల రేషన్, ఓటర్, ఆధార్ కార్డులు, విద్యుత్ మీటర్లను తొలగించాలన్నారు. మన్యంలో గణనీయంగా పెరిగిన గిరిజనేతరులు వెంటనే మన్యాన్ని వీడిపోవాలని డిమాండ్ చేశారు.

పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మిలియన్ మార్చ్

సిఎఎ, ఎన్ఆర్సి, ఎన్పిఆర్‌లకు నిరసనగా వేలాది మంది ముస్లింలు, ప్రజాస్వామికవాదులు జాతీయ జెండాలతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'హమ్ హిందుస్థానీ, హిందుస్థాన్ జిందాబాద్, పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని నినదించారు. తెలంగాణ, ఎపి జెఏసి, తెహరీక్ ముస్లిం షబ్బాన్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 5న ఇందిరాపార్క్ వద్ద మిలియన్ మార్చ్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో హిందూ ముస్లింలను విభజించేందుకు కుట్రపన్నుతోందని ఆరోపించారు. అందులో భాగంగానే సిఏఏ, ఎన్ఆర్సి, ఎన్పిఆర్‌ల అమలు చేయాలని ప్రయత్నిస్తోందని. ఈ చర్యను వ్యతిరేకిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లో నిత్యం నిరసనలు కొనసాగుతున్నాయి.

అమరావతి కోసం కొనసాగుతున్న నిరసనలు

ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి పరిరక్షణ సమితి (జెఏసి) ఇచ్చిన సమ్మె పిలుపుకు స్వచ్ఛందంగా రైతులు, మహిళలు, పెద్ద ఎత్తున రోడ్లమీదకు వచ్చారు. 'ఈ రాజధాని మాది' నినాదంతో అమరావతిలో భారీ ర్యాలీలు జరిగాయి. జనవరి 3న మందడంలో మహిళలపై పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా రాజధాని 23 గ్రామాలు జనవరి 4న స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులకు అసెంబ్లీ జనవరి 20న ఆమోదం తెలిపింది. ఇదే రోజు అమరావతి చుట్టుపక్కల గ్రామాలు అసెంబ్లీకి చేరుకోగా పోలీసులు లాఠీచార్జీ చేసి, ప్రజలను గాయపరిచి, అరెస్టుచేసి చెల్లాచెదురు చేశారు. అయినా ఇప్పటికీ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి.

విప్లవ రచయితల సంఘం 27వ మహా సభలు

ప్రస్తుతం దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమల్లో ఉందని కంచన్ కుమార్ అన్నారు. బిజెపికి లౌకికవాదం గిట్టదని, భారతదేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని, అందులో భాగంగానే ఎన్ఆర్సి, సిఏఏ, ఎన్పిఆర్ వంటి అప్రజాస్వామిక విధానాలను తెస్తున్నారన్నారు. విప్లవ రచయితల సంఘం 'యాభై వసంతాల వర్గ పోరాట రచన' నినాదంతో జనవరి 11, 12 తేదీల్లో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 27వ మహాసభలు జరిగాయి. ఈ సభలో కంచన్‌కుమార్ ప్రారంభోపన్యాసం చేశారు. 'సృజనాత్మక ధిక్కారం'పై పాణి; ఫాసిస్టు వ్యక్తీకరణలు–భిన్న సమూహాల సృజనాత్మక ధిక్కారంపై ఇతర రాష్ట్రాల ప్రముఖులు, ఫాసిస్టు సందర్భంలో రచన అంశంపై సంగిశెట్టి శ్రీనివాస్‌తో పాటు పలువురు రచయితలు మాట్లాడారు. యాభై వసంతాల విప్లవ సాహిత్యోద్యమంపై కాశీం; పీడిత అస్తిత్వాల ధిక్కారంపై వరలక్ష్మి; దేశవ్యాప్తంగా ఫాసిస్టు రాజ్యహింస–రచయితలు అంశంపై దేవిప్రియ తదితరులు ప్రసంగించారు.

ఆచంట లక్ష్మణరావు మృతి

శ్రీకాకుళ ఉద్యమకారుడు, ప్రజా న్యాయవాది ఆచంట లక్ష్మణరావు జనవరి 15న మరణించారు. 1936లో విశాఖ జిల్లా నర్సీపట్నంలో జన్మించిన లక్ష్మణరావు ఆంధ్రా విశ్వవిద్యాలయంలో బి.ఎల్. చదివి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు రాజకీయాల్లో చురుకుగా పనిచేసిన లక్ష్మణరావు నక్సల్బరీ ఉద్యమంతో ప్రభావితమై శ్రీకాకుళ ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించారు. 1968లో పి.డి. యాక్ట్ కింద అరెస్టై 6 నెలలు జైల్లో ఉన్నారు. 140 మంది ముద్దాయిలు, 897 మంది సాక్షులతో ఏడేళ్ల పాటు విచారణ సాగిన ప్రపంచంలోనే అతిపెద్ద కుట్రకేసుగా పేర్కొనే పార్వతీపురం కుట్రకేసులో నిందితుడుగా 4 ఏళ్లు జైలు శిక్ష అనుభవించారు.

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ. కాశీం అరెస్టు

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొ. కాశీంను మావోయిస్టులతో సంబంధాలున్నాయనే అభియోగంతో గజ్వేల్ పోలీసులు జనవరి 18న అరెస్టు చేశారు. ఆయన క్వార్టర్ తలుపులు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి తనికీలు చేసి ఆయన్ను ములుగు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రజల గొంతులను నొక్కడంలో భాగంగానే కాశీం అరెస్టు అని ఈ అప్రజాస్వామిక చర్యను ఖండిస్తూ ఆయన్ని వెంటనే విడుదల చేయాలని తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు, ప్రజా సంఘాలు, మేధావులు నిరసనలు కొనసాగిస్తున్నారు. ప్రొ. కాశీంను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 24న ఉస్మానియాలో పలు విద్యార్థి సంఘాలు ర్యాలీ నిర్వహించాయి.

రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సదస్సు

కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ ఉల్లంఘనకు వ్యతిరేకంగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో తెలంగాణలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని జనవరి 21న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించింది. ఈ మేరకు జనవరి 13న వేదిక తీసుకున్న నిర్ణయాలను సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, చాడ వెంకటరెడ్డి వెల్లడించారు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా సదస్సులు నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. జనవరి 23న సుబాస్ చంద్రబోస్ జయంతి సందర్భంగా కార్యక్రమాలను నిర్వహించాలని, జనవరి 26న రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా, జనవరి 30న మహాత్మాగాంధీ వర్ధంతిన వివిధ రూపాలలో కార్యక్రమాలు నిర్వహించాలని వేదిక పిలుపునిచ్చిందని తెలిపారు.

ఎ.పి. విఠల్ మృతి

మార్క్సిస్టు మేధావి ఎ.పి. విఠల్ (78) జనవరి 20న గుండెపోటుతో విజయవాడలో మృతిచెందారు. విఠల్ గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గంలోని వరహాపురంలో జన్మించారు. 1967లో గుంటూరు ప్రభుత్వ కళాశాలలో ఆయన ఎంబిబిఎస్ చదివారు. ఆ రోజుల్లోనే కమ్యూనిస్టు సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. వైద్య విద్య పూర్తయ్యాక నెల్లూరు ప్రజావైద్యశాలలో వైద్యుడిగా విఠల్ పనిచేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షునిగా, సిపిఎం అనుబంధ హక్కుల సంఘం అధ్యక్షునిగా, పొలిట్‌బ్యూరో సభ్యునిగా పనిచేశారు. ప్రజాశక్తి పత్రికలో ఎడిటోరియల్ బోర్డులో పనిచేశారు. సుందరయ్య స్వయంగా చెప్పుకున్న ఆత్మకథను 'విప్లవ పథంలో నా పయనం' పేరిట విఠల్ రాశారు. 'మార్క్సిజం పరిణామ సంధ్యలో', 'లోకం తీరు', 'మార్క్స్ ఎంగెల్స్ మైత్రి' తదితర గ్రంథాలు రాశారు.

భీం ఆర్మీ నేత చంద్రశేఖర్ ఆజాద్ అరెస్ట్

భీం ఆర్మీ నేత చంద్రశేఖర్ ఆజాద్‌ను హైదరాబాద్ సిటీ పోలీసులు అరెస్టు చేశారు. ఎన్ఆర్సి, ఎన్పిఆర్, సిఎఎలకు వ్యతిరేకంగా వివిధ పార్టీలు, విద్యావంతులు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జనవరి 26న నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభలో పాల్గొనేందుకు చంద్రశేఖర్ ఆజాద్ ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. ఆయన్ను తిరిగి ఢిల్లీ వెళ్లిపోవాల్సిందిగా పోలీసులు హెచ్చరించారు. భీం ఆర్మీ కార్యకర్తలు పోలీసుల నుంచి తప్పించి మాసబ్‌ట్యాంక్‌లోని హోటల్‌కు చేర్చగా పోలీసులు బలవంతంగా హోటల్ ఖాళీ చేయించి బయటకు పంపించారు. దీంతో స్నేహితుని ఇంటికి వెళ్లిన చంద్రశేఖర్‌ను పోలీసులు వెంబడించి అదుపులోకి తీసుకొని బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. వీ

తమిళనాడులో ఇద్దరు జర్నలిస్టులపై కేసు

శ్రీలంక శరణార్థుల ఇంటర్వ్యూ తీసుకోవడంతో పాటు సిఎఎ, ఎన్ఆర్సిలపై వారి అభిప్రాయాలతో కూడిన కథనం రాయాలనుకుంటున్న తమిళనాడుకు చెందిన ఇద్దరు జర్నలిస్టులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వికాతన్ గ్రూప్‌కు చెందిన జర్నలిస్టులు శరణార్థుల క్యాంపులోకి వెళ్లి వారిని సిఎఎకు వ్యతిరేకంగా రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారనేది పోలీసుల ఆరోపణ. పోలీసుల ఆరోపణలను నాగర్‌గోయల్ ప్రెస్‌క్లబ్ ఖండించింది. సిఎఎపై కథనం కోసం కేవలం శ్రీలంక శరణార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తీసుకునేందుకు మాత్రమే వారు అక్కడకు వెళ్లారని పేర్కొంది. జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిసెంబర్ 31న డిమాండ్ చేసింది.

భీమా కోరేగాంకు 5 లక్షల మంది దళితులు

ఈ ఏడాది జనవరి 1న మహారాష్ట్రలో నిర్వహించిన భీమా కోరేగాం 202 వార్షికోత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 5 లక్షలకు పైగా దళితులు పాల్గొన్నారు. పుణెకు 40 కిలోమీటర్ దూరంలోని భీమా కోరేగాం ఏరియాలో ఇంటర్నెట్ సేవలు నిలిపేశారు. 1818 జనవరి 1న జరిగిన బ్రిటిష్ సైన్యాలకు మరాఠా పీష్వాలకు మధ్య జరిగిన యుద్ధంలో పీష్వాలపై దళితులు అధికంగా ఉన్న ఈస్టిండియా కంపెనీ బలగాలు విజయం సాధించాయి. ఆ యుద్ధంలో అమరులైన వారి స్మారకార్థం భీమా కోరేగాంలో స్థూపం నిర్మించారు. వీరులుగా నిలిచిన తమ దళిత పూర్వీకులను స్మరిస్తూ ప్రతి ఏటా ఇక్కడ దళితులు ఏకమవుతారు.

జెఎన్‌యు పై దాడి, దేశ వ్యాప్త నిరసనలు

ఢిల్లీలోని జెఎన్‌యులో జనవరి 5న ముఖాలకు ముసుగులు ధరించిన సుమారు 50 మందికి పైగా దుండగులు క్యాంపస్‌లోకి చొరబడి విద్యార్థుల, అధ్యాపకులపై దాడి చేశారు. కర్రలు, కత్తులు, ఇనుప రాడ్లతో జెఎన్‌యు స్టూడెంట్ యూనియన్ అధ్యక్షురాలు అయిషీ ఘోష్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడిలో గాయపడిన బాధితులైన 19 మందిపై కేసులు పెట్టారు. ఈ దాడి చేసింది తామేనని హిందూ రక్షాదళ్ అధ్యక్షుడు పింకి చౌదరి వీడియోను సోషల్ మీడియాలో జనవరి 7న పోస్టు చేశాడు. ఈ దాడిని ఖండించిన విశ్వభారతి యూనివర్సిటీ, అలీఘర్ ముస్లిం, బెనారస్ హిందూదు, జామియా ఇస్లామియా విద్యార్థులపై ఎబివిపి విద్యార్థులు దాడిచేశారు. ఈ దాడులను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు నిరసన తెలిపారు.

దేశంలో పెరుగుతున్న హత్యలు, అత్యాచారాలు

2018లో దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పలు రకాల నేరాలపై జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సిఆర్‌బి) తన నివేదికను తాజాగా విడుదల చేసింది. ఈ ఏడాదిలో రోజుకు సగటున 80 హత్యలు, 289 కిడ్నాప్‌లు, 91 అత్యాచారాలు జరిగాయని పేర్కొంది. 2018లో మొత్తం 50,74,634 గుర్తించదగిన నేరాలు జరిగాయని, అందులో 31,32,954 నేరాలు భారతీయ శిక్షాస్మృతి నియమావళిలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయని 19,41,680 కేసులు, ప్రత్యేక, స్థానిక చట్టాల కింద నమోదయ్యాయని వెల్లడించింది. ఇవి 2017తో (50,07,044) పోల్చుకుంటే అధికంగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. 2018లో మొత్తం దేశవ్యాప్తంగా 29,017 హత్యలు జరిగాయని నివేదిక వెల్లడించింది.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక, ఉద్యోగులపై కక్షసాధింపు చర్యలకు నిరసనగా పది ట్రేడ్ యూనియన్లకు చెందిన 25 కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు జనవరి 8న దేశవ్యాప్తంగా సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తంచేశారు. పరిశ్రమలు, బ్యాంకులు, రవాణా, రేవులు, ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, గ్రామీణ శ్రామికులు కలిసిరావడంతో సార్వత్రిక సమ్మె-బంద్ విజయవంతమైనట్లు కార్మిక నాయకులు వెల్లడించారు.

రక్తమోడుతున్న ఉత్తరప్రదేశ్

24 గంటల్లో చోటుచేసుకున్న హత్యాకాండతో ఉత్తరప్రదేశ్‌లో ఒక్క జనవరి 5 నాడే 13 హత్యలు జరిగాయి. ప్రయాగ్‌రాజ్, లలిత్‌పూర్, హర్దోయ్, బారాబంకీ, ఆగ్రా, కస్‌గంజ్, మెయిన్‌పురిల్లో ఈ దారుణాలు జరిగాయి. ప్రయాగ్‌రాజ్‌లోని ఒకే కుటుంబంలో ఐదుగురు హత్యగావించబడితే బరాబంకీ జిల్లాలో ఇద్దరు వ్యక్తులపై కాల్పులు జరిపి హత్యచేశారు. లలిత్‌పూర్‌లో జంట హత్యలు. కనగంజ్ జిల్లాలో ఒకరు, పశ్చిమ ఆగ్రా, మెయిన్‌పురిల్లో ఒక్కొక్కరు హత్యకు గురయ్యారు. మెజారిటీ కేసుల్లో వ్యక్తిగత కక్షలే ఈ హత్యలకు కారణమని పోలీసులు చెపుతున్నారు.జనవరి 6న

ఢిల్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల సంఘం

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం జనవరి 6న షెడ్యూల్ ప్రకటించింది. మొత్తం 70 స్థానాలకు ఒకేరోజు ఫిబ్రవరి 8న పోలింగ్ నిర్వహించి 11న ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జనవరి 14న జారీ చేయనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా తెలిపారు. నామినేషన్లు దాఖలు చేయడానికి ఈ నెల 21 చివరి తేదీ అని, 22న నామినేషన్ల పరిశీలన జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు జనవరి 24 చివరి తేదీగా పేర్కొన్నారు.

దేశంలో ఆకలి కేకలు - నీతి అయోగ్ నిర్ధారణ

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో భారతదేశం వెనుకబడే ఉంది. ఒకటి, రెండు రాష్ట్రాలు తప్ప అన్ని రాష్ట్రాలు వెనుకంజలోనే పోటీపడుతున్నాయి. ఫలితంగా 2030 నాటికి పేదరికాన్ని సంపూర్ణంగా నిర్మూలించాలన్న ఐక్యరాజ్య సమితి లక్ష్యం భారత్‌లో అసాధ్యంగా మారింది. ఏ ఒక్క రాష్ట్రం కూడా ఆ దిశలో అడుగులు వేయడంలేదని నీతి అయోగ్ నిర్ధారించింది. ఆకలి, అసమానతల తగ్గింపులోనూ దేశం విఫలమౌతోందని వ్యాఖ్యానించింది. నీతి అయోగ్ కొద్ది రోజుల కింద విడుదల చేసిన నివేదికలో ఈ చేదు నిజాలున్నాయి. పేదరికం, ఆకలి, అసమానతల తగ్గింపు వంటి కీలకమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో 2018 కంటే 2019లో భారత్ వెనకబడింది.

'సక్రమ' వలసదారుల గుడిసెలు నేలమట్టం

కర్ణాటకలోని బెంగళూరులో వేలాది మంది వలస కార్మికుల గుడిసెలు నేలమట్టమయ్యాయి. నార్త్ బెంగళూరులోని కరియమ్మ అగ్రహారా ఏరియాలో అస్సాం, త్రిపుర, ఉత్తర కర్ణాటక నుండి ఉపాధి కోసం వలస వచ్చిన వారిని బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా మన దేశంలోకి వచ్చిన వారిగా అనుమానిస్తూ వారి ఆవాసాలను బృహత్ బెంగళూరు మహానగర్ పాలిక అధికారులు జనవరి 19న కూల్చేశారు. బాధితులు తాము ఈ దేశస్తులమేనని ఆధార్, పాన్ కార్డు, ఓటర్ కార్డు లాంటి గుర్తింపుకార్డులు చూపారు. అస్సాంకు చెందినవారైతే అస్సామీ ఎన్ఆర్సిలో తమ పేరు నమోదు అయిందని పత్రాలు చూపించారు. కూల్చివేతకు ముందు ఆ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎమ్మెల్యే అరవింద లింబావలి ప్రాంతంలో బంగ్లాదేశీ అక్రమ వలసదారులు ఉన్నారని, వారి తొలగింపునకు అధికారులకు సూచనలు చేసినట్టు ట్వీట్ చేశారు.

భీమా కోరేగాం కేసు ఎన్ఐఎకు బదిలీ

భీమా కోరేగాం అల్లర్ల కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)కు బదిలీ చేస్తూ కేంద్రం ఆకస్మిక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం అరెస్టు చేసిన తొమ్మిది మంది ప్రజాస్వామిక వాదులు, మరో పది మంది దళితులు నిందితులుగా ఉన్నారు. ఈ కేసు తాజా స్థితిపై జనవరి 24న పోలీసు అధికారులతో మహారాష్ట్ర ప్రభుత్వం సమీక్షించింది. కేసులపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని భావిస్తున్న సమయంలో కేంద్రం ఈ కేసును ఎన్ఐఎకు అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమని మహారాష్ట్ర హోం మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ అన్నారు. కేంద్రం ఈ కేసును తమ ఆధీనంలోకి తీసుకోవడం వెనక ఈ కేసులోని అసలు దోషులు కాపాడి హక్కుల నేతలు నోరు నొక్కడానికేని అంటున్నారు. వీ

సుడాన్‌లో ఆందోళనలు

సుడాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. డిసెంబర్ 27న రాజధాని ఖార్‌తౌమ్‌లో అధ్యక్షుడు ఒమర్ అల్ బషీర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు నిర్వహించారు. బషీర్ పాలనలో అంతర్యుద్ధం వల్ల నిరుద్యోగం నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయనీ, వీటిని నియంత్రించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టలేదంటూ ప్రజలు నిరసన తెలిపారు.

కొలంబియాలో హక్కుల కార్యకర్తల హత్య

కొలంబియాలో ఆరుగురు హక్కుల కార్యకర్తలు హత్యకు గురయ్యారు. వీరంతా శాంతి, సమన్యాయం కోసం ప్రజల పక్షాన పోరాడినవారు. ఈ హత్యలకు నిరసనగా ప్రజలు నిరసన తెలిపారు. హక్కుల కార్యకర్తల హత్యలను నివారిలించడంలో కొలంబియా అధ్యక్షుడు ఇవాన్ డ్యూక్ పూర్తిగా విఫలమయ్యారని ఆందోళనకారులు విమర్శించారు.

అమెరికాలో ఆహార అభద్రత

అగ్రరాజ్యం అమెరికాలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. దాదాపు కోటిన్నర మందికి పైగా ఆహార అభద్రతకు గురవుతున్నారు. చిన్న పిల్లల్లో 25 శాతం మందికి ఒక్క పూట ఆహారమే లభ్యమవుతోంది. దాదాపు నాలుగున్నర కోట్ల మంది నెలవారీగా ఆహారాన్ని కొనుగోలు చేసేందుకు గాను సప్లమెంట్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రాం కింద అందించే సహకారంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాల్లో 15 శాతం, మెట్రోపాలిటన్ నగరాల్లో 11.8 శాతం మంది ఆహార అభద్రతను అనుభవిస్తున్నారు.

సొమాలియాలో బాంబు పేలుడు

సొమాలియా రాజధాని మొగదిషులో డిసెంబర్ 28న బాంబు దాడి జరిగింది. అత్యంత రద్దీగా ఉండే చెక్‌పాయింట్ వద్ద జరిగిన ఈ దాడిలో తొంభై మందికి పైగా మరణించారు. మరో నూట యాభై మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది యూనివర్సిటీ విద్యార్థులే.

ఇరాక్‌లో అమెరికాకు వ్యతిరేకంగా నిరసనలు

ఇరాక్‌లో అమెరికా జరిపిన దాడులకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేపట్టారు. షియా గ్రూప్‌కు చెందిన ఉగ్రవాదులపై అమెరికా జరిపిన దాడుల్లో ఇరవై ఐదు మంది మరణించారు. డిసెంబర్ 31న రాజధాని బాగ్దాద్‌లో అంత్యక్రియలు ముగిసిన తరువాత ఇరాక్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని నిరసిస్తూ నినాదాలు చేస్తూ అమెరికా ఎంబసీ కార్యాలయంలోకి దూసుకెళ్లి నిప్పంటించారు. జనవరి 4న అమెరికా మరోసారి ఇరాక్‌లో దాడి చేసింది. ఇరాక్ మద్దతుగా ఉన్న హషీద్ అల్ షాబీ సైన్యాలను లక్ష్యంగా చేసుకొని అమెరికా దాడులు సాగించింది.

ఇరాన్‌పై అమెరికా దాడి

ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో జనవరి 3న అమెరికా డ్రోన్ల రాకెట్లతో దాడి చేసి ఇరాన్, ఇరాక్ దేశాలకు చెందిన ఉన్నత స్థాయి కమాండర్లు ప్రయాణిస్తున్న కార్లను పేల్చివేసింది. ఈ దాడిలో ఇరాన్ నిఘా చీఫ్ ఖాసీం సోలీమని, ఇరాక్ కుర్దిష్ మిలీషియా పిఎంఎఫ్ డిప్యూటీ కమాండర్ మెహ్దీ-అల్-మొహందీ మరికొందరు మరణించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకే తాము ఈ దాడికి పాల్పడినట్లు అమెరికా రక్షణ విభాగం తెలిపింది. ఈ దాడికి వ్యతిరేకంగా బాగ్దాద్ నగరంలోని అమెరికా సైనిక శిబిరాలపై ఇరాన్ దాడి చేసింది. ఈ దాడిలో ఎనభై మందికి పైగా అమెరికా సైనికులు మరణించారు.

ఆస్ట్రేలియా అడవుల్లో ఆరని కార్చిచ్చు

ఆస్ట్రేలియా అడవుల్లో గత సెప్టెంబర్ నుంచి మొదలైన కార్చిచ్చు ఇంకా చల్లారలేదు. ఇప్పటి వరకు 60 లక్షల హెక్టార్ల అడవి బుగ్గి పాలైందనీ, 48 కోట్ల జంతువులు, పక్షులు ఇతర వన్య ప్రాణులు మరణించాయి. దాదాపు రెండు వేల ఇండ్లు అగ్నిపాలయ్యాయి. ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్‌వేల్స్‌లో ఇప్పటి వరకు 30 శాతం అడవి తగలబడిపోయినట్లు పర్యావరణ విపత్తు మేనేజ్‌మెంట్ సెంటర్ తెలిపింది.

ఇరాన్‌లో విమానం కూల్చివేత

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో జనవరి 8న విమాన ప్రమాదం జరిగింది. ఉక్రేయిన్‌కు చెందిన ఈ విమానం టెహ్రాన్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొద్ది సమయానికే కూలిపోయింది. విమానంలో ప్రయాణిస్తున్న 180 మందికి పైగా ప్రయాణికులు, సిబ్బంది మరణించారు. ఈ విమానాన్ని ఇరాన్ మిలటరీ కూల్చివేసింది. అమెరికాతో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల మధ్య మానవ తప్పిందంతోనే విమానం కూల్చివేయబడిందని ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ తెలిపారు. ఈ క్షమించరాని తప్పిందం కారణంగా అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయాలని విచారం వ్యక్తం చేశారు.

ఒమన్ సుల్తాన్ మృతి

ఒమన్ సుల్తాన్ ఖాబూస్ బిన్ సైద్ జనవరి 11న మరణించారు. ఆయన కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బెల్జియం ఆస్పత్రిలో మరణించారు. బ్రిటిష్ పాలన నుంచి శాంతియుతంగా అధికారం చేపట్టిన ఖాబూస్ 1970 నుంచి దాదాపు యాభై ఏండ్ల పాటు ఒమన్ దేశ పాలకుడిగా బాధ్యతలు నిర్వహించారు. దేశంలో ప్రధాన వనరులుగా ఉన్న చమురు నిక్షేపాలను వినియోగించుకొని రహదారులు, పోర్టులు, విశ్వవిద్యాలయాలు, స్టేడియంల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గల్ఫ్ దేశాల్లో శాంతి స్థాపనకు ఖాబూస్ ఎంతో కృషి చేశారు. ఆయన మృతి పట్ల ప్రపంచ దేశాల నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

టర్కీలో వికీపీడియాపై నిషేదం ఎత్తివేత

టర్కీ ప్రభుత్వం వికీపీడియాపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసింది. రెండు సంవత్సరాలుగా వికీపీడియాపై ఉన్న నిషేధాన్ని రద్దు చేయాలంటూ టర్కీ అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. దేశ పౌరుల భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హరించే అధికారం ప్రభుత్వానికి లేదని, వారి స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ఉంటుందని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. 2017లో అధ్యక్షుడు ఎర్డోగన్‌పై సమాచారాన్ని పొందుపరిచినందుకు గాను టర్కీ ప్రభుత్వం నిషేధాన్ని విధించింది.

రష్యా ప్రధానిగా మిషుస్తిన్

రష్యా నూతన ప్రధానిగా మైఖేల్ మిషుస్తిన్ ఎన్నికయ్యారు. ఆయన పేరును అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించారు. మిషుస్తిన్ ఫెడరల్ ట్యాక్స్ సర్వీసెస్ అధినేతగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అధ్యక్షుడు పుతిన్ రాజ్యాంగ సంస్కరణలను ప్రతిపాదించిన నేపథ్యంలో ప్రధానిగా ఉన్న మెద్వేదేవ్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో రష్యా మంత్రి మండలి మొత్తం రాజీనామ చేసింది.

అమెరికా అధ్యక్షుడిపై అభిశంసనకు తీర్మానం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై నమోదైన అభిశంసన అభియోగాలపై అమెరికన్ కాంగ్రెస్ ఎగువసభ సెనేట్ జనవరి 21న విచారణ ప్రారంభించింది. అభిశంసనకు అనుసరించాల్సిన విధి విధానాలకు సంబంధించిన తీర్మానంపై సెనేట్ చర్చ అనంతరం ఓటింగ్ జరుగనుంది. అధికార దుర్వినియోగం, కాంగ్రెస్ విధులను అడ్డుకోవడం వంటి అభియోగాలతో ట్రంప్‌ను అభిశంసిస్తూ విచారణకు డిమాండ్ చేసారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుదుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(డిసెంబర్ 1 నుండి డిసెంబర్ 31, 2019 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (952), ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో (893) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1845)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు		స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.																
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	1	-	14	18	9	4	3	3	2	1	2	1	2	27	29	-	-	-	2	1
హైదరాబాద్	-	-	-	9	20	2	7	4	2	5	4	13	4	4	42	13	-	-	-	-	-
కరీంనగర్	-	4	1	7	11	4	6	2	3	4	2	3	3	6	28	22	-	-	-	-	2
ఖమ్మం	-	2	-	5	17	2	2	-	1	3	-	-	-	4	24	8	-	-	-	-	-
మహబూబ్‌నగర్	-	-	1	2	4	2	1	2	4	3	2	2	4	5	35	1	-	-	-	-	2
మెదక్	1	14	-	3	7	9	6	1	2	4	5	3	5	9	16	22	-	-	-	4	1
నల్గొండ	-	3	-	4	6	4	3	2	2	3	2	4	-	2	18	11	-	-	-	1	3
నిజామాబాద్	-	3	-	6	5	3	5	3	1	2	2	3	2	4	23	19	-	-	-	-	2
వరంగల్	1	9	3	4	3	2	4	2	1	3	4	4	2	11	17	20	-	-	-	1	1
రంగారెడ్డి	-	2	-	6	5	3	5	4	4	6	3	5	6	7	26	17	-	-	-	-	3
తెలంగాణ	**3**	**38**	**5**	**60**	**96**	**40**	**43**	**23**	**23**	**35**	**25**	**39**	**27**	**54**	**256**	**162**	**-**	**-**	**-**	**8**	**15**
అనంతపురం	-	3	2	10	30	2	2	7	1	3	1	4	8	5	46	-	-	-	-	-	-
చిత్తూరు	-	3	-	7	6	-	-	-	-	5	2	2	8	3	34	6	-	-	-	-	-
కడప	-	-	-	1	5	-	-	-	-	1	-	-	-	-	21	4	-	-	-	-	-
గుంటూరు	-	-	-	4	6	3	5	2	1	2	3	4	4	4	18	12	-	-	-	-	-
కృష్ణా	-	-	-	3	5	4	7	-	2	3	4	3	2	4	15	7	-	-	-	-	-
కర్నూలు	-	3	-	5	6	3	5	2	3	4	2	4	1	4	26	23	-	-	-	-	2
తూర్పు గోదావరి	-	-	-	1	7	2	5	-	-	2	1	-	1	4	24	13	-	-	-	1	-
ప్రకాశం	-	2	-	3	5	3	6	3	1	3	2	4	2	6	21	16	-	-	-	-	3
శ్రీకాకుళం	-	-	-	2	4	4	5	2	-	-	1	2	4	3	14	11	-	-	-	-	4
పశ్చిమ గోదావరి	-	-	-	3	5	2	3	1	1	2	1	3	1	5	17	13	-	-	-	-	2
నెల్లూరు	-	-	-	4	4	3	4	2	2	5	2	4	3	4	24	17	-	-	-	-	-
విజయనగరం	-	-	-	2	4	4	6	3	1	1	1	2	4	3	12	9	-	-	-	-	4
విశాఖపట్నం	-	-	-	4	6	1	-	1	-	4	2	-	4	1	15	8	-	-	-	4	-
ఆంధ్రప్రదేశ్	**-**	**11**	**2**	**49**	**93**	**32**	**48**	**23**	**12**	**35**	**22**	**32**	**42**	**46**	**287**	**139**	**-**	**-**	**-**	**5**	**15**

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడి(ప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	అబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్ హైదరాబాద్	9705055738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్ హైదరాబాద్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్ హైదరాబాద్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక హైదరాబాద్	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు హైదరాబాద్	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్ హైదరాబాద్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర) హైదరాబాద్	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర) హైదరాబాద్	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా) హైదరాబాద్	8977995537
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
మల్లిఖార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజారెడ్డి బుక్‌స్టాల్	చందానగర్ బిహెచ్ఇఎల్	93466 07648
నవ తెలంగాణ బుక్ హౌస్	చిక్కడపల్లి, హైదరాబాద్	94900 99373
నవ తెలంగాణ బుక్ హౌస్	బాగ్‌లింగంపల్లి-సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్	94900 99378
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
అక్షర బుక్ వరల్డ్, ఎటిసి మార్కెటింగ్	న్యూ టౌన్, మహబూబ్‌నగర్	90102 10464
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	79890 81728
రాజన్న బుక్ స్టాల్	హనుమకొండ చౌరస్తా	93955 07773
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీథి, ప్రొద్దుటూరు	81210 02112
క్రిసెంట్ న్యూస్ ఏజెన్సీ	కడప	98852 35846
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రి బుక్‌హౌస్	మజీద్ వీథి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీదేవి సాయి కూల్‌డ్రింక్స్, కమ్యూనికేషన్స్	దేవి చౌక్, రాజమండ్రి	98489 84394
త్రినాథ్ పాన్ షాప్	మరిడి మహాలక్ష్మి టెంపుల్, రాజమండ్రి	99519 76044

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 223 - February 2020 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/01/2020 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao